ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital
Published from Srikakulam, Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,
28-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 178 పేజీలు: 16 వెల: 6.50

ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో హైదరాబాద్ షూటర్ ఈషా సింగ్‌కు స్వర్ణం

-'ఆట'లో

ఎల్‌నినోపై రైతులకు అవగాహన పెంచండి

ప్రత్యామ్నాయ పంటలను వివరించండి..

ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలి

ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు

విజయవాడ, జులై 27, ప్రభాతవార్తప్రతినిధి: ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చర్చించారు. ఈ ఏడాది అంతటా ఎల్ నినో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని అంచనాలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే తీసుకున్న చర్యలతో పాటు, రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను రైతులకు వివరించడంతోపాటు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. దీని నిమిత్తం క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే ఏప్రాంతాల్లో ఏయే పంట సాగు చేయాలనేదానిపై రైతులకు వివరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని సూచించారు. వరి పంటకు చివరి తేదీ 2026 ఆగస్టు 15 అని చెప్పారు. అర్హులైన రైతులు గరిష్ఠ సంఖ్యలో నమోదు అయ్యేలా సంబంధిత భాగస్వాములందరూ విస్తృత అవగాహన మరియు ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్-2026 సీజన్‌లో రైతుల ప్రయోజనాలపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో వర్షపాతం లోటు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. సీజన్ సాధారణ వర్షపాతం 580.1 మి.మీ. కాగా, ప్రస్తుత తేదీ నాటికి సాధారణంగా 225.7 మి.మీ. వర్షపాతం నమోదవ్వాల్సి ఉందని, అయితే కేవలం 104.5 మి.మీ. మాత్రమే నమోదై 53.7 శాతం లోటు ఏర్పడిందని వివరించారు. మొత్తం 28 జిల్లాల్లో 21 జిల్లాలు వర్షపాతం లోటు కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. పశ్చిమ గోదావరి, అన్నమయ్య, తూర్పు గోదావరి, విశాఖపట్నం, చిత్తూరు, ప్రకాశం జిల్లాలు కలిపి ఆరు జిల్లాలుతీవ్ర వర్షపాతం లోటు కేట గిరీలో ఉన్నాయని, నెల్లూరు జిల్లాలో మాత్రమే >>2

లోక్‌సభకు 'పరీక్షల' బిల్లు

ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

విపక్షాల రగడతో ఉభయసభలు నేటికి వాయిదా

న్యూఢిల్లీ,జులై 27: పేపర్ లీకేజీ నిరోధక బిల్లుపై చర్చించేందుకు అన్ని పార్టీలు సిద్ధంగా ఉన్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అన్ని పార్టీలను ఆయన ఒప్పించినట్లు పార్లమెంటరీ వర్గాలు వెల్లడించాయి. సోమవారం కేంద్రసిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. పేపర్ లీకేజీ నిరోధక సవరణబిల్లును మంగళవారం చర్చించేందుకు అన్ని పార్టీలు అంగీకరించాయని, స్పీకర్ ఓం బిర్లా చేపట్టిన చర్యలవల్ల ఫ్లోర్‌లీడర్లు ఆ చర్చకు ఒప్పుకున్నారని స్పీకర్ కార్యాల వర్గాలుప్రశ్నపత్రాల లీకేజీలు, పబ్లిక్ పరీక్షల్లో అక్రమాలను కట్టడి చేయడానికి >>2

తిరుపతిలో తొలి కరోనా కేసు

65యేళ్ల వృద్ధురాలికి పాజిటివ్

తిరుపతి,జులై 27ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో మళ్లీ ఆందోళనకర అలజడి సృష్టిస్తున్న కరోనా వైరస్ వ్యాప్తి తాజాగా యాత్రాస్థలం తిరుపతిలో కేసు నమోదు కావడంతో యాత్రికులు, తిరుపతి వాసులు ఆందోళన చెందుతున్నారు. 2020-21 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా తీవ్రంగా వ్యాపించి ఎందరో ప్రాణాలు బలిగొన్న ఈ కరోనా వైరస్ ప్రభావంతో జనజీవనం అస్తవ్యస్థంగా మారిన విషయం విదితమే. మళ్ళీ ఐదేళ్ళ తరువాత కరోనా వైరస్ రాష్ట్రంలో కలకలంగా మారింది. ఇప్పటికే రాష్ట్రంలో కరోనా వైరస్ కేసులు తీవ్రంగా నమోదవుతున్న తరుణంలో తిరుపతి నగరంలో ఓ కరోనా వైరస్ >>2

రాజమండ్రిలో మరో ఇద్దరికి కరోనా 2లో

ఇక దృష్టంతా ఫలితాలపైనే

పునాదిపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

విద్యారంగంలో సంస్కరణలు పూర్తి

విద్యార్థులకు మార్కులు రాకపోతే సిఎం నా మార్కులు తగ్గిస్తారు..

పునాదిపాడు జెడ్పీ హైస్కూలును ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి లోకేష్

విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి: విద్యారంగంలో సంస్కరణలు పూర్తయ్యాయని, ఫలితాలపై దృష్టిపెట్టాలని అధికారులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, విద్యా ప్రమాణాలపై మంత్రి ఆరా తీశారు. ముందుగా పాఠశాలలోని పదో తరగతి ఏ సెక్షన్ విద్యార్థులతో మంత్రి సంభాషించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీ సీనియర్స్ కంటే మీరు బాగా చదవాలి. గతేడాది పదో తరగతిలో 67శాతం మంది విద్యార్థులు మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర సరాసరి కంటే ఇది 11శాతం తక్కువ. మీకు మార్కులు రాకపోతే సీఎం చంద్రబాబునాయుడు గారు నా మార్కులు తగ్గిస్తారు. కాబట్టి మీరంతా బాగా చదవాలని వారిని ఉత్సాహపరిచారు. విద్యార్థులకు పదో తరగతి చాలా ముఖ్యం. పది, ఇంటర్మీడియట్ చదివే సమయంలో నా జీవితంలో మార్పు వచ్చిందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ఇప్పుడు మంచి మార్కులు వస్తేనే భవిష్యత్ బాగుంటుందని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ అందజేత, పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను మంత్రి ఆరా తీశారు. బాగుందని విద్యార్థులు సమాధానం ఇచ్చారు. ప్రజాప్రభుత్వంలో మధ్యాహ్న భోజనానికి ఫైన్ రైస్ ను వినియోగిస్తున్నామని చెప్పారు. రాగి జావ ఎంతమందికి ఇష్టం, చిక్కీ ఎంతమందికి ఇష్టం అని మంత్రి సరదాగా ప్రశ్నించగా అధికశాతం మంది విద్యార్థులు చిక్కీ ఇష్టమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రభుత్వం కృషిచేస్తోందని, అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తోందని, మీరు చేయాల్సిందల్లా బాగా చదవడమేనని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. చదువుకున్నది జీవితంలో ఎంతవరకు ఉపయోగపడుతున్నదన్నది ముఖ్యం, లోకజ్ఞానం కూడా అవసరమేనని పేర్కొన్నారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉండటంపై మంత్రి అసంతృప్తి

గతేడాది కంటే ఈ ఏడాది 19 మంది విద్యార్థులు పాఠశాలలో కొత్తగా ప్రవేశాలు పొందారు. ఇందుకు పాఠశాల సిబ్బందిని మంత్రి అభినందించారు. మౌలిక సౌకర్యాల్లో పాఠశాల 2.76 రేటింగ్ సాధించింది. అయితే పాఠశాలలోని విద్యార్థులు అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉండటంపై మంత్రి అసృతృప్తి వ్యక్తం చేశారు. అద్భుతమైన మౌలిక సౌకర్యాలు, మంచి ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ లెర్నింగ్ అవుట్ కమ్స్, సమ్మెటివ్, ఫార్మెటివ్ అసెస్‌మెంట్స్ లో స్కూల్ వెనుకబడి ఉంది. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో 0.9శాతం రేటింగ్ సాధించింది. పట్టణ ప్రాంతానికి దగ్గరగా ఉన్న పాఠశాల అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉందని, లెర్నింగ్ అవుట్ కమ్స్ పై ప్రత్యేక దృష్టిసారించాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని సూచించారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరు కావడాన్ని నివారించాలన్నారు. ఒకేషనల్ ల్యాబ్స్ పైనా దృష్టిసారించాలని ఆదేశించారు. ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సులపై దృష్టి సారించడం ద్వారా ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల విషయంలోనూ మంత్రి ఆరా తీశారు. వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఫలితాల మెరుగుదలకు విద్యార్థుల్లో స్ఫూర్తి >>2

మృతి చెందిన శివాని(ఫైల్)

సిఎం ప్రశంసలు అందుకొన్న టెన్త్ విద్యార్థిని అనూహ్యంగా ఆత్మహత్య

బాలిక మృతిపై సమగ్రవిచారణకు తక్షణమే సిఎం ఆదేశం

రంపచోడవరంలో విషాదం

పోలవరం జిల్లా ప్రతినిధి, జులై 27 ప్రభాత వార్త: పోలవరం జిల్లా రంపచోడవరం మండలం ఇర్లపల్లిలో 10 తరగతి విద్యార్థిని శివాని(14) సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనతో రంపచోడవరంలో విషాదం నెలకొంది. ఈ నెల 24 తేదిన పి. టీ.యం.తల్లికి వందనం వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కార్యక్రమంలో మాట్లాడిన విద్యార్థిని భవిష్యత్తులో 'షైనింగ్ స్టార్'గా ఎదిగి, ఆయన చేతుల మీదుగా అవార్డు అందుకోవాలనే తన ఆకాంక్షను వ్యక్తం చేసింది. విద్యార్థిని మాటలకు ముఖ్యమంత్రి స్పందించి, ఆమెతో సెల్ఫీ దిగడంతో పాటు భవిష్యత్తులో తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆ విద్యార్థిని వచ్చే యేడాది మంచి మార్కులతో శైనింగ్ స్టార్ అవార్డు అందుకుంటాను అని వేదికపై వెల్లడించి, అందరి చేత చప్పట్లు కొట్టించుకుంది. ఈ విద్యార్థిని ప్రసంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ >>2

నిన్న 'కాక్రోచ్'.. నేడు ఇ-20 జనతాపార్టీ

స్వచ్ఛ పెట్రోలు కోసం ఉద్యమం

న్యూఢిల్లీ,జులై 27: నీట్ పేపర్ లీక్ వ్యవహారం నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) పుట్టుకొచ్చింది. సోషల్ మీడియా నుంచి ప్రారంభమైన ఈ ఉద్యమం చివరకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వరకు సాగింది. ఇప్పుడు సిజెపి లాగే కొత్తగా ఇజెపి అంటే 'ఇ20 జనతా పార్టీ' పుట్టుకొచ్చింది. ఈ పేరుతో కొత్తగా డిజిటల్ ప్రచారం మొదలైంది. ఇ20 పెట్రోల్‌తో పాటు వినియోగదారులకు 100 శాతం స్వచ్ఛమైన పెట్రోల్ కొనుగోలు చేసే అవకాశం ఇవ్వాలనేది ఈ పార్టీ ప్రధాన డిమాండ్. ఇ20 జనతాపార్టీ ఇప్పటికే ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ప్రత్యేక అకౌంట్లు క్రియేట్ అయ్యాయి. >>2

విజయ్ 'ఉద్యోగ' ఉత్తర్వులు కొట్టివేసిన మద్రాసు హైకోర్టు

కరూర్ తొక్కిసలాట బాధితులకు ఎలా ఇస్తారని ప్రశ్న

మదురై, జులై 27: సెప్టెంబర్ 2025లో 'తమిళగ వెట్రి కజగ్గం (టివికె) అధ్యక్షుడు సి. జోసెఫ్ విజయ్ ప్రసంగించిన ఎన్నికల ర్యాలీ సందర్భంగా కరూర్‌లో జరిగిన విషాదకరమైన తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం రద్దు చేసింది. >>2

తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు

ఆగస్టు 1 నుంచి ప్రజలకు సదవకాశం: డి.సిఎం పవన్

విజయవాడ,జులై 27,ప్రభాతవార్తప్రతినిధి: పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు జరుగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు డీసీఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినదని పవన్ వ్యాఖ్యానించారు. బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యుడికి సాంత్వన చేకూర్చేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమ్ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అన్నారు. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ.52లకు, గ్రేడ్ 1 పచ్చి బియ్యం (రా రైస్) రూ.50లకు రాష్ట్రంలోని 130 రైతుబజార్లు, 500 రైసు మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు. ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు, సోదరులు నాదెండ్ల మనోహర్ అమలులోకి తీసుకుని వచ్చిన ఈ సౌకర్యం ప్రశంసనీయమన్నారు.. సామాన్యుడిపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడం స్వాగతించదగినదని చెప్పారు. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్ష చేసి, మిల్లర్లతో అత్యవసరంగా సమావేశం నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండేలా మేలైన ధరలను నిర్ణయించారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థికభారాన్ని తగ్గిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట 2లో

బడులు, హాస్టల్స్‌లో స్టీమ్ రైస్ వాడకం

మధ్యాహ్న భోజన పథకం మరింత నాణ్యతతో అమలు: మంత్రి నాదెండ్ల

ఢిల్లీలో విద్యామంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ

విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి: ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రజలకు స్టీమ్ రైస్ అందించడం ద్వారా వారికి పౌర సరఫరాల శాఖ సేవలను మరింత చేరువ చేయొచ్చని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. దీనిద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యం అందడంతో పాటు, బియ్యం అక్రమ రవాణా నిరోధానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని దీనికి కేంద్ర పౌర సరఫరాల శాఖ సహకారం ఎంతో అవసరమన్నారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం ఆయన ఢిల్లీలో కేంద్ర పౌర సరఫరాల శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి తో పాటు శాఖ ఉన్నతాధికారులను వరుసగా కలిశారు. ఈ క్రమంలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ జాయింట్ సెక్రటరీ రవిశంకర్, పాలసీ అండ్ ఎఫ్సీఐ జాయింట్ సెక్రటరీ శిఖా కలిశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మనోహర్ సీఎంఆర్ సేకరణ, స్టీమ్ రైస్ పంపిణీ, మీ మార్టుల ప్రారంభం, రాష్ట్రం నుంచి విదేశాలకు ఎగుమతులు వంటి అనేక అంశాలను చర్చించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రంలోని 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక పాయింట్ల ద్వారా తక్కువ ధరకే బియ్యం విక్రయాలను చేపడుతున్నవిషయాన్ని కేంద్ర మంత్రి వద్ద ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి రావల్సిన అనుమతులు, సహకారం, పెండింగ్ నిధుల విషయాలను ప్రత్యేకంగా కేంద్రమంత్రి ముందుంచారు. రాష్ట్రంలోని 41 వేల పాఠశాలలు, 4 వేల వసతి గృహాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో స్టీమ్ రైస్ వాడకం ద్వారా అందుతున్న నాణ్యమైన భోజనంపై సానుకూలత ఉందని, దీన్ని ప్రజాపంపిణీ వ్యవస్థకు >>2

ఎఫ్‌టీపీసీ జాతీయ కార్యకలాపాలకు సంబంధించిన అధికారిక పోస్టర్, లోగోను ఆవిష్కరించిన మంత్రి దుర్గేష్

వన్ ఇండియా, వన్ సినిమా దిశగా ఎఫ్‌టిపిసి అడుగులు

క్రియేటివ్ ఎకానమీకి ఎపి చిరునామా: మంత్రి దుర్గేష్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై27,ప్రభాతవార్త: సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వం లో ఏపీలో క్రియేటివ్ ఎకానమీని అభివృద్ధి చేయాలని ఆలోచిస్తున్నట్లు తద్వారా రాష్ట్రాన్ని వినోద రంగానికి సరికొత్త గమ్యస్థానంగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్ టీపీసీఏ) ప్రతినిధులు సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్‌ని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీపీసీ జాతీయ కార్యకలాపాలకు సంబంధించిన అధికారిక పోస్టర్, లోగోలను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎఫ్‌టీపీసీఏ ప్రతినిధులు తమ భవిష్యత్ ప్రణాళికలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం లాంటి సాంస్కృతిక వేదికపై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు."ఒకప్పుడు తెలుగు, తమిళం, హిందీ అని వేర్వేరు ప్రాంతీయ చిత్రాలుగా చూసేవాళ్లం. కానీ నేడు పాన్ ఇండియా విప్లవం, ఓటీటీల రాకతో సినిమా స్వరూపమే మారిపోయింది. ప్రేక్షకులకు భాషతో సంబంధం లేకుండా అన్ని రకాల వినోదం అందుతోంది. సినిమాకి ఏ భాషా సరిహద్దు కాదని నిరూపితమైంది" అన్నారు. ఈ నేపథ్యంలో "దేశమంతా ఒకే వినోద వేదికపైకి రావాలనే ఎఫ్‌టీపీసీ ఆశయం అభినందనీయం. ఈ వన్ >>2

28-7pg2exHMNWJQE.qxd:28-7pg2exHMNWJQE.qxd 1/1/02 6:58 AM Page 1

సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో సమావేశమైన పంజాబ్ బిజెపి అధ్యక్షుడు కేవల్‌సింగ్ ధిల్లాన్

సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట

విజయవాడ,జులై27,ప్రభాతవార్తప్రతినిధి: గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఊరట లభించింది. మాజీ సీఐ నాగరాజు కస్టడీ విచారణ అంశంలో హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టు ధర్మాసనం సవరించింది. కస్టడీ విచారణ నిబంధనలను రద్దు చేసింది. సిట్ విచారణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు విజయవాడ ఆఫీస్‌లో నాగరాజును ప్రశ్నించనున్నారు. కృష్ణలంక యువకుడు గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో నిందితుడిగా ఉన్న సీఐ నాగరాజు కస్టడీ విచారణపై సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పును వెలువరించింది. నిందితుడిని రాజమండ్రి జైలులోనే విచారించాలంటూ గతంలో ట్రయల్ కోర్టు, హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సర్వోన్నత న్యాయస్థానం పక్కన పెట్టింది. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, దర్యాప్తునకు అనుకూలంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. విచారణ కోసం సీఐ నాగరాజును విజయవాడలోని దర్యాప్తు కేంద్రానికి గానీ, ఇతర సురక్షిత ప్రాంతాలకు గానీ తీసుకెళ్లి ప్రశ్నించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ కేసు దర్యాప్తు అధికారులకు విచారణ ప్రక్రియలో కీలక వెసులుబాటు లభించినట్లయింది. అయితే, కస్టడీ విచారణ సమయంలో నిందితుడిపై ఎలాంటి భౌతికదాడి లేదా హింసకు పాల్పడరాదని సుప్రీంకోర్టు షరతు విధించింది. అంతేకాకుండా, విచారణ ప్రక్రియ మొత్తాన్ని తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ చేయాలని కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పుతో సీఐ నాగరాజు కస్టడీ విచారణపై కొనసాగుతున్న న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి.

భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం దృష్ట్యా సిఎం చంద్రబాబు విడియో కాన్ఫరెన్స్

విజయవాడ,.జులై27,ప్రభాతవార్తప్రతినిధి: భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం దృష్ట్యా సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు' నినాదంతో కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఉత్తరాంధ్ర కలెక్టర్లు పోటీపడాలి. భోగాపురం విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర గేమ్‌ఛేంజర్‌గా మారుతుంది. యువకులకు వాలీబాల్, రన్, పాటలు, పద్యాల పోటీలు నిర్వహించాలి. వివిధ విభాగాల్లో గెలుపొందిన 600 మందిని విజేతలుగా ప్రకటించాలి. విమానాశ్రయం ఏర్పాట్లు వల్ల కలిగే ప్రయోజనాలపై పోటీలు నిర్వహించాలి. విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. ఈనెల 31న రాత్రి నుంచే డ్రోన్‌షో ఏర్పాటు చేయాలి.ప్రధానికి జాతీయజెండాలతో పిల్లలు స్వాగతం పలకాలి. విమానాశ్రయం ప్రారంభ సమయంలో 13వేల మందితో థింసా ప్రదర్శన. 13 వేల మందితో నిర్వహించే థింసా ప్రదర్శన గిన్నిస్‌రికార్డు సాధించాలి. కొవిడ్ నేపథ్యంలో ఆరోగ్యశాఖ అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రజలకుఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు 11 అంతర్జాతీయ, 25 జాతీయ ఛానళ్లలో ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రసారం జరగనుంది.

కందుల జెస్సీకి విద్యామంత్రి లోకేష్ అభినందన

విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ అసాధారణ ప్రతిభతో ప్రపంచ వేదికపైకి అడుగుపెట్టిన ఆంధ్రప్రదేశ్ విద్యార్థినికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రపంచంలోనే తొలి ఆల్‌గర్ల్స్ గ్లోబల్ లూనార్ క్యూబ్‌శాట్ 'మిషన్ శక్తిశాట్'కు ఎంపికైన తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం విద్యార్థిని కందుల జెస్సీ, సోమవారం ఉండవల్లిలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసింది. ఈ సందర్భంగా జెస్సీని ప్రత్యేకంగా అభినందించిన మంత్రి, ఆమె భవిష్యత్ ప్రయత్నాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ధవళేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కందుల జెస్సీ, మిషన్ శక్తిశాట్‌కు భారత్ నుంచి ఎంపికైన 20 మంది బాలికల్లో ఒకరిగా నిలిచింది. ఈ ఘనత సాధించిన ఏకైక ఆంధ్రప్రదేశ్ విద్యార్థినిగా ఆమె రికార్డు సృష్టించింది. తన పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌లో చేసిన ప్రయోగాలే తనకు అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తిని పెంచాయని జెస్సీ మంత్రికి వివరించింది. ఏడో తరగతి నుంచే స్పేస్ సైన్స్ పట్ల ఆకర్షితురాలినయ్యానని, మిషన్ శక్తిశాట్‌లో భాగంగా 21 మాడ్యూల్స్‌లో 550 సెషన్ల శిక్షణ తీసుకున్నానని తెలిపింది. భవిష్యత్తులో ఏరోనాటికల్ ఇంజనీర్‌గా స్థిరపడటమే తన లక్ష్యమని ఆమె పేర్కొంది.

ఉద్యాన పంటల కార్గో ఎయిర్ పోర్ట్‌కు అనంతలో రీసర్వే చేయండి

కేంద్ర మంత్రి రామ్‌మోహన్ నాయుడిని కోరిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం, జులై 27, ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించాలని కోరుతూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్‌మోహన్ నాయుడితో సోమవారం సమావేశమై కోరారు. ఈ మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి స్పందించి సర్వే నిర్వహించి 30రోజుల్లో నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.

ఇక దృష్టంతా ఫలితాలపైనే

>> నింపాలని, విద్యావ్యవస్థ బాగుండాలంటే సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్ రెండూ ముఖ్యమేనని చెప్పారు. పదో తరగతి పరీక్షా ఫలితాలమెరుగుదలపై దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యారంగంలో సంస్కరణలు పూర్తయ్యాయని, ఫలితాలపై దృష్టిపెట్టాలన్నారు. 340 మంది ఉన్న పాఠశాలలో మార్పు కనపడాలని, ఆ మార్పుఫలితాల్లో ప్రతిబింబించాలని ఆదేశించారు.అనంతరం తొమ్మిదో తరగతి విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. మధ్యాహ్నభోజనం నాణ్యతపై ప్రశ్నించారు. విద్యార్థులకు ఆటోగ్రాఫ్ లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ డీకే బాలాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.వెంకటేశ్వరరావు,ఆర్జేడీఎస్ నాగమణి,డీఈవో యూవీ సుబ్బారావు,ఎంఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు ఇ-20 జనతాపార్టీ

>> ఇంధనం విషయంలో కూడా వినియోగదారులకు తాము ఎంచుకున్న పెట్రోల్ కొనుగోలు చేసే హక్కు కల్పించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఇ20ను అందుబాటులో ఉంచినా, దానితో పాటు 100 శాతం పెట్రోల్‌ను కూడా విక్రయించాలని కోరుతున్నారు. మా కార్లపై ప్రయోగాలు ఆపండి ఇంధనాన్ని ఎంచుకునే హక్కు భారతదేశానికి కావాలి మా వాహనాలు ప్రయోగ యంత్రాలు కావు. సంవత్సరాల ముందే పన్నులు చెల్లించి, మా కష్టార్జితంతో వాటిని కొన్నాము. మనది మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉన్న దేశం, మరియు ఇంధన సామర్థం ప్లస్ వాహన పనితీరు మా రోజువారీ జీవనంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతాయి. అలాంటప్పుడు వాహన మాన్యువల్‌ను అనుసరించకుండా, మా ఇంజిన్లపై ఎందుకు ప్రయోగాలు చేస్తున్నారని ఇజెపి అడుగుతోంది. కొందరు వాహన యజమానులు 20 శాతం ఇథనాల్ కలిపిన ఇ20పెట్రోల్ వాడటం వల్ల వాహనాల ఇంజన్లు దెబ్బతింటున్నాయని, మైలేజ్ తగ్గిందని ఆరోపిస్తున్నారు. నిర్వహణ ఖర్చులు పెరిగినట్లు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఇ20 జనతా పార్టీ పేరిట ఉన్న ఎక్స్ ఖాతాకు 13 వేలకుపైగా, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు 8,800కుపైగా ఫాలోవర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

కొట్టివేసిన మద్రాసు హైకోర్టు

>> తొక్కిసలాట బాధితుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలన్న ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వనిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై సోమవారం జస్టిస్ సి.వి. కార్తికేయన్, జస్టిస్ ఆర్. శక్తివేల్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి పిటిషనర్ల వాదనను సమర్థించింది. అంతకుముందు, నియామక ఉత్తర్వులను పంపిణీ చేయడానికి జులైలో కరూర్‌లో ఒక కార్యక్రమాన్ని నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు అనుమతినిచ్చింది. అయితే, ఆ ఉద్యోగ నియామకాలు తాత్కాలిక ప్రాతిపదికన ఉంటాయని, న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని కోర్టు అప్పుడే స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ద్విసభ ధర్మాసనం సోమవారం విచారణ జరిపి విస్పష్ట తీర్పునిచ్చింది.

అవగాహన పెంచండి

>> సాధారణ వర్షపాతం నమోదైందని చెప్పారు. మండల స్థాయిలో 249 మండలాలు తీవ్ర వర్షపాతం లోట్లులో, 359 మండలాలు వర్షపాతం లోట్లులో ఉండగా, కేవలం రెండు మండలాల్లో మాత్రమే అత్యధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, కోస్తాంధ్ర, రాయలసీమ అనే నాలుగు వ్యవసాయ వాతావరణ మండలాలన్నీ ఇప్పటికీ వర్షపాతం లోట్లు కేటగిరీలోనే కొనసాగుతున్నాయని చెప్పారు. వర్షపాతం పరిస్థితులకు అనుగుణంగా జిల్లాస్థాయి ప్రమాద అంచనాలు, రైతులకు సూచనలు, ప్రత్యామ్నాయ విత్తనాల ప్రణాళిక మరియు దశలవారీ పంటల అత్యవసర ప్రణాళిక చర్యలను ఇప్పటికే ప్రారంభించామని సీఎం చంద్రబాబు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అంచనా వేసిన 8,489 రైతు సేవా కేంద్రాలు మరియు 688 మండలాల్లో, 1,357 రైతు సేవా కేంద్రాలు, 168 మండలాలు అధిక ప్రమాద స్థాయిలో ఉన్నాయని సీఎం చంద్రబాబు చెప్పారు.సాగు విస్తీర్ణంపై ప్రత్యేక దృష్టి.జూలై 25 నాటికి, 12 జిల్లాల్లో సాధారణంగా సాగు కావాల్సిన విస్తీర్ణంలో 50 శాతం కంటే తక్కువ విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో 9 శాతం, బాపట్లలో 5 శాతం, ప్రకాశంలో 15 శాతం మరియు మార్కాపురంలో 15 శాతంతో పరిస్థితి అత్యంత ప్రభావితంగా ఉందన్నారు. 10 జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే 51 శాతం నుంచి 100 శాతం మధ్య సాగు నమోదైందని చెప్పారు. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు, కర్నూలు, పశ్చిమ గోదావరి సహా ఆరు జిల్లాల్లో సాధారణ సాగు స్థాయిని మించి సాగు నమోదైందని వివరించారు. అధిక ప్రమాదంలో ఉన్న 168 మండలాల్లో, సీజన్ సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే 39 శాతం సాగు నమోదైందని తెలిపారు. కర్నూలు జిల్లాలోని అధిక ప్రమాద మండలాలు సాగులో ముందంజలో ఉండగా, మార్కాపురం ప్రాంతంలోని అధిక ప్రమాద మండలాలు రాష్ట్రంలో అత్యంత వెనుకబడి ఉన్నాయని చెప్పారు. సీజన్ సాధారణ పంట విస్తీర్ణం 30.84 లక్షల హెక్టార్లుగా ఉండాలన్నారు.అయితే ఇప్పటివరకు మొత్తం 16.35 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయని సీఎం చంద్రబాబు చెప్పారు. ఇది సీజన్ సాధారణ విస్తీర్ణంలో 39 శాతం మరియు ప్రస్తుత తేదీ నాటికి సాధారణంగా ఉండాల్సిన విస్తీర్ణంలో 74 శాతమని తెలిపారు.రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల విషయంలో కొంత గ్యాప్ ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరును చదివి వినిపించినప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందనను అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రంపచోడవరంలో విద్యార్థి శివాని ఆత్మహత్య చేసుకున్న ఘటనను సీఎం చంద్రబాబు అధికారుల వద్ద ప్రస్తావించారు. చదువులో టాపర్ అయిన శివాని చనిపోవడం చాలా ఆవేదన కలిగించిందని అన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు సైకో మెట్రిక్ టెస్టులను చేయించాలని విద్యా శాఖ ఆదేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు వివరించారు. మానసిన పరిస్థితిని అంచనా వేసేందుకు నిపుణుల సేవలు తీసుకోవడంతోపాటు... టీచర్లకు కూడా అవసరమైన మేరకు శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తిరుపతిలో తొలి కరోనా కేసు

>> పాజిటివ్ కేసు నమోదుతో యాత్రికుల్లో ఆందోళన భావం నెలకొంది. తిరుపతి అర్బన్ ప్రాంతానికి చెందిన 65 ఏళ్ళ వృద్ధురాలికి ఆదివారం కోవిడ్ పాజిటివ్‌గా తేలడంతో తిరుపతిలో మొదటి కేసు నమోదైంది. గత కొన్ని రోజులుగా ఆమె తీవ్ర శ్వాసకోశ సమస్యలతో బాధపడుతోంది. ఆమెను కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించగా ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. నాలుగురోజుల క్రిందట నిర్వహించిన పరీక్షల్లో కరోనా నిర్ధారణ అయింది. అయితే ఆమె కుటుంబ సభ్యులకు జరిపిన పరీక్షల్లో ఎలాంటి వైరస్ లక్షణాలు లేవని వైద్యారోగ్య శాఖ స్పష్టం చేసింది. గత శనివారం ఒక్కరోజే రాష్ట్రంలో మరో 10 మందికి పైగా కరోనా బారిన పడ్డారనేది వైద్యశాఖ అధికారుల సమాచారం. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 49కి చేరగా, ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో 24 మంది చికిత్స పొందుతున్నారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొత్త కేసులు నమోదవగా కృష్ణా, తిరుపతి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఒక్కో కేసు నమోదైంది. ఇప్పటివరకు రాష్ట్రంలో కరోనాతో నలుగురు మృతి చెందినట్లు వైద్యశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. కేసుల సంఖ్య పెరుగుతుండటంతో వైద్యశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నారు.తిరుపతిలోని రుయా ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా వైరస్ సోకిన వారికోసం ప్రత్యేక వార్డులు, పకడలు, వైద్యపరికరాలు, వైద్యసదుపాయాలు అందుబాటులో ఉంచడం జరిగిందని రుయా వైద్యులు తెలిపారు. తిరుపతి యాత్రాస్థలం కావడంతో ఇక్కడకు నిత్యం 70వేలమంది వరకు వివిధ రాష్ట్రాల నుండి విదేశాల నుండి యాత్రికులు తరలివస్తుంటారు. వీరిలో ఎవరికైనా అనుమానాస్పదంగా జ్వరం, జలుబు,చలి ,శ్వాసకోశ సమస్యలు తీవ్రంగా ఉన్నా కరోనా వైరస్ భయం నెలకొంది.

రాజమండ్రిలో మరో ఇద్దరికి కరోనా

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై27,ప్రభాతవార్త: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జిజిహెచ్ లో సోమవారం నిర్వహించిన కోవిడ్ టెస్ట్ లో ఇరువురు మహిళలకు పాజిటివ్ నిర్ధారణ అయింది. జిజిహెచ్ లో 14 మందికి రాపిడ్ టెస్టులు చేయగా ఇరువురు మహిళలకు కోవిడ్ లక్షణాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు. రాజమహేంద్రవరం శ్రీరంగం పట్నం చెందిన 29 ఏళ్ల మహిళ కు అలాగే రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవలేశ్వరం కి చెందిన 45 సంవత్సరాల మహిళలకు పాజిటివ్ అయింది. ఆర్టీ పి సిఆర్ టెస్ట్ కోసం కాకినాడ పంపించినట్లు తెలిపారు రెండు రోజుల్లో రిపోర్ట్ రానున్నదని వివరించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

టెన్త్ విద్యార్థిని అనూహ్యంగా ఆత్మహత్య

>> మంత్రముగుద్దులు అయ్యారు. ఇంతలోనే ఈ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవటం అందరి మనసులను కలించి వేసింది. విద్యార్థిని మృతి పై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్య మంత్రి పోలవరం జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ట్విట్టర్ వేధికగా విద్యార్థిని మృతి పై విచారం వ్యక్తం చేసిన ముఖ్య మంత్రి తన మనసును ఈ ఘటన కలచివేసింది అని పోస్ట్ చేశారు. మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేధికగా రంపచోడవరం మెగాపేరంటే టీచర్ మీటింగ్లో ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడిన శివాని మృతి తీవ్ర విషాదం నింపింది అని విషయం తెలిసినప్పటి నుంచి శివాని మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి అని,సోదరీ శివాని ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను అని,ఎంత కష్టమైనా పోరాడుదాం. ఎంతటి సమస్యనైనా ఎదుర్కొందాం. మీకు నేనున్నాను ఈ ప్రభుత్వం ఉంది మన దేశ భవిష్యత్తు సంపద మీరు. అని లోకేష్ పోస్ట్ చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే పోలీసులు అన్ని కొనాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు అంత కలిసి ఉండాలని ఈ విద్యార్థిని రాసిన లేఖ ఘటన స్థలంలో లభించింది.ముఖ్యమంత్రి ప్రశంసలు అందుకున్న విద్యార్థిని ఆత్మ హత్య చేసుకోవటంతో రంపచోడవరం లో జరిగిన పి. టీ.యం కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరి కళ్ళు చమార్చెలా చేసింది ఈ విషాదం.

సోమవారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద భార్యతో కలిసి బాపూజీకి నావాళులర్పిస్తున్న వాంగ్‌చుక్

ఆకివీడు రామాలయం నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి: ఆకివీడు రామాలయం నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నిర్మాణానికి కలెక్టర్ ఇచ్చిన ఎన్‌వోసీని సుప్రీంకోర్టు సమర్థించింది. అనుమానాలు ఉంటే మరో పిటిషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. ఆకివీడు రామాలయానికి వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

సుప్రీంకోర్టులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి చుక్కెదురు

విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి: సుప్రీంకోర్టులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి చుక్కెదురైంది. ఏపీ లిక్కర్ స్కాంలో నిందితుడు దొడ్డా వెంకట సత్యప్రసాద్‌కు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను కొట్టివేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. సోమవారం ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్‌లో పలు సందేహాలను చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏమైనా సందేహాలుంటే సరైన సమయంలో తమ అభ్యంతరాలతో కోర్టును ఆశ్రయించవచ్చని ఆ వైసీపీ నేతకు ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేసింది. దొడ్డా వెంకట సత్యప్రసాద్‌ను అప్రూవర్‌గా మార్చి.. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నారంటూ ఆ పిటిషన్‌లో వైసీపీ నేత చెవిరెడ్డి ఆరోపించారు. దొడ్డా వెంకట సత్యప్రసాద్‌కు ఇచ్చిన ముందస్తు బెయిల్ కొట్టివేయాలంటూ సుప్రీంకోర్టులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి) దాఖలు చేసారు.ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, దొడ్డా వెంకట సత్యప్రసాద్‌లను అప్రూవర్‌లుగా మార్చి తద్వారా వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ని ఇరికించేందుకు కూటమి ప్రభుత్వంతోపాటు ఈ కేసు విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) కుట్ర పన్నుతున్నాయని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆరోపిస్తున్నారు.

తమ్మినేని సీతారామ్ కుమారుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

విజయవాడ, జులై 27,ప్రభాతవార్తప్రతినిధి: వైఎస్సార్సీపీ నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ కుమారుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తమ్మినేని కుమారుడు నాగ్‌కు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఫోర్జరీ డస్త్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన కేసులో నాగ్ పిటిషన్ కొట్టివేసింది. ఇదే కేసులో తమ్మినేని సీతారామ్ సతీమణి వాణికి మధ్యంతర బెయిల్ మంజూరయ్యింది. ఎప్పుడు పిలిస్తే... అప్పుడు విచారణకు రావాలని వాణిని హైకోర్టు ఆదేశించింది.

వన్ ఇండియా, వన్ సినిమా దిశగా ఎఫ్‌టిసి అడుగులు

>> ఇండియా వన్ సినిమా అనే విప్లవాత్మక లక్ష్యం ప్రతి ఒక్కరికీ చేరాలి. థియేటర్, టెలివిజన్, ఓటీటీ, ఈ మూడు రంగాలు సమాంతరంగా వృద్ధి చెందడమే ప్రభుత్వ ఆకాంక్ష." అన్నారు."రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. భవిష్యత్తులో ఎఫ్‌టీపీసీ చేపట్టే అన్ని రకాల ప్రమోషనల్ కార్యక్రమాలకు, సినీ అభివృద్ధి చర్యలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి సహకారం ఉంటుంది." అని హామీ ఇచ్చారు. క్రియేటివ్ ఎకానమీ ప్రతినిధులు త్వరలోనే రాజధాని అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ఫిల్మ్, టెలివిజన్, థియేటర్ కార్యకలాపాలను విస్తృతంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. భారతదేశంలో సినీసాంకేతిక, వినోద రంగాన్ని ఒకే గొడుగు కిందికి తెచ్చేందుకు ఎఫ్‌టీపీసీచేస్తున్న కృషిని మంత్రి దుర్గేష్ కొనియాడారు. మంత్రిని కలిసిన వారిలో ఎఫ్‌టీపీసీ ఇండియా ప్రెసిడెంట్ చైతన్య జంగా, సెక్రటరీ వర్మ పాకలపాటి, సఖిశక్తి వెల్ఫేర్ ఫౌండేషన్ (పాన్ ఇండియా) ప్రెసిడెంట్ జయ పటేరియా, శ్రీనివాస్, రమేష్, ఈశ్వర్ తదితర ప్రతినిధులు ఉన్నారు.

పొగాకు కొనుగోళ్లకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మద్దతు: సిఎం చంద్రబాబు

విజయవాడ,జులై 27,ప్రభాతవార్తప్రతినిధి: పొగాకు కొనుగోళ్లకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మద్దతిచ్చేందుకు అంగీకరించిందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఉమ్మడిగా రూ.188 కోట్లు భరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది.ధరల లోటు భర్తీ కింద పొగాకు రైతులకు కిలో పొగాకు రూ.20 ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.94 మిలియన్ కేజీల పొగాకు కొనుగోళ్లకు మద్దతిచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.పొగాకు బ్రైట్ రకం కిలో రూ.240, మీడియం రకం పొగాకు రూ.190, లో గ్రేడ్ పొగాకు రూ.110 మేర తగ్గకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.పొగాకు రైతులను ఆదుకునేందుకు కేంద్రంతో నిత్యం సీఎం చంద్రబాబు సంప్రదింపులు జరిపారు.రాష్ట్ర ప్రభుత్వం.౦ండు రోజుల క్రితం సీఎం చంద్రబాబును కలిసిన కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, డైరెక్టర్. సీఎం సూచనల మేరకు పొగాకు రైతులను ఆదుకునేందుకు సహకరించాలని కోరుతూ రాష్ట్రంలోని కేంద్ర ప్రతినిధులు.బయ్యర్లతో చర్చలు జరిపారు.

వారం - వర్జ్యం

28-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
చతుర్దశి సా.6.17,
పూర్వాషాఢ మ.1.09
వర్జ్యం : రా.9.58-రా.11.44
దు.ఉ.8.21-ఉ.9.13,
2)రా.11.50-రా.12.42
రాహుకాలం - మ.3.00-4.30

వార్తాఫలం

మేషం: బంధువుల నుండి ఆహ్వానాలు అందుతాయి. అవకాశాలు అప్రయత్నంగా లాభిస్తాయి. స్థలాలు కొనుగోలు చేస్తారు.

వృషభం: జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. దేవాలయ సందర్శనం చేసుకుంటారు.

మిథునం: ముఖ్యమైన విషయాలలో తొందరపాటు వద్దు. భూముల క్రయ విక్రయాలతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగినది.

కర్కాటకం: పెట్టుబడులకు అనుకూల కాలం. సంఘోద్ధరణకు మీ వంతు సహాయాన్ని అందిస్తారు. ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి.

సింహం: ఇంటి యందు శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. సంతాన విద్య విషయంలో బాధ్యతతో వ్యవహరిస్తారు.

కన్య : వ్యవహారాలలో ఇతరుల జోక్యాన్ని ఆదిలోనే తుంచివేయండి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్న అవసరాలకు డబ్బు అందుతుంది.

తుల: ఆలోచనలు ఫలిస్తాయి. కావు అనుకున్న మొండి పనులలో చలనం ఏర్పడుతుంది. కోపతాపాలకు దూరంగా వుండండి.

వృశ్చికం: అందరిలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుంది. సాంకేతిక రంగంలోనివారికి అనుకూలంగా ఉంటుంది.వస్త్రలాభం.

ధనుస్సు: వివాదాస్పద అంశాలు ఎదురయినప్పుడు సమాధానాలు ఇవ్వక మౌనం వహించండి. ఆర్థికంగా వెసలుబాటు కలుగుతుంది.

మకరం: అన్ని విషయాలు నిబంధనలకు అనుగుణంగా జరగవని లౌక్యం అవసరమని గుర్తించి వ్యవహరించడం వలన లాభపడతారు.

కుంభం: మొండి ధైర్యంతో ఒకానొక ముఖ్య నిర్ణయం తీసుకుని అమలు చేస్తారు. దాని తాలూకు ఫలితాలు భవిష్యత్తులో అందుతాయి.

మీనం: సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. నూతన ఒప్పందాలలో నిదానం అవసరం. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

బడులు, హాస్టల్స్‌లో స్టీమ్ రైస్ వాడకం

>> అనుసంధానం చేసి పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని ఒక జిల్లాలో మొదలుపెట్టేలా అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రివర్యుల నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు. బియ్యం సంచులపై ఆర్ ఎఫ్ఐడీను ముద్రించడం ద్వారా అక్రమ రవాణా అరికట్టడానికి దోహదపడుతుందని, దీన్ని పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో అమలు చేయడానికి అనుమతి ఇవ్వాలన్నారు. రేషన్ బియ్యంలో 10 శాతం నూకల బియ్యం అందిస్తే, ప్రజాపంపిణీలో మంచి ఫలితాలు ఉంటాయని, దీన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని తెలిపారు.అలాగే పెండింగ్ ఉన్న నిధులను విడుదల చేయాలని కోరారు. మంత్రి వెంట పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు , పౌర సరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు, తదితరులు ఉన్నారు.

లోక్‌సభకు 'పరీక్షల' బిల్లు

>> ఉద్దేశించిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈనెల 20న విద్యార్థులపై జరిగిన పోలీసుల బలప్రయోగాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. అటు రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి నెలకొడంతో ఉభయసభలకు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. పార్లమెంట్‌లో సంసద్ ఛలో కార్యక్రమం సందర్భంగా విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. పక్ష సభ్యుల ఆందోళన మధ్య కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాలు నిరసన కొనసాగించడంతో లోక్‌సభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. అటు రాజ్యసభలోనూ విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారంటూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. విపక్షాల నిరసనల మధ్య మొదట మధ్యాహ్నం 12 గంటల వరకు రాజ్యసభ వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత విద్యార్థులపై లాఠీఛార్జితో పాటు పలు అంశాలపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి. ఈ క్రమంలో రాజ్యసభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. ఆ బిల్లు ప్రకారం లీకేజీకి పాల్పడి నిందితులకు పదేళ్ల జైలుశిక్ష, 50 లక్షల ఫైన్ విధించనున్నారు. వాస్తవానికి ఇవాళ 5 గంటలకు ఆ బిల్లుపై చర్చ చేపట్టాలని భావించారు. కానీ విద్యార్థులపై లాఠీఛార్జ్‌ను ఖండిస్తూ విపక్షలు సభలో నినాదాలు చేశాయి. దీంతో గందరగోళం మధ్య సభను మరుసటిరోజుకు వాయిదా వేశారు. సుమారు 6 గంటల పాటు బిల్లుపై చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ పరీక్షల సవరణ బిల్లుపై సమగ్ర చర్చ నిర్వహించాలని కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మరోసారి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించకుండా విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బిల్లుపై నిర్మాణాత్మక చర్చ జరపాలని కోరారు. ప్రశ్నపత్రాల లీకేజీలు వంటి సమస్యలను పరిష్కరించేందుకు కీలక బిల్లును తీసుకొచ్చామని, కానీ కాంగ్రెస్, మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు దీనిపై చర్చకు సిద్ధం కాకుండా సభలో అంతరాయం కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. పరీక్షల వ్యవస్థలో సంస్కరణల కోసం ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన చర్యలను ప్రతిపక్షాలు గుర్తించాలని రిజిజు కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలోఉంచుకుని ఈ బిల్లును ఆమోదించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. నాలుగు గంటల చర్చ ఈ బిల్లుపై లోక్‌సభలో నాలుగు గంటలపాటు చర్చ నిర్వహించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఏసి) నిర్ణయించినట్లు సమాచారం. బిజెపి ఎంపీలు బన్సూరి స్వరాజ్, తేజస్వి సూర్యతోపాటు జేడీయూ, టిడిపి,శివసేన, ఎన్‌సిపి, అప్నాదళ్, ఎల్‌జెపి (రాంవిలాస్) తదితర పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొనే అవకాశం ఉంది.

బిల్లులో ఏడు కీలక సవరణలు

ఈ సవరణ బిల్లులో మొత్తం ఏడు కీలక మార్పులు ప్రతిపాదించారు. పేపర్ లీక్‌లు, పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేయడం, నిందితులకు కఠిన శిక్షలు విధించడం, అమలు వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. బిల్లు ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ఛార్జిషీట్ దాఖలు చేసిన మూడు నెలల్లో విచారణ పూర్తి చేయాలని ప్రతిపాదించారు. రెండు నెలల్లో దర్యాప్తు ముగించాల్సి ఉంటుంది. పరీక్షల అక్రమాల దర్యాప్తు కోసం కేంద్రం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయవచ్చు. రాష్ట్రాలు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించుకునే అధికారం పొందుతాయి. నేరస్థులకు మరింత కఠిన జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించే అవకాశం ఉంటుంది. హైకోర్టు డివిజన్ బెంచ్‌లో నిర్ణీత గడువులో అప్పీల్ చేసే విధానాన్ని కూడా బిల్లులో చేర్చారు.

అబ్దుల్ కలాంకు సిఎం, డి.సిఎం నివాళి

విజయవాడ, జూలై 27 ప్రభాతవార్త ప్రతినిధి: భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నివాళి అర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ దేశానికి శాస్త్ర, సాంకేతిక పరంగా అబ్దుల్ కలాం ఎన్నో విజయాలను అందించారని సిఎం చంద్రబాబు కొనియాడారు. దేశానికి శాస్త్ర, సాంకేతికపరమైన ఎన్నో విజయాలను అందించి, మిస్సైల్ మ్యాన్‌గా గుర్తింపు పొందిన భారతరత్న ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా నివాళి అర్పిస్తున్నాను అంటూ సిఎం పోస్ట్ చేశారు. తన నిరాడంబరత, నిజాయితీ, మానవతా దృక్పథం వంటి విశిష్ట లక్షణాలతో ప్రజల రాష్ట్రపతిగా కలాం పిలువబడ్డారు. ఆ మహనీయుని వర్ధంతి సందర్భంగా స్మృతికి నివాళి అర్పించారు. డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం ఒక జాతి భవిష్యత్తును తీర్చిదిద్దే తూనే ఉన్న ఒక దార్శనికతను వదిలి వెళ్లారని డిప్యూటీ సిఎం పవన్ 'ఎక్స్' ఖాతాలో అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా, భారతరత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాంకు వినయపూర్వక నివాళి అర్పించారు. ఆయనను భారత క్షిపణి మానవుడు ఇస్రో, డిఆర్‌డిఒ ద్వారా భారతదేశ అంతరిక్ష, రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసిన ప్రముఖ శాస్త్రవేత్త, భారతదేశ 11వ రాష్ట్రపతి, స్ఫూర్తిదాయకమైన ఉపాధ్యాయుడు, ఆధునిక భారతదేశపు గొప్ప జాతి నిర్మాతలలో ఒకరు అంటూ పవన్ కల్యాణ్ కొనియాడారు. ఆధునిక భారతదేశపు గొప్ప జాతి నిర్మాతలలో ఎపిజె ఒకరని పవన్ అన్నారు.

సిఆర్‌పిఎఫ్ జవాన్లకు డి.సిఎం శుభాకాంక్షలు

విజయవాడ, జూలై 27 ప్రభాతవార్త ప్రతినిధి: సిఆర్‌పిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన ధైర్యవంతులైన జవాన్లకు డి.సిఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలియజేశారు. "దేశం చూసే ప్రతి శాంతియుత సూర్యోదయం.. చీకటి వేళల్లోనూ మెలకువగా ఉండే జవాన్ల ధైర్యంతో భద్రంగా ఉందన్నారు. వారి అచంచలమైన ధైర్యం, సాటిలేని క్రమశిక్షణ, నిస్వార్థ సేవ భారతదేశ అంతర్గత భద్రతకు ఒక శాశ్వతమైన స్తంభంగా నిలిచాయి. ఉగ్రవాదంతో పోరాడటంలో, వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కోవడంలో, ప్రజాస్వామ్య సంస్థలను పరిరక్షించడంలో, ప్రకృతి వైపరీత్యాలకు స్పందించడంలో, లేదా సంక్షోభ సమయాల్లో పౌరులను రక్షించడంలో అయినా సిఆర్‌పిఎఫ్ ఎల్లప్పుడూ అసాధారణ శౌర్యంతో దేశం పట్ల అచంచలమైన నిబద్ధతతో ముందు వరుసలో నిలిచింది. ప్రతి యూనిఫాం త్యాగానికి ప్రతీక. ప్రతి మిషన్ స్వార్థానికి అతీతమైన కర్తవ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రతి ధైర్యసాహసాల చర్య దేశ విశ్వాసాన్ని, ఐక్యతను బలపరుస్తోంది. ధైర్యవంతులైన సిఆర్‌పిఎఫ్ సిబ్బంది కుటుంబాలకు వందనం. వారి నిశ్శబ్ద త్యాగాలు, స్థిరమైన మద్దతు ప్రతి సిఆర్‌పిఎఫ్ యోధుని సంకల్పాన్ని బలపరుస్తాయ్ అని ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

ముర్రం శివాని బలవన్మరణం తీవ్ర విషాదంలోకి నెట్టేసింది: సిఎం చంద్రబాబు

విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: ముర్రం శివాని తనువు చాలించడం తీవ్ర విషాదంలోకి నెట్టేసిందని సిఎం చంద్రబాబు తెలిపారు. మెగా పిటిఎం వేదికపై ఉత్సాహంగా మాట్లాడిన శివాని బలవన్మరణం ఆవేదన కలిగించిందని 'ఎక్స్' వేదికగా అన్నారు. 'ఆరోజు తన చదువు, ఉన్నత లక్ష్యాలపై శివాని చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏమైనా తన కలలు నిజం కాకుండానే విద్యార్థిని దూరమవడం కలచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించారు సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవరూ ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు లోనుకావొద్దని కోరుతున్నా. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధ, ఆవేదనను మీ కుటుంబసభ్యులు, స్నేహితులతో పంచుకోండి. ఒత్తిడిని అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని తెలియజేస్తున్నా అని సిఎం చంద్రబాబు అన్నారు. శివాని మృతి పట్ల దిగ్భ్రాంతికి లోనవుతున్నట్లు చంద్రబాబు తెలిపారు.

శివానీ మృతిపై విచారణ జరిపించాలి: సిపిఎం

విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: రంపచోడవరం మండలం ఇర్లపల్లి కొత్త కాలనీకి చెందిన గిరిజన విద్యార్థిని ముర్రం శివానీ (15) అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని కలిగించిందని సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. శివానీ మృతి అత్యంత బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నిన్నటివరకు ముఖ్యమంత్రితో సహా అందరి చేత ప్రశంసలు పొంది, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిన ఒక విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం అనేక అనుమానాలకు, ప్రశ్నలకు తావిస్తోంది. చిన్నారిని ఆత్మహత్యకు పురికొల్పిన పరిస్థితులు ఏమిటి? ఆమె ఎదుర్కొన్న మానసిక ఒత్తిడికి కారణాలు ఏమిటి? అనే అంశాలపై సమగ్రంగా, నిష్పాక్షికంగా ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శివానీ కుటుబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఆ కుటుంబానికి తక్షణమే రూ. 25 లక్షల పరిహారం అందించాలనీ వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

శివానీ మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి: సిపిఐ

విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: గిరిజన విద్యార్థిని ముర్రం శివానీ (15) మరణంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించి, ఆత్మహత్యకు గల కారణాలను వెలికితీయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. విద్యార్థిని ముర్రం శివానీ అకస్మాత్తుగా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి, మరణించడం కలచివేసింది. శివానీ మృతిపట్ల ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ముర్రం శివానీ మరణం ఒక ప్రశ్నగా మిగిలిపోకూడదు. శివానీని ఆత్మహత్యకు పురిగొల్పిన పరిస్థితులు, మానసిక సంఘర్షణకు గల కారణాలను కనుగొనేలా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి, నిజానిజాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు.

సెప్టెంబర్‌లో జిఎన్‌యం సప్లిమెంటరీ పరీక్షలు

విజయవాడ, జులై 27 ప్రభాతవార్త: రాష్ట్రంలోని జిఎన్‌యం విద్యార్థులకు సెప్టెంబర్ నెలలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ సోమవారం ఒ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ బోర్డు ఆధ్వర్యంలో జరుగనున్న ఈపరీక్షలకు అర్హులైన విద్యార్థులు సంబంధిత ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల ప్రిన్సిపాళ్ళ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, పరీక్షల షెడ్యూల్ పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ సూచించారు.

డిఎస్సీ ఆరోపణలపై చర్చకు సిద్ధం

- వైసిపి హయాంలో లిక్కర్, భూకుంభకోణాలపై కూడా చర్చిద్దాం
- అభివృద్ధి - సంక్షేమం మా సిద్ధాంతం, విధ్వంసం, బూతులు గొడ్డలిపార్టీ విధానం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం విజయమే లక్ష్యంగా కేడర్ పనిచేయాలి
- పెనమలూరు నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేష్

విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: డిఎస్సీపై గొడ్డలి పార్టీ అధినేత చేస్తున్న ఆరోపణలపై చర్చకు తాను సిద్ధం అని తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ జగన్‌కు సవాల్ విసిరారు. కంకిపాడు ఆయాన్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో నారా లోకేష్ మాట్లాడుతూ డిఎస్సీపై ఆరోపణలతోపాటు వైసిపి హయాంలో లిక్కర్ భూ కుంభకోణాలపై కూడా చర్చకు తాను సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. 2లక్షల టీచర్ పోస్టులు భర్తీచేసిన చరిత్ర టిడిపిది అని, ఐదేళ్ల వైసిపి హయాంలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేని నీచ చరిత్ర జగన్‌ది అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను అమలుచేసి అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహిస్తే బురద జల్లుతున్నారు, 150రోజుల్లో విజయవంతంగా డిఎస్సీ నిర్వహిస్తే 150కేసులు వేసి అడ్డుకోవాలని చూశారు, వారు వేసిన కేసులన్నీ న్యాయస్థానాలు కొట్టివేయడం మా చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్ల బండిలా ముందుకు తీసుకెళ్తున్నామని, వీటన్నింటినీ పార్టీ కేడర్ ప్రజల్లోకి తీసుకెళ్లాలని లోకేష్ కోరారు. ఇంటింటికీ తెలుగుదేశం (డోర్ టు డోర్) కార్యక్రమం ద్వారా పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను పట్టుదల, క్రమశిక్షణతో అమలుచేయాలని కోరుతున్నా. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, గొడ్డలి పార్టీ విధ్వంసం, ఫేక్ ప్రచారాలను ప్రజలకు వివరించాలి. టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తల మధ్య ఐక్యత చాలా అవసరం. నాయకులు, కార్యకర్తలంతా రాష్ట్రంలోని ప్రతి గడప తొక్కాలి అని పార్టీ శ్రేణులకు మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

బిళ్ల సత్యనారాయణను పరామర్శించిన మంత్రి లోకేష్

పెనమలూరు మండలం గోసాలలోని వేణుగోపాలస్వామి నగర్‌లో నివాసం ఉంటున్న టిడిపి సీనియర్ కార్యకర్త బిళ్ల సత్యనారాయణను పరామర్శించారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలో అంకితభావంతో బిళ్ల సత్యనారాయణ పనిచేస్తున్నారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమానికి పసుపు రంగు చొక్కా ధరించి, తన ద్విచక్ర వాహనంపై టిడిపి జెండాతో హాజరవుతూ గుర్తింపుపొందారు. గత మూడేళ్లుగా కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్నారు. చిన్న కిరాణాషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె అనారోగ్య సమస్యల కారణంగా మరణించగా చిన్న కుమార్తె ఇటీవల భర్తను కోల్పోయి తన పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్ద నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లిన మంత్రి నారా లోకేష్, బిళ్ల సత్యనారాయణ, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బిళ్ల సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని, అన్ని విధాల అండగా ఉంటానని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

డిఎస్సీపై గొడ్డలి పార్టీ అబద్ధాలు

- సమైక్యాంధ్ర, నవ్యాంధ్రలో ఉపాధ్యాయ ఉద్యోగాల సృష్టికర్త చంద్రబాబు
- 9 డిఎస్సీలతో 1.80 లక్షల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ ఘనత బాబుదే
- డిఎస్సీ ఎందుకు పెట్టలేదో వైసిపి నేతలు జగన్‌నే అడగాలి
- డిఎస్సీపై బొత్స కామెంట్లు వెనక్కు తీసుకోవాలి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, జులై 27 ప్రభాతవార్త: గొడ్డలి పార్టీ అవాస్తవాలతో కూటమి ప్రభుత్వాన్ని బద్నాం చేస్తూ, యువతలో అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విమర్శించారు. డిఎస్సీపై వైసిపి నేతల ఆరోపణలు, మంగళవారం తలపెట్టిన ధర్నా నేపథ్యంలో మంత్రి సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ సమైక్యాంధ్రలోనూ, నవ్యాంధ్రలోనూ ఉపాధ్యాయ ఉద్యోగాల సృష్టికర్త అంటే చంద్రబాబు ఒక్కరే అని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 9 డిఎస్సీలతో 1.80 లక్షలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశారని మంత్రి కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మెగా డిఎస్సీపై తొలి సంతకం పెట్టి ఆరు నెలల్లోనే 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన ఘనత కూడా చంద్రబాబుకే దక్కిందన్నారు. డిఎస్సీపై వైసిపి ప్రభుత్వం 230కి పైగా కేసులు వేసినా ప్రభుత్వం ఆన్సర్ షీట్లు, ఫలితాలు, ఎంపిక అన్ని విషయాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచి తన పారదర్శకత నిరూపించుకుందన్నారు. గత ప్రభుత్వం 8 వేల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క డిఎస్సీ కూడా నిర్వహించలేక నిరుద్యోగులు, యువతను మోసం చేసిందని దుయ్యబట్టారు. ఐదేళ్ల పాలనలో ఒక్క డిఎస్సీ నిర్వహించని జగన్‌ను వైసిపి నేతలు ఎందుకు? ప్రశ్నించడం లేదని మంత్రి వైసిపి నేతలకు చురకలు అంటించారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు వస్తున్నాయని, ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల విద్య ఏ స్థాయిలో ఉందో చెప్పేందుకు నిదర్శనం అన్నారు.

బొత్స కామెంట్లకు మంత్రి కొండపల్లి చురకలు: డిఎస్సీపై బొత్స కామెంట్లకు మంత్రి కొండపల్లి చురకలు అంటించారు. గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన బొత్స గౌరవ ప్రదంగా తన స్థాయికి తగినట్టుగా మాట్లాడాలని మంత్రి కొండపల్లి హితవు పలికారు. వోక్స్ వ్యాగన్ లావాదేవీలతో బొత్స రాష్ట్రానికి పెద్ద మచ్చ తేవడంతోనే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు మహారాష్ట్రకు వెళ్లిందని విమర్శించారు. గత డిఎస్సీలో విజయనగరం జిల్లాలో 583 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చాయని, డిఎస్సీ పరీక్ష ఎంత పారదర్శకంగా జరిగిందో బొత్స ఆ ఉపాధ్యాయులను అడిగితే చెపుతారన్నారు. బొత్స తక్షణమే డిఎస్సీపై చేసిన కామెంట్లను వెనక్కు తీసుకోవాలని మంగళవారం వైసిపి ధర్నా చేస్తే ఉపాధ్యాయులు, నిరుద్యోగులు వాళ్లనే ఛీ కొడతారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో ఒక్క డిఎస్సీ పరీక్ష కూడా ఎందుకు నిర్వహించలేదన్న ప్రశ్నకు బొత్స ఏమని సమాధానం చెపుతారని మంత్రి ప్రశ్నించారు.

ఎపిలో 1000 'మీ మార్ట్స్'

- ఎన్‌సిసిఎఫ్‌తో పౌరసరఫరాల శాఖ కీలక ఒప్పందం

మంత్రి నాదెండ్ల సమక్షంలో కేంద్ర ప్రభుత్వ నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్‌తో పౌర సరఫరాల శాఖ ఎంఒయు చేసుకున్న దృశ్యం

విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించేందుకు ఎపి ప్రభుత్వం కీలక కార్యచరణకు ఉపక్రమించింది. కేంద్ర ప్రభుత్వ నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్‌తో ఎపి పౌర సరఫరాల శాఖ కీలక అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంది. ఢిల్లీలో పౌర సరఫరాల కమిషనర్ కన్నబాబు ఎన్‌సిసిఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అనీస్ జోసెఫ్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,000 'మీ మార్ట్స్' ఏర్పాటు చేయనున్నారు. తొలి దశలో పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఈ సేవలను ప్రారంభించనున్నారు. రేషన్ దుకాణాల ద్వారానే 'మీ మార్ట్స్' సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మార్ట్స్‌లో 70రకాల నాణ్యమైన వినియోగ వస్తువులు పోటీ ధరలకు విక్రయించనున్నారు. ప్రజలకు నాణ్యమైన వస్తువులను సరసమైన ధరల్లో అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,000 'మీ మార్ట్స్' ఏర్పాటు ద్వారా వినియోగదారులకు మరింత ప్రయోజనం చేకూరనుంది. ఈ సమాచారాన్ని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు.

కృష్ణా జలాల్లో వాటాపై సుప్రీంలో విచారణ

- కర్ణాటక విజ్ఞప్తిని తిరస్కరించిన ధర్మాసనం

విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ ఎపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేసును పరిశీలించింది. సుదీర్ఘ విచారణ చేయాల్సి ఉన్నందున ఈ కేసును ప్రత్యేక బెంచ్ ముందు విచారణకు నివేదిస్తామని వెల్లడించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా వేసింది. ఈలోగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కృష్ణా నదీ జలాల వాటాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఎపి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

రాష్ట్రం, ప్రజల గురించే సిఎం చంద్రబాబు తపన

- కుటుంబం గురించి ఆలోచించరు.. అభివృద్ధికి చర్యలు
- ప్రభుత్వం ప్రజల ఇంటి గడప తొక్కుతోంది
- ప్రజలు కూటమి ప్రభుత్వంతో చేయి కలపాలి
- సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి

రామకుప్పం మండలం ననియాలతో మహిళలనుద్దే శించి ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

కుప్పం, జులై 27 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబు నాయుడు నిత్యం రా ష్ట్రం, రాష్ట్ర ప్రజల గురించే తపన పడుతుంటారని కుటుంబం గురించి ఆలోచించరని సిఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా సోమవారం నారా భువనేశ్వరి రామకుప్పం మండలం కావలి మడుగు గ్రామంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంను ప్రారంభించారు. ననియాల, పిఎంకె తాండా, పంద్యాలమడుగు, రామకుప్పం గ్రామాల్లో పర్యటించి మహిళలు, ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో సిఎం చంద్రబాబు విజన్ 2020తో ఐటి రంగాన్ని అభివృద్ధి చేశా రన్నారు. నేడు రాష్ట్ర విభజన అనంతరం ప్రతి నియోజకవర్గం అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. వైజాగ్ ఐటి హబ్‌గా, అనంత పురం ఆటో మొబైల్ హబ్‌గా రూపుదిద్దుకుంటు న్నాయని చెప్పారు. కుప్పానికి సైతం ముప్పై పరిశ్రమలు తీసుకువచ్చారన్నారు. 732కి.మీ.ల దూరంలో ఉన్న కృష్ణాజలాలను రూ.3600 కోట్ల ఖర్చుతో కుప్పానికి తెచ్చారని పేర్కొన్నారు. నదుల అనుసంధానంతో అన్నిప్రాంతాలకు సాగు, తాగునీరు అందిస్తున్నారన్నారు.

వైఎస్సార్సీ పాలనలో నోరు తెరవలేని దుస్థితి: ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో ప్రజలు నోరుతెరవలేని దుస్థితి నెలకొనడంతో పాటు ఎవరు ఉంటారో ఎవరు పోతారో తెలియని పరిస్థితి ఉండేదని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఐదేళ్లలో అరాచకాలు చేశారని ఈ విషయం ప్రజలు గుర్తించే సిఎం చంద్రబాబుపై విశ్వాసంతో గెలిపించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సిఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు ఎన్టీఆర్ భరోసా, దీపం 2, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, తల్లికివందనం పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్నక్యాంటీన్లు ప్రారంభించాం న్నారు. తాను కష్టపడతానని సంపద సృష్టించి ప్రజలకు పంచుతానని సిఎం చంద్రబాబు పేర్కొంటుంటారన్నారు.

ప్రజలు ప్రభుత్వంతో చేయి కలపాలి: ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రజల ఇంటి గడప తొక్కుతోందని ప్రజలు కూడా ప్రభుత్వంతో చేయి కలపాలని నారా భువనేశ్వరి పిలుపు నిచ్చారు. నలభై సంవత్సరాలుగా సిఎం చంద్రబాబుకు ఓట్లేసి నాలుగుసార్లు ముఖ్య మంత్రిని చేసిన కుప్పం ప్రజలకు తాను చంద్రబాబు భార్యగా మరువనని పేర్కొన్నారు. కుప్పం ప్రజలంటే సిఎం చంద్రబాబుకు ఎంతో అభిమానం అన్నారు. కుప్పాన్ని మరింత అభివృద్ధి చేసి టూరిజం చిత్రపటంలో కుప్పానికి స్థానం కల్పిస్తారని పేర్కొన్నారు. అంతకుముందు గ్రామాల్లో నారా భువనేశ్వరికి మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. నారాయణపురం తాండాలో దివంగత ఎన్టీఆర్ విగ్రహాన్ని నారా భువనేశ్వరి ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, సిఎం పిఎ శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, నేతలు పత్ర నారాయణ, కృష్ణానాయక్, మనోహర్, రఫీ, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిజెపి మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశం

విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని మతాలు ఒకటిగా ఉండాలని అన్నారు. రామజన్మ భూమి అంశాన్ని హిందూ- ముస్లిం కోణంలో చూడొద్దని మాధవ్ పేర్కొన్నారు. మత సమభావన అనేది మా సిద్ధాంతమని, వివక్ష లేని పాలన అందిస్తున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు.

15 మంది బాధితులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు



విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: అనారోగ్య సమస్యలతో ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ తీసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి వచ్చిన సిఎంఆర్‌ఎఫ్ అర్జీలను స్వయంగా పరిశీలించి ప్రత్యేక సాయం అందేలా చూశారు. సోమవారం మధ్యాహ్నం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు 15 మంది బాధితులకు రూ.12.78 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ క్లిష్ట సమయంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయానికి, తమ సమస్యలను గుర్తించి స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

పిహెచ్‌సిల పనితీరుకు 'ఆరోగ్య ఫలితాల్లే ప్రామాణికం: మంత్రి సత్యకుమార్

విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మదింపులో కూటమి ప్రభుత్వం సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎంతమంది రోగులకు సేవలు అందించారు? ఎన్ని పరీక్షలు చేశారు? ఎన్ని ప్రసవాలు నిర్వహించారు? అనే లెక్కలను మాత్రమే కాకుండా అందించిన వైద్య సేవల వల్ల ప్రజల ఆరోగ్యంలో ఎంత మార్పు వచ్చింది? మాతా శిశు మరణాలు తగ్గాయా? రక్తపోటు, మధుమేహ రోగులకు నిరంతర చికిత్స అందుతోందా? లేదా? సేవలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారా? అనే ఫలితాల ఆధారంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును గుర్తించనున్నారు.

ఇందుకోసం మొత్తం 21 కీలక పనితీరు సూచికలతో కొత్త ర్యాంకింగ్, గ్రేడింగ్ విధానాన్ని ప్రభుత్వం రూపొందించింది. సంజీవని. మాతృత్వ, క్షేమ కార్యక్రమాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును అనుసంధానిస్తూ గ్రామస్థాయి వైద్య వ్యవస్థను మరింత జవాబుదారీగా, ఫలితాల ఆధారితంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దడమే ఈ కొత్త ర్యాంకింగ్ విధానం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఐదు అంశాల పరిమితికి స్వస్తి

ప్రస్తుతం 5 అంశాల ఆధారంగానే వైద్యారోగ్య శాఖ ర్యాంకులను ప్రకటిస్తోంది. ఓపీ విధానంలో రోగుల సంఖ్య, ఆసుపత్రిలో చేరినవారు, ల్యాబ్ పరీక్షలు, ప్రసవాలు, గర్భనిరోధక సాధనాల వాడకం వంటి ఐదు అంశాల ఆధారంగానే పిహెచ్‌సిల పనితీరును అంచనా వేసేవారు. ఈ విధానంలో సేవల సంఖ్య మాత్రమే తెలుస్తోందని, వ్యాధుల నివారణలో సాధించిన పురోగతి, మాతా శిశు ఆరోగ్య ఫలితాలు, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ, రోగులకు నిరంతర చికిత్స వంటి కీలక అంశాలు ప్రతిబింబించడం లేదని అధికారుల పునస్సమీక్షలో తేలింది.

ఈ విధానం అమలు, ఫలితాలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జారీ చేసిన ఆదేశాల మేరకు అధికారులు పునస్సమీక్ష జరిపారు. సేవలు మెరుగుపడాలంటే 21 కొలమానాల ఆధారంగా ర్యాంకులను ప్రకటించాల్సిన అవసరం ఉందని మంత్రికి నివేదించారు. వీటికి మంత్రి ఆమోదం తెలుపుతూ గ్రామీణులకు వైద్య సేవలు అందించడంలో కీలకంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు ఈ కొత్త ర్యాంకింగ్ విధానంతో మరింత మెరుగుపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పిహెచ్‌సిల్లో వైద్య సేవలు పొందిన ప్రజలు ఐవిఆర్ఎస్ ద్వారా తెలియజేసే అభిప్రాయాన్ని కూడా ర్యాంకింగ్‌లో భాగం చేశారు. "నెలనెలా ర్యాంకులు ప్రకటించడం ద్వారా వెనుకబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వెంటనే గుర్తించి లోపాలను సరిదిద్దుతాం. ఈ కొత్త ర్యాంకింగ్ విధానాన్ని అమలు ప్రక్రియను ప్రారంభించాం" అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ తెలిపారు.

28-7pg4.qxd:28-7pg4.qxd 1/1/02 6:24 AM Page 1

వార్త

తెలివిగల వ్యక్తి తన ఆర్థిక విషయాలను, మానసిక సంఘర్షణలను, గృహసంబంధమైన విషయాలను ఎప్పుడూ రహస్యంగానే ఉంచుతాడు.

- శామ్యూల్ జాన్సన్

'జై యువ'తకు సెల్యూట్!

ఎవరు అన్నా అనకున్నా ఇప్పుడు భారతీయ యువత అభినందించాల్సిన పరిణామాలే తారసపడుతున్నాయి. ఓ పక్కజీవితాల్లో వెలుగులు నింపాల్సిన ప్రభుత్వాలు ఇన్నాళ్లూ వారి వారి సొంత ఎజెండాలతో కాలక్షేపం చేసేస్తాయి. కొత్త తరపు ఆలోచనలను ఎవరైనా, ఎప్పుడైనా స్వాగతించవలసిందే. యువత తమ భవిత కోసం రోడ్డెక్కితే వారిని ఏలిన వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నారన్న భావనతో విదేశీ నిధులు వస్తున్నాయనో, వారి వెనుక ఉండి ఎవరో నడిపిస్తున్నారనో ఒకవర్గం సామాజిక మాధ్యమాల్లో ఊదరగొడుతున్నాయి. అంటే ప్రశ్నించే వారు ఉండకూడదనేది వారి ఆంతర్యమా!? ప్రశ్నిస్తే తప్పా? మరెందుకలా ఉద్యమకారులపై బురద జల్లి యువత గొంతు నొక్కాలన్న ప్రయ్నత్న మంచిది కాదేమో? ఉద్యమకారుల్లో గత రాజకీయ నేపథ్యం ఉండడం నేరమా? వాళ్ళకి సిద్ధాంతాలు ఉండవా? ఉండకూడదా? అయినా యువ చైతన్యాన్ని ఎవరూ ఆపలేకపోయారు. నిజానికి అతి చిన్న వయసులోనే ఈ తరం యువత పరిణితి చెందారు. ఎన్నో విషయాలపై అవగాహన పెంచుకొని పట్టుసాధిస్తున్నారు. వాళ్లల్లో మేధాశక్తికి కొదువ లేదు. వారికి అనుభవం తక్కువని అనుకోవాలి తప్ప కొత్త తరంలో మానసిక పరివర్తనను ఏమాత్రం తక్కువ చేయలేం. వీధుల్లోకి వచ్చిన యువత ఆగ్రహం ఒక్క పరీక్ష గురించో, ఒక్క మంత్రి రాజీనామా గురించో కాదు. అది చాలా కాలంగా విద్యావ్యవస్థపై పేరుకుపోయిన అసంతృప్తి. తమ చదువుకు విలువ ఉందో లేదో? ఉద్యోగం వస్తుందో రాదో? భవిష్యత్తు ఎలా ఉంటుంది? అనే ఆందోళన. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో జరిగిన 'నీట్' ఉద్యమాన్ని ప్రభుత్వం గుర్తించి వారి ఆకాంక్షలపై సానుకూలంగా స్పందించడం, తమకు తమ భవితవ్యమే తప్ప ఈ దేశ రాజకీయాలతో సంబంధం లేదని చెప్పడంలో యువత విజ్ఞత చెప్పుకోదగినది. అందుకే యువత వైఖరితో యావత్తు భారత దేశం ఊపిరిపీల్చుకున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద యువదేశం భారత్ . 2026 నాటికి భారత జనాభాలో 65 మంది 35 ఏళ్లలోపు వారు. 15-29 ఏళ్లమధ్య ఉన్న యువత 25కోట్లకు పైగా ఉంది. ప్రపంచంలోని ప్రతి 5గురు యువకుల్లో ఒకరు భారతీయుడు. దీన్నే 'యూత్ బుల్జ్ లేదా డెమోగ్రాఫిక్ డివిడెండ్' అంటారు. యువత ఎక్కువ, వృద్ధులు తక్కువ ఉన్నప్పుడు పని చేసే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఉత్పత్తి, పొదుపు, పెట్టుబడి పెరుగుతాయి. 2026-2047 వరకు ఇదే భారత్ వికసిత్ భారత్‌గా మారేందుకు స్వర్ణావకాశం. జపాన్, చైనా, యూరప్ వృద్ధుల దేశాలుగా మారుతున్నాయి. 2030 నాటికి ప్రపంచానికి 12 కోట్ల మంది పనివారు కావాలి. ఆ ఖాళీని భారత యువత మాత్రమే భర్తీ చేయగలదు. భారత యువత ప్రపంచంలోనే అత్యంత ధైర్యవంతులు, ఆశావాదులు, టెక్ సావీ.వారికి సరైన విద్య, నైపుణ్యం, అవకాశం ఇస్తే వారు 'వికసిత్ భారత్'ని నిర్మించడమే కాదు, ప్రపంచాన్నే నడిపిస్తారు. ప్రతి ఏడాది కోటికి పైగా యువత డిగ్రీలు పూర్తి చేసి ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నారు. 2023-24లో సుమారు 1.1 కోట్ల మంది, 2024-25లో దాదాపు 1.2 కోట్ల మంది గ్రాడ్యుయేట్లు బయటకు వచ్చారు. కానీ వారందరికీ ఉద్యోగాల వేటలో తలపండిపోతోంది ఫలితం శూన్యం. 2000 నుంచి 2010 మధ్య దేశంలో ప్రతి ఏడాది సగటున రెండున్నర కోట్లమంది పిల్లలు జన్మించారు. ఆ తరం ఇప్పుడుఉపాధి కోసం బయటకు వస్తోంది. రాబోయే మరో 15 నుంచి 20 సంవత్సరాల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఆర్థికవేత్తలు దీనినే "డెమోగ్రాఫిక్ డివిడెండ్"లేదా 'యూత్ బల్జ్' అంటారు. ఇది ఏ దేశానికైనా ఒక్కసారి మాత్రమే దక్కే అవకాశం. 2050 నాటికి ఈ అవకాశం క్రమేపీ ముగుస్తుంది.అంటే మరో పాతికేళ్లే భారత్ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ప్రతి ఏడాదిసంక్షేమ పథకాల కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, తయారీరంగం, చిన్న పరిశ్రమలపై కూడా భారీ పెట్టుబడులు పెట్టాల్సిన సమయం వచ్చింది. యువత ఉచితాలు కోరుకోవడం లేదు. భారత్ ప్రపంచంలోనే అగ్రశ్రేణి ఆర్థికశక్తిగా నిలిపేయువతమనకు సొంతం.'జెన్ జీ' ఉద్యమ స్పందనతో యువశక్తిని సరైన దారిలో నడిపించి దేశభవితలో వారిని అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ప్రత్యేక సందర్భంలో అభిప్రాయపడ్డారు. 'జై జవాన్', 'జై కిసాన్' లతో ముందుకుకెళ్తున్న కాంగ్రెస్ పార్టీ 'జై యువ' నినాదాన్ని కలుపుకొనిముందుకెళ్తున్నట్లు ప్రకటించారు. అందరికీ విద్య అందుబాటులోకి వచ్చినందున 21ఏళ్ల వయసుకే ఐఎఎస్, ఐపిఎస్‌లు అవుతున్నారు. అదేదారిలో యువతను పార్లమెంట్ తదితర చట్టసభల్లో భాగస్వాములు అయ్యేందుకు వీలుగాఎన్నికల్లో పోటీ చేసే వయసును తగ్గించే అంశంపైచర్చ పూర్తిస్థాయిలో కొనసాగాలని అభిలషించారు. అసెంబ్లీ, లోక్‌సభకు పోటీచేసే వయసు 21 సంవత్సరాలకు, రాజ్యసభ, శాసనమండలికి పోటీ చేసే వయసు 25 సంవత్సరాలకు తగ్గించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. యువతకు ఉద్యమాలతో పనిలేకుండా వారి ఆకాంక్షలను నెరవేర్చగలిగితే వారిలో అసంతృప్తి దూరమవుతుంది. యువతకు రాజకీయ నాయకత్వ అవకాశాలు ఇవ్వడమే కాదు ప్రజాసేవపట్ల నిబద్ధత ఉన్న వారికే ఆ అవకాశం దక్కేటట్లు చూస్తేనే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష. అనేకరంగాల్లో యువత నిర్మాణాత్మక హోదాల్లో తమను తాము నిరూపించుకున్న యువతకు పాలనలో భాగస్వామ్యం కల్పించడంలోనూ ఎవరికీ ఏ అభ్యంతరం ఉండదు. యువశక్తిని గుర్తించిననాడే వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరి వికసిత్ భారత్‌కు కొత్తదారి గోచరమవుతుంది.

నిన్నటి తప్పుల గురించి కాని, రేపు రాబోయే కష్టం గురించి కాని దిగులుపడడమే అతి గొప్ప కాలహరణం.



మహాత్మా గాంధీ

మనం ఎప్పుడూ ఏదో ఒకటి ఆశిస్తూనే ఉంటాం. ఆశ నెరవేరినా, నెరవేరకపోయినా మనిషిలో ఆశ చావదు. జీవితమే ఆశల వల.

సెసిల్

ప్రజావాక్కు

వేగవంతమైన న్యాయ ప్రక్రియ అవసరం

పోటీ పరీక్షలు లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తాయి.అలాంటి పరీక్షల్లోప్రశ్నపత్రాల లీకేజీ జరగడంవల్ల నిజాయితీగా శ్రమించిన అభ్యర్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ఎంతో స్వాగతించదగ్గది. ఇలాంటి కేసుల్లో వేగవంతమైన విచారణ నిందితులకు త్వరగా శిక్షపడేలా చేయడమే కాకుండా, పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది.చాలా సందర్భాల్లో దర్యాప్తు, న్యాయ ప్రక్రియలు సంవత్సరాలపాటు సాగుతుంటాయి. దీనివల్ల పరీక్షలురాసిన అర్హులైన అభ్యర్థులు తీవ్రమానసిక ఒత్తిడికి గురవుతారు. వారి విద్య,ఉద్యోగ అవకాశాలు ఆలస్యమవుతాయి. మరోవైపు నేరస్థులకు చట్టంపై భయం తగ్గే ప్రమాదం కూడా ఉంటుంది. అందువల్ల వేగవంతమైన న్యాయ ప్రక్రియ అవసరం. పరీక్షా నిర్వహణలో అత్యాధునిక భద్రతా వ్యవస్థలు, డిజిటల్ పర్యవేక్షణ, ప్రశ్నపత్రాల రవాణా, నిల్వ ప్రక్రియల్లో కట్టుదిట్టమైన రక్షణ చర్యలు అమలు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

హెల్త్ కార్డులు ఎవరికోసం?

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ హెల్త్‌కార్డులు అందజేయనున్నామని ఈ మేరకు ఉద్యోగులు తమ వివరాలను అప్లోడ్ చేయాలని ప్రకటన చేయడంతో రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులందరూ ఈ విధానం ద్వారా తమకు హెల్త్‌కార్డులు అవసరం లేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.డిఎలు పిఆర్‌సిలు అడిగితే హెల్త్ కార్డులు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం చేతులు దులుపుకోవడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు కంగుతింటున్నారు.

- బి. దేవయ్య, హైదరాబాద్

కూలీల రేట్లు నియంత్రించాలి

సన్న చిన్నకారు రైతుల వ్యవసాయ పనుల దృశ్య, సామాన్య ధరలు, ఆర్థికవ్యవస్థ,కూలీల రేట్లు అమాంతం వందలు వందలుగా విపరీతంగా పెరగడంతో రైతులకు పెనుభారంగా మారుతుంది. గ్రామంలో కమిటీలు వేసి ధరలను నియంత్రించాలి లేదంటే వ్యవసాయం చేసి వృథా. కూలీ రేట్లు తగ్గించి రైతులను ఆదుకోవాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

ప్రజాస్వామ్యం గెలిచింది

బొద్దింకల దెబ్బకు 56 ఇంచిల బాహుబలి దిగివచ్చింది. ఈ దేశాన్ని మత రాజ్యంగా చేయాలనుకున్న వారికి చెంపదెబ్బ.'తమకున్న మతవాద బలంతో ఈదేశాన్ని రామరాజ్యంగా చెయ్యాలని పలుమార్లు ఊకదంపుడు మాటలు పలికే 56 ఇంచిల బాహుబలి బొద్దింకల దెబ్బకు దిగి రాక తప్పలేదు. బలవంతుమైన పాము చలి చీమల చేత చచ్చునట్లు మాకు తిరుగులేదు, మేము చెప్పిందే వేదం అనే రీతిలో నడుస్తున్న, ఎదురు తిరిగినవారిపై దేశద్రోహం కేసులు అంటూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వం చివరికి దేశ యువతకు తలవంచక తప్పలేదు.నెహ్రూ ప్రాజెక్టులు కడితే, మోడీ దొంగబాబాల ఆశ్రమాలు, బాలరాముని గుళ్ళు, పటేల్ విగ్రహాలు కట్టారు. నెహ్రూ శాస్త్రీయ విద్య విద్యార్థులకు నేర్పితే, మోడీఇతిహాసాలు, పుక్కిటి పురాణాలు, అశాస్త్రీయ వాస్తు, జ్యోతిష్యాలు, మంత్ర తంత్రాలు, చేతబడులు, గాయత్రీమంత్రాలు,పాఠ్యాంశాలుగా పెట్టాడు.సైన్స్ కాంగ్రెస్ సదస్సులను మంత్రగాళ్ల సభలుగా మార్చారు.అహంకారంతో ఏదైనా చేస్తాం అనుకునే వాళ్లకు ఇది ఒక గొప్ప గుణపాఠం. ఇప్పటికైనా ప్రభుత్వాల తీరు మారాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

ఉద్యోగాల కోత

ఇప్పటివరకు ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. కొందరికి ఉద్యోగాలు దొరకక ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతోకొంత జీతానికి పని చేస్తున్నారు.పెద్దపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఈమధ్య తమ సీనియర్ ఉద్యోగులను వేలసంఖ్యలో తొలగిస్తున్నారు. కొత్తగా జాయిన్ అయిన వాళ్ల కూడా ఎప్పుడు తమ ఉద్యోగాలు ఊడుతాయోననే భయపడుతున్నారు. నైపుణ్యం గలవారే ఎక్కువ కాలం ఉంటున్నారు. ఉద్యోగాలు కల్పోతున్నవారికి ప్రత్యామ్నాయం ఏమిటి?

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

స్పెషల్ ప్రమోషన్లు ఇవ్వాలి

తెలంగాణా రాష్ట్రంలో ఉన్న వివిధ శాఖల వికలాంగుల ఉద్యోగులకు స్పెషల్ డిపార్టుమెంటు ప్రమోషన్స్ ఇవ్వాలి. ఉన్నత అర్హత, డాక్టరేట్ పట్టభద్రుల వికలాంగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలి. వీరికి తప్పకుండా జి. ఓ 34 వర్తింపజేయాలి.దివ్యాంగులైన ఉన్నత ఉద్యోగులకు ప్రమోషన్స్ కల్పిస్తే వారికి కూడా గౌరవం దక్కుతుంది.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

సర్టిఫికెట్లు కాదు, విద్యార్థులకు నైపుణ్యం ముఖ్యం

విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో కలిసి పాఠ్యాంశాలను రూపొందించాలి. శిక్షణను మార్కుల కోసం చేసే కార్యక్రమంగా కాకుండా, ఉద్యోగానికి సిద్ధం చేసే ప్రక్రియగా మార్చాలి. పరిశ్ర మలు కూడా శిక్షణను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. సమాజం డిగ్రీని గౌరవించినంతగా నైపుణ్యాన్నీ గౌరవించడం నేర్చుకోవాలి. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే మరిన్ని విశ్వవిద్యాలయాలు నిర్మించడం ఒక్కటేసరిపోదు. మరిన్ని డిగ్రీలు ఇవ్వడం కూడా సరిపోదు. విశ్వవిద్యాలయాలు సర్టిఫికెట్లు ముద్రించే కేంద్రాల నుంచి మానవ మూలధనాన్ని తీర్చిదిద్దే కేంద్రాలుగా మారాలి. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడాన్ని నిర్ణయించేది విశ్వవిద్యాలయాలు ఎన్ని డిగ్రీలు ఇచ్చాయన్నది కాదు, ఎన్ని సమస్యలను పరిష్కరించగల మనుషులను తీర్చిదిద్దాయన్నదే.

డి.వి.బి శ్రీహరిన్

ఒకప్పుడు విద్య ఉద్యోగానికి మార్గం. నేడు విద్య ఉద్యోగానికి హామీ కాదు. ఇదే ఇరవై ఒకటో శతాబ్దపు అతి పెద్ద సామాజిక, ఆర్థిక వైరుధ్యం. ప్రతి సంవత్సరం లక్ష లాది మంది యువత డిగ్రీలు, పీజీలు, వృత్తిపరమైన అర్హతలు సంపాదించి ఉద్యోగ విపణిలోకి ప్రవేశిస్తున్నారు.అయినప్పటికీ నిరుద్యోగం తగ్గడం లేదు. అదే సమయంలో పరిశ్రమలు మాత్రం 'పనికి సిద్ధంగా ఉన్న నైపుణ్యం కలిగిన యువత దొరకడం లేదు' అని వాపోతున్నాయి. ఒకవైపు సర్టిఫికెట్లు పెరుగుతుంటే, మరోవైపు సామర్థ్యం కొరత కొనసాగుతోంది. సమస్య ఉద్యోగాల్లో లేదు. సమస్య విద్యలో లేదు, సమస్య ఈ రెండింటి మధ్య తెగిపోయిన సంబంధంలో ఉంది. ప్రపంచ ఆర్థికవ్యవస్థ నైపుణ్యాలను కోరుతున్న వేళ, మన విద్యా వ్యవస్థ ఇంకా సర్టిఫికెట్లను ఉత్పత్తి చేస్తోంది. ఈ వైరుధ్యాన్ని అర్థం చేసుకోవాలంటే ముందు భారత ఉన్నత విద్య విస్తరణను చూడాలి. ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏఐఎస్‌హెచ్‌ఈ) ప్రకారం దేశంలో 4.3 కోట్లకు పైగా విద్యార్థులు ఉన్నత విద్యలో ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఉన్నత విద్యా వ్యవస్థల్లో భారత్ ఒకటి. స్వాతంత్ర్యం తర్వాత విద్యను ప్రజలకు చేరువ చేయడంలో ఇది గొప్ప విజయమే. ఇది విద్యఅందుబాటులోకి వచ్చిందనే విజయాన్ని సూచిస్తుంది. కానీ అదే విద్య ఆర్థికవ్యవస్థకు అవసరమైన నైపుణ్యాలుగా మారకపోవడమే అసలు ఆందోళన. అందుకే విద్యా విస్తరణ, ఉద్యోగ యోగ్యత విస్తరణగా మారలేదు. ఇండియా స్కిల్స్ రిపోర్టు ప్రకారం సుమారు సగం మంది గ్రాడ్యుయేట్లు మాత్రమే పరిశ్రమలకు వెంటనే ఉపయోగపడే స్థాయిలో ఉన్నారు. అంటే సమస్య చదువుకున్న వారి సంఖ్యలోలేదు. వారు సంపాదించిన విద్య, ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన సామర్థ్యంగా మారకపోవడంలో ఉంది. ఇక్కడే డిగ్రీల ద్రవ్యోల్బణం అనే భావన ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ద్రవ్యోల్బణంలో కరెన్సీ కొనుగోలు శక్తి తగ్గినట్లే, డిగ్రీలు విపరీతంగా పెరిగినప్పుడు వాటి ప్రత్యేకత కూడా తగ్గుతుంది.ఒకప్పుడు ఇంటర్ లేదా డిప్లొమాతో లభించిన ఉద్యోగానికి ఇప్పుడు డిగ్రీ అవసరమవుతోంది. నిన్న డిగ్రీ సరిపోతే, నేడు పీజీ కోరుతున్నారు. ఉద్యోగ స్వభావంఅంతగా మారకపోయినా, విద్యార్హతలు మాత్రం పెరుగుతున్నాయి. డిగ్రీలు జ్ఞానాన్ని కొలిచే సాధనంగా కాకుండా, అభ్యర్థులను వడపోసే సాధనంగా మారుతున్నాయి. ఆర్థిక శాస్త్రంలో 2001 నోబెల్ బహుమతి గ్రహీత మైకేల్ స్పెన్స్ ఈ పరిస్థితిని దాదాపు అర్థశతాబ్దం క్రితమే వివరించాడు. ఉద్యోగం ఇవ్వబోయే సంస్థకు అభ్యర్థి నిజంగా ఎంత సమర్థుడో ముందుగానే తెలుసుకోవడం సాధ్యం కాదు. అందుకే అది డిగ్రీని ఒక సంకేతంగా ఉపయోగిస్తుంది. మంచి డిగ్రీ అంటే నేర్చుకునే సామర్థ్యం, క్రమశిక్షణ, పట్టుదల ఉన్న వ్యక్తి అని భావిస్తుంది. కానీ అదే డిగ్రీ లక్షల మందికి వచ్చినప్పుడు ఆ సంకేతం బలహీనపడుతుంది. అప్పుడు మరింత ఉన్నత విద్యార్హతలను కోరడం ప్రారంభమవుతుంది. ఇదే డిగ్రీల ద్రవ్యోల్బణానికి మూల కారణం.సమస్య విద్యార్థుల్లోలేదు. విద్యను ఎంపిక ప్రమాణంగా ఉపయోగించే వ్యవస్థలోఉంది. ఆర్థిక శాస్త్రంలో 1992 నోబెల్ బహుమతి గ్రహీత గ్యారీ బెకర్ విద్యను మానవ మూలధనంగా అభివర్ణించాడు. యంత్రాల్లో పెట్టుబడి పెడితే ఉత్పత్తి పెరిగినట్లే, విద్యపై పెట్టుబడి పెడితే మనిషి ఉత్పాదకత పెరగాలి. కానీ విద్య సామర్థ్యాన్ని పెంచకుండా కేవలం సర్టిఫికెట్‌ను మాత్రమే ఇస్తే, అది మానవ మూలధనంగా మారదు. నేడు భారత్ ఎదుర్కొంటున్న అసలు సమస్య ఇదే. మనం విద్యలోపెట్టు బడి పెడుతున్నాం, కానీ ఉత్పాదకతలో అదే స్థాయి పెరు గుదల కనిపించడం లేదు. డిగ్రీల సంఖ్య పెరుగుతోంది. కానీ సమస్యలను పరిష్కరించే సామర్థ్యం అదే వేగంతో పెరగడం లేదు. అందుకే విద్య విస్తరిస్తున్నా, ఆర్థిక వ్యవస్థకు అవసరమైన మానవ మూలధనం అదే వేగంతో పెరగడం లేదు. ఇది కేవలం విద్యావ్యవస్థ వైఫల్యం కాదు. ఇది సమాజం నిర్మించుకున్న ఒక ఆలోచనా విధాన ఫలితం. దశాబ్దాలుగా భారతీయ కుటుంబాల్లో 'మంచి డిగ్రీ అంటే మంచి ఉద్యోగం' అనే సమీకరణ బలంగా స్థిరపడింది.పాఠ శాలలు మార్కుల కోసం, కళాశాలలు డిగ్రీల కోసం, విద్యా ర్థులు ఉద్యోగాల కోసం పరుగు తీశారు. కానీ ప్రపంచఆర్థిక వ్యవస్థ అంతలోనే మారిపోయింది. నేడు ఉద్యోగదాత అడుగుతున్న ప్రశ్న 'ఏ డిగ్రీ చేశావు?' కాదు. 'ఏం చేయగలవు?' అన్నది. ఈ మార్పును మరింత వేగవంతం చేసింది కృత్రి మ మేధ. గత పారిశ్రామిక విప్లవాలు శారీరక శ్రమను భర్తీ చేశాయి. కానీ కృత్రిమ మేధ విశ్లేషణ, సమాచార ప్రాసెసింగ్, పునరావృత మేధోపరమైన పనులను కూడా స్వీకరిస్తోంది. అందువల్ల పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించడం కంటే, సమస్యలను కొత్త కోణంలో చూడడం, వేగంగా నేర్చుకోవడం, సృజనాత్మకంగా ఆలోచించడం, విభిన్న రంగాల జ్ఞానాన్ని అనుసంధానించడం వంటిసామర్థ్యాలే ఎక్కువ విలువ పొందుతున్నాయి. ప్రపంచ ఆర్థిక నివేదిక విడుదల చేసిన ఫ్యూచర్ ఆఫ్‌జాబ్స్ రిపోర్టు-2025 ఈ మార్పును స్పష్టంగా ప్రతిబింబించింది. 2030నాటికి ఉద్యోగాలకు అవసరమైన ప్రధాన నైపుణ్యాల్లో దాదాపు 39శాతంమార్పు వస్తుందని ఆ నివేదిక అంచనా వేసింది. అదే సమయంలో 17 కోట్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడగా, 9.2 కోట్ల ఉద్యోగాలు కనుమరుగయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ గణాంకాలు ఉద్యోగాల సంక్షోభాన్ని కాదు, నైపుణ్యాల సంక్షోభాన్ని సూచిస్తున్నాయి. ప్రపంచం ఇప్పుడు డిగ్రీల ఆధారంగాకాదు, నైపుణ్యాల ఆధారంగా మానవ వనరులను అంచనా వేయడం ప్రారంభించింది. భారత్‌కు ఈమార్పు మరింత కీలకం. ప్రతి సంవత్సరం ఒక కోటినుంచి 1.2కోట్ల మంది యువత ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నారు. ఇదే మన జనాభా ప్రయోజనం. కానీ నైపుణ్యాలుగా మారని విద్య ఈజనాభా ప్రయోజనాన్ని నిరుద్యోగ భారంగా మార్చేప్రమాదం ఉంది. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలకు వేల సంఖ్యలో ఇంజినీర్లు, పీజీలు దరఖాస్తు చేస్తుండగా, మరోవైపు పరిశ్రమలు శిక్షణ పొందిన వెల్డర్లు, యంత్ర నిర్వహణ నిపుణులు, డేటా విశ్లేషకులు, సైబర్ భద్రత నిపుణులు, కృత్రిమ మేధ ఇంజినీర్ల కోసం వెతుకుతున్నాయి. చదువుకున్న నిరుద్యోగం, నైపుణ్యాల కొరత ఒకేసారి కనిపించడం కంటే పెద్ద హెచ్చరిక ఇంకేముంటుంది? విద్య జ్ఞానాన్ని ఇస్తుంది. నైపుణ్యం ఆ జ్ఞానాన్ని ఆర్థిక విలువగా మారుస్తుంది. ఈ రెండింటిమధ్య సంబంధం తెగిపోయినప్పుడు డిగ్రీల ద్రవ్యోల్బణం ప్రారంభమవుతుంది. అందుకే సంస్కరణలు కూడా విద్యార్థులతో మొదలై విద్యార్థుల దగ్గరే ముగియ కూడదు. విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో కలిసి పాఠ్యాంశాలను రూపొందించాలి. శిక్షణను మార్కుల కోసం చేసే కార్యక్రమంగా కాకుండా, ఉద్యోగానికి సిద్ధం చేసే ప్రక్రియగా మార్చాలి. పరిశ్రమలు కూడా శిక్షణను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. సమాజం డిగ్రీని గౌరవించినంతగా నైపుణ్యాన్నీ గౌరవించడం నేర్చుకోవాలి. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే మరిన్ని విశ్వవిద్యాలయాలు నిర్మించ డం ఒక్కటేసరిపోదు. మరిన్ని డిగ్రీలు ఇవ్వడం కూడా సరి పోదు. విశ్వవిద్యాలయాలు సర్టిఫికెట్లు ముద్రించే కేంద్రా ల నుంచి మానవ మూలధనాన్ని తీర్చిదిద్దే కేంద్రాలుగా మారాలి. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడాన్ని నిర్ణయించేది విశ్వవిద్యాలయాలు ఎన్ని డిగ్రీలు ఇచ్చాయన్నది కాదు, ఎన్ని సమస్యలను పరిష్కరించగల మనుషులను తీర్చిదిద్దాయన్నదే.

డిజిటల్ కరెన్సీతో ఆర్థిక వ్యవస్థకు మరింత భద్రత

సి.హెచ్.ప్రతాప్

సాంకేతిక విప్లవం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వేగంగా రూపాంతరం చెందిస్తోంది. ఒకప్పుడు వస్తు మార్పిడి విధానం నుంచి నాణేలు, కాగితపు నోట్లు,బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ చెల్లింపుల వరకు అభివృద్ధి చెందినద్రవ్య వ్యవస్థ ఇప్పుడు కేంద్ర బ్యాంకు డిజిటల్ కరెన్సీ యుగంలోకి అడుగుపెట్టింది. ఈ మార్పులో భాగంగానే భారతీయ రిజర్వ్ బ్యాంకు డిజిటల్ రూపాయిని ప్రవేశపెట్టి దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారంచుట్టింది. డిజిటల్ రూపాయి అనేది మనం వినియోగించే కాగితపు నోట్లకు డిజిటల్ రూపం. ఇది సాధారణ డిజిటల్ చెల్లింపు విధానాలైన యూపీఐ లేదా మొబైల్ వాలెట్లతో సమానం కాదు. యూపీఐలో ఒక బ్యాంకు ఖాతా నుంచి మరొక ఖాతాకు నిధులు బదిలీ అవుతాయి. అయితే డిజిటల్ రూపాయి విషయంలో డబ్బు స్వరూపమే డిజిటల్‌గా ఉంటుంది. ఇది నేరుగా ఆర్‌బీఐ జారీచేసే చట్టబద్ధమైన అధికారిక కరెన్సీ కావడంతో భౌతిక నగదుకు సమానమైన విశ్వసనీయతను కలిగి ఉంటుంది. డిజిటల్ రూపాయి వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. కరెన్సీనోట్ల ముద్రణ,రవాణా, భద్రత, నిర్వహణ వంటి వ్యయాలు తగ్గుతాయి. లావాదేవీలు వేగంగా, సులభంగా పూర్తవడంతో సమయం ఆదా అవుతుంది. నగదు వినియోగం తగ్గడంవల్ల నకిలీ నోట్ల సమస్యను నియంత్రించడంతో పాటు ఆర్థికవ్యవస్థలో పారదర్శకత పెరుగుతుంది. చిన్న మొత్తాల చెల్లింపుల నుంచి పెద్ద లావాదేవీల వరకు దీన్ని వినియోగించే అవకాశం ఉంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల కోసం హోల్‌సేల్ డిజిటల్ రూపాయి, సాధారణ ప్రజల కోసం రిటైల్ డిజిటల్ రూపాయిని ఆర్‌బీఐ దశలవారీగా ప్రవేశపెడుతోంది. డిజిటల్ రూపాయి వ్యాపార రంగానికి కూడా మేలు చేస్తుంది. నగదు నిర్వహణ ఖర్చుతగ్గడం, తక్షణ చెల్లింపులు, మెరుగైన నగదు ప్రవాహం వంటి ప్రయోజనాలు లభిస్తాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పన్నుల వసూళ్ళ, ఆర్థిక లావాదేవీలలో పారదర్శకత పెరగడానికి కూడా ఇది తోడ్పడుతుంది. భవిష్యత్తులో అంతర్జాతీయ చెల్లింపులను మరింత వేగవంతంగా, తక్కువ వ్యయంతో నిర్వహించే అవకాశాలను కూడా ఇది విస్తరించగలదు. అదేవిధంగా, డిజిటల్ రూపాయి డిజిటల్ ఇండియా, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ వంటి జాతీయ లక్ష్యాలకు మరింత బలం చేకూరుస్తుంది. బ్యాంకింగ్ సేవలు పూర్తిగా అందని ప్రాంతాల్లో కూడా డిజిటల్ లావాదేవీలను విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది. విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు వేగంగా,పారదర్శకంగా అందించడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. అయితే డిజిటల్ కరెన్సీ విజయవంతం కావాలంటే కొన్ని సవాళ్లనుఅధిగమించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్‌మౌలిక సదుపాయాల విస్తరణ, సైబర్ భద్రత బలోపేతం,ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపు,వినియోగదారుల గోప్యత పరిరక్షణ వంటి అంశాలకు అధికప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా వృద్ధులు, గ్రామీణ ప్రజలు, సాంకేతిక పరిజ్ఞానంపై పరిమిత అవగాహన ఉన్నవర్గాలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. డిజిటల్ రూపాయిని బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీలతో పోల్చడం సరైందికాదు. క్రిప్టోకరెన్సీలు మార్కెట్ ఆధారంగా విలువ మారే ప్రైవేట్ డిజిటల్ ఆస్తులు కాగా, డిజిటల్ రూపాయి భారతీయ రిజర్వ్ బ్యాంకు జారీ చేసే అధికారిక చట్టబద్ధకరెన్సీ. ప్రపంచంలోని అనేకదేశాలు కేంద్రబ్యాంకు డిజిటల్ కరెన్సీలను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో,భారత దేశం కూడా ఈ రంగంలో ముందంజలో నిలుస్తోంది.డిజిటల్ కరెన్సీ సాంకేతిక ఆవిష్కరణ మాత్రమే కాదు, భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది. సమర్థవంతమైన నియంత్రణ, అత్యున్నత భద్రతా ప్రమాణాలు, బలోపేతమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, ప్రజల విశ్వాసం కలిసి నడిస్తే డిజిటల్ రూపాయి భారత ఆర్థిక వ్యవస్థను మరింత ఆధునికంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనంగా నిలుస్తుంది.

బాధ్యత కలిగిన యువతతోనే దేశ భవిష్యత్తు

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశంలో వివిధ వైద్య కళాశాలలో వైద్య కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించే అర్హత పరీక్షలో జరిగిన ప్రశ్నాపత్రం పరీక్ష కంటే ముందుగానే బయటికి రావడం గత కొంతకాలం నుండి పెద్ద దుమారాన్నే రేపింది. ఈ క్రమంలో అభ్యర్థుల నుండి మొదలైన నిరసనలు క్రమ క్రమంగా అధికమై దేశంలో యువతరం వరకు వ్యాప్తి చెంది పరీక్ష లీక్ తీరుపై వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తం కావడం ప్రభుత్వాన్నీ ఆలోచనలో పడవేయడం, యువత చేసిన నిరసనలో భాగంగా ఆ శాఖను నిర్వహిస్తున్న కేంద్ర మంత్రితప్పని పరిస్థితుల్లో యువత కోరుకున్న విధంగానే రాజీనామా చేయవలసిన పరిస్థితి రావడం ఇదంతా ఒక ఎత్తు అయితే, యువత జరిపి నిరసనతో ప్రభుత్వమే దిగి రావడం యువత అనుకుంటే సాధించలేనిది ఏమీ లేదనే ఇలాంటి విషయం ఎల్లప్పుడు ప్రతి ఒక్కరు గుర్తించుకొనే విధంగా మిగిలిపోవడంతో ఇకపై అవినీతికి అక్రమాలకు పాల్పడుతున్న వారి తీరు మారాల్సిన అవసరం ఉంటుంది. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలచేత ఎన్నుకోబడిన నాయకులు కూడా యువతను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయాలు చేయాల్సిన అవసరం ఉంటుందని పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తుండడం విశేషం. పరీక్ష విధానంలో కూడా పారదర్శకత కలిగిన విధానంతో సరికొత్త సంస్కరణలు రావాల్సిన అవసరం ఉంది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ సందర్భంగా నెలకొన్న పరిస్థితులను గమనిస్తే భారతదేశంలో నవతరం నిరంతరం దేశ పరిణామాలపై స్పందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు గోచరిస్తుంది. ప్రధానంగా ప్రభుత్వాలు విధానపరమైన కఠినమైన చర్యలు తీసుకోకపోవడం, జాగ్రత్తలు పాటించకపోవడం వలన అవినీతి అక్రమాలు లాంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయనే విషయాలు ఎంతో కాలం నుండి చదువుకున్న యువతలో ఎంతో కొంత అశాంతికి అలజడికి కారణం అవుతున్నాయి. ఈ అంశంపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువత పార్టీలకతీతంగా తొలిసారిగా బయటికి వచ్చి నీట్ ప్రవేశ ప్రశ్నాపత్రం లీక్ బాధ్యులైన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని అంతేకాకుండా దేశంలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరిగినా మొదట ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వంలోని సంబంధిత శాఖ మంత్రులు బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది. అయితే ప్రస్తుతం ఆధునిక సాంకేతిక యుగంలో దేశంలోని యువత మధ్య కమ్యూనికేషన్ వ్యవస్థ సందేశాల పురోగతి అతివేగంగా జరగడంతో చాలామంది తొలిసారిగా యువతను మేల్కొలిపే విధంగా గ్రూపులను రూపొందించుకుని సమస్యలపై స్పందించేందుకు నిర్భయంగా యువతరం నేడు ప్రభుత్వాలను నేరుగా ప్రశ్నిస్తున్నది అంటే ప్రభుత్వాలు ఎంతో కొంత యువతరం ఆలోచనలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టవలసిన ఆవశ్యకత ఉంది. ఈ విధంగా దేశంలోని యువతరానికి జరుగుతున్న నష్టాన్ని ప్రశ్నించడానికి మాత్రమే కాకుండా ఎన్నుకున్న ప్రభుత్వాల అజెండా అమలు విధానాల పైన కూడా రాబోవు కాలంలో యువత ప్రశ్నించేందుకు వెనుకాడదేమో. ఏ విషయంలోనైనా సమాజానికి భంగం వాటిల్లే క్రమంలో అందుకు సంబంధించిన వారు ఎవరైనా జవాబుదారీతనంగాఉండాల్సి వస్తుంది అనేచర్చ జరుగుతుంది. నేటి యువత రేపటి భారత దేశ భవిష్యత్తుకు పునాదులు అలాంటి యువత భారతదేశ సమైక్యతను దేశభక్తి సమగ్రతతోపాటుజాతీయవాదాన్ని బలంగా వినిపిస్తున్నారు. అలాంటి యువతరం భారతదేశం ఉన్నతికి భద్రతకు వెన్నంటి ఉంటారు అనేది అక్షరసత్యం. అందుకు ప్రభుత్వాలు కూడా దేశ భవిష్యత్తులో కీలకంగా మారనున్న యువత సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కాలయాపన చేయకూడదనే విషయంపై అన్ని రాజకీయ పార్టీల్లో చర్చ జరగాల్సిన అవసరం ఉంది. విద్యావంతులు చదువుకున్న వారు భారత దేశంలో ఎక్కువ అవుతున్నారు. దేశంలో ఎలాంటి అంశాల్లోనైనా లోపాలు కనపడితే ప్రశ్నించేందుకు నేటితరం యువత సిద్ధంగా ఉంటుందని, లోపాలను సవరించే వరకు జవాబుదారీతనం వచ్చేంతవరకు నిరసన వ్యక్తం అవుతుందని, తలచుకుంటే సాధించేందుకు యువతరానికి ఏది అడ్డు లేదని చెప్పే రీతిలో యువతరం దేశవ్యాప్తంగా చేసిన శాంతియుత నిరసన విధానాలు చెప్పకనే చెప్తున్నాయి. నేటితరం యువతరం ప్రశ్నించే విషయాలను నిజానిజాలను విశ్లేషించుకోవాలి, నిర్ధారణ చేసుకోవాలి. సరైన విధానం ఉంటే దాన్ని తప్పనిసరిగా అమలు చేసే విధంగా సమస్య కఠినతరం కాకుండా యువతరాన్ని కూడా కలుపుకుపోతూ వారి అభిప్రాయాన్ని కూడా స్వాగతించాల్సిన అవసరం కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలకు ఉండాల్సిందేమో. ఈ క్రమంలో దేశ పరిస్థితుల విషయాలపై యువత మేల్కొని అప్రమత్తంగా ఉంటుందని పాలకులు అందించే విధానాలను నిరంతరం గమనిస్తూ సమాధానం కొరకు నిరంతరం ప్రశ్నిస్తామంటూ ముందుకు వస్తున్న యువతరానికి పాతతరం అనుభవాల సారం కూడా భవిష్యత్ భారత దేశ యువతకు దిశా నిర్దేశం ఆధికృత మార్గదర్శకం అవుతాయని భావించే వారు లేకపోలేదు. యువత ఐక్యత రాగానికి సంబంధించి ప్రభుత్వ ప్రజాపాలనలో ఎటువంటి లోపాలు జరిగినా సంబంధిత పరిపాలనా ప్రతినిధులు బాధ్యత వహించవలసి ఉంటుందనే సందేశం దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందింది. దేశ సమగ్రతకు దేశ భద్రతకు ఎటువంటి విఘాతం కలగకుండా యువత మంచి ఆలోచన విధానాలు న్యాయ సమ్మతమైనవి అయితే పార్టీలకు రాజకీయాలకతీతంగా యువత ప్రశ్నిస్తే దానికి తప్పనిసరిగా జవాబుఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంటుందేమో. రాబోవు కాలంలో ఎలాంటి ప్రభుత్వాలు వచ్చినా యువతకు నష్టం చేసే ప్రతి అంశాన్ని జాగ్రత్తతో ఆచితూచి ఆలోచించి ముందుగానే సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తారేమో. ఏదేమైనప్పటికీ భారతదేశ భవిష్యత్తుకు యువతరం పాత్ర అత్యంత కీలకమైనది. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత పారదర్శకమైన పాలన విధానాలు అనుసరించడమే కాకుండా ప్రతి అంశంలో జవాబుదారీతనాన్ని ప్రదర్శించడంతో పాటు అడపాదడపా తలెత్తుతున్న సమస్యలపై యువత చేస్తున్న నిరసనలపై స్పందించి ఆచితూచి సమయానుకూలంగాసరైన సమయంలో వివరణ ఇచ్చేందుకు తరచూ ప్రయత్నించి సఫలం కావడం ఒకఎత్తు. దేశభక్తి భారతదేశ జాతీయ సమైక్యత సమగ్రతకు భంగం కలగకుండా వ్యవహరిస్తున్న తీరు మరొక ఎత్తుకావడం దేశ భవిష్యత్తుకు

28-7Pg5.qxd:28-7Pg5.qxd 1/1/02 6:09 AM Page 1

మీ గుండె 'లయ' తప్పుతోందా?



న్యూఢిల్లీ,జులై 27: గుండె వేగంగా కొట్టుకోవడం, ఛాతీలో దడ, లేదా కారణం లేకుండా ఆయాసం రావడం వంటి లక్షణాలను చాలామంది తేలిగ్గా తీసుకుంటారు. కానీ, ఇవి ఏట్రియల్ ఫిబ్రిలేషన్ అనే ఏఎఫ్ అని పిలిచే తీవ్రమైన గుండె జబ్బుకు సంకేతాలు కావచ్చు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణమైన ఈ గుండె లయ రుగ్మత, నివారించగలిగే పక్షవాతానికి ఒక ప్రధాన కారణంగా మారుతోంది. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ అధ్యయనం ప్రకారం, భారతదేశంలో సుమారు 80 లక్షల మంది ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌తో జీవిస్తున్నారు. వృద్ధాప్యం, ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలు పెరగడంతో ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డ్యూక్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ క్రిస్టోఫర్ గ్రాంగెర్ ప్రకారం, గుండె పై గదుల్లో అసాధారణమైన ఎలక్ట్రికల్ సంకేతాలు ఏర్పడినప్పుడు ఏట్రియల్ ఫిబ్రిలేషన్ సంభవిస్తుంది. దీనివల్ల గుండె పై గదులు ఒక క్రమపద్ధతిలో కాకుండా అస్తవ్యస్తంగా, వేగంగా కొట్టుకుంటాయిఅని ఆయన వివరించారు. కొంతమందిలో గుండె దడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, త్వరగా అలసిపోవడం వంటి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. అయితే చాలా మందిలో ఇది సైలెంట్ ఏఎఫ్‌గా ఉంటుంది. అంటే, ఎలాంటి లక్షణాలు బయటకు కనిపించవు. తీవ్రమైన సమస్యలు ఎదురయ్యే వరకు ఈ వ్యాధి ఉన్నట్టు కూడా తెలియదు. అసాధారణ గుండె లయను గుర్తించే స్మార్ట్‌వాచ్‌ల ద్వారా కూడా ఈ పరిస్థితిని ముందుగా పసిగట్టే అవకాశం ఉందని డాక్టర్ గ్రాంగెర్ తెలిపారు. ఏట్రియల్ ఫిబ్రిలేషన్ వల్ల ఎదురయ్యే అతిపెద్ద ప్రమాదం పక్షవాతం. గుండె గదులు సరిగా సంకోచించనప్పుడు, రక్తం అక్కడే నిలిచిపోయి గడ్డకట్టే అవకాశం ఉంది. ఈ రక్తం గడ్డకట్టిన ముక్క మెదడుకు ప్రయాణించి రక్తనాళాలను అడ్డుకుంటే, ఇస్కీమిక్ స్ట్రోక్ (పక్షవాతం) వస్తుంది. ఏట్రియల్ ఫిబ్రిలేషన్ వల్ల పక్షవాతం వచ్చే ప్రమాదం ఐదు రెట్లు పెరుగుతుందని, ప్రతి ఐదు పక్షవాత కేసులలో ఒకటి దీనితో సంబంధం కలిగి ఉంటుందని డాక్టర్ గ్రాంగెర్ తెలిపారు. ఈ రకమైన స్ట్రోక్స్ చాలా తీవ్రంగా ఉండి, శాశ్వత అంగవైకల్యానికి దారితీస్తాయి. ఏఎఫ్ సంబంధిత పక్షవాతాన్ని నివారించడానికి యాంటీకాగ్యులెంట్లు అంటే రక్తాన్ని పలుచనచేసే మందులు అత్యంత ప్రభావవంతమైన మార్గం. ఈ మందులు వాడటం ద్వారా ఏఎఫ్ వల్ల వచ్చే పక్షవాతాలలో 70 శాతం వరకు నివారించవచ్చని డాక్టర్ గ్రాంగెర్ పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో గుండె లయను నియంత్రించే మందులు లేదా కాథెటర్ అబ్లేషన్ అనే ప్రక్రియ ద్వారా కూడా చికిత్స అందిస్తారు. వయసు, జన్యుపరమైన కారణాలు ప్రమాదాన్ని పెంచినప్పటికీ, జీవనశైలి మార్పుల ద్వారా దీనిని నివారించవచ్చు లేదా ఆలస్యం చేయవచ్చు. రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవడం, ఆరోగ్యకరమైన బరువును పాటించడం, క్రమం తప్పని వ్యాయామం, ధూమపానానికి దూరంగా ఉండటం, ఆల్కహాల్ పరిమితం చేయడం వంటివి చాలా ముఖ్యం. పక్షవాతం వచ్చిన తర్వాత చికిత్సకు అయ్యే భారీ ఖర్చుతో పోలిస్తే, ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌ను ముందుగా గుర్తించి చికిత్స తీసుకోవడం ఎంతో మేలని నిపుణులు సూచిస్తున్నారు.

మత మార్పిడితో ఎస్సీ హోదా రద్దు

మరోమారు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

రివ్యూ పిటిషన్ కొట్టేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ, జులై 27: షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతం కాకుండా వేరే మతంలోకి మారినప్పుడు, మత మార్పిడి జరిగిన క్షణం నుంచే షెడ్యూల్డ్ కుల హోదాను కోల్పోతారని పేర్కొన్న సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రికార్డులో ఎటువంటి లోపం కనిపించడం లేదని పేర్కొంటూ, జస్టిస్‌లు ప్రశాంత్ కుమార్ మిశ్రా, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం మార్చి 24 నాటి తీర్పుకు వ్యతిరేకంగా దాఖలైన పిటి షన్‌ను కొట్టివేసింది. "సమీక్షా పిటిషన్‌పై మౌఖిక విచారణ కోరుతూ దాఖలు చేసిన దరఖాస్తును తిరస్కరించడమైనది. తాము సమీక్షా పిటిషన్‌ను పరిశీలించి, సమీక్షించాలని కోరిన మార్చి 24, 2026 నాటి తీర్పును కూడా పరిశీలించాము. రికార్డులో ఎటువంటి లోపం స్పష్టంగా కనిపించడం లేదు. అందువల్ల, సమీక్షా పిటిషన్‌ను కొట్టివేస్తున్నామ్ము అని సమీక్షా పిటిషన్‌పై జులై 15న జారీ చేసిన తన ఉత్తర్వులో సుప్రీంకోర్టు పేర్కొంది. మార్చి 24న, ఒక కీలకమైన తీర్పులో, షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి హిందూ, సిక్కు లేదా బౌద్ధమతం కాకుండా వేరే మతంలోకి మారినప్పుడు, పుట్టుకతో సంబంధం లేకుండా మతం మారిన క్షణం నుంచే షెడ్యూల్డ్ కుల హోదాను కోల్పోతారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన వెంటనే తన షెడ్యూల్డ్ కుల హోదాను "తక్షణమే మరియు పూర్తిగ్గా కోల్పోతారని పేర్కొన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వును ఇది సమర్థించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342లోని క్లాజ్ (1) ప్రకారం, భారత రాష్ట్రపతి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల (యూటీలు) కోసం "షెడ్యూల్డ్ తెగల్నుగా గుర్తించబడిన తెగలు, గిరిజన వర్గాలను గుర్తిస్తూ 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ తెగలు) ఉత్తర్వును జారీ చేశారని సుప్రీంకోర్టు పేర్కొంది.

ఇక 'జీహాద్' ఒక్కటే మార్గం

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ సంచలన ప్రకటన

టెహ్రాన్, జులై 27: ఇజ్రాయెల్‌పై పోరాటం సాగిస్తున్న లెబనాన్‌లో హెజ్బొల్లా సాయుధ గ్రూప్‌నకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఇరాన్ సుప్రీంలీడర్ మొజ్తబా ఖమేనీ పునరుద్ఘాటించారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక దాడులు, కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోతేనే అమెరికాతో ఇరాన్ ఘర్షణ ముగుస్తుందని ఆయన స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్‌పై ఇప్పుడు జీహాద్, ప్రతిఘటన తప్ప మరో మార్గం లేదని మొజ్తబా తేల్చిచెప్పారు. హెజ్బొల్లా సెక్రటరీ జనరల్ షేక్ నయీమ్ ఖాసీమ్, గ్రూప్ యోధులను ఉద్దేశించి ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. హెజ్బొల్లా దృఢవైఖరిని ప్రశంసిస్తూ వారిని రక్షించుకోవడం ఇరాన్‌కు ఒక వ్యూహాత్మక బాధ్యత అని ఆయన నొక్కి చెప్పారు. అమెరికాతో ఇరాన్ యుద్ధం ముగియడానికి ఒప్పందం కుదరాలంటే, లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను ఎటువంటి షరతులు లేకుండా వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇరాన్‌కు తమ విధేయతను ప్రకటిస్తూ హెజ్బొల్లా రాసిన లేఖకు సమాధానంగా ఇరాన్ సుప్రీం లీడర్ నుంచి ఈ స్పందన వచ్చింది.అమెరికా, ఇజ్రాయెల్‌లకు వ్యతిరేకంగా పోరాటానికి 'జీహాద్, ప్రతిఘటన తప్ప వేరే మార్గం లేదు' అని ఆయన పేర్కొ న్నారు. తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని అమెరికా, ఇరాన్‌లు ఉల్లంఘించడంతో మరోసారి పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగామారాయి. 'ప్రజల ప్రాణాలను తీస్తూ,భవిష్యత్తు తరాలను నాశనం చేస్తున్న అమెరికా ప్రభుత్వం, జియోనిస్టులు(ఇజ్రాయెల్) అణచివేత, నిరంకుశత్వం, దుర్మార్గాలతో ప్రపంచ దేశాలు విసిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో 'జీహాద్', ప్రతిఘటన తప్ప మనకు వేరే మార్గం లేదు' అని మొజ్తబా ఖమేనీ ప్రకటించారు. ఇజ్రాయెల్ దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాడే గ్రూపులకు హెజ్బొల్లా ఒక కొండలా ముందుండి నడిపిస్తుందని, ఈ తిరుగులేని పోరాటం ప్రపంచంలోనే స్వేచ్ఛను కోరుకునే దేశాలకు స్ఫూర్తిదాయక సందేశంగా మారిందని ఆయన ప్రశంసించారు.

ఆ 'సిట్‌'లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను చేర్చండి

యుపి సర్కార్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు

రెండు వారాల్లో స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ, జులై 27:అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఆరోపణల సంబంధిత కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. కేసు దర్యాప్తు పారదర్శకంగా, సమగ్రంగా చేపట్టేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను తప్పనిసరిగా చేర్చాలని ఉత్తర్వులిచ్చింది. అలాగే దర్యాప్తు పురోగతిపై కూడా రెండు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని సిట్‌ను ఆదేశిస్తూ డెడ్‌లైన్ విధించింది న్యాయస్థానం. ఈ కేసు విచారణ కోసం ఐజీ కిరణ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటుచేసినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేసు విచారణ వేగంగా, నిష్పాక్షికంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఆలయానికి వచ్చిన విరాళాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. అయితే.. ప్రస్తుతం తాము దర్యాప్తును పూర్తి చేయడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నామని న్యాయస్థానం పేర్కొంది. ఈ నేపథ్యంలో సదరు వివరాలను వెలువరించడంపై ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. సిట్ సమర్పించే నివేదికను పరిశీలించాకే తదుపరిచర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. తదుపరి విచారణ వాయిదా వేసింది.

నిరసనకారులపై బలప్రయోగాన్ని సమర్థించలేం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జులై 27: నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో పోలీసులు బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. శాంతియుతంగా, చట్టబద్ధంగా జరిగే నిరసనల్లో పాల్గొనడం ప్రతి పౌరుడికీ రాజ్యాంగం కల్పించిన హక్కు అని స్పష్టంచేసింది. కేవలం ఆందోళన జరుగుతోందనే కారణంతో లాఠీచార్జ్‌కు దిగడం సరికాదని పేర్కొంది. పోలీసులు హద్దులు మీరి వ్యవహరించి ఉంటే స్వతంత్రంగా దర్యాప్తు జరగాలని సూచించింది. విద్యార్థులు, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన 'సంసద్ చల్లో నిరసన సందర్భంగా జరిగిన పోలీసు చర్యలపై దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం విచారించింది. దేశవ్యాప్తంగా నిరసనల సమయంలో పోలీసులు అనుసరించాల్సిన విధానంలో ఏకరూపత అవసరమని అభిప్రాయపడింది. నిరసన జరిగిందనే కారణంతో బలప్రయోగం చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా గాయపడిన పోలీసుల కుటుంబాల తరఫున వాదించేందుకు వచ్చిన న్యాయవాదికి కూడా కోర్టు అనుమతి ఇచ్చింది. విద్యార్థులకైనా, పోలీసులకైనా గాయాలు కావడం సమానంగా ఆందోళనకరమేనని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ వ్యాఖ్యానించారు. నిరసనలను ఎదుర్కొనే పోలీసులకు హెల్మెట్లు వంటి రక్షణ పరికరాలు ఎందుకు అందించలేదని రాష్ట్రాలను ప్రశ్నించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని పిటిషన్లను మంగళవారం కలిపి విచారించనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది.

సిజెపి నేతలకు సొమ్ములెక్కడినుంచి వచ్చాయి?

సుప్రీం న్యాయవాది మహేష్ జెత్మలానీ

న్యూఢిల్లీ,జులై 27: నిరవధిక ఆందోళన నిర్వహించిన సిజెపి నేతలకు సొమ్ములు ఎక్కడినుంచవ ఇచ్చాయో ఆరదృప్తు చేయించాలని సీనియర్ న్యాయవాది స్పందించారు. సిజెపి నేతల సంబరాలపార్టీలపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జెత్మలానీ స్పందించారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టి పలు విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా వేడుకల తీరును న్యాయవాది మహేశ్ జెత్మలానీ విమర్శించారు. హోటల్‌లో పార్టీ చేసుకోవడానికి నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. నిజంగానా సీజేపీ నాయకత్వం హోటల్‌లో విజయోత్సవం జరుపుకుంటోందా, ఢిల్లీలో రోజుల తరబడి హింసాకాండ జరిగిన తర్వాత ఈ యువ కార్యకర్తలమని చెప్పుకునే వారు డ్యాన్సులు చేస్తున్నారు అని ఆయన మండిపడ్డారు. అలాగే ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఆందోళనల వెనుక ఉన్న ఆర్థిక వనరులపైనా జెత్మలానీ ప్రశ్నలు లేవనెత్తారు. ఢిల్లీ ఆందోళనల సమయంలో సీజేపీ నేతలు, కార్యకర్తల ప్రయాణం, ఆహారం,వసతి, లాజిస్టిక్స్ వంటి వాటికి నిధులు ఎక్కడ నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీని అట్టుడికించిన వారికి ఆర్థిక సహాయం ఎవరు చేశా రంటూ ప్రశ్నలు సంధించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన కొద్దిసేపటికే ఈ పార్టీ జరిగినట్లు తెలుస్తోంది.

'ఇ20 పెట్రోల్'తో లబ్ధి ఆరోపణలు, బాంబే హైకోర్టును ఆశ్రయించిన గడ్కరీ

ముంబై, జులై 27: తన పేరును 'ఇ20 పెట్రోల్ కార్యక్రమంతో ముడిపెడుతూ సోషల్ మీడియాలో ప్రచారమైన పోస్టులు, డీప్‌ఫేక్ వీడియోలపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ న్యాయపోరాటానికి దిగారు. తనతోపాటు కుటుంబసభ్యులు ఇ20 విధానం వల్ల లబ్ధిపొందినట్లు తప్పుడు ప్రచారం చేశారని ఆరోపిస్తూ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై మెటాతోపాటు ఇతర సోషల్ మీడియా వేదికలు, గుర్తుతెలియని వ్యక్తులపై సివిల్ దావా వేయడానికి హైకోర్టు అనుమతిచ్చింది. ఇ20 ఇథనాల్ కార్యక్రమంవల్ల తన కుటుంబం లాభపడిందంటూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం జరిగిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. వాస్తవానికి ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానాన్ని కేంద్ర పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ అమలు చేస్తోందని వివరించారు. ఈ పోస్టులు డీప్‌ఫేక్ కంటెంట్ ముంబైలో కూడా అందుబాటులో ఉండటంతో బాంబే హైకోర్టుకు ఈ కేసును విచారించే అధికారం ఉందని గడ్కరీ తరఫు న్యాయవాది వాదించారు. ఈ వాదనలు విన్న జస్టిస్ అభయ్ అహుజా.. సివిల్ సూట్ దాఖలు చేసేందుకు అనుమతి మంజూరు చేశారు.

నిరసనకారులపై ఎఫ్ఐఆర్‌లను ఇప్పటికీ ఎత్తివేయలేదు

సిజెపి ప్రతినిధి సౌరవ్‌దాస్ నిరసన

న్యూఢిల్లీ,జులై 27: నీట్ పేపర్ లీకేజీ, పరీక్షల అక్రమాలపై తాము చేపట్టిన ఆందోళన విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సోమవారం ఆరోపించింది. ఢిల్లీ వెలుపల నిరసనకారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, వివిధ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, అసోం, పశ్చిమ బెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాల్లో విద్యార్థులు,నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. బీజేపీ లేదా ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో నిరసనకారులపై ఎలాంటి శిక్షార్హమైన చర్యలు తీసుకోబోమని కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలోనే మేము మా దేశవ్యాప్త ఆందోళనను విరమించుకున్నాం. ప్రస్తుతం వస్తున్న నివేదికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకుని, అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేసేలాచూడాలని కోరారు. మంగళవారం లోగా లిఖితపూర్వక హామీ ఇస్తామన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఒకవేళ హామీలను గౌరవించకపోతేతదుపరి కార్యాచరణ చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.అయితే, ఢిల్లీలో నమోదైన సుమారు 15 ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణపై ఉన్నతాధికారుల నుంచి అధికారిక ఆదేశాలు వచ్చాకే తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పాట్నాలో ఎకె47 ఉపయోగించిన కానిస్టేబుల్ సస్పెన్షన్

పాట్నా,జులై 27: నీట్ పరీక్ష అక్రమాలపై బిహార్‌లో జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా ఏకే47తో కాల్పులు జరిపిన పోలీసు అధికారిని సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై రాజ్యసభ ఎంపీ మనోజ్ కుమార్ ఝా సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. జులై 25న నిర్వహించిన బిహార్ బంద్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. పలు చోట్ల పోలీసులు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. లాఠీచార్జ్, టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లను పోలీసులు వినియోగించారు. సివాన్‌లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు గాయపడగా వారిలో 15 ఏళ్ల మహ్మద్ ఆరిఫ్ మెడలో బుల్లెట్ తగిలింది. శస్త్రచికిత్స ద్వారా బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా స్పందిస్తూ ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్స్, బిహార్‌లో ఏకే47 వినియోగించడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మరోవైపు ఘటనపై శాఖాపరమైన విచారణ ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. ఆయుధ వినియోగం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందా లేదా అనే అంశాన్ని విచారణలో తేల్చనున్నట్లు తెలిపారు.

జెన్జీ సిజెపి ఉద్యమానికి పొరుగుదేశాల్లోను ప్రశంసలు

న్యూఢిల్లీ,జులై 27: భారత జెన్‌జీ తమ బలహీనతలనే బలంగా మార్చుకుంది. పరీక్షా పత్రాల లీకేజీపై వారు చేసిన వినూత్న ఉద్యమం, కేంద్ర ప్రభుత్వాన్ని కదిలించి ఏకంగా విద్యాశాఖ మంత్రి రాజీనామాకు దారితీసింది. ఈ ఉద్యమ ప్రభావం కేవలం దేశానికే పరిమితం కాలేదు. సరిహద్దులు దాటి పాకిస్థాన్, శ్రీలంక, నేపాల్ వంటి పొరుగు దేశాల యువతను సైతం ఆకర్షించి, వారి నుంచి ప్రశంసలు అందుకుంటోంది. కాక్రోచ్ జనతా పార్టీ సీజేపీ పేరుతో మొదలైన ఈ ఉద్యమంలో మీమ్స్ మేనిఫెస్టోలుగా, రీల్స్ నియామక సాధనాలుగా మారాయి. పోలీసుల చర్యలకు సంబంధించిన షార్ట్ వీడియోలు ఆధారాలుగా నిలిచాయి. ఈ వినూత్న పోరాట పటిమ ఇప్పుడు పొరుగు దేశాల్లో హాట్ టాపిక్‌గా మారింది. భారత జెన్‌జీ ఉద్యమంపై పాకిస్థాన్ నుంచి అనూహ్యమైన స్పందన వస్తోంది. అక్కడి యువత భారత యువతరం ధైర్యాన్ని, ఐక్యతను చూసి ముగ్ధులవుతున్నారు. మీరు ఇలాగే అద్భుతమైన పనులు చేస్తుంటే, మేం మిమ్మల్ని ఎలా ద్వేషించగలం బహుశా ప్రేమలో పడతామేమోనని ఒక పాకిస్థానీ యువతి చెప్పడం విశేషం. కులం, మతం వంటి విభేదాలను పక్కనపెట్టి భారత విద్యార్థులు ఏకతాటిపై నిలవడాన్ని వారు ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నారు. ఈ ఉద్యమానికి పాకిస్థాన్ నిధులు ఇస్తోందని కొందరు అంటున్నారు. మా దేశాన్ని నడుపుకోవడానికే మా దగ్గర డబ్బు లేదు. ఇక మీకెలా ఇస్తామని బిలాల్ హసన్ అనే కంటెంట్ క్రియేటర్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 2022లో ఆర్థిక సంక్షోభంపై పోరాడి ప్రభుత్వాన్ని గద్దె దింపిన శ్రీలంక యువతకు, భారత జెన్‌జీ ఉద్యమం తమ పోరాటాన్ని గుర్తు చేస్తోంది. అక్కడి కార్టూనిస్టులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు భారత యువతకు మద్దతుగా పోస్టులు పెడుతున్నారు. ముంబైలో పోలీసు వ్యాన్‌ను ఒక యువతి ఒంటరిగా అడ్డుకున్న ఫొటోను, చైనాలోని చారిత్రక ట్యాంక్ మ్యాన్ ఫొటోతో పోలుస్తూ ప్రశంసిస్తున్నారు. నేపాల్ యువత కూడా భారత విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకుంటోంది. విద్యార్థులు రోడ్లపైకి రావడం చూస్తుంటే గుండె తరుక్కు పోతోంది. మీ పోరాటం సరైనదే. మీ లక్ష్యం ఏమిటో ఎప్పుడూ మర్చిపోవద్దని నేపాల్‌కు చెందిన ఓ కంటెంట్ క్రియేటర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నాడు.

పార్లమెంటులో ధర్మేంద్ర ప్రధాన్‌కు ఘనస్వాగతం

జైరామ్ రమేష్ వ్యాఖ్యలకు ప్రధాన్ కౌంటర్

న్యూఢిల్లీ,జులై 27: నీట్ పేపర్ లీకేజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌కు సోమవారం పార్లమెంటులో ఘన స్వాగతం లభించింది. చిరునవ్వుతూ కారు దిగిన ధర్మేంద్ర ప్రధాన్, అందరికీ అభివాదం చేస్తూ లోపలికి వెళ్లారు. పలువురు అధికార పక్ష ఎంపీలు ఆయనకు సంఘీభావం తెలుపుతూ శాలువా కప్పి, సంప్రదాయ టోపీతో సత్కరించారు. ఎలాంటి ఆరోపణలు లేకపోయినా ఒక మంత్రి స్వచ్ఛందంగా రాజీనామా చేయడం ఇదే మొదటిసారని ఒక ఎంపీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పార్లమెంట్ కారిడార్‌లో కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్, ధర్మేంద్ర ప్రధాన్‌ను ఉద్దేశించి "అప్పుడప్పుడు ఇలా జరుగుతుంటుంది" అని వ్యాఖ్యానించారు. దీనికి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, "ఏమీ జరగలేదు. నేను వీధి పోరాటాల నుంచి వచ్చిన యోధుడిని, ఏసీ గదుల్లో కూర్చునే కార్యకర్తను కాదు" అని కౌంటర్ ఇచ్చారు.

విద్యార్థులపై అణిచివేత ఇంకా ఆగలేదు

మోడీజీ క్షమాపణలు చెప్పాల్సిందే: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,జులై 27:దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహి రంగంగా క్షమాపణ చెప్పాలన్నారు.

పిఒకెలో జాక్ లాంగ్ మార్చ్..పరిస్థితులు ఉద్రిక్తం

ముజఫరాబాద్,జులై 27: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. పాక్ అధికారులతో చర్చలు విఫలమవడంతో జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) రావల్‌కోట్ నుంచి ముజఫరాబాద్ వరకు లాంగ్ మార్చ్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం చేయవద్దని యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ యూకేపీఎన్‌పీ పాకిస్థాన్ ప్రభుత్వాన్ని కోరింది. మీర్‌పూర్ డివిజన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీలు రావల్‌కోట్‌లో కలుసుకున్నాయి. ఈ ర్యాలీని అడ్డుకునేందుకు పాక్‌ప్రభుత్వం రేంజర్స్, ఫ్రంటియర్ కానిస్టేబులరీ (ఎఫ్‌సీ), పంజాబ్ కానిస్టేబులరీ (పీసీ)దళాలను అదనంగా మోహరించినట్లు సమాచారం.

అమిత్ షా వివరణ కోరుతూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన

న్యూఢిల్లీ,జులై 27: పార్లమెంట్‌లో సోమవారం మరోసారి అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ప్రతిష్టంభన నెలకొన్నాయి. జూలై 20న ఢిల్లీలో జరిగిన ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల కార్యకలాపాలను అడుకున్నాయి.ఈ మేరకు రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేపార్లమెంట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రతిపక్ష పార్టీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటికే నిర్ణయించిన చర్చల్లో పాల్గొనకుండా, ఢిల్లీలో కాక్‌రోచ్ జనతా పార్టీ చేపట్టిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు అతిగా వ్యవహరించారనే ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి సభలో ప్రకటన చేయాలని పట్టుబట్టాయి.

సోమవారం ఉదయం 11 గంటలకు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన వెంటనే ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో ఆందోళనకు దిగారు. దీంతో లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ప్రతిపక్ష సభ్యులను హెచ్చరించారు. తీవ్ర గందరగోళం నెలకొనడంతో లోక్‌సభ, రాజ్యసభలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు.పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టాం. అన్ని రాజకీయ పార్టీలు చర్చలో పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించాలని కోరుతున్నామని రిజిజు చెప్పారు. పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలను కట్టడి చేసేందుకు కఠినమైన చట్టాన్ని రూపొందిస్తున్నామని, ఇలాంటి కీలక బిల్లుపై చర్చకు దూరంగా ఉండి సభలో గందరగోళం సృష్టించడం ప్రజలకు మంచి సందేశం కాదని ఆయన స్పష్టం చేశారు.

సంక్షిప్త వార్తలు

ఉక్రెయిన్‌ను వదలం..తగిన బుద్ధి చెబుతాం: ఇరాన్

టెహ్రాన్, జులై 27: కాస్పియన్ సముద్రంలో తమ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ జరిపిన దాడిలో ఒక నావికుడు మరణించగా, మరొకరు గాయపడినట్లు ఇరాన్ తెలిపింది. ఈ ఘటనపై టెహ్రాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. తమ దేశ ప్రయోజనాలు, ఆస్తులను కాపాడుకునేందుకు ఎలాంటి చర్యకైనా వెనకాడబోమని స్పష్టంచేసింది. ఈ దాడికి కారణమైన ఉక్రెయిన్ తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. యుద్ధం మరింత విస్తరించకుండా ఉండాలంటే కీవ్‌ను కట్టడి చేయాలని ఐరోపా దేశాలను ఇరాన్ డిమాండ్ చేసింది.

చెరువులో పడి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

జైపూర్, జులై 27: రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అక్కడి ఓ చెరువులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతదేహాలు లభ్యమవడం తీవ్ర కలకలం రేపుతోంది. అయితే వారంతా ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామ్‌దేవ్రా పోలీసు స్టేషన్ పరిధిలోని లోహార్కి గ్రామంలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. నీటిలోకి దూకిన నలుగురిలో జస్రాజ్ అనే వ్యక్తి కేకలు వేయడం గమనించి కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే అక్కడకు పరుగెత్తుకెళ్లారు. కానీ చెరువు దగ్గరికి చేరుకునే సరికే వారంతా నీటిలో మునిగిపోయారు.

అమెరికాలో కాల్పులు, ముగ్గురి మృతి

వాషింగ్టన్, జులై 27: అమెరికాలోని సియాటెల్‌లో తుపాకీ సంస్కృతి పడగవిప్పింది. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన స్పేస్ నీడిల్ సమీపంలో జరుగుతున్న వార్షిక ఫుడ్ ఫెస్టివల్ దగ్గర దుం డగులు సామూ హిక కాల్పులకు తెగబడటంతో ముగ్గురు ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా పోలీసులు ఒక దుండగుడిని అరెస్టు చేశారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఈ సామూ హిక కాల్పుల ఘటన జరిగింది. వందలాదిగా ఉన్న ఫుడ్‌స్టాళ్లు, లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌తో కళకళ లాడుతున్న సియాటెల్‌లో అకస్మాత్తుగా తుపాకీ మోతలు వినిపించాయి.

తాహిర్ హుస్సేన్‌కు శిక్షపై తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు

న్యూఢిల్లీ, జులై 27: 2020 ఈశాన్య ఢిల్లీ అల్లర్ల సమయంలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో దోషులుగా తేలిన మాజీ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్, మరో నలుగురికి విధించాల్సిన శిక్షా పరిమాణంపై ఢిల్లీ కోర్టు సోమవారం తన తీర్పును రిజర్వ్ చేసింది. శిక్షకు సంబంధించిన అంశంపై ప్రాసిక్యూషన్, డిఫెన్స్ తరఫు వాదనలు వివరంగా విన్న తర్వాత జులై 31న తీర్పును వెల్లడిస్తామని కర్కర్‌డూమా కోర్టు అదనపు సెషన్స్ జడ్జి(ఎఎస్‌జె) ప్రవీణ్ సింగ్ తెలిపారు. శర్మ హత్యను 'పక్కాని', 'క్రూరమైన' హత్యగా అభివర్ణిస్తూ, గరిష్ట శిక్షను కోరుతూ ఢిల్లీ పోలీసులు మరణశిక్ష విధించాలని కోర్టును అభ్యర్థించారు.

రూ.25వేల వరకూ భారత్ కరెన్సీకి నేపాల్‌లో అనుమతి



ఖాట్మండు,జులై 27: భారత కరెన్సీ వినియోగంపై నేపాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఆంక్షలను సడలిస్తూ, రూ.200, రూ. 500 విలువైన భారత కరెన్సీ నోట్లను దేశంలోకి తీసుకురావడానికి, తీసుకెళ్లడానికి అనుమతించింది. భారతీయులు, నేపాలీ పౌరులు ఇరుదేశాల మధ్య ప్రయాణించేటప్పుడు రూ.25వేల పరిమితికి లోబడి ఈ నోట్ల ను తమ వెంట ఉంచుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో 2016లో భారత్ చేపట్టిన నోట్ల రద్దు అనంతరం విధించిన నిబంధనలకు తెరపడినట్లయింది.

బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి ఒక టెరాబైట్ డేటా చోరీ

ముంబయి,జులై 27: దేశంలోని ప్రముఖ ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడాలో భారీ సైబర్ దాడి జరిగినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. బ్యాంక్ వ్యవస్థలోకి చొరబడ్డామని ప్రకటించిన ఓ హ్యాకర్ దాదాపు ఒక టెరాబైట్ కీలక డేటాను డార్క్‌వెబ్‌లో ఉచితంగా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నాడు. ఇందులో ఖాతాదారుల ఆధార్ నంబర్లు, పేర్లు, రుణాల వివరాలు, సేవింగ్స్, కరెంట్ ఖాతాల సమాచారం, నెట్‌బ్యాంకింగ్, ఎన్ఆర్ఐ, కార్పొరేట్ బ్యాంకింగ్‌కు సంబంధించిన రికార్డులు ఉన్నాయని చెబుతున్నాడు. ఈ డేటా లీక్‌కు సంబంధించిన కొన్ని నమూనా పత్రాలను కూడా హ్యాకర్లు ఆన్‌లైన్‌లో విడుదల చేశారు.

28-7Pg6exHMNWJQE.qxd:28-7Pg6exHMNWJQE.qxd 1/1/02 6:12 AM Page 1

గురుపౌర్ణమిన 155మందితో సమగ్రయోగా

తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: పతంజలి సేవా కార్యకర్తల ఆధ్వర్యంలో 'డయాబెటిస్ రహిత తిరుపతి మిషన్' ప్రారంభిస్తున్నట్లు పతంజలి యోగపీఠ్, హరిద్వార్ కేంద్ర సమన్వయకర్త స్వామి రిత్‌దేవ్ జీ ప్రకటించారు. సమగ్ర యోగా విధానాల ద్వారా తిరుపతిని మధుమేహ రహిత నగరంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ప్రీడయాబెటిస్, డయాబెటిస్‌తో బాధపడుతున్న వారు ప్రత్యేక యోగా శిబిరంలో నమోదు చేసుకుని వ్యాధి నియంత్రణ, నివారణకు యోగాను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ జిల్లా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యోదయ పాఠశాల ప్రాంగణంలో ఘనంగా గురుపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్ఎస్ కుటుంబ ప్రబోధన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ రాజు మాట్లాడుతూ భారతదేశం తన కుటుంబ విలువలు, సామాజిక వ్యవస్థను పరిరక్షించి బలోపేతం చేయడం ద్వారా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. పతంజలి యోగపీఠ్, హరిద్వార్ కేంద్ర సమన్వయకర్త స్వామి రిత్‌దేవ్ జీ మాట్లాడుతూ యోగా ప్రచారంలో తిరుపతి జిల్లా విశేష పురోగతి సాధిస్తోందని ప్రశంసించారు. జిల్లాలో 155 మంది యోగా ఉపాధ్యాయులకు విజయవంతంగా శిక్షణ అందించి, వారికి కార్యక్రమంలో ధ్రువ పత్రాలు ప్రదానం చేసినందుకు అభినందనలు తెలిపారు. పతంజలి యోగా రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ రాజ్ పురోహిత్, జిల్లా అధ్యక్షుడు హరి, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధిక, ఉపాధ్యక్షురాలు ఉమ, భారత్ స్వాభిమాన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ్ల సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారమే ధ్యేయం

● 'డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి'లో శివశంకర్ లోతేటి

తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: వినియోగదారుల విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నామని, ఆ దిశగా చొరవ తీసుకుంటున్నట్లు ఎస్‌పిడిసిఎల్ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. పలువురు వినియోగదారులు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో జాప్యం, ఓల్టేజ్ సమస్యలు, విద్యుత్ స్తంభాల మార్పిడి తదితర సమస్యలను సిఎండి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా మాల్యవంతం గ్రామానికి చెందిన శైలజ మాట్లాడుతూ తమ పొలంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఐదు రోజుల్లోనే తమ సమస్యకు పరిష్కారం లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ధన్యవాదాలు తెలియజేశారు. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి కార్యక్రమం జరిగింది. సిఎండి శివ శంకర్ లోతేటి మాట్లాడుతూ వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా సంబంధిత సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అదేవిధంగా విద్యుత్ బిల్లుల ఆన్లైన్ చెల్లింపుల పట్ల వినియోగదారులకు సంస్థ అధికారులు, సిబ్బంది స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 1912,1800 425 155333కు కాల్ చేయడంగానీ వాట్సాప్ నంబరు 91333 31912కు చాట్ చేయడం, ఎస్‌పిడిసిఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. డైరెక్టర్లు పి.అయుబ్ ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, జె.రమణా దేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్.శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, భాస్కర్ రెడ్డి, జగదీష్, లత, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

రూఫ్ టాప్ సోలార్ పనులు



ఆగస్టు నెలాఖరులోగా లక్ష్యాన్ని చేరుకోవాలి

● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: ఎస్‌పిడిసిఎల్ పరిధిలో రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. కార్పొరేట్ కార్యాలయం నుండి సోమవారం సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల అధికారులు, కాంట్రాక్టర్లతో సిఎండి శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్య సాయి జిల్లాల్లోని 2.07 లక్షల ఎస్సీ,ఎస్టీ విద్యుత్ వినియోగదారుల గృహాలపై సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆయా జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఇతర అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ పనుల పురోగతిని ఆయా జిల్లాల నోడల్ ఆఫీసర్లు పర్యవేక్షి స్తూ, పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది, అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో ఈ యేడాది ఆగస్టు నెలాఖరులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులను పూర్తిచేయని కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సంస్థ పరిధిలోని వివిధ జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులతో సమీక్షి ంచారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఆదిశేషయ్య, జె.రమణాదేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్ శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్రరావు, కె. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, జగదీష్, భాస్కర్‌రెడ్డి, లత, 9 జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు శేషాద్రి శేఖర్, మోజెస్, ప్రదీప్ కుమార్, సుధాకర్, శ్రీనివాసులు, రాఘవేంద్రం, చంద్రశేఖరరావు, సోమశేఖర్‌రెడ్డి, అమర్‌బాబు, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సంక్షేమం అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ళలో సంక్షేమ పథకాలు అమలుతో బాటు రాష్ట్ర అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా కృషి చేశామని తిరుపతి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి జెబి శ్రీనివాస్ తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలపై ఇంటింటికి టిడిపి కార్యక్రమం తిరుపతి నగరంలోని 50వ డివిజన్ తిమ్మినాయుడు పాలెంలో సోమవారం ఉదయం ప్రారంభమైంది. పార్లమెంటర్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్‌తో కలిసి జెబి శ్రీనివాస్ ప్రజలతో మమేకమయ్యారు.

ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్న పథకాల గురించి వివరించడంతో బాటు వారికి అందిన పథకాలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ బిజీ కృష్ణ యాదవ్, యూనిట్ ఇన్‌చార్జ్ ఖాయం వెంకటరత్నం, డివిజన్ అధ్యక్షుడు దండు విజయ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, తాతయ్యగుంట ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జులు పులిగోరు మురళీకృష్ణ, ఆర్సీ మునికృష్ణ, వూకా విజయ్ కుమార్, దంపూరి భాస్కర్ యాదవ్, మునిశేఖర్ రాయల్, టిడిపి నాయకులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

బొండా ఉమా వివాదం... త్రిసభ్య కమిటీ ఏర్పాటు

నేడు వివరణ తీసుకోనున్న పల్లా, నిమ్మల

విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమమహేశ్వరరావు(ఉమా) నుంచి మంత్రి రామానాయుడు, పల్లా శ్రీనివాస్ వివరణ తీసుకోనున్నారు. మాజీ మంత్రి ముద్రగడ్డ పద్మనాభం సంస్మరణ సభలో బొండా ఉమా, వైఎస్సార్సీపీ నేత అంబటి రాంబాబు తదితరులతో కలిసి వేదిక పంచుకున్నారు. 2019లో టిడిపి ఓటమిపై సంచలన వ్యాఖ్యలు చేసారు. ఈ అంశం వివాదాస్పదంగా మారింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమ, అంబటి రాంబాబు వ్యవహారంపై త్రిసభ్య కమిటీని టిడిపి ఏపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఏర్పాటు చేసారు. పల్లాతో కలిపి మంత్రి నిమ్మల, కిలారు రాజేష్‌లతో త్రిసభ్య కమిటీ మంగళవారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయానికి రావాలని బొండా ఉమకు పిలుపు పంపింది. చంద్రబాబు ఆదేశాలతో బొండా ఉమా నుంచి నుంచి మంత్రి రామానాయుడు, పల్లా శ్రీనివాస్ వివరణ తీసుకోనున్నారు. వైఎస్సార్సీపీ నేతలతో వేదిక పంచుకోవడంపై నేతలకు బొండా ఉమా వివరణ ఇవ్వనున్నారు. ఉమా నుంచి వివరణ తీసుకొని నివేదికను చంద్రబాబుకు సమర్పించనున్నారు. గతంలో వైఎస్సార్సీపీ నేతలతో టిడిపి నేతలు వేదిక పంచుకోవటాన్ని అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. ఘటనలు పునరావృతం కాకూడదని గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

ఇఎస్ఐ ఆస్పత్రి అప్‌గ్రేడేషన్ చేయండి

● కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయకు

ఎంపిలు కేశినేని చిన్ని, మాగుంట లేఖ

విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ ఇఎస్ఐ ఆస్పత్రి అప్‌గ్రేడేషన్ చేయాలని లోక్‌సభ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖమంత్రి మన్సుఖ్ మాండవీయకు లేఖ రాశారు. ఇఎస్ఐసి మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయాలని కేశినేని చిన్ని కేంద్రానికి తన లేఖలో విజ్ఞప్తి చేసారు. గుణదలలో ఇఎస్ఐ ఆస్పత్రిని 300 పడకల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలని ఎంపి విజ్ఞప్తి చేశారు. విజయవాడ ఇఎస్ఐ ప్రాంగణంలోనే నూతనంగా ఇఎస్ఐసి మెడికల్ కాలేజీ మంజూరుకు అవకాశాలు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆసుపత్రి ఆవరణలోనే 25 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, అదనపు భూమి అవసరం లేకుండానే నిర్మించవచ్చని ఎంపి కేశినేని చిన్ని స్పష్టం చేశారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు సహా 8 జిల్లాల్లోని 2.88 లక్షల మంది కార్మికులు, 10 లక్షల మంది వారి కుటుంబ సభ్యులకు ఆధునిక వైద్యం అందుబాటులోకి వస్తుందని ఎంపి కేశినేని చిన్ని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిని కలిసి విజయవాడ ఎంపి కేశినేని చిన్ని, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి లేఖను అందజేశారు.

తిరుమల సమాచారం

విశ్వప్రియతీర్థస్వామికి టిటిడి పెద్దమర్యాద

తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: ఆషాడమాసంలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసిన ఉడిపి అడ్మార్ మఠం పీఠాధిపతి విశ్వప్రియతీర్థస్వామికి టిటిడి పెద్దమర్యాద చేసింది. సోమవారం శిష్యులతో కలసి తిరుమల ఆలయం వద్దకు విచ్చేసిన స్వామికి టిటిడి అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు సాంప్రదాయంగా స్వాగతం పలికారు. తొలుత ధ్వజ స్తంభానికి నమస్కరించిన స్వామి ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు బహుకరించారు. కలియుగంలో ప్రజలు భక్తిభావంతో మోక్షం పొందాలని అనుగ్రహించారు.

ఆగస్ట్‌లో రెండు సార్లు గరుడసేవ

తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల్లో రానున్న ఆగస్ట్ నెలలో రెండు సార్లు గరుడసేవ నిర్వహించనున్నారు. సాధారణంగా నెలలో పౌర్ణమిన గరుడసేవ జరుగుతుంది. ఆగస్ట్‌లో 17వ తేదీ సోమవారం గరుడపంచమి పర్వదినాన ఆరోజు రాత్రి మలయప్పస్వామి గరుడుని అధిరోహించి ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతారు. అలాగే 28న శ్రావణ పౌర్ణమి సందర్భంగా పౌర్ణమి గరుడ సేవ అత్యంత వైభవంగా జరగనుంది. సర్వాంగ సుందరంగా ముస్తాబైన మలయప్పస్వామి గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించనున్నారు. ఈ అపూర్వ ఆధ్యాత్మిక ఘట్టాన్ని కనులారా తిలకించడానికి లక్షలమంది భక్తులకు టిటిడి పిలుపునిచ్చింది. ఆగస్ట్ 28న జరిగే గరుడసేవ బ్రహ్మోత్సవాల గరుడసేవకు ట్రయల్‌రన్‌గా నిర్వహించనున్నారు.

కపిలేశ్వరస్వామికి గ్రంధి పవిత్ర సమర్పణ

తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాల్లో సోమవారం గ్రంధి పవిత్ర సమర్పణ కార్యక్రమం జరిగింది. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాద్యాల నడుమ అత్యంత శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో కపిలేశ్వరస్వామిని మేల్కొలిపి, పవిత్ర అభిషేకం నిర్వహించారు. ఆలయ ఆగమ సంప్రదాయాల ప్రకారం నిత్యహోమం, గ్రంధి పవిత్ర సమర్పణ, మూలమూర్తులకు విశేష ఉపచారాలు ఘనంగా చేపట్టారు. పవిత్రోత్సవాల ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పరమేశ్వరుని కృపాకటాక్షాలను పొందారు. సాయంత్రం యాగశాలలో ప్రత్యేక పూజలు, హోమం, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఓ నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కొండంత వివాదంలో అరకు కాఫీ రుచులు!

తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: నిత్యం లక్ష మంది వరకు భక్తులు వస్తున్న తిరుమలలో ఇప్పటికే దుకాణాల ఏర్పాటు కొండంత వివాదం రగులుతుండగా సందట్లో సడేమియా అన్నట్లు టిటిడి బోర్డు పెద్దలు, అధికారులు అరకు కాఫీ రిటైల్ ఔట్‌లెట్ ఏర్పాటుకు సుముఖత చూపడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే తిరుమలలో సిఆర్ఓ ప్రాంతం సమీపంలో, భక్తుల రద్దీ ఉండే ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రెండు మూడు ప్రైవేట్ డెయిరీలతో బాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పాల ఉత్పత్తుల విక్రయాల ఔట్‌లెట్‌లు నడుస్తున్నాయి.

తిరుమలలో జిసిసి రీటైల్ ఔట్‌లెట్‌కు టిటిడి సుముఖత

తాజాగా తిరుమలలో భక్తుల కోసం జిసిసి ఔట్‌లెట్ ఏర్పాటుకు స్థలం ఎంపిక, అనుమతులివ్వడం వెనుక పెద్ద చర్చ మొదలైంది. తిరుమలలో ఏ వ్యాపారం అయినా భక్తుల సందడిపైనే ఆధారపడి నడుస్తుంది. అలాంటిది ఇప్పటికే స్థానికంగా వందల సంఖ్యలో టీ కేటిల్ నడుపుతున్న స్థానికులు ఉన్నారు. కొందరు అద్దెలు కూడా చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సమయంలో తిరుమలో జిసిసి ఉత్పత్తుల ఔట్ లెట్ నిర్వహించుకునే అవకాశం దక్కిందనేది కూడా గుప్పుమంటోంది. టిటిడి మాత్రం ఇదీ ప్రభుత్వ నిర్ణయమని, ప్రభుత్వం ఆదేశాలతోనే మన రాష్ట్రంలో గిరిజనులు పండించే స్వచ్ఛమైన అటవీ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించామని చెబుతున్నారు. అదేగాక దేవదేవుడు తిరుమలేశుని అవసరాల కోసం గిరిజన సహకార సంస్థ (జిసిసి) నుండి వాటిని కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకుంది. దాదాపు రూ.12.97కోట్లతో నాణ్యమైన సరకులు తీసుకునేందుకు అధికారికంగా ఆమోదముద్ర వేశారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఈ స్వచ్ఛమైన గిరిజన ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని ఆలోచనతో నిర్ణయం తీసుకోవడం జరిగింది. తిరుమలలో సిఆర్ఓ ప్రాంతంలో జిసిసి రిటైల్ ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఏడాది పాటు నామినేషన్ పద్ధతిలో జిసిసి నుండి సరకులను కొనుగోలు చేసి, మార్కెట్లో దొరికే ఇతర బ్రాండ్లతో పోలిస్తే జిసిసి అందించే ఇన్‌స్టంట్ కాఫీ పొడి ధర కాస్త ఎక్కువ. అయినా టిటిడి బోర్డు దీనికే మొగ్గుచూపింది. జిసిసి సరఫరా చేసే సరుకుల నమూనాలను కూడా తిరుమలలోని డబ్ల్యుఎఫ్ పరిశోధనశాలలో పరీక్షించారు. టిటిడి నిబంధనల మేరకు నాణ్యత ఉన్నట్లు క్వాలిటీ మేనేజర్ ధ్రువీకరించడంతో ఇతర బ్రాండ్ల కంటే జిసిసి ఇన్‌స్టెంట్ కాఫీ పొడి ధర కొంత అధికమైనా అందులో కల్తీ లేకపోవడం, జిఐ ట్యాగ్ గుర్తింపుతో అరాబికా కాఫీ కావడంతో టిటిడి బోర్డు పెద్దలు అంగీకారం తెలిపారు. టిటిడి పెద్దల తాజా నిర్ణయంతో తిరుమలకు వచ్చే భక్తులకు జిసిసి ఉత్పత్తులను అందుబాటులో ఉంచేందుకు విక్రయాలకు స్థలాన్ని కేటాయించింది. పిఎసి 2 వద్ద (రెండో న్యూ సత్రం దగ్గర గతంలో దొడ్ల డెయిరీ ఉన్న స్థలంలో) 144 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇనుపషీట్ రూఫింగ్‌తో ఈ ప్రత్యేక దుకాణం అందుబాటులోకి రానుంది. ఇక్కడ గిరిజనులు సేకరించిన స్వచ్ఛమైన తేనె, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు తదితర ఉత్పత్తులను భక్తులకు విక్రయిస్తారు.

కేటాయింపు విషయంలో టిటిడి కొన్ని కఠిన నిబంధనలు విధించినట్లు తెలుస్తోంది. తేనె, కుంకుడు కాయల పొడి, ఎండుమిర్చి తదితర వస్తువులను నామినేషన్ పద్ధతిలో తీసుకోవాలని కమిటీ సూచించింది. కుంకుమ పొడి, కారం, పసుపు వంటి వాటిని తగ్గింపు ధరలపైన అందుబాటులోకి తేవాలని చర్చలు జరుగుతున్నాయి.

అనధికార స్టిక్కర్లపై కొరఢా

తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: యాత్రాస్థలం, విద్యాకేంద్రం తిరుపతి నగరంలో పలు రకాలుగా వాహనాలపై స్టిక్కర్లు వేసుకుని పోలీస్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై తిరుపతి జిల్లా పోలీసులు కొరఢా ఝుళిపించారు. అంబులెన్స్‌లు కూడా రోగులు లేకున్నా రద్దీ ప్రాంతాల్లో, కూడళ్లలో సైరన్‌లు వేసుకుని వాహనాలతో దూసుకెళుతున్న వారిపై కూడా తనిఖీలు చేశారు. ట్రాఫిక్ డిఎస్పీ కొండయ్యనాయుడు ఆధ్వర్యంలో సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది తిరుపతిలోని అనేక ప్రధాన కూడళ్లలో వాహనాలకు ప్రెస్, పోలీస్, జ్యూడీషియల్, ప్రభుత్వ వాహనాలు, ఆన్‌డ్యూటీ గవర్నమెంట్, ఎస్‌పిడిసిఎల్, ఎడ్యుకేషన్, మెడికల్ వంటి తదితర విభాగాలు ఇలా రకరకాల పేరుతో స్టిక్కర్లు వేసుకుని ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి మందుసేవించి తిరుగుతున్నారు. దీనివల్ల నిజమైన ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నట్లు పోలీసులకు అందిన సమాచారం. ఈ సమాచారంతో సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వాహనాలపై ఉన్న అనధికారిక స్టిక్కర్స్ తీసివేశారు. కౌన్సెలింగ్ ఇచ్చారు.

శ్రీకాళహస్తి పురవీధుల్లో దర్శనం ఇస్తున్న ద్రౌపదీదేవి అమ్మవారు

ద్రౌపదమ్మ వసంతోత్సవం

శ్రీకాళహస్తి, జులై 28 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వసంతోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ద్రౌపదమ్మ ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో వైభవంగా ఊరేగింపు జరిపారు. వధువుగా పట్టణ ప్రజలు అమ్మవారిని దర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఉత్సవాల ఇన్‌చార్జిలు సుబ్రమణ్యం, దుర్గా ప్రసాద్, ఆలయ చైర్మన్ ఎంఎస్‌రెడ్డి దఫేదార్ పాల్గొన్నారు.

మృత్యుంజయునికి విశేషాభిషేకాలు

శ్రీకాళహస్తి, జులై 28 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాల్లో ఆలయ ఇఓ బికె వెంకటేశులు, భక్తులు విశేషంగా హాజరయ్యారు. తరువాత స్వామి వారికి ప్రత్యేకాలంకారం జరిపారు. వర్షాభావ కారణంగా ఆగస్టు 1న మృత్యుంజ స్వామి ఆలయం వద్ద శత సహస్రఘట్టాభిషేకం నిర్వహించుటకు సన్నాహాలు చేపట్టినట్లు ఇఓ వెంకటేశులు తెలిపారు.

కృత్రిమమేధ సాంకేతికత పరిశోధనపై డిసెంబర్ 4, 5తేదీల్లో అంతర్జాతీయ సదస్సు

తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో డిసెంబర్‌లో 4, 5 తేదీల్లో రెండురోజులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ సంబంధించిన పోస్టర్‌ను సోమవారం వర్సిటీ ఉప కులపతి ఆచార్య వెన్నం ఉమ ఆవిష్కరించారు. "కృత్రిమ మేధస్సులో డేటా, హార్డ్‌వేర్ ఫిన్‌టెక్ సమగ్రతతో నూతన సాంకేతిక సరిహద్దుల అభివృద్ధి" అనే అంశంతో ఈ అంతర్జాతీయ సదస్సు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డిఎస్టీ క్యూరీఏఐ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సదస్సు డిసెంబర్ 4, 5 తేదీలలో హైబ్రిడ్ విధానంలో జరగనుంది. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష, ఐసిఎఐఆర్ 2026 కన్వీనర్ ఆచార్య పి. వెంకట కృష్ణ పాల్గొన్నారు. ప్రత్యక్ష వర్చువల్ విధానాల్లో పరిశోధనా పత్రాల ప్రదర్శనకు అవకాశం కల్పించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, హార్డ్‌వేర్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్, ఫిన్‌టెక్ అభివృద్ధి చెందుతున్న అంతరశాఖ పరిశోధనా రంగాల్లో తాజా పరిశోధనలు, సాంకేతిక పరిణామాలు, ఆవిష్కరణలపై చర్చించేందుకు పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు, పాలసీ మేకర్స్, పారిశ్రామికవేత్తలు విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యం. సదస్సులో ఏఐ డేటా సైన్స్, ఏఐ హార్డ్‌వేర్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్, ఫిన్‌టెక్ అండ్ ఎఐడ్రివెన్ ఫైనాన్షియల్ సిస్టమ్స్, ఎమర్జింగ్ ఇంటర్‌డిసిప్లినరీ ఏరియాస్ అనే నాలుగు ప్రధాన ట్రాక్‌లలో పరిశోధనా పత్రాలను ఆహ్వానిస్తున్నారు.

ఉత్తమ పరిశోధనలకు బెస్ట్ పేపర్ అవార్డు, బెస్ట్ స్టూడెంట్ పేపర్ అవార్డు, బెస్ట్ ఉమెన్ రీసెర్చర్ ప్రజెంటేషన్ అవార్డు, బెస్ట్ ఇండస్ట్రీ ఇన్నోవేషన్ పేపర్ అవార్డులను అందించనున్నారు. పూర్తి పరిశోధనా పత్రాల సమర్పణకు ఆగస్టు 10 గడువుగా నిర్ణయించారు. ఎంపికైన పత్రాల వివరాలను సెప్టెంబర్ 10న తెలియజేస్తారు. కెమెరారెడీ పేపర్ సమర్పణకు సెప్టెంబర్ 30 చివరి తేదీగా నిర్ణయించారు. ఉపకులపతి ఆచార్య వి.ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష దేశ, విదేశాలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు ఆవిష్కర్తలు తమ పరిశోధనా పత్రాలను సమర్పించి సదస్సులో చురుకుగా పాల్గొనాలని కోరారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
మంగళవారం 28, జూలై 2026

ప్రతి వార్డుకూ సమాన ప్రాధాన్యం.. అభివృద్ధే మా లక్ష్యం

చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, జూలై 27, ప్రభాతవార్త :

ప్రతి వార్డుకూ సమాన ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, డీఎంఎఫ్ నిధులు, విఎంఆర్డిఏ నిధులతో 8వ వార్డులో 13 లక్షలు, 7వ వార్డులో శంకుస్థాపనలకు 23 లక్షలు, ప్రారంభోత్సవాలకు 44.2 లక్షలు, అదేవిధంగా 9వ వార్డులో 1.63 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పద్మావతి శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లా డుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, స్పీకర్ (తరువాయి 8వ పేజీలో)

విలు విద్య క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో

మరిన్ని విజయాలు సాధించాలి

పాడేరులో విలు విద్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రులు సంధ్యారాణి, అనిత

పాడేరు, జూలై 27, ప్రభాతవార్త:

పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలువిద్య శిక్షణ కేంద్రాన్ని గిరిజన సంక్షేమ శాఖ మరియు స్త్రీ శిశు సంక్షమా శాఖ మంత్రి గుమ్మిడి సంధ్య రాణి, హోంమంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు సంధ్యారాణి,అనిత మాట్లాడుతూ భవిష్యత్తులో (తరువాయి 8వ పేజీలో)

మహా పుణ్యఫలం

సింహాచలం, జూలై 27, ప్రభాత వార్త :

భూదేవిని ఉద్ధరించిన వరాహ అవతారం.. బాల భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించిన నారసింహ అవతారాల కలయికతో వరాహ లక్ష్మీనృసింహస్వామిగా శ్రీమహావిష్ణువు స్వయంభూగా కొలువుతీరిన పరమ పవిత్రమైన క్షేత్రం సింహాచలం. సింహం ఆకారంలో ఉండడం వలన ఈ పర్వతం సింహగిరిగా ప్రతీతి. ప్రహ్లాదుడిని రక్షించడానికి వచ్చిన వేగంలో ఒక్కసారిగా పర్వతంపై దూకడంతో స్వామివారి పాదాలు పాతాళ లోకంలో చొచ్చుకుపోయా యని క్షేత్ర మహాత్మ్యం. అందుకే సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణతో పాటు స్వామివారి పాద దర్శనం భాగ్యం కూడా దక్కుతుందని పండితులు చెబుతారు. ఔషధ వనాలు, ఆహ్లాదకరమైన ప్రకృతి సోయగాలతో అలరారే సింహగిరి చుట్టూ ప్రదక్షిణ ప్రతీ ఏటా ఆషాఢ శుద్ధ చతుర్దశినాడు ప్రారంభించి పున్నమి నాటి ఉదయం స్వామివారి దర్శనంతో ముగిస్తుంది. వందల ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం ఇదే అయినప్పటికీ గడిచిన కొన్నేళ్లుగా ప్రదక్షిణ చేసే భక్తుల సంఖ్య లక్షల్లోకి చేరుకుంది. ఈనేపథ్యంలో ప్రదక్షిణకే భక్తులు ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రతీ ఏటా ప్రదక్షిణ చేసేవారి సంఖ్య లక్షల్లో పెరుగుతుంటే దర్శనం చేసుకున్నవారి సంఖ్య వేలల్లోనే ఉంది. గత ఏడాది చతుర్దశి నాడు 41,800, పున్నమినాడు 70 వేల మంది దర్శనం (తరువాయి 8వ పేజీలో)

గిరి ప్రదక్షిణకు

అన్ని ఏర్పాట్లు పూర్తి

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు: జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, జూలై 27, ప్రభాతవార్త :

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి గిరిప్రదక్షిణకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జీవీఎంసీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిప్రదక్షిణ 32 కిలోమీటర్ల మార్గమంతా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, తాత్కాలిక మరుగుదొడ్లు, మొబైల్ టాయిలెట్లు, హెల్ప్‌లైన్ కేంద్రాలు, సమాచార బోర్డులు, బ్యారికేడ్లు వంటి అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేశామని కమిషనర్ తెలిపారు. భక్తుల సౌకర్యమే ప్రధాన లక్ష్యంగా జీవీఎంసీ వివిధ విభాగాలు నిరంతరం పనిచేస్తున్నాయని చెప్పారు. లుంబిని పార్క్ (తరువాయి 8వ పేజీలో)

భోగాపురం ఎయిర్‌పోర్టుతో

ఉత్తరాంధ్రకు నూతన యుగం

విశాఖను దేశంలో నంబర్-1 నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

విశాఖపట్నం, జూలై 27, ప్రభాతవార్త :

ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం కీలక మైలు రాయిగా నిలవనుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. విశాఖను దేశంలోనే నంబర్-1 నగరంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ (తరువాయి 8వ పేజీలో)

నేడు, రేపు కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జిపైకి అనుమతుల్లేవు

విశాఖపట్నం, జూలై 27, ప్రభాతవార్త :

గిరి ప్రదక్షణ నేపథ్యంలో ఈ నెల 28, 29 తేదీలలో కైలాసగిరి పై ఉన్న గ్లాస్ బ్రిడ్జి పైకి సందర్శకులకు, పర్యాటకుల కు అనుమతులు ఉండవని వి ఎం ఆర్ డి ఎ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు భద్రతా కారణాల పరిస్థితుల నేపథ్యంలో గ్లాస్ బ్రిడ్జి మూసివేయడం జరుగుతుందని, అందువల్ల సందర్శకులను, పర్యాటకులను అనుమతించరని తెలిపారు. ఈ విషయాన్ని సందర్శకులు, పర్యాటకులు గమనించాలని కోరారు. ఐతే కైలాసగిరి కొండ పైకి మాత్రం యధావిధిగా వెళ్ళవచ్చని తెలిపారు. నగరవాసులు ఈ విషయాన్ని గమనించాలని విఎంఆర్‌డిఎ అధికారులు కోరారు.

అత్యంత సంబరంగా

ముగ్గుల పోటీలు

- పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు
- విజేతలకు ఈ నెల 29 న ఫైనల్ పోటీలు
- ఫైనల్ లో గెలుపొందిన వారికి ఆగస్టు 1న ఎయిర్పోర్ట్ వద్ద బహుమతులు

విశాఖపట్నం, జూలై 27, ప్రభాతవార్త :

ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు భోగాపురం ఎయిర్పోర్ట్ అనే థీమ్‌లో భాగంగా సోమవారం విశాఖపట్నం జిల్లా పరిధిలో రంగవల్లుల పోటీలు అత్యంత వైభవంగా, ఆడంబరంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ సచివాలయాలు ప్రాంతాల్లో విశాఖ నగర పాలక పరిధిలోని అన్ని జోన్లలో ఉత్సాహంగా మహిళలు (తరువాయి 8వ పేజీలో)

విశాఖ డివిజన్ ఉద్యోగుల సర్వీస్ నిబంధనలపై

సాగుతున్న చర్చలు

రైల్వే బోర్డుతో చర్చిస్తున్నట్టు డిఆర్‌యుసిసి సభ్యులు చలసాని గాంధీ

జ్ఞానాపురం, జూలై 27, ప్రభాతవార్త :

దక్షిణకోస్తా రైల్వే ఏర్పడిన అనంతరం వాల్తేరు డివిజన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీస్ నిబంధనలపై రైల్వే బోర్డు పరిదిలో చర్చలు జరుగుతున్నట్టు డిఆర్‌యుసిసి వాల్తేరు డివిజన్ సభ్యులు చలసాని గాంధీ తెలిపారు. ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి దక్షిణ కోస్తా పరిదిలో గుంతకల్, విజయవాడ, గుంటూరు విశాఖపట్టణము డివిజన్లతో కూడిన జోన్ ఏర్పడిందన్నారు. విశాఖపట్టణ డివిజన్‌లో ప్రస్తుతం 10వేల మంది ఉద్యోగులు ఉండగా రాయగడ డివిజన్‌కు 8వేల మంది ఉద్యోగులు ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ ఉద్యోగుల ప్రాంతాల వారీగా వారి పదోన్నతులు, బదిలీలలు వంటి అంశాలపై ఆందోళనలు నలుగుతునే ఉన్నాయి. రాయగడ పరిదిలో పనిచేస్తున్న ఉద్యోగులు తెలుగు ప్రాంతాల్లోకి (తరువాయి 8వ పేజీలో)

హోం మంత్రి ప్రకటనతో

భక్తుల్లో గందరగోళం !

- తొలిపావంచా వద్ద టెంకాయ కొట్టడమే సంప్రదాయమంటున్న వైదిక పెద్దలు

సింహాచలం, జూలై 27, ప్రభాతవార్త :

ప్రదక్షిణ కి వచ్చే భక్తులు టెంకాయ కొట్టి ప్రదక్షిణ ప్రారంభించేందుకు కొండ చుట్టూ ప్రత్యేక కౌంటర్లు (సింహాచలేశుని నమూనా విగ్రహాలతో) ఏర్పాటు చేస్తే ఏ ప్రాంతవారు ఆ ప్రాంతంలో టెంకాయలు కొట్టి ప్రదక్షిణ ప్రారంభిస్తారని రాష్ట్ర హోం మంత్రి చేసిన ప్రకటన ఇప్పుడు భక్తుల్లో గందరగోళానికి దారితీస్తోంది. ఇటీవల జరిగిన సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చిన నేపథ్యంలో దేవాలయ వైదిక పెద్దలు ఈ ప్రతిపాదన పై (తరువాయి 8వ పేజీలో)

గీతం ఫార్మశీ కళాశాలకు

జాతీయ ర్యాంకింగ్‌లో 'ఎ' గ్రేడ్

విశాఖపట్నం, జూలై 27, ప్రభాతవార్త :

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్ ప్రాంగణాల్లోని 'స్కూల్ ఆఫ్ ఫార్మశీ' కళాశాలలు 2025-26 విద్యా సంవత్సరానికి గాను నేషనల్ ర్యాంకింగ్ మరియు రేటింగ్‌లో అత్యున్నతమైన 'ఎ' గ్రేడ్‌ను సాధించాయి. ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ), (తరువాయి 8వ పేజీలో)

GITAM
DEEMED TO BE UNIVERSITY

నర్సీపట్నంలో ఘనంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'

రూ.50 లక్షల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, రూ16.30 లక్షలకు శంకుస్థాపనలు

నర్సీపట్నం, జూలై 27, ప్రభాతవార్త :

నర్సీపట్నం నియోజకవర్గంలో 'ఇంటింటికీ తెలుగు దేశం' కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. 26వ వార్డులో రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి, టిడిపి పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్ నేతృత్వం లో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి గత రెండేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ పంప్లెట్లు పంపిణీ చేశారు. అలాగే స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందు కు

సాగారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 26వ వార్డు పరిధిలో విఎంఆర్డిఏ, మరియు 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు 50 లక్షల రూపాయలతో నిర్మించిన మూడు సిసి రోడ్లు, కాలువల శిలాఫలకాల ను ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం 28వ వార్డులో 16.30 లక్షల రూపాయల (తరువాయి 8వ పేజీలో)

శ్రీ యెర్నిమాంబ ఆలయంలో

చండీయాగం

ప్రారంభించనున్న శాసనసభ్యులు వంశీకృష్ణ

జ్ఞానాపురం, జూలై 27, ప్రభాతవార్త

జ్ఞానాపురం శ్రీ యెర్నిమాంబ దేవాలయంలో పక్షోత్సవ చండీయాగం నిర్వహించ నున్నారు. ఈ చండీయాగాన్ని దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు సి.హెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ నెల 29వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని దేవాలయాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న నేపద్యంలో శ్రీ యెర్నిమాంబ దేవాలయంలో కూడా నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వి. యస్.సురేష్ బాబా తెలిపారు. చండీ యాగం ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజులలో నిర్వహించనున్నట్టు (తరువాయి 8వ పేజీలో)

ఆ రూ.150 కోట్ల ఆస్తులూ.. జీవీఎంసీవే!

ఈస్ట్ పాయింట్ కాలనీలోని పార్కులు, అక్కయ్యపాలెంలో వాటర్ ట్యాంక్, మునిసిపల్ కార్యాలయాలపై జీవీఎంసీ కమిషనర్ కౌంటర్ అఫిడవిట్ దాఖలు

హర్షం వ్యక్తం చేసిన జనసేన మాజీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్

విశాఖపట్నం, జూలై 27, ప్రభాతవార్త :

విశాఖ నగరంలో సుమారు రూ.150 కోట్ల విలువైన జీవీఎంసీ ఆస్తులను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలను అడ్డుకునేందుకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తీసుకుంటున్న చర్యలకు జనసేన మాజీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు కమిషనర్‌కు వినతిపత్రం అందజేసి, ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు ఆయన చూపుతున్న (తరువాయి 8వ పేజీలో)

విశాఖ ఉక్కు

ఊపిరి పీల్చేదెప్పుడు?

పెనం మీద నుంచి పొయ్యిలోకి స్టీల్ ప్లాంట్!

తుగ్లక్ నిర్ణయాలు.. రూ.కోట్ల నాసిరకం కొనుగోళ్లు

గాజువాక,జూలై 27,ప్రభాతవార్త :

'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' అని పోరాడి సాధించుకున్న స్టీల్ ప్లాంట్ నేడు అధికారుల తప్పుడు నిర్ణయాల దెబ్బకు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. నష్టాల నుంచి గట్టెక్కిస్తామని చెప్పిన యాజమాన్యం అవకత వకలతో ప్లాంట్‌ను మరింత నష్టాల్లోకి నెట్టిందని ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి.

రూ.3,000 కోట్ల నాసిరకం కొనుగోళ్లు

వర్షాకాలానికి ముందు మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను వద్దన్నా ప్రారంభించి, రూ.3,000 కోట్ల కు పైగా నాసిరకం బిఎఫ్ కోక్, ఐరన్ పెల్లె ట్స్ కొనుగోలు చేశారు. ఫలితంగా ప్లాంట్‌కు రూ. 2,000 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. లోపల ఉన్న కాల్సినింగ్ ప్లాంట్‌ను పక్కన పడేసి, బయట నుంచి వందల కోట్లతో నాసి రకం లైమ్‌స్టోన్ కొంటున్నారు. గతేడాది రూ.1,000 కోట్లతో కొన్న నాసిరకం ఫెర్రో ఎలాయ్స్ వల్లే ఎస్ఎమ్ ఎస్-1 ప్రమాదం జరిగి 10 మంది బలై పోయా రన్న ఆరోప ణలు ఉన్నాయి. అమ్ముడుపోని రూ.5,000 కోట్ల విలువైన ఉత్పత్తులను బలవంతంగా తయారు చేయించి ప్లాంట్‌లో వర్కింగ్ క్యాపిటల్ లేకుండా చేశారు (తరువాయి 8వ పేజీలో)

జ్ఞానాపురంలో అల్లరిమూకలను కట్టడి చేస్తాం

సిఐ కోరాడ రామారావు

రాత్రి వేళల్లో పోలీస్ పహారా ఉంటుందన్న సిఐ

'వార్త'కు స్పందించిన పోలీసులు

జ్ఞానాపురం, జూలై 27, ప్రభాతవార్త :

కంచరపాలెం పోలీసుల చర్యలకు జ్ఞానాపురం వాసులు ధన్యవాదాలు చెబుతున్నారు. జ్ఞానాపురంలో అయిదో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోరాడ రామారావు స్వయంగా పర్యటించి ఆకతాయిలకు ముక్కుతాడు వేస్తున్నారు. ఈ నెల 21 వ తేదీన వార్త దినపత్రికలో ' ఏంటీ అర్ధరాత్రి గోల' అనే వార్తకు సిఐ కోరాడ స్పందించారు. ఇటీవల కోరాడ రామారావు స్టేషన్ బాధ్యతలు తీసుకున్న నేపద్యంలో ప్రతి ప్రాంతాన్ని ఆయన నిశితంగా పరిశీలన చేస్తున్నారు. ఈ నేపద్యంలోనే జ్ఞానాపురంలో రెండు రోజుల పాటు (తరువాయి 8వ పేజీలో)

పార్టీ కమిటీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నేతలకు దిశానిర్దేశం

విశాఖపట్నం, జూలై 27, ప్రభాతవార్త :

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కమిటీల నిర్మాణం, కమిటీ సభ్యుల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షుడు కె.కె. రాజు పార్టీ నాయకులకు సూచించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్తలు, పరిశీలకులు, రాష్ట్ర, జోనల్, జిల్లా కమిటీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కమిటీల ఏర్పాటులో వేగం పెంచాలని, సభ్యుల (తరువాయి 8వ పేజీలో)

చరిత్రలో నిలిచిపోయే విధంగా

ఫిషింగ్ హార్బర్‌లో క్రేన్ ఏర్పాటు

మత్స్యకారుల చిరకాల కోరికను నెరవేర్చిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం, జూలై 27, ప్రభాతవార్త :

ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారుల చిరకాల కోరికను నెరవేరుస్తూ బోట్లు రిపేర్ చేయడంతో పాటు సముద్రంలో మునిగిపోయిన బోట్లను వెలికితీసేందుకు వీలుగా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సహకారంతో ఏర్పాటు చేసిన క్రేన్‌ను దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘాల పెద్దలు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా తాము ఎదురుచూస్తున్న క్రేన్ ఏర్పాటు కావడం ఎంతో సంతోషకరమని తెలిపారు (తరువాయి 8వ పేజీలో)

బిజెపి నుంచి వైసీపీలో చేరిన

100 మంది మహిళలు, యువకులు

కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన కె.కె రాజు

విశాఖపట్నం, జూలై 27, ప్రభాతవార్త :

విశాఖపట్నం జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 47వార్డు అధ్యక్షులు కుందిరి సుకుమార్, ఉపాధ్యక్షులు బంగారి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో బిజెపి జిల్లా యస్.సి సెల్ జిల్లా కార్యదర్శి పెద్దింటి మహేష్ మరియు 100 మంది మహిళలు మరియు యువకులు వై.యస్.ఆర్ కాంగ్రెస్ (తరువాయి 8వ పేజీలో)

ప్రతి వార్డుకూ సమాన ప్రాధాన్యం.. అభివృద్ధే మా లక్ష్యం

(7వ పేజీ తరువాయి)

అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తున్నామని చెప్పారు. ఉదయం 26, 28 వార్డుల్లో రూ.3.30 కోట్ల వ్యయంతో రోడ్లు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించగా, సాయంత్రం వేళ ఈ మూడు వార్డుల్లో రూ.4.22 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులను ప్రారంభించినట్లు వెల్లడించారు. నర్సీపట్నం పట్టణాభివృద్ధికి 32 కోట్లు, అలాగే ఇంటింటికీ తాగునీటి కొళాయి సరఫరా కోసం 185 కోట్ల వెచ్చించామని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మూడేళ్ల నాలుగు నెలల కాలంలో పట్టణానికి ఒక్క రూపాయి కూడా తేలేకపోయారని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సీపట్నం మున్సిపాలిటీని డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ వంటి అన్ని రంగాల్లో సుందరీకరిస్తున్నామని వివరించారు. నర్సీపట్నం నియోజకవర్గంలో మొత్తం 1,033 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని, గ్రేడ్-1 కాకుండా ప్రతిపక్ష పార్టీ వాళ్ళ అధ్యక్షులు అయ్యన్నపాత్రుడు కృషి వల్ల సాధించడం జరిగింది దీని వల్ల నర్సీపట్నానికి మరిన్ని కేంద్ర, రాష్ట్ర నిధులు వచ్చి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి ప్రాజెక్టులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. అలాగే సుమారు 1,075 లైట్లు పునరుద్ధరించి, 700 కొత్త లైట్లు, 140 విద్యుత్ స్తంభాలు వేయించినట్లు గుర్తుచేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి నిరంతరం కొనసాగుతుందని, స్థానిక ప్రజల నమ్మకమే తమకు బలమని తెలిపారు. ?ఈ కార్యక్రమంలో మాజీ వార్డు కౌన్సిలర్ రావాడ లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ, నాయకులు రావాడ నాయుడు, రుత్తల కృష్ణ, నీటి కొండ గోవిందు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆదిలక్ష్మి, జనసేన నాయకుడు పంచాద హరినాథ్, ఇతర వార్డు ఇన్చార్జిలు, మున్సిపాలిటీ అధికారులు, కూటమి నాయకులు, మహిళలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్రకు నూతన యుగం

(7వ పేజీ తరువాయి)

పర్యటనకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సభకు హాజరయ్యే ప్రజల రవాణా కోసం సుమారు 2 వేల బస్సులను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా డింసా నృత్యంతో ప్రధానమంత్రికి ఘన స్వాగతం పలకనున్నట్లు వెల్లడించారు. గత రెండేళ్లలో ఉత్తరాంధ్ర, విశాఖలో వినూత్న అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మంత్రి తెలిపారు. సీఐఐ సదస్సు ద్వారా విశాఖకు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు అవకాశం లభించిందని, గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అధిగమిస్తూ గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. భోగాపురం విమానాశ్రయానికి సాధారణ బస్సు వార్డులతోనే ఎలక్ట్రిక్ బస్సు సేవలను ప్రారంభించామని, ప్రజలకు సౌకర్యవంతమైన, పర్యావరణహిత రవాణా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఏపీఎస్ఆర్టీసీ బలోపేతం చేసేందుకు 1,400 కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నామని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మరో 1,050 ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా ప్రవేశపెడతామని వెల్లడించారు. భోగాపురం విమానాశ్రయం దూరంగా ఉందనే అపోహ అవసరం లేదని, హైదరాబాద్‌లో శంషాబాద్ విమానాశ్రయం ఎలా అభివృద్ధికి కేంద్రంగా మారిందో, అదే విధంగా భోగాపురం విమానాశ్రయం కూడా ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కేంద్రబిందువుగా మారుతుందని మంత్రి పేర్కొన్నారు. విశాఖ ఉత్తరాంధ్రకు గుండెకాయ అని, విశాఖ అభివృద్ధే ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి బాటలు వేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

గీతం ఫార్మసీ కళాశాలకు జాతీయ ర్యాంకింగ్‌లో 'ఎ' గ్రేడ్

(7వ పేజీ తరువాయి)

కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసిఐ) ఎన్ఎబిఇటి సంయుక్తంగా నిర్వహించిన మొదటి విడత జాతీయ రేటింగ్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా బి.ఫార్మసీ కోర్సును అందిస్తున్న 398 సంస్థలను పరిశీలించారు. విద్య ప్రమాణాలు, పరిశోధనలు, మౌలిక సదుపాయాలు, పాలన మరియు విద్యార్థుల నైపుణ్యాల ఆధారంగా ఈ సమగ్ర మూల్యాంకనం నిర్వహించబడింది. ఈ పోటీలో కేవలం 64 సంస్థలు(16.1) శాతం మాత్రమే అత్యుత్తమ 'ఎ 'గ్రేడ్‌ను దక్కించుకున్నాయి. ఇందులో గీతం విశాఖపట్నం ప్రాంగణం జాతీయ స్థాయిలో 43వ ర్యాంకు సాధించి దేశంలోని టాప్ 10.8 శాతంలో నిలవగా, హైదరాబాద్ ప్రాంగణం 54వ ర్యాంకుతో టాప్ 13.6 శాతంలో నిలిచిందని గీతం అక్కాడమీ సీనియర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజా ప్రభ తెలిపారు. ఈ మైలురాయి గీతం విశ్వవిద్యాలయం బి.ఫార్మసీ, ఎమ్‌ఫార్మసీ విద్యతో పాటు పరిశోధనలకు ఇస్తున్న ప్రాధాన్యతను నిరూపిస్తుందంతో పాటు నాయకత్వ దూరదృష్టి, అధ్యాపకులు, విద్యార్థులు మరియు సిబ్బంది యొక్క కృషికి దక్కిన గుర్తింపు ఆయన పేర్కొన్నారు.

హోం మంత్రి ప్రకటనతో
భక్తుల్లో గందరగోళం !

(7వ పేజీ తరువాయి)

సుముఖత వ్యక్తం చేయలేదు. సింహగిరి ప్రదక్షిణ అంటే.. సింహాచలం కొండ దిగువ తొలిపావంచా వద్ద టెంకాయ కొట్టి ప్రారంభించడమేనని ఆలయ సంప్రదాయాలను ఇదే ఆధారంగా వస్తోందని వైదిక పెద్దలు చెబుతున్నారు. అయినప్పటికీ భక్తుల రద్దీని నియంత్రించే నేపథ్యంలో హోం మంత్రి చేసిన సూచనలకు అనుగుణంగా నాలుగు చోట్ల అదనంగా దేవస్థానం స్టాల్స్ ఏర్పాటు చేస్తోంది. గోపాలపట్నం పెట్రోల్ బంక్, శ్రీకృష్ణాపురంలోని దేవస్థానం గోశాల వద్ద ఉన్న సూర్యనారాయణ స్వామి విగ్రహం, సీతమ్మధార ప్రాంతాల్లో స్టాల్స్ సిద్ధమవుతున్నాయి. లక్షలాదిగా తరలివచ్చే భక్తులు తొలిపావంచా వద్ద టెంకాయ కొట్టడానికి ప్రాధాన్యత నిస్తారా ! కొత్తగా ఏర్పాటు చేస్తున్న స్టాల్స్ వద్ద కొడతారా వేచిచూడాలి.

విశాఖ డివిజన్ ఉద్యోగుల సర్వీస్ నిబంధనలపై సాగుతున్న చర్చలు

(7వ పేజీ తరువాయి)

వచ్చేందుకు ఆందోళనలు జరుగుతున్నాయని గాంధీ తెలిపారు. ఈ సమస్యలన్నీ రైల్వే బోర్డు పరిధిలోకి తీసుకెళ్ళినట్లు ఆయన తెలిపారు. చైర్మన్, ఒడిస్సా పరిధిలో ఉద్యోగులు చేస్తున్న వారిని విశాఖ డివిజన్ పరిధిలోకి తీసుకురావడానికి, వారి సీనియారిటీ, బదిలీలు, పదోన్నతులల్లో ఎవరికీ అన్యాయం జరగకుండా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వాల్తేరు డివిజన్ సీనియారిటీనే కొనసాగించాలని, వారి ప్రయోజనాలు ఇబ్బందులు లేకుండా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్‌లో ఉద్యోగుల సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చించి వారి సూచనల మేరకు పని చేయనున్నట్లు చలసాని తెలిపారు. త్వరలో రైల్వేబోర్డు నుంచి సుదీర్ఘ చర్చల అనంతరం అందరికీ ఆమోదయోగ్యమైన ఉత్తరం లభించనున్నట్లు ఆయన తెలిపారు.

అత్యంత సంబరంగా ముగ్గుల పోటీలు

(7వ పేజీ తరువాయి)

పెద్ద ఎత్తున పాల్గొని ఈ పోటీల ను విజయవంతం చేశారు. గ్రామీణ స్థాయి లో డి.ఆర్.డి.ఏ, పట్టణ ప్రాంతం లో యు.సి.డి శాఖలు ఈ పోటీలను నిర్వహించాయి. ఈ ముగ్గుల పోటీలలో ప్రతి జోన్ లో ముగ్గురు విజేతలను ప్రకటించారు. విజేతలైన వారికి ఈ నెల 29 న ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఫైనల్‌లో ఎంపికైన విజేతలకు ఆగస్టు 1న ప్రధాని మోదీ ప్రారంభించనున్న అంతర్జాతీయ ఎయిర్పోర్ట్ వేదిక వద్ద బహుమతి ప్రదానం చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలలో జోనల్ కమిషనర్లు, ఎంపిడిఓ లు,స్థానిక అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బిజెపి నుండి వైసీపీలో చేరిన 100 మంది మహిళలు, యువకులు

(7వ పేజీ తరువాయి)

పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పెద్దింటి కనకరాజు, రావుపల్లి రాజశేఖర్, రాజన పరేష్, సుండి బాబు, రాజన సురేంద్ర, గండి వంశీ, రాజన చంటి, సొండి రమేష్, పెద్దింటి పెంటమ్మ, సుండి కాసులమ్మ, దేవల్లి నిర్మల, గండి స్వాతి, దీప్తి,సుండి లద్దమ్మ, మరియమ్మ, సుజనమ్మ తదితరులు చేరారు. వారికి విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కె కె రాజు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ మంత్రి వర్మలు పరిశీలకులు బాబాలు బాలరాజు, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, సిటిసి సభ్యులు కోలా గురువులు, మాజీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, నియోజకవర్గ పరిశీలకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, సతీష్ వర్మ, బాణాల శ్రీనివాసరావు, రామకృష్ణ, రాష్ట్ర జిల్లా నాయకులు జాన్ వెస్లీ, సేనాపతి అప్పారావు, జి.వి రమణి, తాడి జగన్నాధరెడ్డి, కర్రి రామారెడ్డి, మారుతి ప్రసాద్, లక్ష్మణరావు, రమేష్, చందురెడ్డి, శ్రీను, మరియు వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు మరియు విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిశీలకురాలు పేడాడ రమణికుమారి ఇతర నాయకులు పాల్గొన్నారు.

సింహగిరి భూ ప్రదక్షిణం మహా పుణ్యఫలం

(7వ పేజీ తరువాయి)

చేసుకున్నట్టు దేవస్థానం ప్రకటించింది. భక్తులు ఉదయాన్నే ప్రదక్షిణ ప్రారంభించేసి మధ్యాహ్నానికి ముగించేస్తున్నారు. 32 కిలోమీటర్లు ఆగకుండా తిరిగితే ఆరు నుండి ఏడు గంటల సమయం పడుతుంది. ఈ ఏడాది ఐదారు లక్షలమంది గిరి ప్రదక్షిణ చేస్తారని అంచనా వేస్తున్నారు.

ప్రదక్షిణ ఇలా ప్రారంభిస్తారు..!

దేశం నలుమూలల నుండి సింహాచలం వచ్చిన భక్తులు కొండ దిగువ తొలిపావంచా వద్ద టెంకాయ కొట్టి ప్రదక్షిణ ప్రారంభిస్తారు. ఇందు కోసం దేవస్థానం పదుల సంఖ్యలో క్యూలు ఏర్పాటు చేసింది. ఇక్కడ నుండి పాత అడివివరం, ముడసర్లోవ, హనుమంతువాక, విశాలాక్షి నగర్ మీదుగా జోడుగుళ్ళ పాలెం, తెన్నేటిపార్క్ చేరుకుంటారు. అక్కడ సముద్ర స్నానం చేసి అప్పూఘర్, వెంకోజీపాలెం, హెచ్బీ కాలనీ, సీతమ్మధార, పోర్టు స్టేడియం మీదుగా జాతీయ రహదారికి చేరుకుంటారు. అక్కయ్యపాలెం, న్యూ కాలనీ, కంచరపాలెం, మురళీనగర్ మీదుగా మాధవధార చేరుకుంటారు. మాధవస్వామి, వేణుగోపాల స్వామి వారి దర్శనం చేసుకుని అక్కడ నుండి ఆర్ అండ్ బి, ఎన్ఎస్ఈఎల్ లక్ష్మీ నగర్, ఇందిరా నగర్, గోపాలపట్నం పెట్రోల్ బంకు వద్ద కుమారి కల్యాణ మండపం, ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్ గోశాల మీదుగా తొలిపావం చాకు చేరుకుని టెంకాయ కొట్టి ప్రదక్షిణ పూర్తి చేస్తారు.

28 చోట్ల సేవా కేంద్రాలు

భక్తులు ప్రదక్షిణ చేసే 32 కిలోమీటర్ల పొడవునా 28 చోట్ల దేవస్థానం సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇక్కడ ప్రాథమిక చికిత్సకు అవసరమైన సదుపాయాలతో పాటు తాగునీరు అందుబాటులో ఉంచుతున్నారు. దారి పొడవునా 600 చోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు అందుబాటులో ఉంచారు. సముద్ర స్నానం చేసే ప్రదేశాల్లో ముందు జాగ్రత్త చర్యగా మత్స్యశాఖ సహకారంతో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. దారి పొడవునా నిరంతరాయంగా విద్యుత్ ఉండేలా ఆశాఖ అధికారులకు సూచనలిచ్చారు.

మద్యం దుకాణాలు బంద్

భక్తులు ప్రదక్షిణ చేసే ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాలను 28వ తేదీ ఉదయం 6 నుండి 29వ తేదీ సాయంత్రం వరకు మూసివేయాలని ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచుతున్నారు. నేరాలను అదుపు చేసేందుకు హై రెజల్యూషన్ సీసీ కెమెరాలను జీవీఎంసీ ఏర్పాటు చేస్తుంది. ప్రదక్షిణ చేసే రహదారికి అనుకొని ఉన్న కమ్యూనిటీహాళ్లు, కళ్యాణ మండపాలు, విద్యాసంస్థల్లో ప్రాథమిక సదుపాయాలు కల్పిస్తున్నారు. భక్తులు ఇక్కడ విశ్రాంతి తీసుకుని సేవలను వినియోగించుకోవచ్చు. పారిశుధ్యం, మరుగుదొడ్ల, నిర్వహణ బాధ్యతను జీవీఎంసీ పర్యవేక్షిస్తోంది.

నర్సీపట్నంలో ఘనంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'

(7వ పేజీ తరువాయి)

అంచనా వ్యయం తో నిర్మించనున్న రెండు సిసి రోడ్లు, డ్రైనేజీ పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నాయకత్వంలో పట్టణాభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. రెండు సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధి సంక్షేమం ప్రతి ఇంటికి తెలియాలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 26వ వార్డులో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 3 సంవత్సరాల 4 నెలల పాటు కౌన్సిలర్‌గా ఉండి కూడా వార్డులో కనీసం రెండు కరెంట్ స్తంభాలు వేయించుకోలేకపో యానని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో గెలిచిన 29 రోజుల్లోనే వివిఎంఆర్డిఏ నుంచి రూ.4.11 కోట్లు, మొత్తం మున్సిపాలిటీకి రూ.32 కోట్లు, అలాగే ఇంటింటికీ తాగునీటి సరఫరా పథకం కోసం రూ.185 కోట్ల భారీ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే పట్టణంలో 700 కొత్త బల్బులు, 1075 పాత లైట్లు మార్చి కొత్త లైట్లు వేయటం జరిగిందన్నారు. అలాగే 140 కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశామని చెప్పారు. తన వార్డు అభివృద్ధికి రూ.1.10 కోట్లు, 28వ వార్డు ఇంచార్జ్ శ్రీకాంత్ అభివృద్ధికి రూ.2.20 కోట్లు కేటాయించారని వివరించారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు, అయ్యన్నపాత్రుడిని గెలిపించడం వల్లే ఈ స్థాయిలో అభివృద్ధి సాధ్యమైందని, ఆగస్టు నెలాఖరు నాటికి ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు డ్రైన్లు, కల్వర్టులు, రోడ్ల నిర్మాణానికి మరిన్ని గ్రాంట్లు తెప్పిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి లాలం మురళి, నూకాంబిక అమ్మవారి ఆలయ చైర్మన్ కొరుప్రోలు శ్రీనివాస్, 28వ వార్డు ఇంచార్జ్ డబ్బీరు శ్రీకాంత్, వార్డు నాయకులు, ఇతర ముఖ్య నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆ రూ.150 కోట్ల ఆస్తులూ.. జీవీఎంసీవే!

(7వ పేజీ తరువాయి)

చొరవను అభినందించారు. ఈస్ట్ పాయింట్ కాలనీలోని లెండి వనం, బాబా చావిడి పార్కులతో పాటు అక్కయ్యపాలెంలోని వాటర్ ట్యాంక్, మున్సిపల్ కార్యాలయాల స్థలాలు పూర్తిగా జీవీఎంసీ ఆస్తులేనని కమిషనర్ హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసినట్లు మూర్తి యాదవ్ తెలిపారు. తప్పుడు సర్వే నివేదికలు, కొందరు వ్యక్తుల ఒత్తిళ్లు, సిఫార్సు లేఖల ఆధారంగా దశాబ్దాలుగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

ఈస్ట్ పాయింట్ కాలనీలోని పార్కు స్థలాల విషయంలో గతంలోనే జీవీఎంసీ కోర్టు కేసుల్లో విజయం సాధించిందని, అయినప్పటికీ వాటిని ప్రైవేటు వ్యక్తుల ఆస్తులుగా చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అయితే కమిషనర్ కేతన్ గార్గ్ హైకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో 1957 నుంచే ఆ భూములు స్థానిక సంస్థ ఆధీనంలో ఉన్నాయని, అప్పటి నుంచి జీవీఎంసీ ఆధీనంలోనే కొనసాగుతున్నాయని స్పష్టం చేసినట్లు తెలిపారు. గతంలో కూడా ఈ భూములు జీవీఎంసీవేనని కోర్టులు తీర్పులు ఇచ్చిన విషయాన్ని కమిషనర్ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు.

ఎస్టేట్ అబాలిషన్ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత ఈ భూములు ప్రభుత్వ ఆస్తులుగా మారాయని, అయినప్పటికీ కొందరు పాత సర్వే నివేదికలను ఆధారంగా చేసుకుని కోర్టులను ఆశ్రయిస్తున్నారని మూర్తి యాదవ్ తెలిపారు. హైకోర్టు కూడా భూమిపై హక్కుల అంశాన్ని సంబంధిత స్థానిక న్యాయస్థానాల్లో తేల్చుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు.

అక్కయ్యపాలెంలోని జీవీఎంసీ స్థలానికి సంబంధించిన అన్ని రికార్డులు కూడా ప్రభుత్వానికే అనుకూలంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల ఆధారంగా ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలను అధికారులు ప్రోత్సహించరాదని, ప్రజా ఆస్తుల పరిరక్షణ విషయంలో రాజీ పడకూడదని కోరారు.

పార్కు స్థలాల్లో ఇప్పటికే కొన్ని అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, జీవీఎంసీ వెంటనే ఆ స్థలాలను పూర్తిగా స్వాధీనం చేసుకుని ఉద్యానవన శాఖ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక సిబ్బందిని నియమించి భూములను సంరక్షించాలని, అక్రమ నిర్మాణాలను తొలగించి పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు.

ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో కమిషనర్ కేతన్ గార్గ్ చూపుతున్న వైఖరికి రాష్ట్రస్థాయి అధికారులు కూడా మద్దతు ఇవ్వాలని, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఆస్తుల విషయంలో సిఫార్సు లేఖలు ఇవ్వకుండా వాటి పరిరక్షణకు కృషి చేయాలని పీతల మూర్తి యాదవ్ విజ్ఞప్తి చేశారు.

ఇంటింటికీ తెదేపా'తో శ్రేణుల్లో నూతనోత్సాహం

గాజువాక,జూలై 27,ప్రభాతవార్త :

గాజువాక నియోజకవర్గంలో నిర్వహించతలపెట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమానికి తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ 65వ వార్డు కాకతీయ కూడలి వద్ద మహానాయకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించిన అనంతరం ఆయన ఈ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం గడిచిన రెండేళ్ల కాలంలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతీ కుటుంబానికి సగర్వంగా చేర్చడమే ఈ కార్యక్రమ ముఖ్య

ఉద్దేశమని వెల్లడించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ ప్రగతి నివేదిక పత్రాలను వారికి అందజేస్తూ, స్థానిక సమస్యలు, ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు.

ప్రజాక్షేత్రంలో సంక్షేమ ఫలాలు:

సూపర్-6 హామీల అమలు తీరును, ప్రభుత్వం ద్వారా చేకూరుతున్న ప్రయోజనాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతీ నాయకుడు, కార్యకర్త రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని స్పష్టంగా వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, వార్డు మాజీ కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు, నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, రాజాన రామారావు, మొల్లి ముత్యాల నాయుడు, వార్డు అధ్యక్షుడు రట్టి వాసు, మహిళా అధ్యక్షురాలు కోరుకొండ మంగ, నాయకులు సింగంపల్లి దేముడు, కోట్ని శ్రీలక్ష్మి, సుగుణ, శివ శాస్త్రి, జయంతి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఆనందపురం, జూలై 27, ప్రభాతవార్త:

ఆనందపురం మండలం పెద్దిపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియరాకపోవడంతో పోలీసులు గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దిపాలెం ప్యారడైజ్ హోటల్ ఎదురుగా జాతీయ రహదారిపై సోమవారం తగరపువలస నుంచి ఆనందపురం వైపు వస్తున్న ట్రావెల్స్ బస్సు రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఆనందపురం పోలీసు లు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్ ద్వారా గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అయితే కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సదరు వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి మెడలో ఉన్న బస్‌పాస్‌పై 'ఆర్. రాజు' అనే పేరు, వయస్సు 41 సంవత్సరాలుగా, చిరునామా విశాఖపట్నం గా నమోదై ఉన్నట్లు గుర్తించారు. అలాగే అతని కుడి చేతిపై 'సోమి' అనే పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి పూర్తి వివరాలు తెలియకపోవడంతో ఆనందపురం పోలీసులు గుర్తింపు కోసం దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఆనందపురం పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు. ప్రమాదానికి కారణాలపై కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

మన కూరగాయల తోట మనమే పెంచుకుందాం

విశాఖపట్నం, జూలై 27 ప్రభాత వార్త :

మన కూరగాయల తోట మనమే పెంచుకుందాం అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం హెచ్ పిసిఎల్ వాల్తేర్ క్లబ్ లో హెచ్ పిసిఎల్ హెచ్ ఆర్ అసిస్టెంట్ మేనేజర్ డి. రాజేశ్వరరావు అధ్యక్షతన గ్రీన్ క్లైమేట్ టీం మన కూరగాయల తోట కార్యక్రమంలో భాగంగా దేశీయ నలుపు, తెలుపు వంగనారు, టమాటా, పచ్చి మిర్చి, బంతి నారు మొక్కలు పంపిణీ చేసిన తర్వాత ఆయన మాట్లాడారు. రసాయన ఎరు వులు లేని కూరగాయలు ఆరోగ్యకరం అన్నా రు. దీనిని దృష్టి లోనికి తీసుకొని ప్రతి ఏటా విశాఖపట్నంలో వేలాది మందికి దేశీయ కూరగాయ, ఆకుకూరల విత్తనాలు, నారు పంపిణీ చేస్తున్నామని వివరించారు. కూరగా యలు ఇంటి వద్ద పెంచు కుంటే మానసిక ఒత్తిడి తగ్గుతుంది అని పేర్కొన్నారు. అలాగే ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. అంతేకాక ఇంటిలోనే అందరికీ ప్రశాంతంగా ఉంటుం దని వివరించారు. వేడెక్కుతున్న శీతోష్ణస్థితి పరిస్థితుల్లో ఇంటి పై కప్పు మీద కూరగాయలు పెంచితే వేడి తగ్గుతుంది అని తెలియజేశారు. విశాఖ నగరంలోని ప్రతి ఒక్కరూ మన కూరగాయల తోట ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో వాల్తేర్ క్లబ్ లోని పలువురు మహిళలు, సిబ్బంది, హెచ్ పి సీఎల్ ఉద్యానవన శాఖ అధికారి లక్ష్మి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో సమన్వయకర్త జె.రాజేశ్వరి తదితరులు పాల్గొని మాట్లాడారు.

భోగాపురం విమానాశ్రయం..
విశాఖ పారిశ్రామికాభివృద్ధికి గేమ్ ఛేంజర్

(ప్రభాతవార్త -విశాఖపట్నం)

భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో విశాఖపట్నం పారిశ్రామిక, సాంకేతిక అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. ఇప్పటికే సెమీకండక్టర్లు, ఐటీ, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు (జీసీసీలు), డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో పెట్టుబడులకు విశాఖ ప్రధాన గమ్యస్థానంగా మారుతోంది. జిల్లాలో పలు ప్రముఖ సంస్థలు భారీ పెట్టుబడులతో ముందుకు వస్తున్నాయి. టార్లువాడలో ఏఎస్ఐపీ టెక్నాలజీస్ తొలి దశలో రూ.468 కోట్లతో సెమీకండక్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుండగా, మొత్తం పెట్టుబడి రూ.2,388 కోట్ల వరకు చేరనుంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ రూ.80 కోట్లతో డెవలప్‌మెంట్ సెంటర్‌ను, ఏఎంఎన్ఎస్ ఇండియా రూ.1,400 కోట్లతో పెల్లెట్ ప్లాంట్ విస్తరణను చేపడుతోంది. రెక్ట్రాన్ గ్లోబల్ రూ.4,150 కోట్లతో షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ ప్రాజెక్టును, హిందుస్థాన్ షిప్‌యార్డ్ రూ.3,000 కోట్లతో షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ క్లస్టర్‌ను అభివృద్ధి చేస్తోంది. లులు గ్రూప్ రూ.1,066 కోట్లతో మెగా షాపింగ్ మాల్‌ను నిర్మిస్తోంది. అదనంగా వేర్‌హౌసింగ్, లాజిస్టిక్స్, ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కులు, స్టోరేజ్ రంగాల్లోనూ కొత్త పెట్టుబడులు వస్తున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో విశాఖకు అంతర్జాతీయ విమాన అనుసంధానం మరింత బలోపేతం కానుంది. దీంతో విదేశీ పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులు, వ్యాపార ప్రతినిధులు, సరఫరాదారుల రాకపోకలు సులభతరం కానున్నాయి. ఫలితంగా సెమీకండక్టర్లు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో దేశీయ, విదేశీ పెట్టుబడులు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

విలువిద్య క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో
మరిన్ని విజయాలు సాధించాలి

(7వ పేజీ తరువాయి)

విలువిద్య క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని మంత్రులు ఆకాంక్షిస్తున్నాను. గిరిజన యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి అవసరమైన శిక్షణ, మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహాన్ని అందించేందుకు ఐటీడీఏల ద్వారా అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ, మౌలిక వసతులు, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాము జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించేలా గిరిజన విలువిద్య క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు.గిరిజన యువత చదువుతో పాటు క్రీడల్లోనూ ముందంజలో ఉండాలి. అదే సమయంలో మాదకద్రవ్యాలు, గంజాయి వంటి దురలవాట్లకు దూరంగా ఉంటూ తమ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలి. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకం. గిరిజన ప్రాంతాల్లో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, జాబ్ మేళాల ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలను మరింత విస్తరిస్తాం. గిరిజనుల విద్య, క్రీడలు, ఉపాధి, సంక్షేమం అనే నాలుగు అంశాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ వారి సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ జిల్లాస్థాయి విలువిద్య పోటీల్లో పాల్గొంటున్న ప్రతి విద్యార్థికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, మీలో ఎంతో మంది భవిష్యత్తులో భారతదేశానికి పతకాలు సాధించే క్రీడాకారులుగా ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిషాశీతి టి, జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, పాడేరు ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ జిల్లా ఎస్పీ అమిత్ భర్ధర్, ఈగల్ ఐజి హెడ్ ఏకే రవి కృష్ణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కమిటీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

(7వ పేజీ తరువాయి)

వివరాల ధృవీకరణ ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కె కె రాజు ఆదేశించారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి నాయకుడు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే జూలై 28న వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించి, విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నియోజకవర్గ సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, పరిశీలకులు పసుపులేటి బాలరాజు, తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, చింతకాయల సన్యాసిపాత్రుడు, సతీష్ వర్మ, జహీర్ అహ్మద్, వీసం రామకృష్ణ, బాణాల శ్రీనివాసరావు, విశాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ పరిశీలకురాలు పేడాడ రమణికుమారి, రాష్ట్ర, జోనల్, జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

(7వ పేజీ తరువాయి)

సముద్ర స్నాన ఘాట్ వద్ద మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా స్నానపు షవర్లు, దుస్తులు మార్చుకునే గదులు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సముద్ర స్నానానికి వచ్చే భక్తుల భద్రత కోసం లైఫ్‌గార్డులు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని ప్రధాన ప్రాంతాల్లో ట్యాంకర్లు, తాగునీటి క్యాన్లు ఏర్పాటు చేశామని, రాత్రి సమయంలో గిరిప్రదక్షిణ చేసే భక్తుల కోసం మార్గమంతా తగినంత విద్యుత్ వెలుతురు కల్పించినట్లు చెప్పారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించేలా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. గిరిప్రదక్షిణ మార్గంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని, ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం విధుల్లో ఉంటారని తెలిపారు. అన్నదాన కేంద్రాల వద్ద తప్పనిసరిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే చర్యలు తీసుకున్నామని చెప్పారు. ట్రాఫిక్ నిర్వహణలో పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేస్తున్నామని, ప్రధాన కూడళ్లు, రోడ్డు క్రాసింగ్‌ల వద్ద బ్యారికేడ్లు, దిశానిర్దేశక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులు అధికారుల సూచనలు పాటిస్తూ గిరిప్రదక్షిణను విజయవంతం చేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ విజ్ఞప్తి చేశారు.

జ్ఞానాపురం శ్రీ యెర్నిమాంబ ఆలయంలో చండీయాగం

(7వ పేజీ తరువాయి)

ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ తెలిపారు. రాష్ట్రం, గ్రామం దుర్భిక్ష బాధలు లేకుండా అమ్మవారి అనుగ్రహం కోసం నిర్వహించే చండీయాగంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గోనాలని ఆయన కోరారు. అమ్మవారి దీవెనలు దేవాల యంలో ప్రవేశించే ప్రతి భక్తునికి ఉండాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు సురేష్‌బాబా తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు పొందగోరు భక్తులు దేవాలయంలో రూ. 1116 చెల్లించి రసీదు పొందాలని సురేష్ కోరారు.

అల్లరిమూకలను కట్టడి చేస్తాం

(7వ పేజీ తరువాయి)

స్వయంగా అన్ని వీదుల్లో పర్యటించి పరిస్తితిని ఆకలింపు చేసుకున్నారు. ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి 12 గంటల మధ్యలో మూడు, నాలుగు సార్లు పోలీసులు గ్రామంలోని అన్ని వీదుల్లో పర్యటించే ఏర్పాట్టు చేయడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సిఐ ఇలాగే పోలీస్ప హారా కొనసాగిస్తే తాము ఆనందంగా బతికే అవకాశాలు ఏర్పడతాయని మహిళలు చెబుతున్నారు. అర్ధరాత్రి వేళల్లో తాగి డ్యాన్సు వేసే బ్యాచ్‌లు చాలా వరకు తగ్గుముఖం పట్టడంపై స్థానికులు పోలీసులకు ధన్యవాదాలు చెబుతున్నారు. ఇప్పటికే పోలీసులు చాలా మందిని కౌన్సిలింగ్ చేసి రాత్రి 9 గంటల తర్వాత రోడ్లపై ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. స్థానికంగా నివసిస్తున్న వారు వారి పిల్లలను రాత్రి వేళల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు కోరుతున్నారు. రానున్న స్థానిక ఉత్సవాల నెపంతో రాత్రి వేళల్లో యువత ఇబ్బందులు పెడితే సహించేది లేదని సిఐ కోరాడ రామారావు విజ్ఞప్తి చేస్తున్నారు.

చరిత్రలో నిలిచిపోయే విధంగా ఫిషింగ్ హార్బర్‌లో క్రేన్ ఏర్పాటు

(7వ పేజీ తరువాయి)

మత్స్యకారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే భారీ గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, మత్స్యకారుల ప్రతి సమస్యను పరిష్కరించే బాధ్యత తన భుజస్కంధాలపై ఉందని తెలిపారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన మత్స్యకార సోదరులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఫిషింగ్ హార్బర్‌లో క్రేన్ ఏర్పాటు కోసం సహకరించిన విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్, డిప్యూటీ చైర్మన్, చీఫ్ మెకానికల్ ఇంజనీర్ శ్రీ రామ్ ప్రసాద్ కి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బోటు అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మణరావు మాట్లాడుతూ, చరిత్రలో నిలిచిపోయే విధంగా ఫిషింగ్ హార్బర్‌లో క్రేన్‌ను ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కీలక పాత్ర పోషించారని అన్నారు. ఈ క్రేన్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బోట్లు రిపేర్ చేయడంతో పాటు ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగిపోయిన బోట్లను వెలికితీయడానికి కూడా ఈ క్రేన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ క్రేన్ 24 గంటలూ మత్స్యకారుల అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బోట్ అసోసియేషన్ ప్రతినిధులు, మత్స్యకార సంఘాల పెద్దలు, మత్స్యకారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఊపిరి పీల్చేదెప్పుడు?

(7వ పేజీ తరువాయి)

'కోక్ ఓవెన్'లకు ఉరితాళ్ళు!...

స్టీల్ ప్లాంట్‌కు కీలకమైన 'కోక్ ఓవెన్' విభాగంలోని 5 బ్యాటరీలలో 4 ఇప్పటికే దెబ్బతిన్నాయి. మిగిలిన ఒకే ఒక్క ఐదో బ్యాటరీపై నిబంధనలకు విరుద్ధంగా రోజుకు 100 పుషింగ్‌లు తీస్తూ ఒత్తిడి పెంచుతున్నారు. మరో 5-6 నెలలు ఇలాగే ఉంటే ఆ బ్యాటరీ కూడా కాలిపోయి ప్లాంట్‌ను స్క్రాప్ కింద అమ్మేసుకోవాల్సిందేనని ఆందోళన వ్యక్తమవుతోంది. దాదాపు 8,000 మంది అనుభవజ్ఞులైన ఉద్యోగులను సాగనంపిన యాజమాన్యం ఉన్న వారిపై రోజూ 5-6 గంటల పాటు విసిల పేరుతో వేధింపులకు గురిచేస్తోంది. గత నాలుగేళ్లుగా వేతన పెంపులు, ప్రమోషన్లు నిలిపివేశారు. చనిపోయిన 750 కుటుంబాలకు రావాల్సిన రూ.200 కోట్ల పిఎఫ్, గ్రాట్యుటీలు ఇవ్వకుండా వేధిస్తున్నారు. విఆర్ఎస్ పొందిన వారికి, రిటైర్ అయిన వారికి రావాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు ఇప్పటివరకు ఇవ్వలేదు. న్యాయ విచారణ జరిపించాలి :ఎస్ఎమ్ఎస్-1 ప్రమాదంలో 10 మంది చనిపోయినా అధికారులు కనీసం పరామర్శించలేదని రికగ్నైజ్డ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాంట్‌ను భ్రష్టుపట్టించిన అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని, ఇచ్చిన హామీ ప్రకారం వారం రోజుల్లోగా కేంద్ర, రాష్ట్ర నాయకులు కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మన్యంలో రెండు రోజులుగా ముసురు

దుంబ్రిగుడ,, జూలై27 ప్రభాతవార్త:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో రెండు రోజులుగా ముసురుతో కూడిన మోస్తారు వర్షం కురుస్తోంది. మెట్ట పొలాలకు దుమ్మును పట్టిన గిరిజన రైతులు వర్షాలకు ఎదురు చూడాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఏర్పడుతుంది. కూరగాయ పంటలకు నీరందని దుస్థితితో నెలకొంటుంది. నీరున్నా పంట పొలాలకు వరినాట్లను గిరిజనులు చేపట్టారు. వర్షధారంపై ఆధారపడిన మెట్ట పొలాలకు ఇప్పటికి నాట్లు లేకపోవడంతో నారుమడులు ఎండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా మోస్తారు వర్షం కురుస్తుడడంతో గిరిజన వ్యవసాయ ఊపిరిపీల్చుకుంటున్నారు.

రాష్ట్ర స్థాయి కే-1 కిక్ బాక్సింగ్ పోటీల్లో అల్లూరి జిల్లా క్రీడాకారుల సత్తా

13 మందిలో 10 మందికి పతకాలు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన విజేతలు

పాడేరు,జూలై27, ప్రభాతవార్త:

విజయనగరం ఎం.ఆర్. కళాశాల స్టేడియంలో ఈనెల 25, 26 తేదీలలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి అమెచ్యూర్ కె-1 కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్లో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారు. జిల్లా నుంచి పోటీల్లో పాల్గొన్న 13 మంది క్రీడాకారుల్లో 10 మంది బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించి తమ ప్రతిభను చాటారు. రాము వాకోకిక్ బాక్సింగ్ అకాడమీకి చెందిన అక్కాచెల్లెళ్లు పాలికి మేరీ, పాలికి మేనక తమ తమ విభాగాల్లో బంగారు పతకాలు సాధించి టైటిల్ కప్పు కైవసం చేసుకున్నారు. వీరు చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ రేగల్లు గ్రామానికి చెందినవారు. మేరీ చింతపల్లి ఏకలవ్య కళాశాలలో బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతుండగా, మేనక జీటీడబ్ల్యూయూ కొక్కిరపల్లి పాఠశాలలో 9వ తరగతి అభ్యసిస్తోంది.

పతక విజేతలు

తాంగుల రామ్ సాయి (హుకుంపేట మండలం)- 54 కేజీల విభాగం- బంగారు పతకం, వంతాల బాలేష్ (హుకుంపేట మండలం)- 55 కేజీల విభాగం- రజత పతకం, ఉల్లి చరణ్ (పెద్దబయలు మండలం)- 50 కేజీల విభాగం- రజత పతకం, బురిడి మహదేవ్ (దుంబ్రిగూడ మండలం)- 55 కేజీల విభాగం- కాంస్య పతకం, కటారి అరుణ్ బాబు (హుకుంపేట) - 60 కేజీల విభాగం- కాంస్య పతకం, ఈశ్వరరావు (పెద్దబయలు మండలం)- 60 కేజీల విభాగం- కాంస్య పతకం, తామర్ల రమేష్ బాబు (పాడేరు మండలం)- 60 కేజీల విభాగం- కాంస్య పతకం, కొండింతల దీపక్ (సీతంపేట మండలం, పార్వతీపురం మన్యం జిల్లా)- 19 కేజీల విభాగం- బంగారు పతకం. ఈ సందర్భంగా అమెచ్యూర్ కే-1 కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమారావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి హేమంత్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ అనిల్, జిల్లా అధ్యక్షుడు కుర్మారావు, శ్రీకాకుళం జిల్లా కోచ్ హరీష్ తదితరులు విజేతలను అభినందించారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడు ఎన్. రామారావు, కోచ్‌లు తాంగుల రామ్ నాయుడు, సుర్ర చిట్టిబాబు, బోయిని నాగేశ్వరరావు, పనస చిరంజీవి, పాలికి గోవింద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పతక విజేతలు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ని మర్యాదపూర్వకంగా కలిసి ఆమె ఆశీస్సులు, అభినందనలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజేతలను అభినందిస్తూ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి జిల్లా, రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రజల, ఉద్యోగుల ఆకలి, దాహార్తిని తీర్చడమే లక్ష్యం

జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఆర్వో వాటర్ ప్లాంట్, సబ్సిడీ భోజనశాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ టి. నిశాంతి

పాడేరు,జూలై 27,ప్రభాతవార్త:

ప్రజలకు, ఉద్యోగులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను మరింత మెరుగుపరచాలనే లక్ష్యంతో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ మరియు సబ్సిడీ భోజనశాలను జిల్లా కలెక్టర్ టి. నిశాంతి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కలెక్టరేట్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, ఉద్యోగులు, అర్జీదారులు, బాటసారులు, గ్రామీణ ప్రాంతాల నుంచి విచ్చేసే సందర్శకులకు సురక్షితమైన, స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సౌకర్యం ప్రజల దాహార్తిని తీర్చడంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు, ఉద్యోగులు, నిరుపేదలు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనాన్ని తక్కువ ధరకు, సబ్సిడీపై పొందేందుకు భోజనశాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజల ఆకలి, దాహార్తిని తీర్చడం ప్రభుత్వ బాధ్యత అని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ అన్నారు. ప్రజలందరూ ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు పరిశుభ్రతను పాటించి వాటి నిర్వహణ కు సహకరించాలని ఆమె కోరారు. ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేసిన జిల్లా రెవెన్యూ యంత్రాం గాన్ని, భోజనశాల ఏర్పాటుకు సహకరించిన జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారిణి ఝాన్సీ రామ్ పడాల్, డాక్టర్ డి. ప్రతాప్ కుమార్లను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, ఆర్డీవో ఎం. భుజంగరావు, సర్వ శిక్ష అభియాన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ స్వామినాయుడు, జిల్లా ప్రజా సంబంధాల అధికారిణి కె.అన్నమ్మ, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి పి. ప్రసాద్, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, భోజనశాల నిర్వాహకులు రాజు పాల్గొన్నారు.

విద్యార్థులను వెనక్కి పంపించే ప్రయత్నాలు తక్షణమే వెనక్కి తీసుకోవాలి

పాడేరు ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు

పాడేరు,జూలై27,ప్రభాతవార్త:

విశాఖపట్నం మారికవలస గిరిజన గురుకుల పాఠశాలలో 5,6,7 తరగతుల విద్యార్థులను ప్రభుత్వం వెనక్కి పంపించె ప్రయత్నాలు చేస్తు న్నారు. ఆ నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేయాలని కోరుతూ సోమవారం పాడేరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పాడేరు శాసన సభ్యులు, వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు కీ అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కీ విద్యార్థుల తల్లి తండ్రులు వినతి పత్రం అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఐటీడీఏ కార్యాలయానికి వెళ్లి ఐటీడీఏ పీఓ అందుబాటులో లేకపోవడంతో ఏపీఓ కి వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు, మాజీ ఎమ్మెల్యే ఫాల్గుణ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు నుండి విశాఖపట్నం మరికవలస లో ఉన్న రెసిడెన్షియల్ స్కూల్లో గిరిజన విద్యార్థులు అక్కడ చదువుకొని ఎంతో మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి మంచి అవకాశాలు సాధిస్తున్నారు, అలాంటి తరుణంలో ఇప్పుడు 5,6,7 వ తరగతుల విద్యార్థులకు సుమారు 270 మందికి వెనక్కి పంపించే ప్రయత్నాలు ఈ ప్రభుత్వం చేస్తుందనీ కావున ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని విద్యార్థులకు అక్కడే కొనసాగించాలని ప్రభుత్వ అధికారులకు వారు కోరారు, లేదంటే విద్యార్థులు తల్లి తండ్రులతో పాఠశాలలో ధర్నాలు చేపడతాం అని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు హెచ్చరించారు.

కూటమి పాలనలో ఇంటింటా సంక్షేమ ఫలాలు

అరకులోయ, జులై 27, ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో ప్రతి ఇంటిలోనూ సంక్షేమ ఫలాలు అందాయని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డాక్టర్ సియ్యారి దొన్ను దొర, అరుకు నియోజకవర్గం పరిశీలకులు బుద్ధ నాగ జగదీశ్వరరావు పేర్కొ న్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ యువ నాయకులు నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సోమవారం పద్మాపురం గ్రామంలో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ అభివృద్ధి ఫలాలను వివరించారు. ఏ కుటుంబానికి ఏ స్థాయిలో మేలు జరిగిందన్న విషయాలపై అవగాహన కల్పించారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ పరిశీలకులు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణ లు ముఖ్యఅతిథిలుగా హాజరైన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దొన్ను దొర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో అందించిన సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి అందాయన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, శ్రీ శక్తి, 3 గ్యాస్ సిలిండర్ల ఉచితం, మెగా డీఎస్సీ, రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు అందజేత, గృహ నిర్మాణాలు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్నా క్యాంటీన్లు వంటి పథకాలు ద్వారా ప్రతి ఇంట్లోనూ మేలు జరిగిందన్నారు. ఏ ఇంటికి వెళ్ళినా రెండు మూడు పథకాల రూపంలో వారికి ఆర్థిక సాయం అందిన విషయాన్ని స్వయంగా తెలియజేస్తున్నారు. ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు అందడం శుభ సూచకమన్నారు. ప్రభుత్వం పట్ల ప్రజలు ప్రజలు చాలా కృతజ్ఞతతో ఉన్నారని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన మెజారిటీకి తగ్గట్టుగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారనే భావన కలుగుతుందన్నారు. ఈరోజు తామెల్లిన ప్రతి ఇంట్లోనూ రెండు మూడు పథకాల రూపంలో తమకు ఆర్థిక సాయం అందిందని ప్రజలే స్వయంగా చెబుతున్నారన్నారు. ఇది ఏ రాష్ట్రంలోనూ ఈ మాదిరి ఆర్థిక సాయం పొందిన పరిస్థితి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శతక బొంజి బాబు, వి కొండయ్య, సన్యాసమ్మ, లోకోయి మహదేవ్, ఆనంద్, ఎస్ సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ బీబీ లక్ష్మి, సుబ్బారావు, పాంగి రవీంద్ర, పి.రవిశంకర్ నాయుడు, కల్లోషి, బి వినోద్, మాంధ్య గురుస్వామి, అరకు నియోజకవర్గ మండల ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్ బూత్ ఇన్చార్జిలు, పంచాయతీ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జడ్పిటిసిలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల కంటి ఆరోగ్యానికి పెద్దపీట

శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఉచిత కంటి పరీక్షల శిబిరం : జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు,జూలై37,ప్రభాతవార్త:

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం లోని శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థినుల కోసం సోమవారం ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమా న్ని మొహ్సిన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్ సహకారంతో విశాఖ ఐ హాస్పిటల్ ట్రస్ట్ ఉచితంగా నిర్వహించింది. నిపుణులైన వైద్య బృందం విద్యార్థినులకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తగిన వైద్య సలహాలు అందించడంతో పాటు తదు పరి చికిత్స అవసరమైన విద్యార్థులను గుర్తించి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా నిశాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టి.నిశాంతి మాట్లాడుతూ విద్యార్థులకు చిన్న వయస్సులోనే కంటి సమస్యలను గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడవచ్చని పేర్కొన్నారు. ఈ కంటి పరీక్షల శిబిరంలో మొత్తం 509 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించగా, నలుగురికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించి, ఒక విద్యార్థినిని తదుపరి వైద్యం కోసం రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో డా. పి. శివపార్వతి, ఆప్టోమెట్రిస్టులు కె. లిఖిత, పి. సంధ్య, క్యాంపు ఆర్గనైజర్ ఈ. సాయి కృష్ణ, టెక్నీషియన్ వి.రాజు, డీబీసీఎస్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ డి. వెంకటరావు, పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు, ఎం. మంజుల, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులు కాపాడుటలో చర్చల పేరుతో ప్రభుత్వాలు కాలయాపన

నేటి మంత్రుల సమావేశాన్ని బహిష్కరించే ఆలోచనలో డిఎల్ఓ సంఘాలు

పాడేరు,జూలై27, ప్రభాతవార్త:

ఆదివాసీ హక్కులు, చట్టాలు కాపాడుటలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వాలు చర్చలపేరిట దోబూసులాటలాడుతున్నారని దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షులు కొరియా మార్క్ రాజ్ తీవ్రంగా విమర్శించారు. ప్రజా సంఘాలతో ఎన్ని సార్లు చర్చలు జరుపుతారని ఆయన ప్రశ్నించారు. ఆదివాసి ప్రాంత ఉద్యోగ నియామకాలకు గుండెకాయలాంటి జీఓ నంబర్ 3ను సుప్రీంకోర్టు 2020లో రద్దు చేసిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ ప్రజాగ్రహా నికి గురైన అప్పటి ప్రభుత్వం ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌లో తీర్మానం చేసి కొత్త జీవో తీసుకురాకుండా చేతులు దులుపుకున్నాయని ఆయన విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరకు నియోజకవర్గంతో పాటు వివిధ ప్రాంతాల్లో మాట్లాడుతూ జీఓ నంబర్ 3ను ఇచ్చింది నేనే. మళ్ళీ తెచ్చేది నేనే, జీఓ 3కు ప్రత్యామ్నాయంగా చట్టబద్ధమైన రక్షణ కల్పిస్తాను" అని హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్మిన ఆదివాసీలు ఏజెన్సీ ప్రాంతంలోని ఏడు నియోజకవర్గాల్లో ఐదు నియోజకవర్గాల్లో కూటమికి ఘన విజయం అందించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రభుత్వం మెఘా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపడతామని ప్రకటించినప్పుడు, దండకారణ్య విమోచన సమితి రాష్ట్రవ్యాప్తంగా మెఘా డీఎస్సీ నిర్వహించవచ్చని, అయితే ఏజెన్సీ ప్రాంతంలో మాత్రం జీఓ 3కు ప్రత్యామ్నాయంగా చట్టం చేసిన తరువాతే ప్రత్యేక డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ డిమాండ్‌పై అనేక నిరసన కార్యక్రమాలు కూడా నిర్వహించిందనీ అయన గుర్తు చేశారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి సోషల్ మీడియా (ట్విట్టర్)వేదికగా "గిరిజనులకు అన్యాయం జరగనివ్వను" అని ప్రకటించారు. రంప చోడవరంలో గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శితో, తరువాత అమరావతిలో ముఖ్యమంత్రి కార్యాలయం లో పలు దఫాల చర్చలు నిర్వహించినప్పటికీ ఎటువంటి స్పష్టమైన నిర్ణయం వెలు వడలేదు. ఆ తరువాత ఐఏఎస్ లా బృందం, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ అధికారులు, ట్రైబల్ లీగల్ అడ్వైజరీ కమిటీ ప్రతినిధులు అన్ని ఐటిడీఏల్లో అభిప్రాయ సేకరణ నిర్వహించి ఆదివాసులకు మొండిచేయి చూపించారన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఆరు దఫాల చర్చలు నిర్వహించినప్పటికీ, ఎటువంటి చట్టపరమైన నిర్ణయం తీసు కోకుండా ఆదివాసీలను మభ్యపెడుతూ, మోషం చేస్తూ కాలయాపన చేస్తోందన్నారు. ఈ విషయమై తీవ్రంగా కలత చెందిన ఆదివాసీ యువత నెల 17న పాడేరులో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టిన తరువాత ప్రభుత్వం కొన్ని తనకు అనుకూల సంఘాలను అమరావతికి చర్చల పేరుతో పిలిపించి, ఆ సమావేశాలపై ఎటువంటి ప్రకటన చేయకుండా చేతులు దులుపుకుందన్నారు.మరోసారి ఆదివాసి సంఘాలను చర్చలు ఆహ్వానించడం కూడా కాలయాపనలో భాగమేనని భావిస్తున్న దండకారణ్య విమోచన సమితి, దాని అను బంధ సంఘాలు, చిత్తశుద్ధి లేని బూటకపు చర్చలను బహిష్కరించే ఆలోచనలో ఉన్నామని ప్రకటించాయి.

హుకుంపేటలో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం

హుకుంపేట,జూలై 27,ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలే స్థానిక సంస్థల ఎన్నికల విజయాలకు శోపానాలని అరకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు బుద్ధ నాగ జగదీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమన్ని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శతక బొంజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి ఇంటికి తమ కార్యకర్తలతో వెళ్లి కూటమి ప్రభుత్వం పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతుంది మీ సమస్యలపై తమకు తెలిపాలని తప్పక సమస్యలు పరిష్కరిద్దామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వానికి ఆదరించాలని అభ్యర్థించారు. అరకు నియోజకవర్గం ఇన్చార్జి సియారి దున్నదొర, రాష్ట్ర కనీస వేతనాల డైరెక్టర్ తుడుము సుబ్బారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జాన ప్రకాష్ టిడిపి అరకు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సిరిగం సూర్యకాంతం, సీనియర్ నాయకులు బాకూర్ సర్పంచ్ భాకూరు వెంకటరమణ, టిడిపి ప్రధాన కార్యదర్శి బొడ్డ శ్యామ్, మండల ఉపాధ్యక్షులు లకే, నాగేశ్వరరావు, శోభకోట సర్పంచ్ శశిభూషణం నాయుడు, క్లస్టర్ ఇన్చార్జిలు యూనిటీ ఇన్చార్జిలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి: ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి

గూడెం కొత్తవీధి జులై 27, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ యువకుల సమస్యలను పరిష్కరించి, వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించాలని జి.కె.వీధికి చెందిన నిరుద్యోగి ఎస్. సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోలా బుజ్జిరెడ్డిని కలిసి ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లోని ఎంతోమంది యువతీ యువకులు ఉన్నత చదువులు చదివి, పట్టభద్రులైనప్పటికీ సరైన ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పోస్టులను అర్హత కలిగిన స్థానిక అభ్యర్థులతోనే భర్తీ చేయాలని ఆయన కోరారు. అలాగే వారికి గౌరవప్రదమైన వేతనం అందిస్తూ, ఉద్యోగ భద్రత కల్పించాలని చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు.

చినలబుడులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

అరకు రూరల్, జులై 27, ప్రభాతవార్త



అరకు లోయ మండలం చినలబుడు గ్రామం లో జిల్లా కలెక్టర్ నిశాంతి. టి ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు సోమవారం నాడు అరకులోయ మండలంలోని చినలబుడు గ్రామ పంచాయతీలో ప్రజా ఫిర్యాదు ల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ కార్యక్రమం మండల ప్రత్యేక అధికారి జిల్లా, హార్టికల్చర్ మాదంశెట్టి శ్రీధర్, అరకులోయ ఎంపీడీవో వీసం ప్రసాద్, ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజల నుండి మొత్తం 12 వినతులు స్వీకరించబడ్డాయి. వాటిలో ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ - 2, స్పెషల్ మైనర్ ఇరిగేషన్-2, స్కూల్ ఎడ్యుకేషన్-2, స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు-1, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ-5 వినతులు ఉన్నాయి. అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి, సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి, సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కారం పొందేందుకు పి జిఆర్ఎస్ వేదిక ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇటువంటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ జి రాజశేఖర్, మండల విద్యాశాఖ అధికారి భారతిరత్నం, డిప్యూటీ ఎంపీడీవో కేవీఏ సత్యనారాయణ, ఆర్ బ్ల్యూఎస్ వెంకట్రావు, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ స్వర్ణలత, పంచాయతీ అభివృద్ధి అధికారి బివి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి రోడ్డు పని యంత్రంతో పూర్తి..!

టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్యలకై పీసా ఉపాధ్యక్షుడు డిమాండ్

కొయ్యూరు, జూలై 27 ప్రభాతవార్త

ఉపాధి హామీ చట్టాన్ని అనుసరించి ఉపాధి కూలీలతో చేయించాల్సిన ఓ రోడ్డు పనిని నిబంధనలకు విరుద్ధంగా జెసిబి యంత్రంతో చేయించిన టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లపై తగు చర్య తీసుకోవాల ని ఎంపీడీవో, ఉపాధి ఏపీఓ లకు చీడిపాలెం పిసా కమిటీ ఉపాధ్యక్షుడు దోసపాటి జోగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం చీడి పాలెంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో లిఖితపూర్వకంగా కోరారు. చీడిపాలెం పంచాయతీలోని ములకలపాడు గంగాభవాని పొలం నుండి, వి. రాజబాబు పొలం వరకు నిర్మించిన రోడ్డును ఉపాధి కూలీలతో కాక, జెసిబి అంతరంతో చేయించారని ఆయన ఆరోపించారు. ఉపాధి చట్టానికి వ్యతిరేకంగా యంత్రంతో పని చేయించిన ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్, స్థానిక వీఆర్పీ పై ఉన్నతాధికారులతో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని, డ్రా చేసిన సొమ్మును రికవరీ చేయించాలని కోరారు. ఈ విషయమై విఆర్పి కాకూరు సుధారాణిని వివరణ కోరగా యంత్రాలతో పని చేయించాం అనడంలో వాస్తవం లేదని, ఉపాధి కూలీలతోనే చేయించామని, తన వద్ద ఫోటోల ఆధారాలు ఉన్నాయని తెలిపారు.

శాఖాంబరి అమ్మవారిగా దర్శనమిచ్చిన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు

పాడేరు,జూలై27,ప్రభాతవార్త:

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి ఉమాదేవి అమ్మవారికి సాకాంబరి మహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు సమర్పించిన వివిధ రకాలు కూరగాయలు పండ్లతో అమ్మవార్లకు స్వామి వారికి శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి వారికి ఆకర్షణీయంగా వైభవంగా అలంకరించారు. శాకాంబరీ అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించు కోవడానికి ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. అమ్మవారిని ప్రత్యేక దర్శనాలు చేసుకుంటూ భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శాకాంబరీ ఉత్సవాలతో గిరికైలాస క్షేత్రం కిటకిటలాడింది. ఈ కార్యక్రమం లో ఆలయ ధర్మకర్తలు కొట్టగుల్లి సింహాచలం నాయుడు రమాదేవి దంపతు లు, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల సీతారామశాస్త్రి ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పుల వెంకటరత్నం వైదేహి, కిముడు ప్రభాకరరావు కాత్సాయని కొట్టగుల్లి రామారావు భాగ్యలక్ష్మి, సిద్ధనాతి కొండలలో బొడ్డు ముకుందరావు, వి.రాజుబాబు గాయత్రి, కోనే శివ దాసరి నాగు, శివరాత్రి శ్రీనివాసరావు కొట్టగుల్లి పోతురాజు పొన్నగంటి రవిశంకర్ సత్య వరపు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

బంగారం పేటలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణి

రాష్ట్ర ట్రైకర్ డైరెక్టర్ కూడా కృష్ణారావు

కొయ్యూరు,జులై 27, ప్రభాతవార్త

మండలంలోని బంగారం పేట అంతాడ గ్రామ పంచాయతీలలోని 60 మంది. మహిళలకు వారి యొక్క జీవనోపాధిని పెంపొందించుటకుగాను కుట్టుమిషన్లు ఇస్తూ.కుటుంబ ఆదాయాన్ని పెంపొందించుకోవాలని, ప్రతి ఒక్క మహిళ ప్రభుత్వ సంస్థల సహకారం తీసుకొని ఎదగాలని రాష్ట్ర ట్రైకర్ డైరెక్టర్ కూడా కృష్ణారావు పిలుపునిచ్చారు సోమవారం అంతడలో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ- వీరికి నెల రోజులు ఉచిత, టైలరింగ్ శిక్షణ ఇస్తూ, వారకనుకూలమైన డిజైన్లతో శిక్షణ ఇవ్వుటకు టీచర్లు నియమించి. వారి యొక్క జీవనోపాధిని పెంపొందించుకునేలాగ తయారు చేయాలని జీవం స్వచ్ఛంద సేవా సంస్థ రూరల్ రైస్ ఫౌండేషన్ వారు శిక్షణ అనంతరం సర్టిఫికెట్ కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు. కావున ఈ సదవకాశాన్ని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా డైరెక్టర్ కృష్ణారావు వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి సిగ్గే సన్యాసిరావు. బిజెపి మహిళా మోర్చా నాయకురాలు అన్నపూర్ణ, బంగారం పేట మాజీ సర్పంచ్ పాంగి రాజు, ఎంపిటిసి ఇరువాడ దేవుడు, పీస ఉపాధ్యక్షులు, అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు. మహిళలు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ కు విశ్వసనీయత ఉంటే పదవికి రాజీనామా చేయాలి

అరకు రూరల్, జులై 27, ప్రభాతవార్త

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్‌కు విశ్వసనీయత ఉంటే పదవికి రాజీనామా చేయాలి, డీఎస్సీ అక్రమా లపై కూటమి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహిం చాలి, అరకు మాజీ సమన్వయకర్త మాజీ ఎంపీపీ అరుణ కుమారి, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు నిజమైన చిత్తశుద్ధి ఉంటే డీఎస్సీ అక్రమాలపై బాధ్యత వహిస్తూ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అరకు మాజీ ఎంపీపీ మాజీ సమన్వయకర్త అరుణకుమారి డిమాండ్ చేశారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అక్రమాలకు కేరాఫ్‌గా ఆంధ్రప్రదేశ్ రూపకల్పన చేసారన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగుల పేరుతో డీఎసి తీసి అనర్హులకు ఉద్యోగాలు కట్టబెట్టి తీవ్ర మోసం చేస్తారన్నారు. ఓట్ల సీట్ల కోసం ఎన్నికల సమయంలో దొంగ హామీలతో అధికారములో వచ్చి వారి సొంత ప్రయోజనలే లక్ష్యంగా పనిచేస్తున్నారని విమర్శించారు. ప్రజలకి ఇచ్చిన హామీ అమలు చేయకుండా ఇష్టరాజ్యంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని చెప్పారు. నిరుద్యోగు లకు ఉద్యోగాలు నిరుద్యోగ భృతి పేరుతో నట్టేట ముంచారన్నారు, హామీలు కొండంత, చేసేది గోరంత కూడా లేదన్నారు, రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మోసం చేస్తుందని, రెండేళ్ల పాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేదని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైన నేపథ్యంలో తమ పదవులకు బెసరత్తుగా రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి విశాఖ మాజీ అధికార ప్రతినిధి, అల్లూరి జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పాలు, అరుకు టౌన్ ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్ కుమార్, సీనియర్ నాయకులు శెట్టి సోమేష్, నవీన్ పాల్గొన్నారు.

దివంగత సీనియర్ వైసిపి నేత సోనియా తిరుపతికి శ్రద్ధాంజలి ఘటించిన జెడ్పి చైర్పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు జూలై 27 (ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండల వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కీర్తి శేషులు సోనియా తిరుపతి ఇటీవల గుండెపోటుతో ఆకస్మిక మరణం పొందారు. ఈ నేపథ్యంలో తన స్వగ్రామం ముంచంగిపుట్టు మండల కేంద్రంలో సోమవారం పెద్దకర్మ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్పర్సన్ జల్లిపల్లి. సుభద్ర ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటా మని భరోసా ఇచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మండ లంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏ కార్యక్రమమైనా ఆయన లేకుండా జరిగేది కాదని ప్రతి కార్యక్రమాన్ని తన భుజస్కందాలపై నడిపే వారిని సుభద్ర పేర్కొన్నారు. పార్టీకి ఇటువంటి సేవకులు దొరకడం అరుదన్నారు. పార్టీ పైన జగన్మోహన్ రెడ్డి పైన అత్యంత అభిమానం ఉన్న నేతను కోల్పోవడం బాధించిందన్నారు. ఆయన కుటుంబానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

గంజాయి రహిత అల్లూరి కోసం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ముందుకు రావాలని

హోం మంత్రి వంగలపూడి అనిత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పిలుపు

పాడేరు,జూలై27, ప్రభాతవార్త:



హోంమంత్రివంగలపూడి అనిత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి సోమవారం సాయంత్రం తలరాసింగిలోని సీఏహెచ్ స్కూల్లో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో సమావేశమై, అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా మరియు మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, ముఖ్యంగా యువతలో సామాజిక చైతన్యం పెంపొందించడంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేలా తమ డిజిటల్ వేదికలను వినియోగించాలని, ప్రభుత్వ మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి ప్రజల సహకారం అందేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. సమష్టి కృషి, ప్రజల భాగస్వామ్యంతోనే "గంజాయి రహిత అల్లూరి సీతారామరాజు జిల్లా" లక్ష్యాన్ని సాధించగలమని వారు తెలిపారు. సమావేశంలో ఏపీ పోలీస్ ఈగిల్ టీమ్ జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా మరియు మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అమలు చేస్తున్న చర్యలను వివరించింది. ఈ ఉద్యమానికి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు తోడ్పాటునందిస్తూ, వాస్తవ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం, అవగాహన కల్పించే సృజనాత్మక కంటెంట్ రూపొందించడం, యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రోత్సహించాలని కోరింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు మంత్రులు మరియు ఏపీ పోలీస్ ఈగిల్ టీమ్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, తమ సోషల్ మీడియా వేదికల ద్వారా మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారంలో చురుకుగా పాల్గొని, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఏపీ పోలీస్ ఈగిల్ టీమ్ సభ్యులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు పాల్గొన్నారు.

ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు

ఎలమంచిలి, జూలై 27, ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రవరం 11వ వార్డు గొల్లల కొండపై ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ పిలుపుమేరకు రెండేళ్ల పాలనపై ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రం ఎన్నో సంవత్సరాలకు వెనక్కి వెళ్లిపోయిందని కనీసం నిరుద్యోగులకు ఉపాధి లేకుండా చేసిందని నేడు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నేత మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నో కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటు చేశారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని వాటిని పూర్తిగా ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గొర్లె నానాజీ, ఆదిమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు కోటారు సాంబ, క్లస్టర్ ఇంచార్జిలు బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవికుమార్, జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, నమ్మి రమణ, సేనాపతి రాజా మహేష్, కరెడ్ల మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, సురకాసులు రమణబాబు, నాగేందర్, షేక్ ఖాసిం, పాల్గొన్నారు.

మున్సిపల్ నాన్ పిహెచ్‌సి వర్కర్ల అందరికీ తల్లికి వందన పథకాన్ని అమలు చేయాలి : ఏఐటీయూసీ

ఎలమంచిలి, జూలై 27, ప్రభాతవార్త

మున్సిపాలిటీలో పనిచేస్తున్న నాన్ పిహెచ్చి ఔట్సోర్సింగ్ వర్కర్లకు అందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి) ప్రధాన కార్యదర్శి గని శెట్టి ఏసుదాసు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో నిరసన తెలియజేసి అన అనంతరం మున్సిపల్ కమిషనర్ బివిఎస్ఎన్ ప్రసాద్ రాజుకి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యేసుదాసు మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో వాటర్. ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ ఆపరేటర్స్ బిల్ కలెక్టర్స్, నాన్ పిహెచ్చి, ఔట్సోర్సింగ్ కార్మికులందరికీ కూడా తల్లికి వందన అమలు చేసి ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సభ్యులు పి సూరిబాబు, సతీష్ కుమార్, పి ఎన్ మూర్తి, కుమారి పాల్గొన్నారు.

భూ సర్వేని అడ్డుకున్న గ్రామస్తులు

ఎలమంచిలి, జూలై 27, ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలోని పెద్దపల్లి రామన్న పాలెం మీదుగా 100 అడుగుల రోడ్డు భూ సర్వేను అడ్డుకున్న పెద్దపల్లి రైతులు. రైతులు మాకు ఎటువంటి వివరణ ఇవ్వకుండా భూ సర్వే ఎలా చేస్తారని అసలు భూమి దేనికి తీసుకుంటున్నారు అంటూ ఎవరు తీసుకుంటున్నారు చెప్పకుండా రెవెన్యూ అధికారులు భూ సర్వే ఎలా చేస్తారని అధికారులను రైతులు నిలదీశారు. గ్రామంలోని గ్రామ సభ పెట్టి గ్రామ తీర్మానంలో రైతులందరూ రైతులతో కాంపన్జేషన్ మాట్లాడిన తర్వాతే భూ సర్వే చేయాలని రైతులు ప్రభుత్వాన్ని అధికారులను కోరుతున్నారు.

అమరావతి ఛాంపియన్షిప్- 2026 ఆటల పోటీలు

ఎలమంచిలి, జూలై 27, ప్రభాతవార్త

నియోజకవర్గ అమరావతి ఛాంపియన్షిప్ 2026 ఆటల పోటీలలో భాగంగా ఈనెల 30వ తేదీన షటిల్ బాడ్మింటన్, 31 తేదీన అథ్లెటిక్స్, యోగ, హాకీ పోటీలు పట్టణంలోని గురజాడ అప్పారావు డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించ నున్నట్లు మండల కోఆర్డినేటర్ పీ.డీ.కుందూరు రాజు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్.ఎం వై.వి.రమణ ఆధ్వర్యంలో పీ.డీ.కుందురు రాజు అధ్యక్షతన మండలం వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే ఈ క్రీడలను సమర్ధవంతంగా నిర్వహించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని హెచ్.ఎం.రమణ వ్యాయామ ఉపాధ్యాయులుకు సూచించారు. ఈ కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ సభ్యులు మహేష్, వ్యాయామ ఉపాధ్యాయులు కిషోర్, మూర్తి, సూర్యప్రకాష్, ఆంజనేయులు, విజయ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి, జూలై 27,ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించుకొని సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లి జీవీఎంసీ 82వ వార్డు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని పెదరెల్లి వీధిలో సోమవారం నిర్వహించిన ఇంటింటికి కూటమి ప్రభుత్వం విజయోత్సవ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టిన ముఖ్యమైన కార్యక్రమాలు, అమలు చేసిన పథకాలు, సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర పాల్గొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి సభ్యులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జైలును పరిశీలించిన న్యాయమూర్తి సన్యాసినాయుడు

అనకాపల్లి జూలై 27, ప్రభాతవార్త

అనకాపల్లి సబ్ జైలును న్యాయమూర్తి డిఎల్ఎస్ఎ కార్యదర్శి ఆర్. సన్యాసి నాయుడు పరిశీలించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జైల్లో పరిశీలించారు. నిందితులతో మాట్లాడి ఉచిత న్యాయ సహాయం కోసం సూచనలు ఇచ్చారు. జైల్లో సమస్యలను, ఆహార మెను గురించి అడిగి తెలుసుకున్నారు. జైలు సూపరింటెంట్ కిరణ్, న్యాయ సహాయకులు సాయిరాం, మణి, ఎం.ఎల్.ఎస్.సి ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ స్వామి హుండీ ఆదాయం లెక్కింపు

అనకాపల్లి, జూలై 27, ప్రభాతవార్త

స్థానిక గవరపాలెం అగ్రిమరిచెట్టు వద్ద కొలువైన శ్రీ సుభద్రా బలభద్ర సమేత జగన్నాథ్ స్వామివారి రథయాత్ర మహోత్సవాలు పూర్తి అయిన సందర్భంగా సోమవారం ఆలయ మండపంలో స్వామివారి హుండీ ఆదాయం లెక్కించారు. భక్తులు హుండీ ద్వారా, దర్శనం టికెట్లు ద్వారా పది రోజులకు వచ్చిన ఆదాయం 18.44.366 (18 లక్షల 44 వేల 366 రూపాయలు వచ్చిందని ఆలయ అధికారులు తెలియజేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 3 లక్ష,0 7 వేల 999రూపాయలు ఎక్కువ వచ్చిందని చైర్మన్ ఈవో తెలియజేశారు. ఈ కార్యక్రమం ఆలయ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ కార్య నిర్వహణ అధికారి కె చంద్ర తేజ, బి మురళీ, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ వేళ పట్టణంలో సందడి

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ఎలమంచిలి, జూలై 27, ప్రభాతవార్త

భోగాపురం విమానాశ్రయం ఆగస్టు 1న ప్రారంభం కానున్న నేపథ్యంలో, ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలు హాజరై ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో మొత్తం 40 మంది మహిళలు తమ సృజనాత్మకతను చాటుతూ ఆకర్షణీయమైన రంగురంగుల ముగ్గులతో ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దారు. మహిళల్లోని నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మొదటి, రెండు, మూడవ బహుమతులతో పాటు అదనంగా మరో రెండు కన్సోలేషన్ బహుమతులు అందజేయనున్నట్లు మెప్మా సీఎంఎం పద్మావతి తెలియజేశారు. ఈ ముగ్గుల పోటీల కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, మెప్మా ఐబీ వరలక్ష్మి, మెప్మా సీఓలు, ఆర్పీలు పాల్గొని పోటీలలో పాల్గొన్న మహిళలను ఉత్సాహపరిచారు.

రాష్ట్రపతి పదవికి వన్నెతెచ్చిన అబ్దుల్ కలాం : టిడిపి నేత దాడి రత్నాకర్

అనకాపల్లి, జూలై 27, ప్రభాతవార్త

అనకాపల్లి అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో భారత రక్షణ రంగాన్ని అగ్ర పదంలో నిలిపిన మహోన్నత వ్యక్తి రాష్ట్రపతి పదవికి వన్నెతెచ్చిన మహనీయుడు భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా సోమ వారం తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దాడి రత్నాకర్ మాట్లాడుతూ భారత రాష్ట్రపతి పదవికి ఎంతో వన్నెతెచ్చిన వారని రాష్ట్రపతిగా ఉన్నప్పటికీ కూడా నిరంతరం విద్యార్థులతోనే సమయాన్ని గడిపేవారని అన్నారు. మిస్సైల్ మెన్ ఆఫ్ ఇండియా గా భారత రక్షణ రంగానికి ఎనలేని సేవలు అందించారని అన్నారు. అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేసిన అబ్దుల్ కలాం సేవా సేవా సంస్థ వ్యవస్థాపకులు ఆళ్ల ప్రవీణ్ కుమార్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో దాడి వీరనాయుడు కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్, రేభక మధుబాబు, మొల్లి రమణబాబు, ఆరేపల్లి శ్రీనివాస్ రెడ్డి, పసగాడా నాగేంద్ర, గాజుల రాంబాబు, కాండ్రేగుల శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు కార్యక్రమంలో మహిళలకు ముగ్గుల పోటీలు

గొలుగొండ జూలై 27 ప్రభాతవార్త

ఉత్తరాంధ్ర ప్రజల కలల సహకారం అవుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు ఆగస్టు 1న ప్రారంభించే భోగాపురం విమానాశ్రయం ప్రారంభం సందర్భంగా ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు.మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు అనే కార్యక్రమం ద్వారా డ్వాక్రా మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ప్రతి గ్రామ స్వర్ణ పంచాయతీ వద్ద ముగ్గుల పోటీలు ప్రాముఖ్యతను వివరిస్తూ వాటి నిర్వహణ గురించి తెలియజేస్తూ మహిళల్లో ఉత్సాహాన్ని నింపారు. అంతర్జాతీ య విమానాశ్రయం మన ఉత్తరాంధ్రలో ఇంత భారీగా నెలకొల్పడం ఈ ప్రాంత ప్రజలు గర్వించదగిన విషయమని ఎంపీడీవో పొలపాల శ్రీనివాసరావు అన్నారు. మండల ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లిలు దిద్దారు. పాత మల్లంపేటలో మాజీ సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో గడ్డం ఆనంద్ పర్యవేక్షణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఏపిఎం కరుణానిధి, మండలసమైక్య సభ్యులు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి..

ఎపి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

ఎలమంచిలి, జూలై 27, ప్రభాతవార్త

ఎపి విద్యుత్ రంగంలో 1999-2004 మధ్య నియమితులైన ఉద్యోగులకు జిపిఎఫ్, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎపి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 డిమాండ్ చేసింది. ఈపీఎఫ్ నుండి జిపిఎఫ్‌గా మార్చమని ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విన్నవించిన వినతిపత్రంను శాసనసభ్యులు సుంద రపు విజయ్ కుమార్‌కి క్యాంప్ కార్యాలయంలో అందజేసిన యూనియన్ నాయకులు ఎ.పి.ఎస్.ఇ.బి. విభ జన అనంతరం ఏర్పాటైన ప్రభుత్వ యాజమాన్యంలో ని విద్యుత్ సంస్థల ఉద్యోగులు రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా లభించాల్సిన పెన్షన్ ఇవ్వాలని 1104యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జగన్ 2.0 యాప్ ప్రచార పత్రిక ఆవిష్కరించిన కరణం ధర్మశ్రీ

ఎలమంచిలి, జూలై 27, ప్రభాతవార్త

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జగన్ 2.0 యాప్ ను రూపొందించారని వైయస్సార్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో యాప్ ప్రచార పత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా యాప్లో పొందుపరచాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను సాక్షాలఎతో యాప్లో పొందుపరచాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ ఆస్తులకు ఆటంకం చేస్తే ప్రజా యాప్లో సమస్యను తెలియపరచాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగినట్లయితే వైయస్సార్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని తెలిపారు. వైఎస్ఆర్సిపి పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 2.0 పొందుపరిచిన సమస్యలు, అన్యాయాలు, అక్రమాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పట్టణ రూరల్ అధ్యక్షులు బోద్దపు ఎర్రయ్య దొర, కొల్లి త్రినాధరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రేపు గుప్తా, రాంబిల్లి జడ్పిటిసి దూళి నాగరాజు, కౌన్సిలర్లు దుంగ అచ్యుతరావు, వైఎస్ఆర్సిపి నాయకులు కోటారు కొండబాబు, ఎడ్ల వాసు, పిల్లా త్రినాథ్, దాసరి కుమార్, పోలరౌతు చిన్న నాయుడు, రాజాన శ్రీను, కోడిగుడ్డు రమణ, గొర్ల వెంకట్, పక్కుర్తి శంకర్, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత.. 57 ఫిర్యాదుల స్వీకరణ

అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు

అనకాపల్లి, జూలై 27, ప్రభాతవార్త

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, వారికి భరోసా కల్పించడమే లక్ష్యంగా అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తుందని జిల్లా అదనపు ఎస్పి ఎల్ మోహన్ రావు అన్నారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, మార్గదర్శకత్వంలో సోమవారం జరిగిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు బాధితుల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 57 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో ప్రధానంగా భూ తగాదాలు, ఆస్తి సంబంధిత సమస్యలు కుటుంబ సమస్యలు, భార్యాభర్తల మధ్య కలహాలు, వేధింపులు, మోసపూరిత వ్యవహారాలు, ఆర్థిక నేరాలు, ఇతర ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన అంశాలపై ఫిర్యా దులు స్వీకరించారు. ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం అదనపు ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికా రులతో ఫోన్ ద్వారా మాట్లాడి కీలక సూచనలు చేశారు. ప్రతి ఫిర్యాదుపై 7 రోజుల్లోపు సమగ్ర విచారణ పూర్తి చేయాలని ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా వాస్తవాల ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితులకు చేపట్టిన చర్యల గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, విచారణ అనంతరం తీసుకున్న చర్యల నివేదికను తప్పనిసరిగా జిల్లా కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన న్యాయం అందించడమే పోలీసు యంత్రాంగం ప్రధాన బాధ్యత. ప్రజా సమస్యల పరిష్కారంలో అనకాపల్లి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని అదనపు ఎస్పి ఎల్.మోహన రావు తెలియజేశారు. ఎస్సై ఎస్.ప్రసాద్, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డాక్యుమెంట్ రైటర్ల పెన్ డౌన్



(నక్కపల్లి,ప్రభాతవార్త)

డాక్యుమెంట్ రైటర్ల న్యాయపరమైన కోరికను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కార దిశగా అడుగులు వేయాలని కోరుతూ వారు నిర్వహిస్తున్న పెన్డౌన్ కార్యక్రమంలో డిమాండ్ చేశారు. నక్కపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలోని దస్తావేజు లేఖరుల పెన్డౌన్ కార్యక్రమం సోమవారం నాటికి ఎనిమిదవ రోజుకు చేరింది. ఆర్ఎస్కే సెంటర్లపై వచ్చిన జీవో నెంబర్ 396ను రద్దు చేయాలని, పిపిపి విధానంలో రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటుపరం చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులతో పాటు దస్తావేజులేఖరుల మనుగడ పూర్తిగా మారిపోతుందని, తక్షణమే జీవో రద్దు చేసి దస్తావేజు లేఖరులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు దాతారం మురళీకృష్ణ, కార్యదర్శి బత్తుల శ్రీను, కోశాధికారి లోవరత్నం, సహాయ కార్యదర్శి డిఎంపి కుమార్, త్రినాథ్, నవీన్, నూకరాజు, బొంతు రాజు, ముద్దా బాబ్జి, సాయి తేజ, శేఖర్, మదీనా, బాబ్జి, కొంగర రాంబాబు గోవిందు, రమేషు, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రంగోలి కార్యక్రమం

నక్కపల్లి, ప్రభాతవార్త

ఆగస్టు 1 వ తేదీన భోగాపురం నందు అత్యంత వైభవంగా నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదగా ప్రారంభోత్సవ చేయు సందర్భంగా సోమవారం ఈవెంట్ "ఉత్తరాంధ్ర కళలుకి రెక్కలు"కార్యక్రమంలో భాగంగా రంగోలి కార్యక్రమం నక్కపల్లి మండల పరిషత్ అధికారి చలపతి రావు , దెందుకూరి సీతారామరాజు ల సమక్షంలో వెలుగు ఏపీఎం శ్రీనివాస్, వివోలు ఈ రంగోలి కార్యక్రమం లో భాగంగా ముగ్గులు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వేశారు. ఈ రంగోలిలో మన సంస్కృతి ఉట్టిపడే విధంగా ఏటికొప్పాక లక్కబొమ్మలు, బొబ్బిలి వీణ,భోగాపురం ఎయిర్ పోర్ట్, పొందూరు ఖద్దరు ను మేళవించి ముగ్గులు విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ ముగ్గులు కార్యక్రమంను నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ ,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, పిఎసిఎస్ అధ్యక్షులు వెలగా శ్రీనివాసరావు, గోసల తాతారావు, రాఘవ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు వైబోయిన రమణ తదితరులు రంగోలి ను వీక్షించి సంతోషం వ్యక్తం చేశారు. మన రాష్ట్ర సౌదర్యం ఉట్టిపడే విధంగా వేశారని అభినందించారు. డిప్యూటీ ఎంపీడీవో జ్యోతి ,వెలుగు సీసీలు, వివో ఏలు ఉన్నారు.

స్మశాన వాటిక కప్పేస్తున్నారు చర్యలు తీసుకోండి ..సీఐకి వినతి

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని అమలాపురం పంచాయితీ అమలాపురం గ్రామంలో సశ్మాన స్టీల్ ప్లాంట్ నిర్మాణం పనుల్లో భాగంగా కొంతమంది బయట వ్యక్తులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కప్పేస్తున్నారని తక్షణమే వారిపై చర్య తీసుకోవాలని ఆదివారం సాయంత్రం గ్రామస్తులు సీఐ జూ రెడ్డి మురళికి ఫిర్యాదు చేశారు. స్మశాన వాటిక మధ్యగుండా ప్రక్కనున్న రైతు సూరకాసుల బాబ్జి అనే స్టీల్ ప్లాంట్ కంపెనీకి సంబంధించిన వారు కలసి వాహనముల రాకపోకలకు రోడ్డు వేశారని, అందు వలన కంపెనీకి సంబంధించిన వాహనములు అన్నియూ ఈ మార్గం గుండా రాకపోకలు కొనసాగిస్తున్నాయని, దీని కారణంగా మా గ్రామ ఎవరైనా చనిపోతే దహనం చేసేందుకు తీసుకెళ్లాలంటే తరలించడానికి చాలా కష్టం ఉందని సీఐ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. స్మశాన వాటికిలో ఉన్న సమాధులు ఉన్నాయని, సమాదులను పెకిలించి రోడ్డు వేశారని ఇది చాలా దారుణం అని అన్నారు. ఇది అంతా కంపెనీవారు ప్రక్కనున్న రైతుతో కుమ్మకై వేశారని ఆరోపించారు. కంపెనీకి గాని, ప్రక్కనున్న రైతుకు గాని ఈ స్మశానంకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. మా గ్రామ పెద్దలు ప్రజలు కంపెనీ వారిని, రైతును పిలిపించి అడిగినా మా మీద దౌర్జన్యం చేసి మమ్మల్ని భయ బ్రాంతులకు గురి చేస్తున్నారని ఆ ఫిర్యాదులో గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ విషయంపై అడిగితే ఆడవారిని దుర్భాషలు ఆడుతున్నారని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయితీ రోడ్డు మీద పెద్ద వాహనములు, కంపెనీ వాహనములు వెళ్లడానికి అవకాశం లేదని. కంపెనీకి సంబందిచిన సూపర్ వైజరు దూసి శ్రీను వాహనములు వెళుతున్నాయని వెళ్లడానికి వీలులేదని సీఐ ని కోరారు. ఈ పనులు అన్ని కంపెనీ సూపర్వైజర్ దూసి శ్రీను దౌర్జనంగా జరిపిస్తున్నాడని తక్షణమే తనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ నాయకత్వంలో సీఐ మురళికి గ్రామ పెద్దలు గ్రామాలు చెందిన నాయకులు అందజేశారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

మరణించిన పాడి రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన హెరిటేజ్ డైరీ

రాంబిల్లి, జూలై 27, ప్రభాతవార్త

రాంబిల్లి మండలం మూల కొత్తూరు గ్రామానికి చెందిన హెరిటేజ్ డైరీ పాడి రైతు చీర గంగరాజు సహజ మరణం చెందగా హెరిటేజ్ డైరీ తరుపున నామిని చీర సన్యాసమ్మకు రూ 50 వేల ఆర్థిక సహాయాన్ని హెరిటేజ్ డైరీ మేనేజర్ శేషు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డైరీకి పాలు సరఫరా చేస్తున్నా ప్రతి పాడి రైతు సంక్షేమమే సంస్థ లక్ష్యం అని తెలిపారు. హెరిటేజ్ డైరీకి పాలు పోసే రైతులందరికీ పాడి పశువులకు కేవలం రూ 50కే కృత్రిమ గర్భాధారణ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. హెరిటేజ్ డైరీ కి పాలు సరఫరా ప్రతి గ్రామంలో ఈ సేవలను రైతులకు చేరువ చేస్తున్నామని వివరించారు. అలాగే హెరిటేజ్ ఫిన్లీస్ బ్యాంక్ ద్వారా పాలు సరఫరా చేసే రైతులకు వారి అర్హతమేరకు 24 గంటల్లోనే రుణాలు మంజూరు చేసే సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. రుణం తీసుకున్న రైతు మరణించిన పక్షంలో ఆ రుణాన్ని కుటుంబ సభ్యులు తిరిగి చెల్లించవలసిన అవసరం లేదని సంబంధిత భీమా నిబంధనల ప్రకారం సంస్థ పరిష్కరిస్తుందని పేర్కొన్నారు. హెరిటేజ్ డైరీ కి పాలు సరఫరా చేస్తున్న రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే 2 లక్షలు, సహజ మరణం సంభవిస్తే రూ 50 వేల ఆర్థిక సహాయాన్ని నామినికి అందజేస్తామని తెలిపారు. జిల్లాలోని ఇతర డైరీలతో పోలిస్తే హెరిటేజ్ డైరీ రైతులకు మెరుగైన పాల ధరలు చెల్లిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఊరుకూటి కోటేష్, సత్తిబాబు, ధారబాబు, వరలక్ష్మి ,రామకృష్ణ, సన్యాసిరావు, దేవుడు, త్రినాథ్, నరసమ్మ తదితర పాడి రైతులు పాల్గొన్నారు.

శ్రీ ఉమా ధర్మ లింగేశ్వర స్వామి ఆలయంపై దుష్ప్రచారం చేసిన వారికి కర్మ ఫలితం తప్పదు

శ్రీ శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ ఆగ్రహం -విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్యక్రమం

రాంబిల్లి, జూలై 27, ప్రభాతవార్త

మండలంలో పంచదారల శివారు ధారబోగాపురంలోని శ్రీశ్రీశ్రీ ఉమాధర్మలింగేశ్వర స్వామి దేవాలయానికి ఆనందాశ్రమం పీఠాధిపతులు శ్రీ శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ సోమవారం ఉదయం విచ్చేశారు. ఈ కార్యక్రమాన్ని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రాంబిల్లి మాజీ మండల అధ్యక్షులు వసంతవాడ వెంకటేశ్వర్లు (దినుబాబు) సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ పంచదార్ల క్షేత్రంలో మంచినీటికి బదులు బురద నీరు వస్తుందని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారు. ఆలయ ప్రతిష్ట దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్న వారికి కర్మ ఫలితం తప్పకుండా అనుభవిస్తారు అని తీవ్రంగా హెచ్చరించారు. భక్తులు ఎలాంటి అపోహలు లేకుండా దర్శించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశంలో రాష్ట్ర నేత వీసం

నక్కపల్లి, ప్రభాతవార్త

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు నియోజక వర్గాల బాధ్యులు,మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు విశాఖలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్ వీసం రామకృష్ణ పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో పర్యటన నేపద్యంలో ఆ కార్యక్రమం విజయవంతం పై చర్చించినట్లు రామకృష్ణ తెలిపారు.

కోడిపందాలు శిబిరముపై పోలీసులు దాడి.. ఏడుగురు అరెస్ట్

నక్కపల్లి/కోటవురట్ల, జూలై 27, ప్రభాతవార్త

కోటవురట్ల మండలం, కొడవటిపూడి గ్రామంలో కోడిపందాలు జరుగుతున్నాయని వచ్చిన సమాచారం మేరకు ఎస్సై విజయ్ కుమార్, సిబ్బంది దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 4 కోళ్లు 3,500 స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

పేట నియోజకవర్గం అభివృద్దే లక్ష్యం..

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: హోం మంత్రి "వంగలపూడి అనిత"

(నక్కపల్లి/పాయకరావుపేట, ప్రభాతవార్త)

అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట మండలం పాల్మన్‌పేటలో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హోం మంత్రికి ఘన స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా హారతులతో స్వాగతిస్తూ ఆత్మీయంగా ఆహ్వానించారు.హోం మంత్రి అనిత ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కొత్త పరిశ్రమలను తీసుకొస్తున్నామని తెలిపారు. ఉత్తరాంధ్రను అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పాయకరావుపేట నియోజకవర్గాన్ని పరిశ్రమలు, పర్యాటక రంగాలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో చేపట్టే ప్రతి ముఖ్య కార్యక్రమాన్ని పాల్మన్‌పేట గ్రామం నుంచే ప్రారంభించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో పాల్మన్‌పేట పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని, పాయకరావుపేట సమగ్ర అభివృద్దే తమ లక్ష్యమని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి గ్రామస్తులు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. టిడిపి పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పిఎసిఎస్ అధ్యక్షులు గుర్రం రామకృష్ణలు ఉన్నారు. రంగవల్లి కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రాముఖ్యతని తెలియజేసే విధంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణ కు వచ్చే భక్తులు మాధవస్వామిని దర్శించుకుని తరించండి

మాధవధార, జూలై 27, ప్రభాతవార్త :

సింహాచలం గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులు మాధవ దారిలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాధవస్వామి దేవాలయాన్ని సందర్శించాలని అర్చకులు కోరుతున్నారు. గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులు మాధవధార బస్ స్టాప్ నుంచి జలధారకు వెళ్లే దారిలో ప్రకృతి సహజ సిద్ధమైన ఉన్న జలధారలో స్నానం చేసి వందలాది సంవత్సరాల క్రితం నుంచి ఉన్న మాధవ స్వామి ఆలయాన్ని, భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయాన్ని, వేణుగోపాల స్వామి ఆలయాన్ని సందర్శించాలని కోరుతున్నారు. ఈ ఆలయాలను గిరిప్రదక్షిణలో భాగంగా సందర్శించి స్వామివారి అనుగ్రహం పొందాలని అర్చకులు భక్తులకు పిలుపునిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థానం వారు మాధవస్వామి దేవాలయం వరకు విద్యుత్ దీపాలు, మంచినీరు, మొబైల్ టాయిలెట్స్ వంటి సదుపాయాలు కూడా కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ మాధవస్వామి ఆలయం నుండి సింహాచలానికి వెళ్లేందుకు మెట్ల మార్గం కూడా ఉంది అని, భవిష్యత్తులో ఎప్పుడైనా భక్తులు ఈ మెట్ల మార్గం ద్వారా ప్రయాణించి అనుభూతిని కూడా పొందాలని కోరుతున్నారు.

ఇంటింటికీ కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రచారం

ఆనందపురం, జూలై 27, ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన ఇంటింటి ప్రచార కార్యక్రమం ఆనందపురం మండలం ఎల్‌వి పాలెం గ్రామంలో సోమవారం ప్రారంభమైంది. భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 45 రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రచారంలో ప్రతి ఇంటిని సందర్శించి కూటమి ప్రభుత్వ రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మీసాల సత్యనారాయణ, బిమ్మిడి సూర్యనారాయణ, బమ్మిడి తారక్, లొడగల వెంకట్రావు, లొడగల రమణ, జనసేన పార్టీ అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు, బీజేపీ కన్వీనర్ ప్రసాదరావు పట్నాయక్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

13వ వార్డులో ఉత్సాహంగా తెదేపా శ్రేణులు ఇంటింటా ప్రచారం

ఆరిలోవ, జూలై 27, ప్రభాతవార్త:

తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు పిలుపు మేరకు స్థానిక 13వ వార్డు సెక్టర్ 4, వెర్ని దుర్గా నగర్ లో సోమవారం వార్డ్ అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు ఆధ్వర్యంలో ఉత్సాహంగా ఇంటింటికి తెలుగుదేశం పార్టీ ప్రచారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు ఏళ్ల కాలంలో చేసిన అభివృద్ధి, సాధించిన ప్రగతి, సంక్షేమ పథకాలు తెలియజేస్తూ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు "ఇది మంచి ప్రభుత్వం" అని హర్షం వ్యక్తం చేస్తూ యువకులకు మంచి ఉపాధి అవకాశాలు ఏర్పడాలంటే రానున్న కాలంలో కూడా కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత, విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి పాత్రకండ ధర్మారావు, వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, సీనియర్ నాయకులు యల్లమిల్లి సురేష్, వార్డు ఉపాధ్యక్షులు మారిక జక్కన్న, బాయిశెట్టి యోగి, మజ్జి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మేడికవర్‌లో అత్యాధునిక ఇంటర్‌వెన్షనల్ పల్మోనాలజీ సూట్ ప్రారంభం

ఊపిరితిత్తుల వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో కొత్త అధ్యాయం: డాక్టర్ ప్రేమ్ కుమార్

ఆరిలోవ, జూలై 27 (ప్రభాతవార్త):

ఎంవీపీ మెడికవర్ హాస్పిటల్స్‌లో రాష్ట్రంలోనే అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ ఇంటర్‌వెన్షనల్ పల్మోనాలజీ సూట్ ద్వారా ఊపిరితిత్తుల వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్లు పల్మోనాలజీ నిపుణులు డాక్టర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సదుపాయం ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వచ్చే రోగులకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్లుగా డాక్టర్ సుధీర్, డాక్టర్ మోనిష, డాక్టర్ సత్యపద్మజతో కలిసి నిపుణుల బృందంగా పనిచేస్తూ క్లిష్టమైన కేసులకు సమగ్ర చికిత్స అందిస్తున్నామని తెలిపారు. గతంలో టిబి, రెస్పిరేటరీ మెడిసిన్‌కే పరిమితమైన పల్మోనాలజీ ప్రస్తుతం స్లీప్ మెడిసిన్, క్రిటికల్ కేర్, ఇంటర్‌వెన్షనల్ పల్మోనాలజీ వంటి ప్రత్యేక విభాగాలుగా విస్తరించిందన్నారు. కొత్తగా ప్రారంభించిన సూట్‌లో బ్రోంకోస్కోపీ ద్వారా ఐసీయూ రోగుల నుంచి నమూనాలు సేకరించి, బయోఫైర్ పరీక్షల సహాయంతో నాలుగు నుంచి ఆరు గంటల్లోనే ఇన్ఫెక్షన్ కారకాలను గుర్తించే అత్యాధునిక సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని వివరించారు. ఈ సమావేశంలో డాక్టర్ సుధీర్, డాక్టర్ మోనిష, డాక్టర్ సత్యపద్మజ, సెంటర్ హెడ్ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భద్రయ్య పేట గ్రామంలో మూతపడిన మంచినీటి ఆర్వో ప్లాంట్

పద్మనాభం, జూలై 27, ప్రభాతవార్త:

మండలంలో భద్రయ్యపేట గ్రామంలో లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన మంచినీటి ఆర్వోప్లాంట్ అధికారులు నిర్లక్ష్యం వల్ల మూత పడింది. దీంతో గ్రామ ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గ్రామంలో పలువురు కిడ్నీ వ్యాధిగ్రస్తులు కావడంతో పలు పత్రికల్లో వచ్చిన కథనాలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించి వైజాగ్ రోటరీ క్లబ్ సహాయంతో గ్రామంలో ఈ ఆర్వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. అయితే ఈ ప్లాంట్ నెలరోజులు పనిచేసి పడకేసింది. దీనిపై గ్రామ సచివాలయ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఈ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో గ్రామ ప్రజలు తాగునీటికీ అనేక ఇబ్బందులు పడుతున్నారు. లక్షల రూపాయల ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఈ ప్లాంటు అధికారులు నిర్లక్ష్యంతో లక్ష్యం నెరవేరలేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు.

పిల్లలు కంటి చూపుపై అవగాహన అవసరం

ఆరిలోవ, జూలై 27, ప్రభాతవార్త

పిల్లలు బ్లాక్ బోర్డు పైన అక్షరాలు చదవటానికి ఇబ్బంది పడటం లేదా దూరపు వస్తువులను కళ్ళు చిట్లించి చూడటం చేస్తుంటే పిల్లవాడికి కనిపించటం లేదు కళ్ళద్దాలు అవసరం అనుకుంటారు కానీ నిజానికి ఇది మయోపియా (దగ్గర దృష్టి) ప్రారంభానికి సంకేతం కావచ్చునని ఎల్ఎల్ వి ప్రసాద్ కన్సల్టెంట్ ఆప్తమాలాజిస్ట్ జ్యోత్స్న కళ సూచించారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా పిల్లలను ప్రభావితం చేస్తున్న నేత్ర సమస్య అని తెలిపారు. మయోపియా వ్యాధికి సరియైన కారణాలు లేవని ఇది జన్యుపరంగా లేదా పర్యావరణం వలన సంభవించ వచ్చునని నేత్ర వైద్యులు తెలిపారు. ఈ మయోపియా వ్యాధి గురించి తల్లితండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండటం అవసరమన్నారు. ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల మయోపియా నేత్ర సమస్యలపైన అవగాహన కార్యక్రమంలో సందర్భంగా ఆమె మాట్లాడారు. డిజిటల్ వస్తువులు వాడకం, డిజిటల్ పరికరాలపై చదవడం, మయోపియాకు కారణం అవుతున్నాయన్నారు.

నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలి

నారా లోకేష్ రాజీనామా చేయాలి

డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలి: వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జి.వి. రామచంద్రరావు

విశాఖపట్నం, జూలై 27 (ప్రభాతవార్త):

మెగా డీఎస్సీ నిర్వహణలో భారీ అవకతవ కలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జి.వి. రామచంద్రరావు డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పార్టీ ముఖ్య నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ నియామక ప్రక్రియలో జరిగిన అక్రమాలకు సంబం ధించి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికే సాక్ష్యాధా రాలతో ప్రభుత్వ దృష్టికి తీసుకువ చ్చారని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి విచారణకు ఆదేశం చకపో వడం పలు అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు.

సాక్ష్యాధారాలు ఉన్నా చర్యలు ఎందుకు?

డీఎస్సీ అవకతవకలకు సంబంధించిన ఆధారాలు సమర్పించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం వెనుక కారణం ఏమిటని జి.వి. రామచంద్రరావు ప్రశ్నించారు. 'తమ తప్పులు బయటపడతాయనే భయంతోనే ప్రభుత్వం విచారణకు వెనుకాడుతోంది. అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుకోవడం దారుణం' అని ఆయన విమర్శించారు.

సీబీఐతో సమగ్ర విచారణ జరపాలి

డీఎస్సీ అక్రమాలపై మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని, మొత్తం వ్యవహారంపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కష్టపడి చదివిన నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా ప్రభుత్వం పారదర్శకంగా తదుపరి చర్యలు చేపట్టాలని కోరారు.

నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటం

లక్షలాది మంది నిరుద్యోగులు రాత్రింబవళ్లు శ్రమించి డీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యారని, అయితే నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించడం వల్ల అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడితే వైఎస్ఆర్‌సీపీ చూస్తూ ఊరుకోదని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. డీఎస్సీ అవకతవకలపై ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని జి.వి.రామచంద్రరావు హెచ్చరించారు.

భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి జన సమీకరణపై కూటమి నేతల సమీక్ష

ఆనందపురం, జూలై 27, ప్రభాతవార్త:

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలను సమీకరించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆనందపురం మండల కేంద్రంలో కూటమి నాయకులు, అధికారులు సోమ వారం సమావేశమయ్యారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నియో జకవర్గ ఇన్‌చార్జి విజయబాబు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరగనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆనందపురం మండలం లోని 26 గ్రామపంచాయతీల నుంచి ప్రజల ను పెద్ద ఎత్తున తరలించే అంశంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి అధికసంఖ్యలో ప్రజల భాగస్వామ్యాన్ని నిర్ధారించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు మంచినీరు, భోజనం, రవాణా, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలపై అధికారులు, నాయకులు చర్చించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశం లో మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, క్లస్టర్ ఇన్‌చార్జి మీసాల సత్యనారా యణ, జనసేన మండల అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు, బీజేపీ కన్వీనర్ ప్రసాద రావు పట్నాయక్, డిప్యూటీ ఎంపీడీవో బాబి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, ఇతర అధికారులు, 26 గ్రామపంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు.

సీదిరి అప్పలరాజు అరెస్టు రాజకీయ కక్షసాధింపే

కేసులు ఉపసంహరించి వెంటనే విడుదల చేయాలి: వాసుపల్లి జానకిరామ్

విశాఖపట్నం, జూలై 27, ప్రభాతవార్త:

మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అరెస్టు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని జాతీయ మత్స్యకార సంఘం గౌరవ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఆరోపించారు. సోమవారం విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన ఆయన, ప్రమాదానికి బాధ్యులపై చట్టపరమైన చర్యలను తాము వ్యతిరేకించడం లేదన్నారు. అయితే ఘటన సమయంలో అక్కడ లేని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై కూడా తీవ్ర సెక్షన్లు నమోదు చేసి అరెస్టు చేయడం రాజకీయ ఉద్దేశంతోనే జరిగిందని ఆరోపించారు. సీదిరి అప్పలరాజు వైద్యుడిగా, మత్స్యశాఖ మంత్రిగా మత్స్యకారుల సంక్షేమానికి విశేష సేవలు అందించారని పేర్కొన్న జానకిరామ్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయనను రాజకీయంగా అణచివేసేందుకు కుట్రపూరితంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. పలాసలో బలమైన బీసీ నాయకత్వాన్ని బలహీనపర్చడమే ఈ చర్యల వెనుక ఉద్దేశమని ఆరోపించారు. మత్స్యకారులు, యాదవుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు ఫలించవని, 2029 ఎన్నికల్లో మత్స్యకారులు తగిన సమాధానం ఇస్తారని అన్నారు. మత్స్యకార నాయకుడు తెడ్డు శంకర్ మాట్లాడుతూ, మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదులో కూడా ఇది ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదమేనని పేర్కొన్నారని, అయినప్పటికీ సీదిరి అప్పలరాజును అదే కేసులో అరెస్టు చేయడం రాజకీయ కక్షసాధింపేనని ఆరోపించారు. అడ్వకేట్, మత్స్యకార నాయకుడు తెడ్డు తాతారావు మాట్లాడుతూ, బెయిల్‌కు అవకాశం ఉన్న కేసుల్లో కూడా ఉద్దేశపూర్వకంగా అరెస్టులు చేసి జైలుకు పంపించడం చట్ట స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. రాజకీయాలకు అతీతంగా మత్స్యకార సమాజం మొత్తం ఈ అరెస్టును వ్యతిరేకిస్తోందని, చట్టాన్ని రాజకీయ ప్రత్యర్థులను వేధించే సాధనంగా ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకుని, ఆయనను తక్షణమే జైలు నుంచి విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మత్స్యకార నాయకులు కాసారపు వెంకటేశ్వరరావు, దూడ పోలయ్య, బడే ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'సెయింట్ ఆన్స్ ఫీస్ట్'

గాజువాక,జూలై 27,ప్రభాతవార్త :

యేసుక్రీస్తు అమ్మమ్మ సెయింట్ ఆన్ జన్మదినం (జూలై 26) సందర్భంగా మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో వారం రోజులుగా నిర్వహించిన 'సెయింట్ ఆన్స్ ఫీస్ట్' వేడుకలు ఘనంగా ముగిశాయి. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకోగా, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యం లో గాజువాక, పెందుర్తి, జ్ఞానాపురం, ఎండాడ ఆశ్రమాల్లో పండ్లు, నిత్యవసరాలు పంపిణీ చేశారు. విశ్వాసంతో అద్భుతాలు సాధించవ చ్చని, సేవా గుణంతో దేవుని కృప లభిస్తుందని సెయింట్ జోసెఫ్ చర్చి ఫాదర్ రెవరెండ్ జీవన్ బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో కరస్పాం డెంట్ సిస్టర్ గెసిల్లా, డిగ్రీ ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జూనియర్ ప్రిన్సిపాల్ సిస్టర్ క్యాస్లిన్, ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఛలో తర్లువాడకు వెళ్తున్న వామపక్ష నేతల అరెస్ట్

ఆనందపురం, జూలై 27, ప్రభాతవార్త:

ఆనందపురం మండలం తర్లు వాడ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న అధానీ గూగుల్ డేటా సెంటర్ భూ సమస్యలపై రైతులను కలిసేందుకు వెళ్తున్న సీపీఐ సిపిఎం తదితర వామపక్ష పార్టీల నాయకులను పోలీసులు సోమవారం మార్గమధ్యం లో ఆనందపురం పెందుర్తి జాతీయ రహదారి తర్లువాడ జంక్షన్లో అదుపు లోకి తీసుకుని ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తర్లువాడలో సమావేశం నిర్వహించకుండా ముందస్తు అరెస్టులు వామపక్ష నేతలు తీవ్రం గా ఖండించారు. ఈ సందర్భంగా సిపిఐ సిపిఎం నాయకులు కె.లోకనాదం, ఎం పైడి రాజు, బి.గంగారావు, ఎస్ కె.రహి మాన్, ఎం.జగ్గునాయుడు, ఎ.విమల మాట్లాడుతూ నాయకులను స్టేషన్ కు తరలించడంతో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై వామపక్ష నాయకులు పోలీసుల చర్యను ఖండిస్తూ, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. డేటా సెంటర్లు వద్దని దేశ విదేశాల్లో ప్రజలు వ్యతిరేకించారని మన దేశంలోనే అది ఆంధ్రప్రదేశ్ లోనే పెడుతున్నారని అంత విలువైన డేటా సెంటర్లు ఐతే అమరావతిలో ఎందుకు పెట్టరని వామపక్ష నేతలు విమర్శించారు విశాఖ జిల్లా, ఉత్తరాంధ్రలోనే రసా యిన పరిశ్రమలు డేటా సెంటర్లు పెట్టి అమాయక ఉత్తరాంధ్ర ప్రజలు జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సిపిఎం నాయకులు కె సత్యాంజనేయ, ఆర్ ఎస్ ఎన్ మూర్తి, కె వనజాక్షి, ఎం.డి బేగం, ఎం.మన్మధరావు ఆర్ శ్రీనివాసరావు, తదితరులతో పాటు సిపిఐ సిపిఎం ఇతర వామపక్ష పార్టీలు నాయకులు పాల్గొన్నారు.

భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవ పీఎం సభను విజయవంతం చేయాలి

పద్మనాభం, జూలై 27, ప్రభాతవార్త:

వచ్చేనెల 1వ తేదీన భోగాపురంలో జరగనున్న ఎయిర్పోర్ట్ ప్రారంభో త్సవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలని అధికారులు, నాయకులు కోరారు. సోమవారము మండల పరిషత్ కార్యాలయంలో పీఎం సభకు ప్రజలను తరలించే విషయంపై ఏర్పాటు చేసిన అధికారులు, నాయకుల సమన్వయ సమావేశంలో ఎండిఓ చెన్నారావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు కె దామోదర్ రావు, పీఎం సభ పద్మనాభం ఇన్చార్జి రాష్ట్ర కృష్ణ బలిజి కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు , మండల టిడిపి అధ్యక్షులు కే రమణ మాట్లాడారు. మండలంలో ఉన్న 22 గ్రామపంచాయతీలకు ప్రభుత్వము 100 బస్సులను ఏర్పాటు చేసిందని, ఈ బస్సుల ద్వారా మండలం నుండి 5000 మంది తరలించడానికి అందరూ కృషి చేయాలని వారు కోరారు. ఈ బస్సులు ఒకరోజు ముందుగానే ఆయా గ్రామాలకు చేరుకుంటాయని వారన్నారు. ప్రజలకు ప్రభుత్వము అల్పాహారము ఏర్పాటు చేసిందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో అనంత పద్మనాభ స్వామి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు గోపి బాబు, నాయకులు గంగరాజు, అప్పలనాయుడు, ఎర్రి నాయుడు, మండల అధికారులు పాల్గొన్నారు.

భారతదేశానికి గర్వకారణం అబ్దుల్ కలాం

ఆనందపురం, జూలై 27, ప్రభాతవార్త:

భారతదేశపు మాజీ రాష్ట్రపతి ప్రముఖ శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆనందపురం వేములవలస కూడలి ఉత్తరాంధ్ర ఆర్ఎంపి జోనల్ కార్యాలయంలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి మాట్లాడుతూ, భారతదేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగంలో దిక్సూచిగా నిలిపిన మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం మిసైల్ మాన్, పీపుల్స్ ప్రెసిడెంట్ గా పేరుగాంచిన అబ్దుల్ కలాం కలలు కనండి ఆ కలలు సహకారం చేసుకోండి. అనే వారి మాటలను స్ఫూర్తి గా తీసుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి గద్ద చిరంజీవి, జోనల్ అడ్వైజర్ కోన ప్రకాష్, జోనల్ జాయింట్ సెక్రెటరీ కెవెన్ రావు, జిల్లా ప్రచార కార్యదర్శి వినోద్ కుమార్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రామ కోటేశ్వరరావు, మండల కార్యవర్గ సభ్యులు గోట్టుముక్కల రఘు, పద్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు

భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం వేళ.. గాజువాకలో కూటమి నేతలు సంబరాలు

గాజువాక,జూలై 27,ప్రభాతవార్త :

భోగాపురం శ్రీ అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న నేపథ్యంలో గాజువాకలో సోమవారం కూటమి నేతలు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాతగాజువాక కూడలిలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాజపా నేత కరణంరెడ్డి నరసింగరావు, జనసేన ఇన్ ఛార్జ్ కోన తాతారావు మాట్లాడుతూ.. అత్యాధునిక వసతులతో రూపుదిద్దుకున్న ఈ విమానాశ్రయం 'గేట్‌వే ఆఫ్ ఉత్తరాంధ్ర'గా నిలవనుందని, ప్రాంతీయ అభివృద్ధికి, స్థానిక యువత ఉపాధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్ట్‌కు మన్యం వీరుడు అల్లూరి పేరు పెట్టడం సంతోషకరమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రధాని మోదీకి 3 లక్షల మందితో ఘన స్వాగతం పలకనున్నట్లు చెప్పారు. అలాగే 13 వేల మంది గిరిజన కళాకారులతో నృత్య ప్రదర్శన నిర్వహించి ప్రపంచ రికార్డు సృష్టించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకుడు ప్రసాదుల శ్రీనివాసరావు, భాజపా నేతలు కృష్ణంరాజు,మాజీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, మాజీ కార్పొరేటర్లు పల్లా చిరంజీవి, గంధం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నాపురం జంక్షన్ నుండి కొయ్యపేట, చిన్నాపురం వరకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

పద్మనాభం, జూలై 27, ప్రభాతవార్త:

మండలంలో చిన్నాపురం జంక్షన్ నుండికొయ్యిపేట, నేరలవలస, చిన్నాపురం గ్రామాల వరకు ఉన్న రోడ్డుకి ఇరువైపులా వీధిలైట్లను ఏర్పాటు చేయాలని చిన్నాపురం మాజీ సర్పంచ్ ఈగల శ్రీరామమూర్తి, కొయ్యిపేట టిడిపి నాయకులు కృష్ణ, చంద్ర రావు అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరారు. అయితే చిన్నాపురం జంక్షన్ నుండి ఆయా గ్రామాల వరకు ఉన్న సుమారు రెండు కిలోమీటర్ల పొ డవునా రోడ్డుకి ఇరువైపులా పూర్వం నుంచి వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు ముఖ్యంగా విద్యార్థులు, కార్మికులు ఇంటికి చేరే సమయంలో రోడ్డు చీకటిగా ఉండడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు, ఎందరు ప్రజాప్రతినిధులు మారిన ఈ వీధి లైట్లు సంగతి పట్టించుకోలేదని వారు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ వీధిలైట్లు విషయమై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చిన్నాపురం జంక్షన్ నుండి కొయ్యపేట వరకు రోడ్డుకు ఇరువైపులా వీధిలైట్లు వేయాలని వారు కోరుతున్నారు.

इंडियन बैंक
ఇండియన్ బ్యాంక్

శ్రీహరిపురం బ్రాంచ్, జిఆర్ కన్‌స్ట్రక్షన్స్ భవనం క్రింది అంతస్తు, జివిఎంసి గ్రౌండ్ వెనుక, శ్రీహరిపురం, విశాఖపట్నం - 530011. మొబైల్ : 8712689319

బంగారు నగల వేలము నోటీసు

ఈ దిగువ ఉదహరించిన వ్యక్తులు బంగారు నగల హామీపై మా బ్యాంకు తాలూకా దిగువ దాఖలా నందు అప్పు తీసుకుని బ్యాంకు నిబంధనల ప్రకారం అప్పు తీర్చనందున, వారి బకాయి చెల్లించి వారి యొక్క నగలు విడిపించుకోవలసిందిగా కోరుచూ నోటీసు ద్వారా తెలియజేసినప్పటికినీ వారు ప్రతిస్పందించనందున, సదరు బంగారు నగలు ది.04-08-2026, మంగళవారం మధ్యాహ్నం గం॥ 3-30 లకు మా బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమకట్టుకొనబడును. వేలములో పాల్గొనదలచినవారు ది.04-08-2026 మధ్యాహ్నం 3 గం॥లలోపు రూ.10,000/-లు ధరావత్తుగా చెల్లించవలయును. ఎట్టికారణము చూపకనే వేలమును రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము వేసినా కూడా బకాయిలు రద్దుకాని యెడల మిగిలిన బకాయి మరియు ఇతర ఖర్చుల కొరకు వారిపై చట్టరీత్యా తగుచర్య తీసుకొని మిగిలిన బకాయిలను వసూలు చేయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించినయెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

క్రమ సంఖ్య	ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	నిలువు తూకం మొత్తం గ్రాములలో
1.	7529722709	బంగారు సబిత, 71-31-1400/ఎ, కాకర్లలోవ, గాంధీనగరం, పెదగంట్యాడ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్	3.45
2.	7695181563	మంతుర్తి ప్రశాంత్, 59-4-6, ప్రియదర్శిని కాలనీ, మల్కాపురం, విశాఖపట్నం	4.00
3.	7726889244		3.50
4.	7752373307		21.70

ప్రదేశం : విశాఖపట్నం
తేది : 27-07-2026
సం/- బ్రాంచ్ మేనేజర్, ఇండియన్ బ్యాంక్, శ్రీహరిపురం శాఖ

కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ
A Government of India Undertaking

ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నం-I
డి.నెం.9-29-15/7, పద్మావతి టవర్స్, బాలాజీనగర్, సిరిపురం, విశాఖపట్నం-530003. ఫోన్: 83310 36926

హైపోథికేషన్ అగ్రిమెంట్ ప్రకారం బ్యాంకుకి సెక్యూరిటీగా హైపోథికేట్ చేసిన మెషినరీస్ అమ్మకం కొరకు వేలం అమ్మకం ప్రకటన

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న, బ్యాంకుకి హైపోథికేటెడ్/ఛార్జి చేసిన దిగువ వివరించిన మెషినరీను హైపోథికేషన్ అగ్రిమెంట్ 11(C) ప్రకారం తేది 03-08-2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది.

వేలం తేది & సమయం: 03-08-2026, సా॥ 4:00 గం.ల నుండి సా॥ 04:30 గం. వరకు

రిజర్వు ధరలో 10% మేర ఉండే EMD మొత్తాన్ని, అధీకృత అధికారి, కెనరా బ్యాంక్, చినవాల్తేర్ బ్రాంచ్ పేరున డిమాండ్ డ్రాఫ్ట్ (DD) ద్వారా గానీ, లేదా కెనరా బ్యాంక్, చిన్నవాల్తేరు బ్రాంచ్ ఖాతా (A/c No. 209272434, IFSC Code CNRB0013582) కు RTGS/NEFT/ఫండ్ బదిలీ ద్వారా గాని తేది.02-08-2026 సాయంత్రం 4:00 గం॥ల లోపు జమ చేయాలి.

కెనరా బ్యాంక్, చినవాల్తేర్ బ్రాంచ్, ఫోన్: 99854 17389 & 83310 19134

ఋణగ్రహీతలు : 1) శ్రీ బొడ్డేపల్లి సూర్యనారాయణ, తండ్రి: నరసయ్య, డి.నెం.39-19-53/4, మాధవధార, రామాలయం వీధి, విశాఖపట్నం-530007. 2) శ్రీ బొడ్డేపల్లి అమర్నాథ్, తండ్రి: నరసయ్య, డి నెం.39-19-53/3, మాధవధార, విశాఖపట్నం-530007.

Sl	Movables (Items Description)			
1	DESCRIPTION OF ITEMS	QTY	DESCRIPTION OF ITEMS	QTY
	Almarah	2	Mixer	1
	Plywood Bed (4x6) with fixers and mattress	1	Iron Utility Stand	1
	Iron chair foldable	1	Rice Drum	1
	REFRIGERATOR	1	Gas Cylenders	1
	Plastic chairs	3	Total kitchen vessels	1 Set
	Sealing Fans	3	Dressing Table	1
	Stove	1	Luggage Bags	5
	Plywood 6x6 Bed with all accessories and matrises	1	Plastic Bucket	1
	1.5 T AC	1	Jute Bag	1
	DRESSING TABLE	1	White Jute Bag	1
	TABLE	1	Mat jute bag	1
	Plastic stools	2	Hall Box	1
	Grinder	1	Demudu samanulu	1
	Wooden Table	1		

రిజర్వు ధర: రూ. 18,000/- ధరావత్తు సొమ్ము: రూ. 5,000/-

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలు కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, చిన్నవాల్తేర్ బ్రాంచ్ మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 99854 17389 & 83310 19134.

తేది: 17-07-2026, ప్రదేశం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

28-7Pg7exHMNWJQE.qxd:28-7Pg7exHMNWJQE.qxd 1/1/02 7:06 AM Page 1

చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి

• ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సుమన్



సుమన్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎఇఒ రవీంద్రబాబు

కాణిపాకం, జులై 27 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎపి ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరక్టర్, ప్రముఖ హీరో సుమన్ అన్నారు. ఇటీవల ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరక్టర్‌గా నియమితులైన సుమన్ సోమవారం జిల్లా ఈడిగ సంఘం నాయకులతో కలసి ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుమారు 11 భాషల్లో వెయ్యికి పైగా చిత్రాల్లో నటించి 45యేళ్ళ సుదీర్ఘ అనుభవం వున్న తనను ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరక్టర్‌గా నియమించడం అనందంగా వుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని చలనచిత్ర నిర్మాతల సౌకర్యార్థం విజయవాడలో రీరికార్డింగ్, డబ్బింగ్ థియేటర్లును ఏర్పాటు చేయాల్సిన అవసరం వుందన్నారు. అలాగే సినిమా షూటింగ్‌ల కోసం తిరుపతి, తలకోన పరిసర ప్రాంతాల్లో లొకేషన్‌లను అభివృద్ధి చేయాల్సిన అవసరం వుందన్నారు. ముఖ్య ంగా ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయను తమిళనాడులోని ఊటి తరహాలో ఉద్యానవనాలను అభివృద్ధి చేస్తే సినిమా షూటింగ్‌లకు ఎంతో అనువుంగా వుంటుందన్నారు. అలాగే ప్రభుత్వ లొకేషన్‌లను చిన న్న చిత్రాలు నిర్మించే నిర్మాతలకు ఉచితంగా ఇవ్వడంతో పాటు చలన చిత్రపరిశ్రమను ఆదుకునేందుకు పట్టణాల్లోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద చిన్నతరహా సినిమా థియేటర్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని సుమన్ తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన ఈడిగ కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చి వారి అభివృద్ధికి అన్ని రకాలుగా ప్రభుత్వం తోడ్పాటు అందించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు.

శాకంబరిగా దుర్గమ్మ అనుగ్రహం

• ఇంద్రకీలాద్రిలో శాకంబరి ఉత్సవాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి, జులై 27 ప్రభాతవార్త: శాకంభరీ నమోస్తుతే అంటూ భక్తుల జయజయ నాదాల నడుమ కూరగాయలు, పండ్లు అలంకారంతో దుర్గమ్మ శాకంబరి మాతగా అనుగ్రహించారు. ఇంద్రకీలాద్రిపై వైభవంగా శాకంబరి ఉత్సవాలు సోమవారం ప్రారంభమైనాయి. జగన్మాత, అమ్మవారు ఈ సంవత్సరం పచ్చి వేరుసెనగ కాయల దండ, యాలకుల దండ, పుదీనా దండలు మెడలో ధరించి ప్రత్యేక ఆకర్షణగా భక్తులకు దర్శనమిచ్చారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు ఈనెల 29తో ముగుస్తాయని ఇఒ తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పూజాదికాల్లో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ వికె శీనా నాయక్ పాల్గొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల నుండి ఈ ఉత్సవానికి భక్తులు తరలివచ్చారు. ఆలయ అలంకరణ, కదంబం ప్రసాదం తయారీ నిమిత్తం సుమారు 45టన్నుల కూరగాయల వినియోగించారు. ప్రధాన ఆలయంలో శ్రీ కనకదుర్గ అమ్మ, మహా మండపంలో ఉత్సవర్లు, ఉపాలయాలల్లో దేవతా మూర్తులందరూ హరిత వర్ణంతో విరాజిల్లుతు భక్తులను అనుగ్రహించారు.

భక్తులకు కదంబ ప్రసాదం పంపిణీ: శాకంబరి ఉత్సవాల్లో భక్తులకు ఆయా కూరగాయలతో తయారు చేసిన కదంబం ప్రసాదాన్ని ఇఒ వికె శీనా నాయక్, ప్రధాన అర్చకులు లింగం బొట్ల దుర్గాప్రసాద్ పంపిణీ చేశారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తులు: దుర్గమ్మని సోమవారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సునీత, జస్టిస్ సుజాత దర్శించుకున్నారు. వారికి ఇఒ శీనా నాయక్ దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

ఆషాఢం సారె తెచ్చిన భక్తులతో రద్దీ: దుర్గమ్మకి ఆషాఢం సారె తెచ్చిన భక్తజనంతో ఆలయంలో ఆదివారం రద్దీ నెలకొంది. శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర, సారెలతో ఇంద్ర కీలాద్రికి 13వ రోజు సోమవారం సాయంత్రం గంటల వరకు 27 సారె బృందాలకు చెందిన 14,756 మంది మహిళలు అమ్మకి సారె సమర్పించారు. సాయంత్రం 4 గంటల సమయానికే సుమారు 78 వేల మంది భక్తులు అమ్మని దర్శించుకున్నారు. దుర్గమ్మవారి దర్శనానంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించి పూజాదికాలు నిర్వహించారు. క్యూలైన్ దర్శనం మొత్తం సారె భక్తులకు కేటాయించారు.

ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: టిటిడి అదనపు ఇఒ

తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లోపు ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులనువేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశించారు. ఎస్వీ మ్యూజియంలో ఏర్పాటు చేసిన గ్యాలరీలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. మ్యూజియంలోని గ్యాలరీలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం మ్యూజియం బయట పార్కింగ్, మొబైల్ కౌంటర్లు, పాద రక్షకాలు భద్రపరచే కేంద్రాల ఏర్పాటు గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఆరోగ్యవిభాగం డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, ఎస్ఇ వేణు గోపాల్, ఎలక్ట్రికల్ డిఇ చంద్రశేఖర్, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: కోవూరు ఎమ్మెల్యే

కోవూరు (నెల్లూరు), జులై 27 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాన్ని సరిదిద్దుకుంటూ అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు 90శాతం పైగా వాగ్దానాలను నెరవేర్చారన్నారు. కూటమి నాయకులు ధైర్యంగా ప్రతి ఇంటికి వెళ్లి మనం చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. ప్రజల్లో ఎవరికైనా సమస్యలు పరిష్కారం కాకపోతే నేరుగా తమ వద్దకు రావచ్చని పేర్కొన్నారు. అర్హులకు సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సిహెచ్ సుబ్బయ్య, ఎంపిడిఒ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపిడిఒ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ జగదీష్, ట్రాన్స్‌కో డిఇ మధుసూదన్‌రెడ్డి, ఎఇ గిరీష్, పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ అశోక్‌రెడ్డి, పాటూరు నీటి సంఘం అధ్యక్షుడు ఆదాల శివారెడ్డి, ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు లక్ష్మీనరసారెడ్డి, బాల రవి, ఎంపిపి టి. పార్వతి, పురుషోత్తం, పెంచలయ్య, వెంకయ్య, వెంకోజీరావు, శివకృష్ణ, తదితరులు ఉన్నారు.

నెల్లూరులో జాతరలా సైకిళ్ల పంపిణీ

- 7 వేల మందికి మంత్రి నారాయణ ఉచిత సైకిళ్లు

నెల్లూరు(వైద్యం), జులై 27 ప్రభాతవార్త: వీఆర్సీ గ్రౌండ్ సోమవారం అక్షరాలా జాతరను తలపించింది. వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ట్రంక్ రోడ్డు, వీఆర్సీ గ్రౌండ్ కిక్కిరిసిపోయాయి. 'థాంక్యూ నారాయణ సార్' అంటూ విద్యార్థుల నినాదాలతో ప్రాంగణం మార్మోగింది. నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 7 వేల మంది విద్యార్థులకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుటుంబం సొంత నిధులతో ఉచిత సైకిళ్లు పంపిణీ చేసింది. మొత్తం 10 వేల మంది విద్యార్థులకు రూ.6 కోట్ల వ్యయంతో సైకిళ్లు అందించే కార్యక్రమంలో తొలి విడతగా ఈ పంపిణీ చేపట్టారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ తన జీవిత ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. నేను పేదరికాన్ని పుస్తకాల్లో చదవలేదు.. జీవితంలో అనుభవించాను. గుడిసెలో పుట్టి, హరనాథపురం నుంచి వీఆర్సీ వరకు కాలినడకన వెళ్లి చదివాను. మా నాన్న ప్రైవేట్ బస్సు కండక్టర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించారు. అప్పుడే బాగా చదివి పేదరికాన్ని జయించాలని నిర్ణయించుకున్నాను అని భావోద్వేగంగా చెప్పారు. ఎన్నికల సమయంలో 80 వేల ఇళ్లు తిరిగినప్పుడు పేద విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తనను కలచివేశాయని, వారికి నాణ్యమైన విద్యను ఆస్తిగా అందిస్తానని అప్పుడే నిర్ణయించుకున్నానని తెలిపారు. తాను చదివిన వీఆర్సీ విద్యాసంస్థను రూ.17 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దామని, ప్రస్తుతం అక్కడ 1,100 మంది నిరుపేద విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. నగరంలోని మరో 14 ప్రభుత్వ హైస్కూళ్లను ఆధునీకరిస్తున్నామని, వక్ఫ్ బోర్డు స్థలంలో రూ.20 కోట్ల సీఎస్ఆర్ నిధులతో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల మెటీరియల్‌ను ఉచితంగా అందించి, ఆగస్టు 1 నుంచి ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అభినందించిన మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పేద పిల్లల భవిష్యత్తు కోసం మంత్రి కుటుంబం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. వేలాది మంది విద్యార్థుల కళ్లల్లో కనిపించిన ఆనందమే ఈ కార్యక్రమం విజయానికి నిదర్శనమన్నారు. మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ ఒకే రోజు 7 వేల సైకిళ్ల పంపిణీ చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. రూరల్ ఎంఎల్ఏ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ అడగ్గానే సైకిళ్ళు నెల్లూరు రూరల్‌కి ఇచ్చిన గొప్ప వ్యక్తి మంత్రి నారాయణ అని కొనియాడారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఈరోజు చాలా సంతోషమైన రోజన్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఇది గిన్నిస్ బుక్‌లో నమోదయ్యే స్థాయి కార్యక్రమమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి, అల్లుళ్ళు పునీత్, గంటా రవితేజ, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, సంతపేట ఆంజనేయస్వామి ఆలయ చైర్ పర్సన్ విజేతా రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, టిడిపి నేతలు జహీర్, బాలాజీ, తిరుమల నాయుడు, కిన్నెర మాల్యాద్రి, మొయినుద్దీన్, కర్తం ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం!

• ఆత్మకూరులో దళితవాడ నుంచి 'ఇంటింటికి టిడిపి' కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి ఆనం

ఆత్మకూరు (నెల్లూరు), జులై 27 ప్రభాతవార్త: ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ రెండేళ్ళ విజయాలను ప్రతి ఇంటా తెలిసేలా ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం ఆత్మకూరు పట్టణంలోని ముస్తాపురం దళితవాడలో ఇంటింటికి వెళ్ళి ప్రజలను కలిశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ళ పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. మంత్రి ఆనంకు స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. మంత్రి ఆనంతోపాటు ఆనం కుమార్తె లీలా కైవల్యారెడ్డి, సీనియర్ నేత తాళ్ళూరు గిరినాయుడు, ఎన్‌డిఎ కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ హామీల అమలు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈసందర్భంగా ప్రజలు ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ముస్తాపురంలో 34లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, సిమెంట్ డ్రైన్‌లను మంత్రి ప్రారంభజంచారు. ఈసందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన ప్రతి హామీని ప్రజలకు ఇంటింటికి వెళ్ళి వివరిస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గత రెండేళ్ళుగా రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ అభివృద్ధి సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళుతున్నామన్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీ, రూరల్ మండల ఆలయాల అభివృద్ధికి రూ.22.40 కోట్ల నిధులు మంజూరు చేశామని, ప్రధాన దేవాలయాలకు రూ.8 కోట్లు సిజిఎఫ్ నిధులు, 18 గ్రామీణ దేవాలయాలకు రూ.90 లక్షలు, 13 శ్రీవాణి భజన మందిరాలకు రూ.4.60కోట్లు కేటాయించినట్లు వివరించారు. రైతుల కోసం అన్నదాత సుఖీభవ పథకం తొలివిడత నిధులను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. 'తల్లికివందనం' పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేల ఆర్థికసాయం అందిస్తున్నా మన్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీలో ఇప్పటికే రూ.75కోట్లతో రోడ్లు, డ్రైన్‌లు, మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి సోమశిల పైప్‌లైన్ లీకేజీల మరమ్మత్తులకు కోటికిపైగా ఖర్చుచేశామని, శాశ్వత పరిష్కారానికి రూ.26 కోట్లతో 40కొత్త తాగునీటి పథకాలు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ముస్తాపురం దళిత కాలనీలో నూతన కోదండరామస్వామి దేవాలయాన్ని పవిత్రతకు ప్రతీకగా అన్ని వసతులతో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శవాలను బైక్‌కు కట్టి సముద్రంలో పడేసి

• జంట హత్యల కేసును ఛేదించిన పోలీసులు • సముద్రపు వేటలో వివాదాలే ప్రధాన కారణం

విజయవాడ,మచిలీపట్నం, జులై 27 ప్రభాతవార్త: సముద్రపు వేటలో జరిగిన చిన్నపాటి ఘర్షణ నాలుగు కుటుంబాలను వీధిన పడేసింది. ఇరువురి మధ్య జరిగిన ఈ చిన్నపాటి గొడవ జంట హత్యలకు దారి తీయగా నెల రోజుల అనంతరం పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో దర్యాప్తు చేసి సంఘటన మిస్టరీని ఛేదించారు. నిందితులైన జల్లా నాగరాజు, శంకరపు శ్రీనివాస్, గుడివాడకు చెందిన కటికల కళ్యాణ్, డొక్కుమళ్ళ శ్రీకాంత్, షేక్ జిలాని, అబ్బూరి విజయరత్నంలను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. మచిలీపట్నం డిఎస్పీ జి. శ్రీనివాసరావుసోమవారం మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు పూర్వాపరాలను వివరించారు. కృష్ణ జిల్లా, కృత్తివెన్ను మండలం, చినగొల్లపాలెం గ్రామంలోని యానాది కుటుంబాలు సముద్రపు వేటనే జీవనంగా సాగిస్తూ ఉంటారు. అదే గ్రామానికి చెందిన శెట్టి సుబ్బన్న (49), ఇతని అల్లుడు గొలుసు అయ్యప్ప (23) సమీపంలోని ఉప్పుటేరు కొత్త కాలువ ద్వారా సముద్రంలోకి వెళ్ళి చేపలు పట్టి విక్రయిస్తూ ఉంటారు. కాగా, గత నెల 27వ తేదీ రాత్రి చేపలవేటకు వెళ్ళిన మామా అల్లుళ్ళు ఇద్దరూ ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు వారిద్దరూ ఉప్పుటేరు కొత్త కాలువలో శవాలుగా పడి ఉండటాన్ని గుర్తించారు. వారిద్దరినీ చంపి వారి బైక్‌కే కట్టి కాలువలో పడవేసిన స్థితిలో ఉండటం సంచలనం సృష్టించింది.

కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, పెడన సీఐ, కంకిపాడు సిఐ, మచిలీపట్నం సీఐ ఆధ్వర్యంలో మూడు బృందాలను ఏర్పాటు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. హత్యకు గురైన శెట్టి సుబ్బయ్యకు, అదే గ్రామానికి చెందిన శంకరపు శ్రీనుతో చేపల వేటకు సంబంధించి రెండు నెల రోజుల క్రితం చిన్నపాటి గొడవలు జరిగాయి. అవి మనసులో పెట్టుకున్న శంకరపు శీను, అతడి స్నేహితుడు జల్లా నాగరాజు, వీరిద్దరికీ పాత పరిచయం ఉన్న గుడివాడకు చెందిన కటికల కళ్యాణ్, డొక్కుమళ్ళ శ్రీకాంత్, షేక్ జిలాని, అబ్బూరి విజయరత్నంలతో హత్యకు పథకాన్ని రచించి సముద్రపు వేటకు వెళ్లి వస్తున్న మామా అల్లుళ్ళు సుబ్బయ్య, అయ్యప్పలను దారుణంగా చంపారు. ఇద్దరి శవాలను వారి బైకుకు తాడుతో కట్టి సముద్రంలో పడేశారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుల గుర్తింపు: జంట హత్యల కేసును ఛేదించడంలో పోలీస్ యంత్రాంగం అన్ని రకాలుగా జల్లెడ పట్టినా ఎలాంటి క్లూ దొరకకపోవడంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సెల్ ఫోన్ల ఆధారంగా కేసును ఛేదించారు. ఈ కేసును పరిష్కరించడంలో సహకరించిన పెడన సీఐ నాగేంద్ర ప్రసాద్, కృత్తివెన్ను ఎస్ఐ పైడి బాబు, దర్యాప్తులో పాల్గొన్న కంకిపాడు సిఐ బీటీ రవికుమార్, సీఐ ఏసుబాబు, గూడూరు ఎస్ఐ ప్రకాష్, సాంకేతిక సిబ్బందిని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

అంతర్రాష్ట్ర జేబుదొంగలు ముఠా అరెస్ట్

తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలలో పలురకాలుగా నేరాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర జేబుదొంగలను తిరుమల టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. రాంభగీచ కార్ పార్కింగ్ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం అంతర్రాష్ట్ర నేర ముఠాకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

కర్ణాటకకు చెందిన బాలాజీ అకాడే(33), మహారాష్ట్రవాసి అప్పాషా మానే (65), నెల్లూరు జిల్లాకు చెందిన కల్తీ రెడ్డి కీర్తి(31) కలసి తిరుమలకు విచ్చేసే భక్తుల రద్దీని ఆసరాగా చేసుకొని బాలాజీ బస్టాండ్, ఉచిత బస్సులు, ఇతర రద్దీ ప్రాంతాల్లో జేబుదొంగతనాలు, పర్సుల చోరీలు, బ్యాగులు కత్తిరించి నగదు, విలువైన వస్తువులు అపహరిస్తున్నట్లు అంగీకరించారు.

దర్యాప్తులో మహిళా నిందితురాలు నకిలీ టిటిడి గుర్తింపు కార్డు తయారు చేసుకుని తాను టిటిడి ఉద్యోగినినని నమ్మిస్తూ విఐపి దర్శనం, ప్రత్యేక దర్శన టికెట్లు, వసతి గదులు ఏర్పాటు చేస్తానని యాత్రికులను మభ్యపెట్టి, ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. నిందితుల వద్ద నుండి ఒక దొంగిలించిన పర్సు. రూ.5,100 నగదు, మోటార్ సైకిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, నకిలీ టిటిడి గుర్తింపు కార్డు, మూడు సెల్ ఫోన్లు, కట్టర్, చిన్న కత్తి, బ్లేడ్‌లు, గిల్ట్ నగలు స్వాధీనం చేసుకున్నారు.

కెనరా బ్యాంక్ ముందు దంపతుల ఆత్మహత్యాయత్నం

కుందుర్పి, జులై 27 ప్రభాతవార్త: అనంపురం జిల్లా కుందుర్పి మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మండల పరిధిలోని మందలపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ నాగేంద్ర దంపతులిద్దరూ ఒంటిపై డీజిల్ పోసుకొని బ్యాంకు ముందర డీజిల్ పోసుకొని హత్య ప్రయత్నం చేశారు. సకాలంలో రైతులు నిలువరించడం తో ప్రమాదం తప్పింది. చంద్రకళ మాట్లాడుతూ తమ మామ పంట రుణాల అప్పు తీర్చాలంటూ మా అకౌంటు హోల్డ్‌లో ఉంచారన్నారు. ఐదు రోజుల క్రితం తమ పిల్లలవి తల్లికి వందనం డబ్బులు డ్రా చేయడానికి వస్తే బ్యాంక్ అధికారులు నాన్న ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్ మేనేజర్‌ని ఎన్నోసార్లు ప్రాధేయపడిన బయటికి వెళ్లాలంటూ దౌర్జన్యం చేస్తున్నారని చంద్రకళ పేర్కొన్నారు.

ఎపికి సెంట్రల్ రోడ్ ఫండ్ స్కీమ్ కోసం రూ.200 కోట్లు నిధుల విడుదల

విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపికి సెంట్రల్ రోడ్ ఫండ్ స్కీమ్ కోసం రూ.200 కోట్లు నిధుల విడుదలయ్యాయి. రాష్ట్రంలో వివిధ రోడ్ల నిర్మాణం, నిర్వహణ తదితరంశాలకు సంబంధించి బిల్లు పెండింగ్‌లో ఉన్నాయి. జాతీయ రహదారుల అనుసంధాన అంశాల్లో బిల్లుల చెల్లింపులో జాప్యం నిర్మాణ పనుల ఆలస్యం కావడానికి కారణంగా భావిస్తున్న క్రమంలో పెండింగ్ బిల్లుల చెల్లింపు, న్యాయపరమైన చిక్కుల నివారణకు నిధులు విడుదల చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

గీతం ఫార్మశీ కళాశాలకు 'ఎ' గ్రేడ్

విశాఖపట్నం, జులై 27 ప్రభాతవార్త: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్ ప్రాంగణాల్లోని 'స్కూల్ ఆఫ్ ఫార్మశీ' కళాశాలలు 2025-26 విద్యా సంవత్సరానికి గాను నేషనల్ ర్యాంకింగ్ మరియు రేటింగ్‌లో అత్యున్నతమైన 'ఎ' గ్రేడ్‌ను సాధించాయి. ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ), క్వాలిటి కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసిఐ) ఎనఎబిఇటి సంయుక్తంగా నిర్వహించిన మొదటి విడత జాతీయ రేటింగ్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా బి.ఫార్మశీ కోర్సును అందిస్తున్న 398సంస్థలను పరిశీలించారు. విద్యా ప్రమాణాలు, పరిశోధనలు, మౌలిక సదుపాయాలు, పాలన మరియు విద్యార్థుల నైపుణ్యాల ఆధారంగా ఈ సమగ్ర-మల్యాంకనం నిర్వహించబడింది. ఈ పోటీలో కేవలం 64 సంస్థలు(16.1) శాతం మాత్రమే అత్యుత్తమ 'ఎ 'గ్రేడ్‌ను దక్కించుకున్నాయి. ఇందులో గీతం విశాఖపట్నం ప్రాంగణం జాతీయ స్థాయిలో 43వ ర్యాంకు సాధించి దేశలోని టాప్ 10.8శాతంలో నిలవగా, హైదరాబాద్ ప్రాంగణం 54వ ర్యాంకుతో టాప్ 13.6 శాతంలో నిలిచిందని గీతం ఐక్యూఎసి సీనియర్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజా ప్రభు తెలిపారు. ఈ మైలురాయి గీతం విశ్వవిద్యాలయం బి.ఫార్మశీ, ఎమ్‌ఫార్మశీ విద్యతో పాటు పరిశోధనలకు ఇస్తున్న ప్రాధాన్యతను నిరూపిస్తుండటంతో పాటు నాయకత్వ దూరదృష్టి, అధ్యాపకులు, విద్యార్థులు మరియు సిబ్బంది కృషికి దక్కిన గుర్తింపుగా ఆయన పేర్కొన్నారు.

సాహిత్య విమర్శపై అరసం నేతృత్వంలో శిక్షణ

అనంతపురం, జులై 27 ప్రభాతవార్త బ్యూరో: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సాహిత్య విమర్శ మీద ఆగస్టు 8, 9 తేదీలలో అనంతపురంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్‌డిటి ఎకాలజీ సెంటర్‌లో రెండురోజుల పాఠశాల జరుగుతుందని అరసం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఈశ్వర్ రెడ్డి, తన్నీరు నాగేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధమాన విమర్శకులకు సాహిత్య విమర్శకు సంబంధించిన మెలకువలు నేర్పడం ఈ పాఠశాల ఉద్దేశం. ఈ పాఠశాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి నలభై మంది విద్యార్థులు హాజరవుతారు. ఎన్. వేణుగోపాల్, కె.నాగేశ్వరాచారి, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అధ్యాపకులుగా వ్యవహరిస్తారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, కార్యదర్శులు శరత్ చంద్రజ్యోతిశ్రీ, ఏఎంఆర్ ఆనంద్ అతిథులుగా హాజరవుతారు అని తెలిపారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం

• 85.28 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తి

• నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు(కలెక్టరేట్), జులై 27 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, గణాంకాలు, తదుపరి చర్యలపై కలెక్టర్ వివరాలు వెల్లడించారు. జూన్ 15 నుంచి జూలై 24 వరకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లాలోని మొత్తం 19,74,240 మంది ఓటర్లలో 16,83,557 మంది నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించి 85.28శాతం మ్యాపింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు. మ్యాపింగ్ పూర్తైన వారిలో 83.5 శాతం మందిని 2002 ఓటర్ల జాబితాతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల వివరాల ఆధారంగా అనుసంధానం చేయడం జరిగిందని, రాష్ట్రంలోనే ఒక విశేషమైన పురోగతిగా పేర్కొన్నారు. మ్యాపింగ్ కాని 1.8 శాతం మంది ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన 12 రకాల అధికారిక గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి సంబంధిత ఈఆర్ఓకు సమర్పిస్తే వారి ఓటు హక్కు కొనసాగుతుందని స్పష్టం చేశారు. గత 45 రోజులుగా సెలవులు కూడా తీసుకోకుండా రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసిన సచివాలయ సిబ్బంది, బిఎల్ఒలు, తహసీల్దార్లు, ఆర్‌డిఒలు, ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులకు నా ప్రత్యేక అభినందనలు అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో కీలకంగా పనిచేసి విజయవంతం చేసిన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్ఒ విజయ్ కుమార్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

సాగునీటి సమస్య పరిష్కరించండి

• సిఎం చంద్రబాబుకు వల్లభనేని వంశీ లేఖ

విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జిల్లా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గన్నవరం వైసిపి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సిఎం చంద్రబాబుకు లేఖ రాశారు. సాగు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను తక్షణం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి రైతుల సమస్యలను విన్నవించుకున్నామని తెలిపారు. అప్పుడు కూడా సమస్యను పరిష్కరించారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే విధంగా సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. తనను కలిసేందుకు ముఖ్యమంత్రికి ఇబ్బంది అయితే రైతులు మాత్రమే వచ్చి సమస్యను వివరిస్తారని చెప్పారు. సిఎం అనుమతి ఇస్తే తాను కూడా కలుస్తానని వల్లభనేని పేర్కొన్నారు.

'ఈచర్ ఢీకొని ముగ్గురు మృతి

• చిత్తూరు జిల్లా శాంతిపురం వద్ద ఘటన

శాంతిపురం, జులై 27 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో శాంతిపురం మండలం కడపల్లి సమీపంలో సోమవారం ఓ ఈచర్ వాహనం ఢీకొన్న సంఘటనలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. వీరిలో ఐదేళ్ల చిన్నారి సైతం ఉండడం కలచివేసింది. మరో ఐదుమంది తీ వ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. వి.కోట వైపు నుంచి ఈచర్ వాహనం కుప్పం వైపు వెళ్తుండగా కుప్పం వైపు నుంచి టువీలర్‌లో శివపురం గ్రామంకు చెందిన సుందరప్ప (60), మునివెంకటమ్మ (50)లు తమ స్వగ్రామంకు వస్తున్నారు. కడపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ఈచర్ వాహనం వీరి టువీలర్‌ను ఢీకొనడంతో వారు మృతి చెందారు.

అదే ఈచర్ వాహనం సమీపంలో ఉన్న నీళ్ల ట్యాంకరును సైతం ఢీకొంది. దీంతో అక్కడే ఉన్న సాత్విక్ (5), నందిని (14), కాంగావళి (20), అక్షయ (22) తీవ్రంగా గాయపడ్డారు. సాత్విక్‌ను చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలించగా మృతి చెందాడు. మృతదేహాలకు కుప్పం ఏరియా ఆస్పత్రిలో పంచనామా నిర్వహించిన అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

కాగా మృతుల కుటుంబీకుల ఆర్తనాదాలు అందర్నీ కలచివేశాయి. డిఎస్పీ పార్థసారథి, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ సంఘటనా స్థలిని పరిశీలించారు. రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈచర్ వాహనం డ్రైవర్ వేగంతో రావడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

ఎంఈవో పాఠశాలల తనిఖీ

ఇచ్ఛాపురం, జూలై 27 (ప్రభాతవార్త):

మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొలిగాం, కీర్తిపురం పాఠశాలల్లో మండల విద్యా శాఖాధికారి కారర సూర్యారావు ఆకస్మిక పర్యటన చేపట్టారు. ఇరు పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యార్థుల అభ్యసన సంసిద్ధత కార్యక్రమాల నిర్వహణను పరిశీలించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు ఇచ్చారు. మధ్యాహ్న భోజనం నిర్వహణను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. తదనంతరం భోజన నిర్వాహకులకు సూచనలిచ్చారు. కొలిగాం, కీర్తిపురం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గణేష్ పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఫసల్ బీమాతో రైతులకు మేలు : ప్రభుత్వ విప్ అశోక్

కవిటి, జూలై 27 ప్రభాతవార్త

ప్రధానమంత్రి ఫసల్ బీమాతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ అశోక్ అన్నారు. ఈ మేరకు సోమవారం రామయ్యపుట్టుగ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అశోక్ మాట్లాడారు. ఎల్ నినో వర్షాభావ పరిస్థితులు కారణంగా ఇచ్ఛాపురం నియోజక వర్గంలో వరి పంటకు అవకాశాలు తక్కువగా ఉన్నాయని ఇటువంటి తరుణంలో ప్రధానమంత్రి ఫసల్ బీమాలో ప్రతి రైతు చేరితే నష్టాన్ని పూడ్చుకోవడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సుమారు 32వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నప్పటికీ వర్షాభావ పరిస్థితులు కారణంగా వరి నాట్లు వేయడం అంతంత మాత్రంగా ఉందని ఇటువంటి తరుణంలో ప్రతి రైతు ఎకరాకు 160 రూపాయలతో బీమా చేయించుకోవాలని నష్టం వాటిల్లితే ఎకరాకు నలభై వేల రూపాయలు చొప్పున నష్టపరిహారం లభిస్తుందని వ్యవసాయ అధికారులు సమక్షంలో తెలియజేశారు. ప్రతి సీజన్లో యూరియా రైతులకు అవసరమైన మేరకు అందుబాటులో ఉందని ఎటువంటి అపోహలు పడవలసిన అవసరం లేదని కొన్ని సాంకేతిక లోపాల కారణంగా సమస్య వాటిల్లడం జరిగిందని ఇకపై యూరియా విషయంలో ఏ ఒక్క రైతు ఇబ్బందిపడవలసిన అవసరం లేదని తెలిపారు.

ప్రధానపుట్టుగలో ఇంటింటికి తెలుగుదేశం

కంచిలి, జూలై 27 ప్రభాతవార్త :

కంచిలి మండలం తలతంపర గ్రామం పంచాయతీ ప్రధానపుట్టుగలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాదిన రామారావు, మండల యూత్ అధ్యక్షులు మద్దిల ఆనంద్ రావు, తలతంపర పంచాయతీ పార్టీ అధ్యక్షులు జగబంధు, ఏపీ లైవ్ స్టాక్ డైరెక్టర్ మదపాటి పూర్ణ, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ అభిమన్యు బిసాయి మరియు గ్రామ పెద్దలు పాల్గొని రెండేళ్ల పాలన ప్రగతి ఇచ్చిన హామీలు పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు.

మాజీ మంత్రి అప్పలరాజు అరెస్టును ఖండించిన మత్స్యకారులు

రాజకీయ కక్షతోనే అక్రమ అరెస్టు

సంతబొమ్మాళి, జూలై 27 ప్రభాతవార్త :

మాజీ రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు, ఆయన కుమారుడి అరెస్టును మండల మత్స్యకారులు తీవ్రంగా ఖండించారు. మండలం మలగాం పంచాయతీ సూరదవానిపేటలో సోమవారం మత్స్యకార నాయకులు విలేకరులతో మాట్లాడారు. రాజకీయ కక్షతోనే మత్స్యకారుల ఎదుగుదలను అడ్డుకునేందుకు అప్పలరాజును అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. యాక్సిడెంట్‌ను హత్య కేసుగా నమోదు చేసి ముందుగా అప్పలరాజు కుమారుడిని, అనంతరం మాజీ మంత్రి అప్పలరాజును అరెస్టు చేయడం దారుణమన్నారు. రోడ్డు ప్రమాదాన్ని హత్యా కేసుగా మార్చడం దురదృష్టకరమని పేర్కొన్నారు. మత్స్యకార కుటుంబంలో జన్మించి మత్స్యకారులకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన అప్పలరాజును లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తున్నందునే ఆయనపై ప్రభుత్వం కక్ష పెంచుకుని ఈ ప్రమాద ఘటనను అస్త్రంగా ఉపయోగించుకుందని విమర్శించారు. నీతి, నిజాయితీతో ప్రజా సేవ చేసిన అప్పలరాజును జైలుకు పంపడం బాధాకరమని, మత్స్యకారుల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు మత్స్యకారులకు అన్యాయంగా జైలుకు పంపడం సరికాదని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అప్పలరాజు, ఆయన కుమారుడిని విడుదల చేయడంతో పాటు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో స్థానిక ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, మత్స్యకార నాయకులు మేరుగ అప్పారావు, సూరాడ రాజారావు, సూరాడ వెంకటేష్, శ్రీరంగం వీరాస్వామి, మంకు సింహాచలం, మంకు గారయ్య, మూగు చిరంజీవి, మేరుగ కాంతారావు, కృష్ణారావు మైలపల్లి ఓంకార్ పాల్గొన్నారు.

మరువాడలో రచ్చబండ నిర్మాణానికి భూమి పూజ

సంతబొమ్మాళి, జూలై 27, ప్రభాతవార్త

మండలంలోని మరువాడ పంచాయతీ డి.మరువాడ గ్రామంలో రూ.3 లక్షల వ్యయంతో నిర్మించనున్న రచ్చబండ నిర్మాణానికి తాజా మాజీ సర్పంచ్ ప్రతినిధి సూరాడ దానోరావు సోమవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరప్రాంత ప్రజల అవసరాలను గుర్తించిన మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సౌజన్యంతో ఎంపీ లాడ్స్ నిధుల నుంచి రూ.3 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి గ్రామస్తుల వినియోగానికి అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో మరువాడ మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ మరియు శ్రీకాకుళం జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ గంట లోకేష్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కర్లెమ్మలో జోరుగా 'ఇంటింటికీ తెలుగుదేశం' ప్రచారం

కొత్తూరు, జూలై 27 ప్రభాతవార్త :

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కొత్తూరు మండల పరిధిలో గల కర్లెమ్మ పంచాయతీ ఎన్.ఎస్.కాలనీ (274వ బూత్)లో సోమవారం 'ఇంటింటికీ కూటమి' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు పాల్గొని, కాలనీలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అందించిన సేవలు, భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా నేరుగా ప్రజలతో మమేకమై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రజల సమస్యలు, సూచనలను స్వయంగా తెలుసుకున్న ఆయన, వాటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజల ఆశీస్సులు, నిరంతర సహకారంతోనే రాష్ట్ర అభివృద్ధి మరింత వేగంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్డీఏ కూటమి నాయకులు లోతుగెడ్డ లక్ష్మీ నారాయణ నాయుడు, బోర శ్రీరాములు, పడాల వెంకట కృష్ణ, మురపాకల శంకరరావు, బూరడా నారాయణ రావు, అరసవిల్లి అన్నాజిరావు, నువ్వుపండా పైడిరాజు, లక్కోజీ మధు, కూనిబిల్లి శ్రీను, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఒడియా ప్రథమ భాష సాహిత్య పుస్తకాలు

కవిటి, జూలై 27 ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒడియా మాధ్యమం చదువుతున్న విద్యార్థులకు రెండు లక్షల 50 వేల విలువ చేసే 9, 10వ తరగతి విద్యార్థులకు సంబంధించి ప్రథమ భాష ఒడియా సాహిత్య సింధు 11 పుస్తకాలు, సాహిత్య ధర వెయ్యి 50 పుస్తకాలు మరియు ఒరియా వ్యాకరణం 2150 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఉదయ మైనార్టీ సంఘ అధ్యక్షులు సత్యనారాయణ పాడి కార్యదర్శి బృందలాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సత్యనారాయణ పార్టీ మాట్లాడుతూ ఈ విద్యా సంస్థను సంబంధించిన మీడియా మాధ్యమిక పుస్తకాలు అందించుటకు కృషిచేసిన జాయింట్ సెక్రటరీ జ్యోతిర్మయి మిశ్రా, ఉత్కల సమ్మేళన రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ రవీంద్ర కుమార్ మిశ్రా ఉత్కల సమ్మేళన గంజాం శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శుభ్రత కుమారస్వామి దీనబంద్ పల్లవకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపోటా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భాస్కర్ పాడి, బృందావనం దొరై మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో చదువుతున్న ఒరియా విద్యార్థులకు సకాలంలో ఒడియా పాఠ్యపుస్తకాలు అందించడం ఆనందదాయకమని అన్నారు.

డాక్యుమెంట్ రైటర్స్ పట్ల ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి

ఆమదాలవలస, జూలై 27, (ప్రభాతవార్త)

ఆర్ఎస్కే సెంటర్ స్థాపించి ప్రభుత్వం డాక్యుమెంట్ రైటర్స్ పట్ల ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని శ్రీకాకుళం జిల్లా స్టాంపు వెండర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాగాది తేజేశ్వరరావు అన్నారు. సోమవారం ఆమదాలవలస డాక్యుమెంట్ రైటర్స్ మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా తీసుకొచ్చిన జీవో నెంబర్ 396ను వెంటనే రద్దు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా డాక్యుమెంట్ రైటర్స్ ఎంతో సంఘీభావంగా నిరసన తెలపడం హర్షనీయమన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మొదలవలస వేణుగోపాలరావు, ఉపాధ్యక్షులు కూన పెద్దిరాజు, కార్యదర్శి సువారి సూర్య నారాయణ,తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 30న అడవి మధ్య మన్యం సవారీ బైక్ టూర్

సీతంపేట, జూలై 27 ప్రభాతవార్త

అడవి మధ్యలో మన్యం సవారీ బైక్ టూర్ కార్యక్రమాన్ని ఈ నెల 30న సీతంపేటలో నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి ఎం.వాణి శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6:00 గంటలకు ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ సున్నపుగెడ్డ జలపాతం వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ వైశాలి, ఐటీడీఏ పీఓ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

రేపు బోరుభద్రలో గురు పౌర్ణమి వేడుకలు

సంతబొమ్మాళి, జూలై 27, ప్రభాతవార్త

మండలంలోని బోరుభద్ర శివాలయం ఆవరణలో గురు పౌర్ణమి వేడుకలు బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు ముద్దపు రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సరస్వతి పంచదశ స్వామి ముద్దాడ రఘుపతి నాయుడు హాజరవుతారని అయన ఆధ్వర్యంలో వేద వేదాంత అతీత వైజ్ఞానిక రెండో మహాసభ జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై జయప్రదం చేయాలని ముద్దపు రమణ మూర్తి కోరారు.

శ్రీకాకుళం వార్త

బడి పిల్లలకు కంటి పరీక్షలు

కొత్తూరు, జూలై 27 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సూచనల మేరకు కొత్తూరు మండలం, కురిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నివగాం జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాఘవదాస్ ఆధ్వర్యంలో, వైద్యాధికారి డాక్టర్ పి.ప్రసన్న సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య పాఠశాలలోని 288 మంది విద్యార్థులకు క్షుణ్ణంగా కంటి పరీక్షలు చేపట్టారు. వీరిలో 36 మంది విద్యార్థులకు దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ విద్యార్థులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున త్వరలోనే ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు వైద్య సిబ్బంది వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు కంటి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. కంటికి సంబంధించిన వివిధ రకాల సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆప్తాల్మిక్ ఆఫీసర్ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జిపురంలో ఇంటింటా ప్రచారం

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన

లావేరు, జూలై 27 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విజయనగరం జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షులు వడ్డిపల్లి శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. సోమవారం ఆయన మండలంలోని బెజ్జిపురం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలకు ఆయన అవగహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో సాధించిన అపూర్వ అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమర్థ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తీరును ఆయన ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు తాను నిరంతరం అందుబాటులో ఉంటానని, ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా నా దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పిన్నింటి మధుబాబు, నాయకులు ఇజ్జాడ విశ్వనాథం, ఇజ్జాడ సన్యాసినాయుడు, వడ్డేపల్లి సురేష్, జోగినాయుడులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం తక్షణమే 396 జీవోను రద్దు చేయాలి

8వ రోజు కొనసాగిన డాక్యుమెంట్ రైటర్ల పెన్ డౌన్ నిరసన

రణస్థలం, జూలై 21 ప్రభాతవార్త :

ప్రభుత్వం అమలు చేయనున్న 396 జీవోను తక్షణమే రద్దు చేయాలని రణస్థలం డాక్యుమెంట్ రైటర్ల సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర డాక్యుమెంట్ రైటర్ల సంఘం ఆదేశాల మేరకు సోమవారం రణస్థలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రణస్థలం డాక్యుమెంట్ రైటర్ల సంఘం 8వ రోజు పెన్ డౌన్ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయనున్న 396 జీవో డాక్యుమెంట్ రైటర్ల పొట్ట కొట్టే విధంగా ఉందని తక్షణమే 396 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పెన్ డౌన్ నిరసన కార్యక్రమంలో మీసాల రామారావు, సూరవాజ్జుల శివ కుమార్, అరసాడ విజయ సారధి, పులగ్గుర్త మల్లిబాబు, బైరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళిలో 'ఇంటింటికి టీడీపీ'

సంతబొమ్మాళి, జులై 27, ప్రభాతవార్త :

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమాన్ని సోమవారం మండల కేంద్రం సంతబొమ్మాళిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి గత రెండు సంవత్సరాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలు, సూచనలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రానున్న రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేస్తామని పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగ్గు శాంతిస్వరూప్ రెడ్డి, పి ఏ సి యస్ చైర్మన్ కూచెట్టి కాంతారావు, రెడ్డి అప్పన్న, అట్టాడ రాం ప్రసాద్, వెంకటేష్, భానుప్రకాష్, కృష్ణారావు, యువత పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి... అరాచకం సృష్టించకండి

వైసీపీ నేతలకు ఎమ్మెల్యే అశోక్ హితబోధ

కవిటి, జూలై 27 ప్రభాతవార్త

అభివృద్ధికి సహకరించండి... అరాచకం సృష్టించకండి అంటూ ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసీపీ నేతలకు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అశోక్ విలేకరుల సమావేశంలో హితబోధ చేశారు. సోమవారం రామయ్యపుట్టుగ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ మాజీ మంత్రి అప్పలరాజుకు అలానే ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే గత ఐదేళ్ల కాలంలో మత్స్యకారుల కోసం ఏం చేశారని అవసరమైతే ఈ విషయం కోసం తాను బహిరంగ చర్చకు సిద్ధమంటూ స్పష్టం చేశారు. కుల మతాలకు అతీతంగా ప్రశాంతమైన ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కుటిల రాజకీయాలు, సోషల్ మీడియా రాజకీయాలు తగదని హితవు పలికారు. ముఖ్యంగా పలాసలో మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడు చేసిన రోడ్డు ప్రమాదంలో అప్పలరాజు చేసిన తప్పులే ఆయన అరెస్టుకు కారణమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. దీన్ని ఆసరాగా చేసుకొని మత్యకార గ్రామాలు తిరుగుతున్న నాయకులు గత ఐదేళ్లలో అప్పలరాజు మత్యకారులకు చేసిన మేలేంటో తెలియజేయాలని ప్రశ్నించారు. చివరికి మత్స్యకారులకు ప్రమాదవశాస్తూ జరిగిన ప్రమాదాలకు ఇచ్చే బీమా కూడా ఇవ్వలేని వైసీపీ నాయకులు ఇప్పుడు మత్స్యకారులకు అన్యాయం జరిగిందంటూ ప్రచారం చేయడం దెయ్యాలు వేదాలు వధించడమేనని ఎద్దేవా చేశారు. అనుకోకుండా జరిగిన రోడ్డు ప్రమాదంలో మీ అబ్బాయిని రక్షించే ప్రయత్నంలో మరో సంబంధం లేని వ్యక్తిపై కేసు నమోదుకు మీరు ప్రయత్నించడం తప్పు కాదా అని ఘంటాపదంగా తెలియజేశారు. అప్పలరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైసీపీ నాయకులకు చనిపోయిన దానయ్య కుటుంబము కనిపించడం లేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. దానయ్య కుటుంబం కనీసం రేషన్ కార్డు కూడా చేసుకోనని పరిస్థితిలో ఉండటం మరోవైపు దానయ్య కుటుంబం అద్దె ఇంట్లో నివాసమున్న సంగతి వైసీపీ నాయకులు గమనించలేదంటూ ధ్వజమెత్తారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తెచ్చి అప్పటికి పరిష్కారం కానీ పట్ల ఒక ప్రతిపక్షంగా మీరు పోరాడాలని ఆయన హితబోధ చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎం.వి కృష్ణారావుకు ముందు తరువాత కూడా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కులమతాలకు చోటు లేదని ఇప్పుడు మీరు ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నంలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసం అని ధ్వజమెత్తారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనిస్తున్నారని వారే మీకు బుద్ధి చెబుతారని అన్నారు.

ఆమదాలవలస కాలేజీ మైదానంలో వాకింగ్ ట్రాక్‌కు మరమ్మత్తులు

ఆమదాలవలస, జూలై 27,(ప్రభాతవార్త)

ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకింగ్ ట్రాక్‌కు నిర్మాణ పనులను టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ చేపట్టారు. ఆమదాలవలస ప్రాంతంలో ఉదయం మధ్యాహ్నం వాకింగ్ చేసేందుకు చాలా మంది వస్తుంటారు. ప్రధానంగా మహిళలు ఈ ప్రాంతం సురక్షితమైనది కావడంతో ఎక్కువగా వాకింగ్ కోసం వస్తుంటారు. ఈ మైదానంలో చిన్నపాటి చినుకు పడితే ట్రాక్ మొత్తం బురదమయం అవుతుంది. దీంతో స్థానికులు నాయకులకు పలుమార్లు వినతి పత్రాన్ని అందించారు. ప్రభుత్వ పరంగా పనులు మంజూరు అయ్యేందుకు సమయం పట్టడంతో స్వతహాగా క్రికెట్ క్రీడాకారుడైన తమ్మినేని విద్యా సాగర్ సొంతంగా ట్రాక్ చుట్టూ నిర్మాణానికి గ్రావెల్, మట్టి మూడు రోజులుగా వేస్తున్నారు. గతంలో కూడా చిరంజీవి మెమోరియల్ ట్రస్ట్ పేరున జిల్లా అంతర్ జిల్లా క్రికెట్ పోటీలను ఈ మైదానంలోనే నిర్వహించారు. ఆ సమయంలో గ్రౌండ్ చుట్టూ అశోక మొక్కలను నాటారు. అలాగే వాటికి సేఫ్ గార్డులు ఏర్పాటు చేసి స్వయాన సంరక్షణ చేశారు. ఇప్పుడు ట్రాక్ చుట్టూ సుమారు 500 మీటర్లు మేర నిర్మాణ పనులను స్వతహాగా చేపట్టారు. ట్రాక్ పనులు పూర్తి అయితే నిరంతరం వాకింగ్ చేసే వారికి సౌకర్యవంతంగా ఉంటుంది. స్వచ్ఛందంగా పనులు చేస్తున్న విద్యాసాగర్‌ను పలువురు అభినందించారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda 119
బ్యాంక్ ఆఫ్ బరోడా
టెక్కలి బ్రాంచ్
దోకి అనురాధ కాంప్లెక్స్, ఇందిరా గాంధీ జంక్షన్, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా-532201, ఆం.ప్ర
ఫోన్ : 08945-244888, ఇ-మెయిల్ : tekkal@bankofbaroda.bank.in

(Appendix-IV) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(1) ప్రకారం

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (54 ఆఫ్ 2002) ప్రకారము బ్యాంక్ ఆఫ్ బరోడా, టెక్కలి బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/ హామీదారు/తనఖాదారు శ్రీ రోనంకి గౌరీపతి, తండ్రి: రామమూర్తి లేటు, శ్రీ రోనంకి రమేష్, తండ్రి: రోనంకి గౌరీపతి మరియు శ్రీ రోనంకి సతీష్, తండ్రి: రోనంకి గౌరీపతి వారు తేది.09.11.2024 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.12,55,605.34/- (అక్షరాల పన్నెండు లక్షల యాభై ఐదు వేల ఆరు వందల ఐదు రూపాయల ముప్పై నాలుగు పైసలు మాత్రమే) ప్లస్ వర్తించని వడ్డీ రూ. 1,87,135.94/- (అక్షరాల ఒక లక్ష ఎనభై ఏడు వేల నూట ముప్పై ఐదు రూపాయల తొంభై నాలుగు పైసలు మాత్రమే) మరియు తేది.10.11.2024 నుండి వడ్డీ, చట్టపరమైన, ఇతర ఛార్జీలతో కలిపి మొత్తమును సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా కోరుతూ తేది.15.11.2024 న డిమాండ్ నోటీసును జారీచేసినారు.

ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారు సదరు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు చట్టం సందలి రూల్ 8 ప్రకారం దిగువ వివరించిన ఆస్తిని తేది. 22.07.2026 న స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారు & యావన్మంది ప్రజానీకమునకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి చెల్లించవలిసిన బకాయి మొత్తం తేది.09.11.2024 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.12,55,605.34/- (అక్షరాల పన్నెండు లక్షల యాభై ఐదు వేల ఆరు వందల ఐదు రూపాయల ముప్పై నాలుగు పైసలు మాత్రమే) ప్లస్ వర్తించని వడ్డీ రూ. 1,87,135.94/- (అక్షరాల ఒక లక్ష ఎనభై ఏడు వేల నూట ముప్పై ఐదు రూపాయల తొంభై నాలుగు పైసలు మాత్రమే) మరియు తేది.10.11.2024 నుండి వడ్డీ, చట్టపరమైన మరియు ఇతర ఛార్జీలు ఏమైనా ఉన్నచో మొత్తమునకు లోబడివుంటాయి.

ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు) తమ సెక్యూర్డ్ ఆస్తి విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8) లోని నిబంధనలు గమనించవలెను.

స్థిరాస్తి వివరములు:
శ్రీకాకుళం జిల్లా, టెక్కలి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం & మండలం, టెక్కలి గ్రామ పంచాయతీ & మండలం, రఘునాథపురం గ్రామం, సర్వే నెంబ.531/12 & 531/10, 1వ వార్డు, శ్రీనివాస నగర్ (రిజిస్టర్డ్ అమ్మకపు దస్తావేజు నెం.1194/2017 ప్రకారం), తూర్పు-పడమర: 17 అ॥లు, ఉత్తరం-దక్షిణం: 90 అ॥లు. మొత్తం విస్తీర్ణం: 170 చ॥గ॥లులోని ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: ఎగ్జిక్యూటెంట్ యొక్క ఖాళీ స్థలం (డ్రైనేజీగా సరిచేయబడింది), దక్షిణం: డ్రైనేజీ, పడమర: కె. రామ్మోహనరావు ఖాళీ స్థలం (హక్కుదారుని ఖాళీ స్థలంగా సరిచేయబడింది), ఉత్తరం: బమ్మిడి కృష్ణమూర్తి గారి ఇల్లు మొదలైనవి.

సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.1194/2017, తేది.22.06.2017 మరియు రెక్టిఫికేషన్ డీడ్ నెం.2267/2017 తేది.20.10.2017 ప్రకారం ఆస్తి శ్రీ రోనంకి గౌరీపతి, తండ్రి: లేటు రోనంకి రామమూర్తి పేరున కలదు.

తేది : 22.07.2026 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: టెక్కలి బ్యాంక్ ఆఫ్ బరోడా

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda 119
బ్యాంక్ ఆఫ్ బరోడా
టెక్కలి బ్రాంచ్
దోకి అనురాధ కాంప్లెక్స్, ఇందిరా గాంధీ జంక్షన్, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా-532201, ఆం.ప్ర
ఫోన్ : 08945-244888, ఇ-మెయిల్ : tekkal@bankofbaroda.bank.in

(Appendix-IV) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(1) ప్రకారం

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (54 ఆఫ్ 2002) ప్రకారము బ్యాంక్ ఆఫ్ బరోడా, టెక్కలి బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/ హామీదారు/తనఖాదారు : శ్రీ వాకాడ రాంబాబు మరియు శ్రీ వాకాడ హరిచంద్ర రావు వారు తేది.13.12.2025 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.4,57,239/- (అక్షరాల నాలుగు లక్షల యాభై ఏడు వేల రెండు వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే) ప్లస్ వర్తించని వడ్డీ రూ. 2,854.49/- (అక్షరాల రెండు వేల ఎనిమిది వందల యాభై నాలుగు రూపాయల నలభై తొమ్మిది పైసలు మాత్రమే) ప్లస్ వసూలుకాని వడ్డీ రూ.10,379.06/- (అక్షరాల పది వేల మూడు వందల డెబ్బై తొమ్మిది రూపాయల ఆరు పైసలు మాత్రమే) ప్లస్ చక్ర వడ్డీ రూ.114/- (అక్షరాల నూట పద్నాలుగు రూపాయలు మాత్రమే) మరియు తేది.14.12.2025 నుండి వడ్డీ, చట్టపరమైన, ఇతర ఛార్జీలతో కలిపి మొత్తమును సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా కోరుతూ తేది.24.12.2025 న డిమాండ్ నోటీసును జారీచేసినారు.

ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారు సదరు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు చట్టం సందలి రూల్ 8 ప్రకారం దిగువ వివరించిన ఆస్తిని తేది. 22.07.2026 న స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారు & యావన్మంది ప్రజానీకమునకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి చెల్లించవలిసిన బకాయి మొత్తం తేది.13.12.2025 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.4,57,239/- (అక్షరాల నాలుగు లక్షల యాభై ఏడు వేల రెండు వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే) ప్లస్ వర్తించని వడ్డీ రూ. 2,854.49/- (అక్షరాల రెండు వేల ఎనిమిది వందల యాభై నాలుగు రూపాయల నలభై తొమ్మిది పైసలు మాత్రమే) ప్లస్ వసూలుకాని వడ్డీ రూ.10,379.06/- (అక్షరాల పది వేల మూడు వందల డెబ్బై తొమ్మిది రూపాయల ఆరు పైసలు మాత్రమే) ప్లస్ చక్ర వడ్డీ రూ.114/- (అక్షరాల నూట పద్నాలుగు రూపాయలు మాత్రమే) మరియు తేది.14.12.2025 నుండి వడ్డీ, చట్టపరమైన మరియు ఇతర ఛార్జీలు ఏమైనా ఉన్నచో మొత్తమునకు లోబడివుంటాయి.

ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు) తమ సెక్యూర్డ్ ఆస్తి విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8) లోని నిబంధనలు గమనించవలెను.

స్థిరాస్తి వివరములు:
శ్రీకాకుళం జిల్లా, టెక్కలి మండలం, రఘునాథపురం గ్రామం మరియు పంచాయతీ పరిధి, సంభాన వీధిలో, సర్వే నెం.397 నందు విస్తీర్ణం 43.54 చ॥గ॥ల స్థలంలో నిర్మించబడిన, విస్తీర్ణం 305 చ॥అ॥లుతో RCC స్లాబ్ రూఫ్ రెసిడెన్షియల్ గ్రౌండ్ ఫ్లోర్ భవనం డోర్ నెం. 5-137, HSC నెం.5160 మరియు అసెస్‌మెంట్ నెం.5215 తో కలదు. కొలతలు: తూర్పు నుండి పడమర: 10 అ॥లు 7 అంగుళములు లేదా 4.019 మీ॥లు, ఉత్తరం నుండి దక్షిణం: 28 అ॥ల 5 అంగుళములు లేదా 8.069 మీ॥లు. ఈ కొలతల ప్రకారం మొత్తం విస్తీర్ణం 43.54 చ॥గ॥లు. ఆస్తి హద్దులు: తూర్పు: రోడ్డు, దక్షిణం: వాకడ మహాలక్ష్మి గారి ఇల్లు, పడమర: వాకడ అప్పలస్వామి గారి ఇల్లు, ఉత్తరం: వాకడ సాంబమూర్తి గారి ఇల్లు.

గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ నెం.982/2021, తేది: 22.04.2021 ప్రకారం ఆస్తి వాకాడ రాంబాబు, తండ్రి: హరిశ్చంద్ర రావు గారి పేరున కలదు.

తేది : 22.07.2026 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: టెక్కలి బ్యాంక్ ఆఫ్ బరోడా

28-7Pg9th cheli 2.qxd:28-7Pg9th cheli 2.qxd 1/1/02 6:17 AM Page 1

గురుసాక్షాత్ పరంబ్రహ్మా

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః
గురుసాక్షాత్ పరంబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః

అజ్ఞానమనే చీకటిని తొలగించి, జ్ఞానమనే జ్యోతినరి వెలిగిఆంచేవారు మన కన్నతల్లిదండ్రులు ప్రథమ గురువులుగా కాగా, మిగిలిన జీవితం మొత్తం మార్గనిర్దేశనం చేసేవారు గురువు. మానవ జీవిత చరితార్థానికి, భగవదర్శ నానికి బాటలు వేసేవారే గురువులు. గురుపూర్ణిమ, ఆషాఢ పూర్ణిమ, వ్యాస పూర్ణిమ ఏదైనా పవిత్రమె నదే. వ్యాసభగవానుని జన్మదినం. అష్టాదశ పురణాలను మనకు అందించిన మహనీయుని జన్మదినం కారణంగా గురుస్థానములో ఆ వ్యాసభగవానుని స్మరిస్తూ చేసుకునే పవిత్రమైన రోజు. ఆషాడ పూర్ణిమను గురు పూజతో ఉత్సవం చేయటం మన భారతీయ సంస్కృతిలో భాగమైనది. గురువుని త్రిమూర్తి స్వరూపంగా భావిస్తాము. మానవ చరిత్రలోనే అపూర్వమైన ఆధ్యాత్మిక పర్వదినంగా నిలచినది వ్యాస జన్మతిథి. పౌరాణికులు, కథకులు, బోధకులు కూడా గురువుతే పురాణాలలో నిగాఢంగా నిహితం చేయబడిన విషయాలను మానవజాతి జ్ఞానం సంపాదించాలంటే వ్యాస మహర్షి అనుగ్రహం అవసరము. అందుచేత మనం వ్యాస పూర్ణిమ నాడు పౌరాణికులను, మన గురువులను ధూపదీప నైవేద్యాలతో పూజించి తగిన విధంగా సత్కరించాలి. గురువులకు గురువుగా ఖ్యాతి గడించిన మహనీయుడు వ్యాసమహర్షి. అందువలన లోకంలో అందర్కూ శ్రీ వ్యాసమహర్షిని పూజించి, గౌరవించాలి. తమ జీవితాలకు సరైన మార్గ నిర్దేశనం చేయటానికి కావలసిన సాధన సంపత్తి గురువు ద్వారా లభిస్తుందని అందరి విశ్వాసం.

గురువులుగా ప్రసిద్ధిగాంచిన , ఆది శంకరులు, దత్తాత్రేయుడు, గురు దక్షి ణామూర్తి మొలైనవారిని ఈరోజు కొలుస్తారు. ఈ గురుపూర్ణిమ ఉత్సవాన్ని శ్రీ ఆదిశంకరులే ప్రారంభించారని చెబుతారు. గురుపూర్ణిమ నాడు ఈ రోజు దేవాలయాలలో విశేష పూజలు నిర్వహిస్తారు. ఉదయం పాలాభిషే కాలు, అర్చనలు నిర్వహిస్తారు. రోజంతా శ్రీ గురుచరిత్ర, సాయిచరిత్ర పుస్తకాలను, ఉడకబెట్టిన శెనగలను ప్రసాదంగా పంచి పెట్టటమే విశిష్టత.

కామధేనువు మరి కల్పవృక్షము కూడ గురువు మనసునందు కొలువుయుండు
గురువునకు సరియగు గురుదేవులే సుమా ప్రకృతి పలుకునిచ్చు ప్రభు మనకు !!

సమస్త ప్రకృతిలో నిండి నిభిఢీకృత్కుడై జానానందాన్ని, ప్రేమను పంచటానికి గురువు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఆ మహత్తర జ్ఞానాన్ని అందుకోవటానికి శిష్యులకు చిత్తశుద్ధి అవసరం. మనిషిలో గుప్తంగా దాగి యున్న జ్ఞానాన్ని, విశేష శక్తియుక్తులను వెలికితీసి మార్గనిర్దేశనం కలిగించేవారు గురువు.

- డాక్టర్ దేవులపల్లి పద్మజ

చిన్నారులకు దూరంగా !

పిల్లలు టేబుల్ మూలలు తగలకుండా, మెట్ల మీద జారకుండా.. ఇలా చాలా జాగ్రత్తలే తీసుకుని ఉంటారు.

మామూలు బ్యాటరీలు చిన్న పిల్లల చేతిలో కనిపిస్తాయి. వెంటనే తీసేయొచ్చు. కాని బటన్ తరహా వాటితోనే ప్రమాదం. పిల్లల బొమ్మలు, కొన్నరకాల రిమోట్‌లలో ఇవి ఉంటాయి. పొరపాటు పిల్లల చేతికి చిక్కి, నోట్లో పెట్టుకున్నారో ప్రమాదం. జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తాయి కూడా.

కాబట్టి, గమనించుకోండి.

□ గోళీలు, పూసలు, మాగ్నెటిక్ బాల్స్.. ఇవీ చిన్నారులను ఆకర్షించేవే. మెరుసూనత రంగులతో ఉంటాయి కదా! వెంటనే నోట్లో పెట్టేసుకుంటారు. గొంతులో ఇరుక్కుపోవడమో, పేగులను దెబ్బతీయడమో చేస్తాయి కూడా. కాబట్టి, గమనించుకోండి. □ గోళీలు, పూసలు, మాగ్నెటిక్ బాల్స్.. ఇవీ చిన్నారులను ఆకర్షించేవే మెరుస్తూ రంగులతో ఉంటాయి కదా! వెంటనే నోట్లో పెట్టేసుకుం టారు. గొంతులో ఇరుక్కుపోవడమో, పేగులను దెబ్బతీయడమో చేస్తాయి. వీటినీ అందని చోట్ల ఉంచడం మేలు. □ స్విచ్‌బోర్డుల్లో వేళ్లు ఎక్కడ పెడతారో అని చాలా మంది వాటిని మూసేస్తున్నారు. కానీ ఛార్జింగ్ వైర్లు, కేబుల్స్‌ని మాత్రం స్విచ్ బోర్డులకు పెట్టి వదిలేస్తుం టారు. పొరపాటున స్విచ్ ఆపడం మరిచిపోయినా, వైర్లు ఎక్కడైనా తెగినా ప్రమాదమే. వాటిని పిల్లలు నోట్లో పెట్టుకుంటే షాక్‌కి గురవుతారు.

□ అవసరానికి పని కొస్తాయని బకెట్లు, టుబ్బుల్లో నీటిని పట్టి ఉంచు తాం. కానీ చిన్నపిల్లలు నీటిపట్ల ఎలా ఆకర్షితు లవుతారో తెలిసిందేగా? చిన్న ప్రాణాలు పొం పాటున వాటిల్లో పడ్డారంటే ఊపిరా డదు. చిన్నారులకు అందుబాట ులో ఉండకుండా అయినా చూడండి. లేదా వాటిపై ఏవైనా మూతలు ఏర్పాటు చేయడమో మరేవైనా జాగ్రత్తలు తీసుకోవడమో.

'మిన్ను' తాకిన సంకల్పంతో ..

సొంతంగా కలలు కని వాటిని నిజం చేసుకోవాలని మాజీ రాష్ట్రపతి ప్రఖ్యాత శాస్త్రవేత్త ఎపిజె అబ్దుల్‌కలాం ఉపదేశిస్తుం చారు. అలాంటి ధోరణిలోనే ఆలోచించిన ఓ తనయ మిన్నుజోషి తన తండ్రి కలనే తన కలగా ఎంచుకొని సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించారు. సాధారణంగా 'వివాహం విద్యానాశాయః' అంటుంటారు దానిలోని అర్థం గ్రహించిన మిన్ను ఎంతో చాకచక్యంగా తొలుత కుటుంబాన్ని చదువును సమన్వయం చేసుకుంటూ పోలీసుశాఖలో క్లర్క్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఉద్యో గాన్ని, కుటుంబాన్ని సమన్వయం చేసుకుంటూ సివిల్‌లో విజయం సాధించారు. ప్రస్తుతం ఆమె మహారాష్ట్రలోని అమరావతిలో ఉద్యోగం ఉన్నారు. కేరళలోని పత్తనంతిట్టకు చెందిన మిన్ను, ఓ పోలీస్ అధికారి కూతురు. ఆమె విద్యార్థిగా ఉండగానే తండ్రి మరణించారు. ప్రభుత్వం అందించే కారుణ్య నియామకం కింద 2012లో కేరళ పోలీస్ శాఖలో క్లర్క్‌గా చేరారు. తన కుమార్తె సివిల్ సర్వెంట్ కావాలన్నది ఆమె తండ్రి కల. ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా చదువును కొనసాగించిన ఆమె, కేరళ యూనివర్సిటీ నుంచి బయోకెమిస్ట్రీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఇస్రో అధికారి జోషి డి.జె.తో వివాహమైంది. ఓ పాప కూడా. తనకున్న చిన్న ఉద్యోగంతో సరిపెట్టుకోకుండా ఒక పక్క ఇంటిపని, మరో పక్క ఉద్యోగం, ఇంకా పక్క సివిల్స్‌ను కఠోర శ్రమతో పూర్తి చేశారు. ఐదుసార్లు విఫలమైనా నిరాశ చెందలేదు. పట్టు విడవలేదు. ఆరో ప్రయత్నంలో 150 ఆల్ ఇండియా ర్యాంకు సాధించరు. తండ్రి కలను నిజం చేయగలిగానన్న సంతృప్తితో ప్రస్తుతం మిన్ను జోషి మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో భట్కులితివాసా సబ్‌డివిజన్‌కు అసిస్టెంట్ కలెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. ఎన్ని బాధ్యతలున్నా లక్ష్య సాధనలో పట్టుదల ఉంటే సాధించలేనిదే ఉండదని 'మిన్ను' ప్రయత్నం నిరూపించింది.

రోజువారీ శుభ్రంతో అందం



కొంతమంది ముఖంపై ఎంత వెతికినా ఒక్క మొటి మైనా కనిపించదు. ఇక నల్లమచ్చల జాడే దొరకదు.

మేకప్ మాయజాలం లేకుండానే న్యాచురల్ బ్యూటీస్‌గా కనిపించేస్తుంటారు. ఇలాంటి వాళ్లను చూడగానే.. అందం కోసం ఎన్నెన్ని సౌందర్య చిక్సితలు తీసుకుంటారో అనిపిస్తుంటుంది. నిజానికి ఈ మహిమంతా చికిత్సలు, చిట్కాల్లో కాదు. వారు పాటించే రోజువారీ అలవాట్ల.. మరి, అవేంటో తెలుసుకుందాం..

ఉదయం నిద్ర లేచిన వెంటనే, రాత్రి పడుకునే ముందు ఈ రెండు సందర్భాల్లో ముఖం శుభ్ర పరచుకునే వారు చాలా తక్కువ మంది. ముఖంపై మొటిమలు రావడానికి ఈ నిర్లక్ష్యమూ ఓ కారణం. అందుకే ఈ రెండు సంద ర్భాలతో పాటు.. చెమట ఎక్కువగా వచ్చినప్పుడు తప్పని సరిగా ముఖం శుభ్రం చేసుకోవాలి. ఫలితంగా ముఖంపై దుమ్ము, జిడ్డుదనం తొలగిపోయి చర్మ రంధ్రాలు మూసుకుపోవు. తద్వారా మొటిమలూ ఏర్పడవు. అయితే ఈ క్రమంలో చర్మతత్వానికి సరిపడే ఫేస్‌వాష్‌ను ఎంచుకోవడమూ ముఖ్యమే. పబ్లిక్ టాయిలెట్ కంటే మొబైల్ స్క్రీన్ ఎక్కువ అపరిశుభ్రంగా ఉంటుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఫోన్ మాట్లాడేటప్పుడు, మొబైల్‌ను తాకిన చేతులతోనే ముఖాన్ని తడుముకోవడం వల్ల ఈ క్రిములు ముఖం పైకి చేరి మొటిమలకు కారణమవుతాయి. ఈ సమస్య దరిచేర కుండా.. ఫోన్ స్క్రీన్‌ను ఎప్పటికప్పుడు శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. చేతుల్ని పదే పదే ముఖానికి తాకించే అలవాటు కొంతమందికి ఉంటుంది. ఫలితంగా చేతులకున్న నక్రిములు, మురికి ముఖం పైకి చేరి మొటిమలకు కారణమవుతాయి. అందుకే ముఖం కడుక్కునేటప్పుడు తప్ప అసలు చేతుల్ని ముఖానికి తాకించకుండా జాగ్రత్తపడాలి. రోజూ వాడే క్రమంలో మన చర్మం, జుట్టు కుదుళ్లలో ఉన్న జిడ్డు దిండు కవర్ల పైకి చేరుతుంది. అది వాతావరణంలోని దుమ్మును ఆకర్షిస్తుంది. ఈ అపరిశుభ్రమైన దిండ్లనే వారాల తరబడి వాడడం, ఇతరులు వీటిని ఉపయోగించడం వల్ల ముఖంపై మొటిమలొస్తాయి. కాబట్టి వారానికోసారైనా దిండ్ల కవర్లను మార్చుకోవడం, ఎవరి దిండువారే వాడుకోవడం మంచిదంటురు.

బుఖారీ పులావ్

బాస్మతి బియ్యం: అర కిలో, మటన్: అర కిలో, క్యారెట్ తురుము: ఒక కప్పు, పచ్చి బఠాణీ: అర కప్పు, టమాట ముక్కలు: ఒక కప్పు, ఉల్లిగడ్డ: ఒకటి, పచ్చిమిర్చి: రెండు, జీడిపప్పు: పావుకప్పు, కిస్మిస్: ఒక టేబుల్ స్పూన్, అక్రోట్స్: ఐదు, నూనె: అర కప్పు, కారం: ఒక టేబుల్ స్పూన్, నంముందుగా బాస్మతి బియ్యాన్ని అరగంటపాటు నానబెట్టుకుని పొడిపొడిగా వండాలి. స్టవ్‌మీద కుక్కర్ పెట్టి ఒక టేబుల్ స్పూన్ నెయ్యి వేసి వేడయ్యాక జీడిపప్పు, అక్రోట్స్, కిస్మిస్ జోడించి బాగా వేయించి పక్కన పెట్టాలి. అదే నెయ్యిలో నూనె వేసి దాల్చిన చెక్క, సాజీర, అనాస పువ్వు, యాలకులు, లవంగాలు వేయాలి. కాసేపు వేగాక తరిగిన ఉల్లిగడ్డ, మిర్చి, టమాట కలపాలి. అన్నీ బాగా వేగాక మటన్ వేయాలి. రెండు నిమిషాలు మగ్గిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, ధనియాల పొడి, గరం మసాలా, పసుపు, క్యారెట్ తురుము, పచ్చిబఠాణీ, తగినంత ఉప్పు వేసి పది నిమిషాలు సన్నటి మంటపై మగ్గనివ్వాలి. అర లీటర్ నీళ్లు పోసి కుక్కర్ మూత పెట్టి ఐదు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. బాగా ఉడికిన మటన్‌లో.. ఉడికించి పెట్టుకున్న బాస్మతి రైస్ వేసి కలిపి పైనుంచి వేయించిన డ్రైఫ్రూట్స్, నెయ్యి వేసి మరో రెండు నిమిషాలు మూత పెట్టుకుంటే నోరూరించే బుఖారీ పులావ్ సిద్ధం.

తెర

ఘనంగా ప్రారంభమైన 'పొలిమేర 3'

బ్లాక్ బస్టర్ 'బ్లాస్ట్ జోన్' తర్వాత 'పొలిమేర' ఫ్రాంచైజీలోకి యాక్షన్ కింగ్ అర్జున్.. ఘనంగా ప్రారంభమైన 'పొలిమేర 3'. ఓటీటీలో ..'మా ఊరి పొలిమేర'తో సంచలనం సృష్టించి, థియేటర్లలో 'పొలిమేర 2'...తో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు డా. అనిల్ విశ్వనాథ్ తెరకెక్కిస్తున్న విజయవంత మైన హారర్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ ఇప్పుడు పొలిమేర3గా మరింత పవర్‌ఫుల్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. డా.అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో 'పొలిమేర 3' చిత్రాన్ని వంశీ నందిపాటి ఎంటర్‌టైన్ మెంట్స్ అండ్, ప్రముఖ నిర్మాత, పంపిణీ దారుడు దివంగత నారాయణదాస్ నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సిని మాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్స్‌పై వంశీ నంది పాటి, జాన్వీ నారంగ్‌లు ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తు న్నారు. ఈ రెండు సంస్థల కలయికతో మరింత పవర్‌ఫుల్‌గా భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం నేడు సికింద్రాబాద్‌లోని ఓ గణేష్ ఆలయంలో సంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత, ఎగ్జిబిటర్ నారాయణదాస్ నారంగ్ జయంతి సందర్భంగా చిత్రాన్ని ప్రారంభించడం విశేషంగా నిలిచింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలుగు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తొలి క్లాప్ ఇవ్వగా, సీనియర్ నిర్మాత డి. సురేష్ బాబు కెమెరా స్విచ్చాన్ చేశారు. యువ నిర్మాత బన్నీవాస్, ఎగ్జిబిటర్ సదానంద్ గౌడ్ చిత్ర బౌండెడ్ స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందించి విజయాన్ని ఆకాంక్షి ంచారు. ఈ ప్రారం భోత్సవ వేడుకలో ప్రముఖ నిర్మాత సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు తదితరులు

'టాక్సిక్' స్టైల్ పోస్టర్ రిలీజ్

రాకింగ్ స్టార్ యష్ హీరోగా గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'టాక్సిక్' విడుదలకు ఇక కేవలం నెల రోజులే మిగిలాయి. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా కౌంట్‌డౌన్‌ను ప్రారంభిస్తూ మేకర్స్ మరో కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఫియర్, మిస్టరీ, స్టైల్ కలగలిసిన ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ పోస్టర్‌లో యష్ ప్రశాంతంగా సిగరెట్ వెలిగిస్తున్నట్లు కనిపిస్తున్నారు. పొగ, చీకటి కారణంగా ఆయన ముఖం పూర్తిగా కనిపించకుండా మిస్టరీని కొనసాగించారు. ఆయన చేతి మాత్రం రక్తంతో తడిసి ఉండటం, వేళ్ల నుంచి రక్తపు చుక్కలు జారుతూ తెల్లటి షర్ట్‌పై పడటం చూస్తే ఒక టెర్రిఫిక్ యాక్షన్ సీన్ ని చూపిస్తోంది. యష్ రఫ్ బియర్డ్, టాటూలతో చేతులు, స్టైలిష్ రింగ్స్, టైలర్డ్ ఓవర్‌కోట్‌తో పవర్‌ఫుల్‌గా కనిపించారు. బ్లాక్ అండ్ వైట్ బ్యాక్‌డ్రాప్‌లో రక్తపు ఎరుపు రంగు, సిగరెట్ నిప్పు మాత్రమే ప్రత్యేకంగా హైలైట్ అవుతూ పోస్టర్‌ను మరింత ఆకట్టుకునేలా తీర్చిదిద్దాయి. కెవిఎన్ ప్రొడక్షన్స్ మరియు మాస్టర్ మైండ్ క్రియేషన్స్ నిర్మించిన 'టాక్సిక్' తన ప్రత్యేకమైన ప్రమోషనల్ క్యాంపెయిన్‌తో ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంది. కథ గురించి ఎలాంటి వివరాలు వెల్లడించకుండా విడుదల చేస్తున్న ప్రతి పోస్టర్ ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. టాక్సిక్ ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది.

'మహేంద్రగిరి వారాహి' సెప్టెంబర్ 11న విడుదల

సుమంత్, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న స్పిరిచువల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి'. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మహేంద్రగిరి వారాహి' మహేంద్రగిరి నేపథ్యం గా, వారాహి మాత డివైన్ పవర్ చుట్టూ సాగే ఈ కథలో ఎన్నో అంతుచిక్కని సంఘటనలు, రహస్యాలు, మిస్టరీతో ప్రేక్షకులకు సరికొత్త సినీ అనుభూతిని అందించబోతుంది. ఈ చిత్రంలో మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. . ఇప్పటికే విడుదలైన టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం సెప్టెంబర్ 11న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకురానున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. రిలీజ్ డేట్ ప్రెస్ మీట్‌లో హీరో సుమంత్ మాట్లాడుతూ: . 'మహేంద్రగిరి వారాహి' జర్నీ రెండున్నరేళ్ల క్రితం ప్రారంభమైంది. సంతోష్ నాకు ఈ సబ్జెక్ట్ చెప్పిన తర్వాత ఒక మంచి నిర్మాత కోసం ఎదురు చూశాం. మధు, లక్ష్మణ్ చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్. ఈ సినిమాకు ఏం కావాలో అన్నీ సమకూర్చి, చాలా గొప్పగా తీర్చిదిద్దారు. టీజర్‌ను ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు. ఈ సినిమాలో ఇంకా చాలా సర్‌ప్రైజ్ ట్విస్టులు, ఊహించని సన్నివేశాలు, ఆసక్తికరమైన మలుపులు ఉన్నాయి. మీ అందరి ఆశీస్సులతో, అమ్మవారి ఆశీస్సులతో సెప్టెంబర్ 11న థియేటర్లలోకి వస్తున్నాం. సినిమాను మరింత అద్భుతంగా తీర్చిదిద్ది మీ ముందుకు తీసుకొస్తున్నాం. ఈ సినిమా చూసిన తర్వాత మీరు తప్పకుండా సంతృప్తి చెందుతారు. ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునే సినిమా అవుతుంది. మా టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. దర్శకుడు సంతోష్ జాగర్లపూడి మాట్లాడుతూ.. నాకు ఈ అవకాశం ఇచ్చిన లక్ష్మణ్ గారికి, మధు గారికి ధన్యవాదాలు. అలాగే సుమంత్ కూడా నన్ను బలంగా నమ్మారు

'భగవంతుడు' 'సిత్తరాల నవ్వు' పాటరిలీజ్

యంగ్ టాలెంటెడ్ హీరో తిరువీర్ నటిస్తున్న కొత్త సినిమా 'భగవంతుడు'. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ నటుడు రిషి ప్రధాన పాత్రలో కనిపించ నున్నారు. ఈ సినిమాను ఏషియన్ ఫిలిమ్స్ నారాయణ దాస్ నారంగ్, పనస శంకరయ్య గౌడ్ సమర్పణలో రవి పనస ఫిలిం కార్పొరేషన్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెంబర్ 1గా నిర్మిస్తున్నారు సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రవి పనస. ఈ సినిమాతో జి.జి. విహారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న "భగవంతుడు" సినిమా త్వరలోనే రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'సిత్తరాల నవ్వు' రిలీజ్ చేశారు. ఈ పాటను మ్యూజిక్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేయగా, డైరెక్టర్ జి జి విహారి ఆకట్టుకునే లిరిక్స్ అందించారు. ప్రముఖ సింగర్ జావెద్ అలీ రిపీటెడ్‌గా వినేలా పాడారు. 'సిత్తరాల నవ్వు' పాట ఎలా ఉందో చూస్తే సిత్తరాల నవ్వు, అరే సిలకల్లే నువ్వు, చేమంతి పువ్వు, నీలాల కళ్లు, అరే పారే సెలయేళ్లు, ఒంపు పరవళ్లు..అంటూ సాగుతూ ఏరువాక పున్నమి లాంటి అమ్మాయి, కొండగాలి దేవర వంటి అబ్బాయి మధ్య ప్రేమను చూపిస్తూ రూపొందించిన ఈ మట్టి పాట ప్రతి ఒక్కరిని ఇంప్రెస్ చేస్తోంది.

'తీరం' టైటిల్ సాంగ్ విడుదల

భావోద్వేగ కథతో ప్రేక్షకుల ముందుకు రానున్న 'తీరం' హైదరాబాద్‌ల టోని ప్రసాద్ ల్యాబ్‌లో శ్రీ భవానీ క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న భావోద్వేగ ప్రధాన చిత్రం 'తీరం' టైటిల్ సాంగ్‌ను ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 'పుష్ప' ఫేమ్ నటుడు జగదీష్, ఫన్ బకెట్ మహేష్ విట్ట, నటుడు రాజ్ కుమార్ కసిరెడ్డి, దర్శకుడు ప్రసాద్, జబర్దస్త్ సద్దాం, నటుడు కుమానన్ తదితరులు హాజరై టైటిల్ సాంగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు వంశీ మునగాల మాట్లాడుతూ, తీరం' ప్రతి ఒక్కరి హృదయాలను తాకేలా భావోద్వేగభరితమైన కథతో రూపొందుతోందన్నారు. చిత్రీకరణ విజయవంతంగా పూర్తై ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు నిర్మాత ఉపేందర్ గంగావెల్లి మాట్లాడుతూ, దర్శకుడు వంశీ మునగాల కథ వినిపించిన వెంటనే ఎంతో నచ్చిందన్నారు. కథపై నమ్మకంతోనే ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చానని తెలిపారు. సినిమా నిర్మాణం తుది దశకు చేరుకుందని, విడుదల తేదీతో పాటు ఇతర విశేషాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. హీరో ప్రభు మాట్లాడుతూ, షార్ట్ ఫిల్మ్స్‌తో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించి ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్‌లో హీరోగా నటించే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నటుడు జగదీష్ మాట్లాడుతూ, తీరం అనే టైటిల్ చాలా అర్థవంతంగా ఉందన్నారు.

నటుడిగానే నా ప్రయాణం: జై కృష్ణ

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేశ్ బాబు సోదరుడు రమేశ్ బాబు తనయుడు జై కృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. నటుడిగా తనను తాను నిరూపించుకుని, ఇండస్ట్రీలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకోవడమే తన లక్ష్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జై కృష్ణ హీరోగా నటిస్తున్న తొలి చిత్రం శ్రీనివాస మంగాపురం విడుదల కానున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జై కృష్ణ మాట్లాడుతూ, "దర్శకుడు అజయ్ తీర్చిదిద్దిన పాత్రలు, భావోద్వేగాలు చాలా సహజంగా ఉన్నాయి. ఈ సినిమా ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని నమ్ముతున్నాను. నటుడిగా నా ప్రతిభను చాటుకోవడానికి ఇది ఒక చక్కని కథ. మంచి సినిమాలు చేసే నటుడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా తపన," అని పేర్కొన్నారు. దర్శకుడు అజయ్ భూపతి మాట్లాడుతూ, "మహేశ్ బాబుతరహాలోనే జై కృష్ణ కూడా ఇండస్ట్రీలో సుదీర్ఘ కాలం నిలిచిపోయే కథానాయకుడు అవుతాడు. సినిమా నేను అనుకున్న దానికంటే చాలా బాగా వచ్చింది," అని ధీమా వ్యక్తం చేశారు. నటుడు నరేశ్ విజయకృష్ణ మాట్లాడుతూ, కృష్ణవారసత్వాన్ని జై కృష్ణ ఎంతో బాధ్యతగా ముందుకు తీసుకెళ్తున్నాడని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నటులు బ్రహ్మాజీ, వడ్లమాని శ్రీనివాస్, సినిమాటోగ్రాఫర్ జై కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' అక్టోబరు 2 విడుదల

'చిట్టిబాబు'గా విక్టరీ వెంకటేష్ పాత్ర పరిచయం. విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొం దుతున్న ప్రతిష్టాత్మక కుటుంబ కథా చిత్రం ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 (ఎకె 47)' ప్రచార కార్యక్రమాలు అధికారికంగా ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా చిత్రంలోని ప్రధాన పాత్రలను ఒక్కొక్కటిగా పరిచయం చేస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. తొలి పాత్రగా విక్టరీ వెంకటేష్ పోషిస్తున్న 'చిట్టిబాబు' పాత్రను పరిచయం చేయగా, అనంతరం శ్రీనిధి శెట్టి, యువినా పార్థవి, రాజా ప్రజ్వల్ పాత్రలను పరిచయం చేయనున్నారు. ఈ నలుగురి పాత్రలు ఈ ఆత్మీయ కుటుంబ కథకు హృదయంగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో వెంకటేష్ చిట్టిబాబు పాత్రలో అలరించ నున్నారు. కుటుంబాన్ని ప్రేమతో, ఆప్యాయతతో, బాధ్యతతో ఒకే తాటిపై నడిపించే కుటుంబ పెద్దగా ఆయన పాత్ర ఆకట్టుకోనుంది. విడుదలైన పాత్ర పరిచయ వీడియోలో వెంకటేష్‌తో పాటు శ్రీనిధి శెట్టి, నారా రోహిత్ కనిపిస్తూ, నవ్వులు, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలతో నిండిన చిత్ర ప్రపంచాన్ని అందంగా పరిచయం చేశారు. సహజమైన నటన, అద్భుతమైన కామెడీ టైమింగ్, కుటుంబ కథా చిత్రాల్లో తనదైన ముద్ర వేసిన వెంకటేష్ మరోసారి అన్ని వయసుల ప్రేక్షకులను అలరించే పాత్రతో రాబోతున్నారు. చిట్టిబాబు పాత్ర ఆయన కెరీర్‌లో మరో చిరస్మరణీ యమైన పాత్రగా నిలిచేలా కనిపి స్తోంది. ఆనందం, అనుబంధాలు, కుటుంబ విలువ లకు ప్రతిరూపంగా ఈ పాత్ర ఉండబోతోంది. తొలి పాత్ర పరిచయంతోనే చిత్రంపై భారీ అంచనాలు నెల కొన్నాయి. ఇక వరుసగా రానున్న ఇతర పాత్రల పరిచయాలు కూడా 'ఆదర్శ కుటుంబం' ప్రపంచాన్ని మరింత ఆసక్తికరంగా ప్రేక్షకులకు చేరువ చేయనున్నాయి.

బొబ్బిలిలో "ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ అండ్ బి మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి

భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమ ఏర్పాట్ల పరిశీలన -బొబ్బిలి పట్టణం, జెండావీధిలో "ఇంటింటికీ టీడీపీ" కార్యక్రమం ప్రారంభం -బొబ్బిలి కోటలో మీడియా సమావేశం

బొబ్బిలి, జూలై 27 ,ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నేటి నుండి 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. మంత్రుల నుంచి బూత్ స్థాయి కన్వీనర్ల వరకు పార్టీ యంత్రాంగం మొత్తం ఈ అవుట్ రీచ్ కార్యక్రమంలో పాల్గొనాలని టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. బొబ్బిలి నియోజకవర్గంలో, బొబ్బిలి పట్టణం, జెండావీధిలో ఈ కార్యక్రమాన్ని గౌరవ ఆర్అండ్బి మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి శాసనసభ్యులు ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయనచేతులమీదుగా ప్రారంభించడం జరిగింది. మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి బొబ్బిలి కోటలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు.. కొన్ని కోట్ల రూపాయల పెట్టుబడులు విశాఖ నగరానికి వస్తున్న నేపథ్యంలో, భోగాపురం విమానాశ్రయం ప్రారంభం కావడం విశాఖఅభివృద్ధిదోహద పడుతుందని ఎంతో మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతుందన్నారు.. గత ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, రోడ్లను అధ్వాన స్థితిలో ఉంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని మండిపడ్డారు. ఇప్పుడు కూడా అసెంబ్లీకి రాకుండా బయటనుంచే మాట్లాడుతూ, వాళ్ల సొంత పత్రిక ద్వారా అవాస్తవాలను ప్రచురిస్తూ ప్రజలను ఇంకా మోసం చేస్తున్నారని విమర్శించారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉప-ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆర్వర్యంలో "అభివృద్ధి-సంక్షేమం" ఎలాంటి లోటు లేకుండా ప్రజలకు సమపాళ్లలో అందేలా చూస్తున్నామని తెలిపారు.. ఎమ్మెల్యే బేబీనాయన పారాది వంతెన నిర్మాణం కోసం ఎన్నో సార్లు తనను కలిసి ప్రజల ఇబ్బందులు తెలియపరచి, వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించుకున్నారనిఅంతటి పట్టుదల ఉన్న ఎమ్మెల్యే దొరకడం బొబ్బిలి నియోజకవర్గ ప్రజల అదృష్టమని కొనియాడారు.. బొబ్బిలి నియోజకవర్గంలో అన్ని రోడ్లను తప్పకుండా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.. అనంతరం, ఎమ్మెల్యే బేబీనాయన పారాది వంతెన నిర్మాణానికి దుర్భరమైన రోడ్డు కారణంగా బొబ్బిలి ప్రజలు నరకం చూశారని, గత ప్రభుత్వ హయాంలో ఎక్కడా ఒక్క రోడ్డు కూడా వేయకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని అన్నారు.. ఇప్పుడు బొబ్బిలి ప్రజలు ప్రశాంతంగా రోడ్లపై ప్రయాణం చేస్తున్నారంటే అందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి కారణమని, వారికి బొబ్బిలి ప్రజలు రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఏపి మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, విజయనగరం పార్లమెంట్ ఇంచార్జ్ డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ బొబ్బిలి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ గిరడ అప్పలస్వామి, విజయనగరం జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వేమకోటి గిరిబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

53 లక్షల వ్యయంతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

పాచిపెంట జూలై 27 ప్రభాతవార్త

మండల కేంద్రమైన పాచిపెంట ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన మండల విద్యా శాఖ కార్యాలయం భవనాన్ని మంత్రి గుమ్మడి సంధ్యారాణి సోమవారం ప్రారంభించారు. విద్యా పరిపాలన మరింత సమర్థవంతంగా సాగి విద్యార్థులు, ఉపాధ్యాయులకు మెరుగైన సేవలు అందించడానికి అనువుగా ఉంటుందని అన్నారు. అలాగేఈ సందర్భంగా ప్రజా సేవల బలోపేతానికి గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పంచాయతీలకు 25 ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. అలాగే మండలంలో గల సచివాలయాలకు 1,92,500 విలువైన 17 యూపీఎస్లను అందజేశారు. విద్య, గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యం, ప్రజా సంక్షేమం-ఈ నాలుగు రంగాల్లో సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

నిరశన ర్యాలీ విజయవంతం చేయాలి

పోస్టర్ ఆవిష్కరించిన వైకాపా నాయకులు

గరివిడి, జూలై 27, ప్రభాత వార్త

డిఎస్సీ లో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలపై ఈ నెల 28 న విజయనగరంలో వైకాపా యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించే నిరశన ర్యాలీ విజయవంతం చేయాలని విజయనగరం మాజీ పార్లమెంటు సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ యువ నాయకురాలు డాక్టర్ బొత్స అనూష కోరారు. నిరశన ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ని ఈ సందర్భంగా చీపురుపల్లి నియోజకవర్గ వైకాపా నాయకులు సమక్షంలో ఆవిష్కరించారు. శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యక్రమంలో జరిగిన సమావేశంలో బెల్లాన, అనూష లు మాట్లాడుతూ డిఎస్సీలో జరిగిన అవినీతి కి నైతిక బాధ్యత వహించి విద్యాశాఖామంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని వారు కోరారు. విజయనగరం మున్సిపల్ కార్యాలయం నుండి మూడు లాంతర్లు సెంటర్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. ర్యాలీ కి పెద్ద ఎత్తున తరలి రావాలని వారు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో చీపురుపల్లి నియోజకవర్గ వైకాపా నాయకులు మీసాల విశ్వేశ్వర రావు, కోట్ల విశ్వేశ్వర రావు, కె వి సూర్యనారాయణ రాజు, ఇప్పిలి అనంత్, పొట్నూరు సన్యాసి నాయుడు, వలిరెడ్డి శ్రీనివాసులు నాయుడు, లెంక శ్రీరాములు నాయుడు, తాడ్డే వేణుగోపాల్ నాయుడు, బమ్మిడి కార్తీక్, బెల్లాన వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం విద్య పెద్ద పీట

కే.జీ.బీ.వీలో అదనపు భవనాలకు భూమి పూజ చేసిన మంత్రి సంధ్యారాణి

పాచిపెంట, జూలై 27, ప్రభాత వార్త

విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు .మండ కేంద్రమైన పాచిపెంట కేజీబీవీ జూనియర్ కళాశాలకు అదనపు తరగతుల భవనాలకు 2.12 కోట్ల రూపాయలు నిధులతో మంజూరైన అదనపు భవనాలకు సోమవారం భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలోఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్య పట్ల ఎనలేని ప్రాధాన్యత కల్పించడంలో ముందుంటున్నారు. పాచిపెంట గ్రామంలో కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం 2.12 కోట్ల రూపాయలను సి.ఎం చంద్రబాబు నాయుడు నిధులు మంజూరు చేశారని అన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రజాదర్బార్లో విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని అదనంగా మరో 10 మరుగుదొడ్లను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని అన్నారు. ఐటీడీఏలను నిర్వీర్యం చేసిన గత ప్రభుత్వం తీరు వలన మూతపడ్డాయని అన్నారు. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐటీడీఏలు బలోపేతానికి కృషి చేస్తూ ఐటిడిఏ పిఓ లను నియమించడం జరిగిందని ఐటీడీఏ ద్వారా గిరిజనులకు ట్రైకా రుణాలను ఇతరత్రా పథకాలను అందిస్తున్నామని అన్నారు.ఈ పిల్లలను చూస్తే బాల్యం గుర్తుకు వస్తోంది.ఆటపాటలతో హాయిగా చదువుకోండి... తల్లిదండ్రులు చెప్పినట్లు వినండి.. గురువుల ఆశీస్సులు పొందండి విద్యార్థినిలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏం సి చైర్మన్ ముఖి, మండల టిడిపి అధ్యక్షులు యుగంధర్, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి బలరాం యువత అధ్యక్షుడు కనక స్థానిక ఎంపీటీసీలు డి ఏడుకొండలు పి ఉమా ఎంపీడీవో పాత్రో తహసిల్దార్ రవి ,కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు

ఎన్డీయే ప్రభుత్వ రెండేళ్ల ప్రగతి వివరించిన ఎమ్మెల్యే.

కురుపాం,జూలై 27 ప్రభాతవార్త.

తెలుగుదేశం ప్రభుత్వం ఇంటింటి కార్యక్రమంలో భాగంగా ఎన్డిఏ ప్రభుత్వశీ రెండేళ్లలో చేసిన ప్రగతిని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రజలకు వివరించారు. సోమవారం ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో గుమ్మ లక్ష్మీపురం మండల కేంద్రంలోని బూత్ నెంబర్-75లో "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్ పాల్గొన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేసిన సూపర్-6 హామీలు, రాజధాని అమరావతి అభివృద్ధి, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, వృద్ధుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తోందని, గత రెండేళ్లలో అభివృద్ధి సంక్షేమం సమన్వయంతో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాల వివరాలను తెలుసుకుంటూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రతి ఇంటికి చేరవేయడంతో పాటు ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ స్థాయిలో మరింత చురుకుగా పనిచేసి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మదారపు వెంకటేష్, నియోజకవర్గ జనసమీకరణ పరిశీలకులు పెరిపి ఈశ్వరరావు,

కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం

సాలూరు జులై27 ప్రభాతవార్త

ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అలాగే మంత్రి సంధ్యారాణి సూచన మేరకు సాలూరు మండల నాయకుడు ఆముదాల పరమేష్ ఆధ్వర్యంలో రెండేళ్ల నమ్మకం ఇంటింటా తెలుగుదేశం అనే కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఈ మేరకు జీగిరాం గ్రామంలో పరమేష్‌తో కలసి టీడీపీ నాయకులు కార్యకర్తలు ప్రతి ఇంటికి డోర్ టు డోర్ వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందజేసారు. అలాగే కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్ల పాలనలో వారికి అందించిన సంక్షేమ పథకాలు ఇంకా అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని రాబోయే రోజుల్లో మరింత సంక్షేమం అభివృద్ధి చూస్తారని భరోసా కల్పించారు. నడిమింటి రామకృష్ణ,కోట లక్ష్మణ్,ముప్పల ప్రసాద్,శ్రీరామ్,రవికుమార్, సింహాచలం,దుర్గారావు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన ధ్యేయంగా సీఎం కృషి చేస్తున్నారు : ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట,జులై27, ప్రభాతవార్త..

రాష్ట్రంలో పేదరిక నిర్మూలన ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు ఏర్పడిన సందర్భంగా టీడీపీ పార్టీ ఇంటింట తెలుగుదేశం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోళ్ల మండలంలోని పోతనాపల్లి గ్రామంలో సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా కోళ్ల ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో రెండేళ్లలో జరిగిన అభివృద్ధి,సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయం కోసం కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రగతి ఫలాలను తెలుగుదేశం పార్టీ శ్రేణులంతా బాధ్యతగా ప్రతి ఇంటికీ చేర్చాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

వాగ్దేవి డిఫెన్స్ అకాడమీలో వైభవంగా ఫ్రెషర్స్ డే..

కొత్తవలస జూలై 27 (ప్రభాతవార్త)

క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో చదువుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లి వద్దనున్న వాగ్దేవి డిఫెన్స్ అకాడమీలో ఫ్రెషర్స్ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కృషి పట్టుదల క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని ఆమె తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కోటిన మహేశ్వర రావు, కళాశాల చైర్మన్ డా.కె. చంద్రమౌళి, కళాశాల డైరెక్టర్ సీహెచ్. ప్రవీణ్ కుమార్, మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తే తమ లక్ష్యమని, దేశసేవ భావనను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కళాశాల ప్రాంగణమంతా విద్యార్థుల,ఆనందోత్సాహాలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ సతీష్, రాజ్ కుమార్, సురేష్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనరి.

త్వరలోనే పరిహారం చెక్కులు పంపిణీ.. ఎమ్మెల్సీ రఘురాజు భరోసా

శృంగవరపుకోట,జూలై27, ప్రభాతవార్త..

జిందాల్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు పరిహారం చెక్కుల పంపిణీ ప్రక్రియ త్వరలోనే పూర్తి కానుందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు.తమకు చెక్కులు ఎప్పుడు అందుతాయనే అంశంపై బాధితులు సోమవారం బొడ్డవరలో ఎమ్మెల్సీని కలిశారు. ఈవిషయమై ఎమ్మెల్సీ నిర్వాసితులతో మాట్లాడుతూ ఎవరూ అధైర్యపడవద్దని బాధితులకు తగిన న్యాయం జరిగేలా ప్రభుత్వం పెద్దలతో,జిందాల్ యాజమాన్యంతో, సంబంధిత అధికారులతో నిరంతరం చర్చిస్తున్నానని భరోసా ఇచ్చారు.ఈవారంలో పరిహారం చెక్కులు అందే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఎమ్మెల్సీ వెల్లడించారు. ఈసమస్య త్వరితగతిన కొలిక్కి వచ్చేలా రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత,జిల్లా యంత్రాంగం, కంపెనీ యాజమాన్యంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని త్వరలోనే బాధితులకు పరిహారం అందుతుందని ఎమ్మెల్సీ రఘురాజు నిర్వాసితులకు తెలిపారు.

నేటి నుంచే అమరావతి ఛాంపియన్ షిప్ ఆటల పోటీలు : కోఆర్డినేటర్ శ్రీరాములు

శృంగవరపుకోట,జూలై27,ప్రభాతవార్త..

ఎస్.కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం నుంచి అమరావతి ఛాంపియన్ షిప్ 2026 ఆటల పోటీలు ప్రారంభం కానున్నాయని నియోజకవర్గ క్రీడా కోఆర్డినేటర్ పి.శ్రీరాములు తెలిపారు. కబడ్డీ,ఖోఖో, వాలీబాల్,చెస్, యోగ, బ్యాడ్మింటన్ లలో అండర్ 17 అండర్ 23 స్త్రీ పురుషులకు ఎంపిక పోటీలు నిర్వహించి త్వరలో జిల్లా స్థాయిలో జరగబోవు పోటీలకు నియోజకవర్గ స్థాయి టీంలను ఎంపిక చేసి పంపించడం జరుగుతుందని తెలిపారు.ఈపోటీలలో పాల్గొనే క్రీడాకారులు ముందుగా ఆన్ లైన్లో పేర్లు నమోదు చేసుకోనే వారు మాత్రమే పాల్గొనాలని తెలిపారు.ఇందులో పాల్గొనే క్రీడాకారులకు ప్రభుత్వ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు దారరాజు భోజన ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఈపోటీలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

ఘనంగా ఎంఆర్ఎన్ జన్మదిన వేడుకలు

మక్కువ జులై 27 ప్రభాతవార్త

మక్కువ మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మావుడి రంగు నాయుడు జన్మదిన వేడుకలను మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలంలో ఉన్న 21 పంచాయతీల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున నిర్వహించారు. మండలం నుండే కాకుండా నియోజకవర్గ స్థాయిలో నాయకులు రంగు నాయుడుకు శుభాకాంక్షలు తెలపడానికి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బారులు తీరారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించి మావుడి వెంకటరావు రైస్ మిల్ ప్రాంగణంలో పెద్ద ఎత్తున భోజన కార్యక్రమాలు నిర్వహించారు.

పశువైద్య కళాశాలను తనిఖీ నిర్వహించిన విసీఐ బృందం

గరివిడి, జూలై 27,ప్రభాతవార్త

గరివిడి పశువైద్య కళాశాలను పశువైద్య మండలి బృందం తనిఖీ నిర్వహించింది. న్యూ ఢిల్లీకి చెందిన వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇన్స్పెక్టర్లు డాక్టర్ సుశాంత్ రాయ్(కర్ణాటక), డా.ఎల్.రామ్ సింగ్ (తెలంగాణ) సోమవారం కళాశాల తనిఖీ చేపట్టారు. కళాశాలలో భవనాలు, మౌలిక సౌకర్యాలు, ల్యాబ్,తరగతి గదులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రొఫెసర్లు ఎంత మంది ఉన్నారు రికార్డులను పరిశీలించారు. రహదారులు, వసతి గృహాలు, తదితర కళాశాల పరిసరాలు వారు నిశితంగా క్షేత్ర స్థాయిలో చూసారు. కళాశాల కు గత ఆరేళ్లుగా విసి ఐ అనుమతులు లభించని నేపథ్యంలో విసీఐ బృందం తనిఖీ చేపట్టడంతో అనుమతులు మంజూరు కాగలవని గంపెడాశతో విద్యార్థిలోకం నిరీక్షిస్తుంది. కాగా రెండు రోజులు పాటు కళాశాల ను పశువైద్య మండలి బృందం తనిఖీలు చేపట్టనున్నట్లు కళాశాల యాజమాన్య ప్రతినిధులు వెల్లడించారు. కాగా విసీఐ బృంద పరిశీలనలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ ఆర్ వి సురేష్ కుమార్, తిరుపతి వెటర్నరీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.విను, గరివిడి పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నెక్కంటి ధనలక్ష్మి పశువైద్య కళాశాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ ఇంటింటి ప్రచార కార్యక్రమం

పార్వతీపురం, జులై27, ప్రభాతవార్త:



కూటమి ప్రభుత్వం రెండేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించి ప్రజల కష్ట సుఖాలు తెలుసుకోవాలని నియోజకవర్గ ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో అమలైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు ఇంటింటికీ చేరవేసే ప్రచార కార్యక్రమానికి పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేశారు. విజయచంద్ర మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రతి వార్డుకు, ఇంటికి వెళ్లి ప్రతి ఓటర్ ని కలిసి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ప్రతి వార్డులో విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. అదేవిధంగా ఆగస్టు 1న విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలో నిర్మించిన శ్రీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానుందని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి చారిత్రాత్మక మైలురాయిగా నిలిచే ఈ కార్యక్రమానికి పార్వతీపురం నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు కోరాడ రాజాబాబు పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

విజయనగరం పార్వతీపురం మన్యం
వార్త 25

బొబ్బిలిలో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డబీ మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి

భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమ ఏర్పాట్ల పరిశీలన -బొబ్బిలి పట్టణం, జెండావీధిలో "ఇంటింటికీ టీడీపీ" కార్యక్రమం ప్రారంభం. -బొబ్బిలి కోటలో మీడియా సమావేశం

బొబ్బిలి, జూలై 27 ,ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నేటి నుండి 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది..మంత్రుల నుంచి బూత్ స్థాయి కన్వీనర్ల వరకు పార్టీ యంత్రాంగం మొత్తం ఈ అవుట్ రీచ్ కార్యక్రమంలో పాల్గొనాలని టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు.. బొబ్బిలి నియోజకవర్గంలో, బొబ్బిలి పట్టణం, జెండావీధిలో ఈ కార్యక్రమాన్ని గౌరవ ఆర్డబీ మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి శాసనసభ్యులు ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన చేతులమీదుగా ప్రారంభించడం జరిగింది. మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి బొబ్బిలి కోటలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు.. కొన్ని కోట్ల రూపాయల పెట్టుబడులు విశాఖ నగరానికి వస్తున్న నేపథ్యంలో, భోగాపురం విమానాశ్రయం ప్రారంభం కావడం విశాఖఅభివృద్ధిదోహద పడుతుందని ఎంతో మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతుందన్నారు.. గత ప్రభుత్వం హయాంలో ఉత్తరాంధ్ర ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, లిరోడ్లను అధ్వాన స్థితిలో ఉంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని మండిపడ్డారు. ఇప్పుడు కూడా అసెంబ్లీకి రాకుండా బయటనుంచే మాట్లాడుతూ, వాళ్ల సొంత పత్రిక ద్వారా అవాస్తవాలను ప్రచురిస్తూ ప్రజలను ఇంకా మోసం చేస్తున్నారని విమర్శించారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉప-ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆర్వర్యంలో "అభివృద్ధి-సంక్షేమం" ఎలాంటి లోటు లేకుండా ప్రజలకు సమపాళ్లలో అందేలా చూస్తున్నామని తెలిపారు.. ఎమ్మెల్యే బేబీనాయన పారాది వంతెన నిర్మాణం కోసం ఎన్నో సార్లు తనను కలిసి ప్రజల ఇబ్బందులు తెలియపరచి, వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించుకున్నారనిఅంతటి పట్టుదల ఉన్న ఎమ్మెల్యే దొరకడం బొబ్బిలి నియోజకవర్గ ప్రజల అదృష్టమని కొనియాడారు. బొబ్బిలి నియోజకవర్గంలో అన్ని రోడ్లను తప్పకుండా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.. అనంతరం, ఎమ్మెల్యే బేబీనాయన గారు మాట్లాడుతూ, దుర్భరమైన రోడ్డు కారణంగా బొబ్బిలి ప్రజలు నరకం చూశారని, గత ప్రభుత్వ హయాంలో ఎక్కడా ఒక్క రోడ్డు కూడా వేయకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని అన్నారు.. ఇప్పుడు బొబ్బిలి ప్రజలు ప్రశాంతంగా రోడ్లపై ప్రయాణం చేస్తున్నారంటే అందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి కారణమని, వారికి బొబ్బిలి ప్రజలు రుణపడి ఉంటామని అన్నారు.ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఏపి మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, విజయనగరం పార్లమెంట్ ఇంచార్జ్ డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ బొబ్బిలి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ గిరడ అప్పలస్వామి, విజయనగరం జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వేమకోటి గిరిబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి

నెల్లిమర్ల, జూలై 27, ప్రభాతవార్త

పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం రుచికరంగా ఉండేలా భోజన కమిటీ మహిళలు ప్రత్యేక దృష్టి సారించాలని మండల విద్యాశాఖ అధికారి 2 సిద్ధాంతం త్రినాధరావు సూచించారు. మండలంలోని కొండ గుంపాం ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఉపాధ్యాయులతోనూ విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు అంక శ్రేడి పై సమస్యలను ఇచ్చి విద్యార్థులతో చేయించారు. విద్యార్థుల స్పందన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలను చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళలకు రంగవల్లి పోటీలు

నెల్లిమర్ల, జూలై 27, ప్రభాతవార్త

భోగాపురంలో ఆగష్టు 1న ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ల చేతులు మీదుగా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని గ్రామ, మండల స్థాయిల్లో మహిళలకు వెలుగు ఏపీఎం సురేష్ ఆధ్వర్యంలో రంగవల్లి పోటీలు నిర్వహించారు. గ్రామ స్థాయిలో ప్రతి మహిళా ఎంతో ఆనందంగా రంగవల్లి పోటీల్లో పాల్గొన్నారని ఆయన తెలిపారు. అలాగే స్థానిక మండల సమాఖ్య కార్యాలయం వద్ద కూడా మండల స్థాయిలో రంగవల్లి పోటీలు నిర్వహించారు. మహిళలు అందరూ స్వచ్ఛందంగా పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. భాగపురంలో ప్రారంభమవుతున్న అంతర్జాతీయ విమానాశ్రయం వలన మన ఉత్తరాంధ్ర ఎంతో అభివృద్ధి చెందుతుందని, యువతకి కొత్త ఉపాధి అవకాశాలు రావడం జరుగుతుందని,పర్యటకంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు . రైతుకు , యువతకు కొత్త ఆశలు కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రగతి వైపు పయనిమ్పచేస్తూ ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల కలలను సాకారం చేసిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రికి మహిళలు ధన్యవాదాలు తెలిపారు.

LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

బ్యాక్ ఆఫీస్, 4వ అంతస్తు, ఉత్తర విభాగం, జీవన్ సమృద్ధి, న్యూ ఇన్వెస్ట్‌మెంట్ భవనం, ఎల్.ఐ.సి. ఎనెక్స్ భవనం, తిక్కన రోడ్డు, విశాఖపట్నం - 530004. ఫోన్:0891-2746480

(రూల్ 8 (1) స్వాధీనతా ప్రకటన

U/s.13(4) SARFAESI చట్టం 2002 ప్రకారం (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారము LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సదరు చట్టము సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని (రూల్-3)తో చదువబడే సెక్షన్ 13(12) ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: శ్రీ సోమశేఖర్ బాదంపూడి మరియు శ్రీమతి సాయి లత బాదంపూడి** వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **తేది.15.04.2026 నాటికి రూ.41,75,469.20 (అక్షరాల నలభై ఒక లక్షల డెబ్బై అయిదు వేల నాలుగు వందల అరవై తొమ్మిది రూపాయల ఇరవై పైసలు మాత్రమే) తేది.16.04.2026 నుండి** తదుపరి వడ్డీ, ఖర్చులు మొదలగునవి కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.12-05-2026న డిమాండ్ నోటీసు** జారీ చేయబడినది.**(లోన్ ఖాతా నెం. 7003020002065, ఏరియా ఆఫీస్ : విజయనగరం).**

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు నందలి రూలు 8 ప్రకారము **LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌నకు తనఖా చేయబడిన దిగువ తెలిపిన ఆస్తిని తేది.22-07-2026న లాంఛనాత్మకంగా స్వాధీనత** తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా చెల్లించవలసిన బకాయి మొత్తం **తేది.15.04.2026 నాటికి రూ.41,75,469.20 (అక్షరాల నలభై ఒక లక్షల డెబ్బై అయిదు వేల నాలుగు వందల అరవై తొమ్మిది రూపాయల ఇరవై పైసలు మాత్రమే) తేది.16.04.2026** నుండి ఒప్పంద రేటు ప్రకారం వర్తించు తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు **LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి వుండునని ప్రత్యేకించి ఋణగ్రహీత/ సహ-ఋణగ్రహీత/హామీదారు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. (మీ ద్వారా ఏవైనా చెల్లింపులు ఉన్నచో మినహాయించబడును).

స్థిరాస్తి వివరములు

విజయనగరం జిల్లా, విజయనగరం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు (ఆర్.ఓ), విజయనగరం కార్పొరేషన్, అయ్యన్నారాయణపురం గ్రామం మరియు పంచాయితీ, సర్వే నెం.49/1లోని 205 చ॥గ॥లు విస్తీర్ణంల స్థలం అందు 51.25 చ॥గ॥లు లేదా 42.85 చ॥మీ॥ల అవిభాజ్య మరియు అనిర్దేశపు వాటాతో గల స్థలం అందు "శ్రీ రమణ ఎన్‌క్లేవ్", రెండవ అంతస్తులోని 1450 చ॥అ॥లు (కామన్ ఏరియాలతో సహా), స్టిల్ట్ ఫ్లోర్ నందు 100 చ॥అ॥ల కార్‌పార్కింగ్ ఏరియాతో గల ఫ్లాట్ నెం.10. **హద్దులు: తూర్పు:** ప్లాటు నెం.11 ఖాళీ స్థలం, **దక్షిణం:** ప్లాటు నెం.22 ఖాళీ స్థలం, **పడమర :** ప్లాటు నెం.9 ఖాళీ స్థలం, **ఉత్తరం :** లేఅవుట్ రోడ్డు. **ఫ్లాట్‌కు హద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** కారిడార్ లిఫ్ట్ & మెట్లు.

తేది.22.07.2026న నా స్వహస్తములతో కంపెనీ ముద్రతో జారీచేయబడినది.

తేది. : 22.07.2026 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విశాఖపట్నం LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

టీమిండియా వరుస ఓటములపై..
గంభీర్, శ్రేయస్ అయ్యర్‌లకు చెక్!

న్యూఢిల్లీ: టీమిండియా వరుస ఓటములపై సమీక్ష నిర్వహించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) సిద్ధమైంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత్ 6 టి20లు, రెండు వన్డేల్లో ఓటమిపాలైంది. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలోఉంచుకొని విదేశాల్లో భారత జట్టు ప్రదర్శన మెరుగయ్యేందుకు చేపట్టాల్సిన మార్పులు, ఆటగాళ్ల ఎంపిక, వ్యూహాలపై వివరంగా చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ వరుస ఓటముల వెనుక గల కారణాలను బిసిసిఐ ఆరా తీయనుంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లతో అత్యవసర సమావేశం నిర్వహించి వరుస పరాజయాలకు వివరణ కోరాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. భారత జట్టు పేలవ ప్రదర్శనపై భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు అధికారులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. జింబాబ్వేతో ప్రస్తుతం జరుగుతున్న టి20 సిరీస్ ముగిసిన వెంటనే ముంబైలోని ప్రధాన కార్యాలయంలో ఈ ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి టీమిండియా టి20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో పాటు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, తాత్కాలిక కోచ్ వీవీఎస్ లక్ష్మణ్, సెలెక్టర్లు, బిసిసిఐ అధికారులు హాజరు కానున్నారు. ఈ సమావేశంలో తక్షణ నిర్ణయాలేవి తీసుకోనప్పటికీ గంభీర్, శ్రేయ్యర్ ఇద్దరికీ ఒక గట్టి వార్నింగ్ ఇచ్చే అవకాశం ఉంది. గంభీర్‌కు 2027 వరకు ఒప్పందం ఉన్నం దున అతని పదవికి వచ్చే ముప్పు ఏం లేనప్పటికీ, వన్డే, టి20 క్రికెట్‌లో జట్టు ఘోర ప్రదర్శన ఒత్తిడిని పెంచుతోంది. టెస్ట్‌ల్లో భారత ప్రదర్శన మరీ నాసిరకంగా తయారైంది. పరిస్థితులు ఇలానే కొనసాగితే 2027 వన్డే ప్రపంచకప్‌లో కూడా భారత్ పేలవ ప్రదర్శన కన బర్చే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. దాంతోనే గంభీర్‌తో అత్యవసర సమావేశానికి బిసిసిఐ సిద్ధమైనట్లు తెలుస్తోంది. కొత్త టి20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వైఖరిపై కూడా ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉంది. కాకపోతే అతనికి మరికొన్ని సిరీస్‌ల వరకు అవకాశం ఇవ్వవచ్చు. 2026 ఆసియా గేమ్స్‌లో భారత్ గోల్డ్ మెడల్ సాధిస్తే అతనిపై ఉన్న ఒత్తిడి తగ్గనుంది. ఇదే సమయంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కింద పని చేసే సపోర్ట్ స్టాఫ్ భవితవ్యంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు.

వరల్డ్ కప్ మహిళల పిస్టల్..
ఈషాకు స్వర్ణం
మనుకు కాంస్యం

న్యూఢిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్ డబుల్ పోడియం ఫినిష్‌ను సాధించింది. చైనాలోని హాంగ్‌జౌలో సోమవారం జరిగిన ఈ పోటీల్లో హైదరాబాద్ షూటర్ ఈషా సింగ్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, ఒలింపిక్ పతక విజేత మను భాకర్ కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఎనిమిది మంది షూటర్ల ఫైనల్‌లో ఈషా నిలకడైన ప్రదర్శన కనబరిచి, 40 హిట్‌లతో పోడియంపై అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో మను పోరాడి, కీలకమైన షూట్‌ఆఫ్‌లో నెగ్గి, 28 హిట్‌లతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఇద్దరు భారతీయ షూటర్లు ఆకట్టుకున్నారు, మను 586-20న స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా, ఈషా 585-18న స్కోరుతో రెండో స్థానంలో నిలిచి ఫైనల్‌లో తమ స్థానాలను సునాయాసంగా ఖరారు చేసుకున్నారు. ఇక మాజీ ఆసియా క్రీడల ఛాంపియన్ రాహి సర్నోబత్ 582 -16న స్కోరుతో పతకాల రౌండ్‌కు అర్హత సాధించడంలో స్వల్ప తేడాతో విఫలమయ్యాడు. సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ (576-20న) మరియు అభిజ్ఞా అశోక్ పాటిల్ (573-16న) ర్యాంకింగ్ పాయింట్స్ ఓన్లీ (ఆర్‌పీఓ) విభాగం కింద పోటీపడ్డారు. కాగా 21 ఏళ్ల హైదరాబాదీ షూటర్ ఈషా ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉంది. ఈ యేడాది ఆరంభంలో మ్యూనిచ్‌లో జరిగిన ఫైనల్‌లో 43 హిట్స్‌తో సీనియర్, జూనియర్ ప్రపంచ రికార్డులు రెండింటినీ నెలకొల్పి ఆమె చరిత్ర సృష్టించింది. పారిస్ 2024 ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత అయిన ఈషా, ప్రపంచంలోని అగ్రశ్రేణి పిస్టల్ షూటర్లలో ఒకరిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

కామన్వెల్త్ గేమ్స్ మహిళల వెయిట్ లిఫ్టింగ్
జ్ఞానేశ్వరికి రజతం

న్యూఢిల్లీ: కామన్వెల్త్ గేమ్స్ 2026 మహిళల 53 కేజీల వెయిట్ లిఫ్టింగ్ ఈవెంట్‌లో భారత క్రీడాకారిణి జ్ఞానేశ్వరి యాదవ్ రికార్డు బ్రేకింగ్ ప్రదర్శనతో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. గ్లాస్గోలో సోమవారం జరిగిన స్నాచ్ విభాగంలో జ్ఞానేశ్వరి తన మూడు ప్రయత్నాలలో 82 కేజీలు, 85 కేజీలు, 88 కేజీలను విజయవంతంగా ఎత్తి, ప్రారంభ విభాగం తర్వాత రెండవ స్థానంలో నిలిచింది. నైజీరియాకు చెందిన ఒనోమే ఒమోలోలా డిడిహ 93 కేజీలతో అగ్రస్థానంలో నిలవగా, కెనడాకు చెందిన రెబెకా గ్రౌల్క్స్ 83 కేజీలతో మూడవ స్థానంలో నిలిచింది. జ్ఞానేశ్వరి అదే ఊపును క్లీన్ అండ్ జర్క్‌లో కూడా కొనసాగించి, తొలి ప్రయత్నంలో 103 కేజీలను సునాయాసంగా ఎత్తి, రెండవ ప్రయత్నంలో దానిని 107 కేజీలకు మెరుగుపరుచుకుంది. రజత పతకం కోసం జరిగిన పోరులో, జ్ఞానేశ్వరి అత్యంత కీలకమైన సమయంలో తన చివరి ప్రయత్నంలో 111 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి సత్తా చాటింది. ఈ ప్రదర్శన ఆమెకు పోడియంపై స్థానాన్ని సంపాదించి పెట్టడమే కాకుండా, ఒక కొత్త వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శనను, క్లీన్ అండ్ జర్క్‌లో (111 కిలోలు) ఒక కొత్త భారత జాతీయ రికార్డును, మరియు మొత్తం 199 కిలోల (88 కిలోలు + 111 కిలోలు) బరువుతో ఒక కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది.

హెచ్‌సిఎ డివిజన్ లీగ్ క్రికెట్‌లో
రాణించిన శ్రేయ్‌సింగ్

హైదరాబాద్,జులై 27: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఏ డివిజన్, బీ డివిజన్ రెండు రోజుల లీగ్ ఛాంపియన్‌షిప్‌లో తొలి రోజు మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగాయి. బ్యాటర్లు భారీ స్కోర్లు నమోదు చేయగా, పలువురు బౌలర్లు ఐదు, ఆరు వికెట్లతో మెరిశారు. వర్షం కారణంగా కొన్ని మ్యాచ్‌లు ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయ్యాయి. చార్మినార్ 308 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. జట్టులోని బ్యాటర్ శ్రేయ్‌సింగ్ 97 పరుగులతో శతకాన్ని మిస్‌అయినా 8 బౌండరీలు, మూడు సిక్స్‌లు సాధించి శెహభాష్ అనిపించుకున్నాడు. భావేష్ సేథ్ 88 పరుగులు చేశాడు. రిషబ్ బస్లాస్ 6 వికెట్లు పడగొట్టాడు. ప్రత్యర్థి ఈఎంసీసీ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 107/1తో నిలిచింది.ఎ డివిజన్: దయానంద్, స్పోర్టింగ్ ఎలెవన్ విజయాలు రౌండ్ 1 తొలి రోజు మ్యాచ్‌లో ఆర్. దయానంద్ జెమినీ ఫ్రెండ్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జెమినీ ఫ్రెండ్స్ 124 పరుగులకు ఆలౌటవగా చిరాగ్ యాదవ్ (52), అవేజ్ అహ్మద్ (40) రాణించారు. ఎం. ధీరజ్ రావు 6/29తో చెలరేగాడు. అనంతరం దయానంద్ 125/4తో లక్ష్యాన్ని చేరుకుంది. రవి తేజ అజేయ అర్ధశతకం (50..) సాధించాడు.స్పోర్టింగ్ ఎక్స్ఐ కూడా ఎస్‌బిఐపై ఐదు వికెట్లతో గెలిచింది. ఎస్‌బిఐ 133 పరుగులకు ఆలౌట్ అవగా తనయ్ త్యాగరాజన్ 5/14తో అద్భుత బౌలింగ్ చేశాడు. అనంతరం యశ్ సత్వాలేకర్ (52) అర్ధశతకంతో స్పోర్టింగ్ ఎక్స్ఐ 19.4 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది.బడ్డింగ్ స్టార్ 43 ఓవర్లలో 142/2తో బలమైన స్థితిలో నిలిచింది. జైరామ్ కశ్యప్ (70), విభాన్ ఆదిత్య వర్మ (32 నాటౌట్) రాణించారు.కేంబ్రిడ్జ్ ఎక్స్ఐ 256 పరుగులు చేయగా, ఆశ్లేష్ వామన్ 73, అర్హాన్ సత్వాలేకర్ 59 రాణించారు. ఇంపీరియల్ తొలి రోజు 18 పరుగులు వికెట్ నష్టపోకుండా చేసింది.డెక్కన్ వాండరర్స్ 37 ఓవర్లలో 246/3తో భారీ స్కోరు సాధించింది. నితీష్ రెడ్డి 112 బంతుల్లో 107 పరుగులతో శతకం నమోదు చేయగా, సాయి శరణ్ 68, హర్షిత్ చౌదరి 44 పరుగులు చేశారు.ఉమ్మడి రెండు జిల్లాల జట్లు కూడా తొలి ఇన్నింగ్స్‌లో వరుసగా 117, 230 పరుగులుచేశాయి. ఏఓసీఎవర్‌గ్రీన్, ఎస్‌సీఆర్ఎస్ఏడెక్కన్ క్రానికల్‌మ్యాచ్‌లు తడి మైదానం కారణంగా ఒక్క బంతికూడా పడకుండానే రద్దయ్యాయి.

కామన్వెల్త్ బాక్సింగ్‌లో..
క్వార్టర్ ఫైనల్స్‌కు సచిన్

న్యూఢిల్లీ: కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల 65 కేజీల బాక్సింగ్ ఈవెంట్‌లో భారత్ బాక్సర్ సచిన్ సివాచ్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. బాక్సింగ్‌ఈవెంట్‌లో 26 యేళ్ల క్రీడాకారుడు, సోమవారం ఇక్కడ స్కాటిష్ ఈవెంట్ క్యాంపస్‌లో జరిగిన పోరులో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, ఇంగ్లాండ్‌కు చెందిన విలియం హెవిట్‌ను 4-1 పాయింట్ల తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. హెవిట్ వేసిన రెండు వేగవంతమైన పిడిగుద్దులు ఒకటి కుడి నుంచి, మరొకటి ఎడమ నుంచి పోటీ గమనాన్ని నిర్దేశించాయి. తర్వాత సచిన్ రింగ్‌లో తెలివిగా కదులుతూ ఆంగ్లేయుడిపై దాడికి దిగి తన పంచ్‌లను విజయవంతంగా సంధించాడు. అదే సమయంలో హెవిట్ స్పష్టంగా పంచ్‌లు కొట్టడం కష్టతరం చేశాడు. చివరిలో, సచిన్ పూర్తి నియంత్రణలోఉండి, పక్కలనుండి వరుసగా పదునైన పంచ్‌లు విసురుతూ, పాయింట్ల విషయంలో న్యాయనిర్ణేతలు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చేలా ఒత్తిడి తెచ్చాడు. రెండో రౌండ్‌లో హెవిట్ దూకుడుగా బరిలోకి దిగి, భారత ఆటగాడిని కలవరపెట్టే ప్రయత్నంలో అతనిపైకి దూసుకెళ్లాడు. కానీ సచిన్ సంయమనం కోల్పోకుండా ఆ ఒత్తిడిని తట్టుకుని, తన స్థానాన్ని తిరిగి పొంది, సరైన స్కోరింగ్ ప్రదేశాలను అత్యంత సునాయాసంగా లక్ష్యంగా చేసుకుని విజయం సాధించాడు.

పాలిమర్ కరెన్సీ నోట్లకు తొలి అడుగు

రూ.10, రూ.20 నోట్లపై పైలట్ పరీక్షలు

న్యూఢిల్లీ,జులై 27: భారతదేశంలో పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రవేశానికి కేంద్ర ప్రభుత్వం తొలి అడుగు వేసింది. ఆర్బీఐ ప్రతిపాదించిన మేరకు రూ.10, రూ.20 విలువ కలిగిన తలా 100 కోట్ల పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా విడుదల చేయ డానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం తెలి పింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరీ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాలిమర్ నోట్లు ఎలా పనిచేస్తాయో అంచనా వేయడానికి ఈ ప్రయోగాత్మక విడుదల చేపడుతున్నట్లు తెలిపారు. ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతమైతేనే దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రవేశపెట్టే అంశంపై నిర్ణయం తీసుకుం టామని ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ నిర్ణయంతో పాలిమర్ నోట్లపై ఆర్‌బిఐ పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించనున్నట్లు గతంలో వెలువడిన వార్తలకు అధికారిక ధృవీకరణ లభించింది. ఆర్‌బిఐ ప్రకారం, పాలిమర్ నోట్లు ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు నోట్ల కంటే ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. అధిక నగదు లావాదేవీలు జరిగే దేశాల్లో పాలిమర్ నోట్ల జీవితకాలం ఎక్కువగా ఉండటంతో వాటి వినియోగం ప్రయోజనకరమని అంతర్జాతీయ అనుభవాలు సూచిస్తున్నాయని తెలిపింది.అయితే పాలిమర్ నోట్ల ప్రవేశంతో కాగితపు నోట్లను పూర్తిగా రద్దు చేయాలనే ఉద్దేశం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న కాగితపు కరెన్సీతో పాటు పాలిమర్ నోట్లు కూడా చలామణిలో ఉంటాయని, కాగితపు నోట్ల స్థానంలో పూర్తిగా పాలిమర్ నోట్లను తీసుకురావాలనే ప్రతిపాదన లేదని పేర్కొంది.పాలిమర్ నోట్లు డిజిటల్ చెల్లింపులపై ఎలాంటి ప్రభావం చూపుతాయో ఇప్పుడే చెప్పడం సాధ్యం కాదని ఆర్‌బిఐ తెలిపింది. అవి సాధారణ చలామణిలోకి వచ్చిన తర్వాత మాత్రమే దీనిపై సమగ్ర అంచనా వేయవచ్చని పేర్కొంది.భౌతిక కరెన్సీ మరియు డిజిటల్ చెల్లింపులు ఒకదానికొకటి ప్రత్యామ్నా యాలు కాకుండా పరస్పర అనుబంధ వ్యవస్థలని, భవిష్యత్తులో కూడా రెండూ కలిసి కొనసాగుతా యని ఆర్‌బీఐ అభిప్రాయపడింది.

కోల్ ఇండియా తొలి త్రైమాసిక లాభం రూ.8,852 కోట్లు
ఒక్కో షేరుకు రూ.5.50 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ,జులై 27: ప్రభుత్వ రంగ బొగ్గు కంపెనీ కోల్ ఇండియా స్వల్ప లాభాల వృద్ధిని నమోదు చేసింది. కంపెనీ నికర లాభం గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే 0.6 శాతం పెరిగి రూ.8,852 కోట్లకు చేరింది. షేర్‌హోల్డర్లకు కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.5.50 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. డివిడెండ్‌కు అర్హులైన వాటాదారులను నిర్ణయించేందుకు జులై 31ని రికార్డు తేదీగా నిర్ణయిం చింది. డివిడెండ్ మొత్తాన్ని ఆగస్టు 25, 2026లోపు చెల్లించనున్నట్లు తెలిపింది.తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మొత్తం ఆదాయం 7.8 శాతం పెరిగి రూ.46,255 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.42,919 కోట్లు. ఎబిట్డా 4.1శాతం తగ్గి రూ.12, 069 కోట్లకు పరిమితమైంది. గత యేడాది ఇది రూ.12,588 కోట్లు. ఎబిట్డా మార్జిన్ 29.3 శాతం నుంచి 26.1 శాతానికి తగ్గింది. నికర లాభం 0.6 శాతం పెరిగి రూ.8,852 కోట్లకు చేరింది. ఒక్కో షేరుకు రూ.5.50 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. షేరు స్వల్ప లాభంతో ముగింపుత్రైమాసిక ఫలితాల అనంతరం కోల్ ఇండియా షేరు ధర సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి 0.02 శాతం పెరిగి రూ.427.50 వద్ద స్థిరపడింది. ఇదే సమయంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 0.96 శాతం లాభపడింది. రోజంతా కంపెనీ షేరు రూ.425.75 నుంచి రూ.431.00 మధ్య ట్రేడైంది. ప్రారంభంలో రూ.429.50 వద్ద ప్రారంభమైన షేరు, అంతకుముందు ముగింపు ధర రూ.427.40గా ఉంది.

నాలుగురెట్లు పెరిగిన బిలియనీర్ టాక్స్ పేయర్లు

న్యూఢిల్లీ,జులై 27: దేశంలో యేడాదికి రూ.100 కోట్లకు పైగా ఆదాయం ప్రకటిస్తున్న పన్ను చెల్లింపుదారుల సంఖ్య గత ఐదేళ్లలో గణనీయంగా పెరిగింది. ఈ సంఖ్య దాదాపు నాలుగు రెట్లు పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాలు వెల్లడించారు. 2025-26 అసెస్‌మెంట్ సంవత్సరంలో రూ.100 కోట్లకు మించి వార్షిక ఆదాయం ప్రకటించిన వారి సంఖ్య 576కు చేరిందని తెలిపారు. 2021-22లో ఈ సంఖ్య 142 మాత్రమే ఉండేదని చెప్పారు. అంటే ఐదేళ్ల వ్యవధిలో దాదాపు 300 శాతం పెరుగుదల నమోదైందని వివరించారు. 2022-23లో ఈ సంఖ్య 301కు చేరగా, తర్వాత ఏడాది స్వల్పంగా తగ్గి 284గా నమోదైంది. ఆ తర్వాత 2024-25లో 415కు పెరిగి, గత యేడాది 576కు చేరింది.

ఆదాయపు పన్ను చట్టం 2025లో బిలియనీర్ అనే పదానికి ప్రత్యేక నిర్వచనం లేదని కేంద్రం స్పష్టం చేసింది. అందువల్ల ఆదాయపు పన్ను రిటర్నుల్లో రూ.100 కోట్లకు పైగా ఆదాయం ప్రకటించిన వ్యక్తుల వివరాలను మాత్రమే అందించినట్లు పేర్కొంది. ఈ గణాంకాలు పన్ను రిటర్నుల ఆధారంగా సేకరించినవేనని వెల్లడించింది. దేశంలో ఆదాయ అసమానతలపై అడిగిన ప్రశ్నకు కూడా కేంద్రం సమాధానం ఇచ్చింది. హౌస్‌హోల్డ్ కన్సంప్షన్ ఎక్స్‌పెండిచర్ సర్వే ప్రకారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదాయ అసమానత తగ్గినట్లు తెలిపింది. అలాగే 15 ఏళ్ల పైబడిన వారి నిరుద్యోగ రేటు 3.1 శాతానికి తగ్గిందని వెల్లడించింది. ఉపాధి కల్పన, ప్రగతిశీల పన్ను విధానం, ఆరోగ్యం, విద్య, గృహ నిర్మాణం, గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా సమ్మిళిత ఆర్థిక వృద్ధికి కృషి జరుగుతున్నట్లు కేంద్రం వివరించింది.

ఐదు రోజుల నష్టాలకు బ్రేక్

లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు..

ముంబయి,జులై 27: ముడి చమురు ధరల తగ్గుదల, ఐటీ షేర్ల ర్యాలీతో జోష్ దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ఐదు వరుస ట్రేడింగ్ సెషన్ల నష్టాలకు చెక్ పెడుతూ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరలు భారీగా తగ్గడం, భౌగోళిక ఉద్రిక్తతలు సడలడం, తొలి త్రైమాసిక ఫలితాలపై సానుకూల అంచనాలు మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. విదేశీ బ్రోకరేజ్ సంస్థలు ఐటీ రంగ రేటింగ్‌ను 'అండర్‌వెయిట్' నుంచి 'న్యూట్రల్' కు పెంచడంతో ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 776.01 పాయింట్లు లాభపడి 76,835.78 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 228.50 పాయింట్లు ఎగిసి 23,995.95 వద్ద స్థిరపడింది. అంతకుముందు వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2.67 శాతం, నిఫ్టీ 2.32 శాతం మేర నష్టపోయాయి. నిఫ్టీ లాభాలకు ఎటర్నల్ 5.61, ఇన్ఫోసిస్ 3.59, బజాజ్ ఫైనాన్స్3.57 ప్రధానంగా దోహదపడ్డాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 1.13 శాతం, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.34 శాతం పెరిగాయి. ఎన్ఎస్ఇలో 2,259 షేర్లు లాభపడగా, 1,071 షేర్లు నష్టపోయాయి. 116 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి సంబంధించిన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 7.93 డాలర్లు 8.19 శాతం తగ్గి 88.85 డాలర్లకు చేరింది.విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ గత ముగింపు 96.5300తో పోలిస్తే 95.9425 వద్ద ట్రేడైంది. ఎంసిఎక్స్‌లో ఆగస్టు 5, 2026 డెలివరీకి సంబంధించిన బంగారం ఫ్యూచర్స్ ధర 0.57 శాతం పెరిగి రూ.1,43,925కు చేరుకుంది. అమెరికా 10 యేళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 0.94 శాతం తగ్గి 4.635 శాతానికి చేరింది.ఈ వారంలో వెలువడనున్న ప్రముఖ టెక్నాలజీ కంపెనీల త్రైమాసిక ఫలితాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన సమావేశంపైనా ఇన్వెస్టర్ల ఫోకస్ పెరిగింది. ఫెయిర్‌కెమ్ ఆర్గానిక్స్ త్రైమాసిక లాభాల్లో గణనీయమైన వృద్ధిని నమోదు చేయడంతో షేరు 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.లోధా డెవలపర్స్ సమీకృత నికర లాభం 103.36 శాతం పెరిగి రూ.1,372.1 కోట్లకు చేరడంతో షేరు 5.27 శాతం ఎగిసింది.ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ స్వతంత్ర నికర లాభం 37.03 శాతం పెరిగి రూ.795.95 కోట్లకు చేరడంతో షేరు 5.08 శాతం లాభపడింది. కెనరా బ్యాంక్ తొలి త్రైమాసికంలో నికర లాభం 2.19 శాతం పెరిగి రూ.4,856 కోట్లకు, మొత్తం ఆదాయం 4.26 శాతం పెరిగి రూ.39,684 కోట్లకు చేరడంతో షేరు 1.08 శాతం పెరిగింది.శేషసాయి పేపర్ అండ్ బోర్డ్స్ స్వతంత్ర నికర లాభం 96.89 శాతం పెరిగి రూ.33.59 కోట్లకు చేరడంతో షేరు 3.42 శాతం ఎగిసింది.జెన్ టెక్నాలజీస్ సమీకృత నికర లాభం 27.83 శాతం తగ్గి రూ.34.46 కోట్లకు చేరడంతో షేరు 5 శాతం పడిపోయింది. వేదాంత్ ఫ్యాషన్స్ షేరు 1.19 శాతం, జిందాల్ స్టీల్ షేరు 2.92 శాతం లాభపడ్డాయి. బిర్లా కార్పొరేషన్ సమీకృత నికర లాభం 3.20 శాతం తగ్గడంతో షేరు 5.42 శాతం క్షీణించింది. టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సమీకృత నికర లాభం 27.78 శాతం పెరిగి రూ.426.98 కోట్లకు చేరడంతో షేరు 1.84 శాతం పెరిగింది.ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ నికర లాభం 28.98 శాతం పెరిగి రూ.130.12 కోట్లకు చేరినప్పటికీ షేరు 2.01 శాతం నష్టపోయింది.

సిఇఒ, సిఎఫ్ఒకు జరిమానా

ముంబయి, జులై 27: దేశంలోనే ప్రైవేటుబ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డి ఎఫ్‌సి బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ బ్యాంకు మేనే జింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశిధర్ జగదీశన్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ శ్రీనివాసన్ వైద్యనాథన్ లపై రూ. 1 లక్ష చొప్పున జరిమానా విధించింది. రిటైల్ అసెట్స్ గ్రూప్ హెడ్ అరవింద్ వోహ్రాపై కూడా ఇదే మొత్తంలో జరిమానా వేసింది. ఈ మేరకు సోమవారం నాడు బ్యాంక్ ఒక ప్రకటన విడుదల చేసింది. మహారాష్ట్ర స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి డిపాజిట్లను సమీకరించే విషయంలో జరిగిన అవకతవకలపై బ్యాంకు అంతర్గత విచారణ చేపట్టింది. 2017, 2021 సంవత్సరాల్లో జరిగిన ఈ డిపాజిట్ల సమీకరణపై స్వతంత్ర డైరెక్టర్లతో కూడిన ప్రత్యేక క్రమశిక్షణా కమిటీ దర్యాప్తు నిర్వహించింది. ఈనెల 23న జరిగిన బోర్డు సమావేశంలో ఈ కమిటీ నివేదికను సమీక్షించారు. సంబంధిత అధికారుల ప్రవ ర్తన వ్యాపార పరిధిని దాటడం కిందకు వస్తుందని, ఇందులో ఎలాంటి దురు ద్దేశం లేదా వ్యక్తిగత లాభం లేదని బోర్డు నిర్ధారణకు వచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిం చడంలో ఎటువంటి అలసత్వం ఉండకూడదనే ఉద్దేశంతో, కమిటీ సిఫార్సుల మేరకు బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ముగ్గురు ఉన్నతాధికారులకు జరిమానాతోపాటు హెచ్చరిక లేఖలు జారీచేసింది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఇతర ఉద్యోగులకు కూడా హెచ్చరిక లేఖలు ఇచ్చింది. విచారణ ఫలితాలను ఆర్‌బీఐకి తెలియజేయాలని బోర్డు ఆదేశించింది.

టాటా గ్రూప్ ఆదాయం
రూ.16.24 లక్షల కోట్లు
నికర లాభం 52 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, జులై 27: టాటా గ్రూప్ సమగ్ర స్థాయిలో మరోసారి బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. గ్రూప్ మొత్తం ఆదాయం 7.8 శాతం పెరిగి రూ.16,24,030 కోట్లకు చేరగా, పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభం 51.9 శాతం పెరిగి రూ.1,70,525 కోట్లకు చేరిందని టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ వెల్లడించారు.టాటాగ్రూప్ సంస్థల హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ వార్షిక నివేదికలో వాటాదారులనుఉద్దేశించి చంద్రశేఖరన్ మాట్లా డారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ రంగంలో పెట్టుబడుల ప్రవాహం మధ్య కూడా టాటా గ్రూప్ అత్యుత్తమ ఆర్థిక ప్రదర్శన కనబర్చిందన్నారు.

టాటాసన్స్ ఆదాయం 9.1 శాతం పెరిగి రూ.42, 367 కోట్లకు, నికరలాభం 21.8 శాతంపెరిగి రూ.31,961 కోట్లకు చేరింద న్నారు. ఒక్కో షేరుకు రూ.1,10,717 తుది డివిడెండ్ చెల్లించాలని బోర్డు సిఫారసు చేసిందని, దీనికి వాటాదారుల ఆమోదం అవసరమని తెలిపారు. సంస్కరణలు, వ్యాపార పునర్వ్యవస్థీకరణ ఫలితంగానే ఈ వృద్ధి సాధ్యమైందని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ తయారీలో వేగంగా ఎదుగుతున్నటాటా గ్రూప్ ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యాపారం కేవలం నాలుగేళ్లలోనే రూ.1,31,082 కోట్ల ఆదాయంతో గ్రూప్‌లో నాలుగో అతిపెద్ద సంస్థగా ఎదిగిందన్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942-271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.